


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 181

శనివారం 21-9-2024



అమ్మే దిగివస్తే మత్తు దిగదా...

-13లో



కళ'నైనా' కనని కాలం చెల్లని...

-13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే

సాక్షి



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

చంద్రబాబూ.. నీ రాజకీయ స్వార్థం కోసం తిరుమలను అపవిత్రం చేస్తావా?

రాజకీయంగా కొట్లాడాలనుకుంటే.. నాతో కొట్లాడు: వైఎస్ జగన్

- నీ 100 రోజుల పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి ఇంత నీచానికి దిగజారతావా?
- రాజకీయాల కోసం దేవుడినీ వాడుకోవాలనే దుర్మార్గ మనస్తత్వం ప్రపంచంలో నీ ఒక్కడికే ఉంది
- ముఖ్యమంత్రి స్థానంలో కూర్చుని తిరుమల ఆలయానికి అపవిత్రత ఆపాదిస్తావా?
- లడ్డూ తయారీ ప్రక్రియను దారుణంగా అభాసుపాలు చేస్తావా?
- నెయ్యిపై రెండు నెలల క్రితం వచ్చిన నివేదికను ఇప్పుడు టీడీపీ కార్యాలయంలో విడుదల చేస్తావా?
- రాజకీయ స్వార్థం కోసం టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రకు పాల్పడ్డ చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని ప్రధాని, సీజేఐకి లేఖ రాస్తాం



“చంద్రబాబుకు దేవుడి మీద భక్తి ఎప్పుడూ లేదు.. ఉండదు. నేను రాసి చెబుతున్నా. దేవుడిని రాజకీయాల కోసం ఉపయోగించుకునే అత్యంత హేయమైన, హీన మనసు కలిగిన వ్యక్తి చంద్రబాబు. టీటీడీకి ఏదైనా చెడు జరిగిందంటే అది చంద్రబాబు హయాంలోనే జరుగుతుంది. మిగతా ఎవరి హయాంలోనూ జరగదు. ఎందుకంటే చంద్రబాబుకు దేవుడంటే భక్తీ లేదు.. భయమూ లేదు

రాక్షసులతో యుద్ధం చేస్తున్నాం. చంద్రబాబు, ఓ ఈనాడు, ఓ ఆంధ్రజ్యోతి, ఓ టీవీ 5.. వీరంతా ఉన్మాదస్తులు.. ఉన్మాదంతో బాధపడుతున్నారు. రాజకీయంగా కొట్లాడాలనుకుంటే చెయ్.. బంగారంగా చెయ్.. మేమంతా ఆహ్వానిస్తాం. ప్రజలకు ఫలానా మంచి చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చావ్. ఆ మంచి చేసి ప్రజల మన్ననలు పొందు. కానీ ఇవేం రాజకీయాలు..? ఒక అబద్ధాన్ని సృష్టించడం, దాన్ని అమ్మడం, ఆ అబద్ధం ద్వారా మనుషుల మీద బురద జల్లడం ఎంతవరకూ ధర్మం?”

– వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు స్వార్థ రాజకీయాల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ప్రతిష్టను దెబ్బతీయడానికి తెగబడ్డారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. లడ్డూ ప్రసాదం తయారీలో ఏ తప్పూ జరగకున్నా.. జరిగినట్లుగా అసత్య ప్రచారం చేస్తూ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ఖ్యాతిని బజారుకీడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకోవాలనే దుర్మార్గమైన మనస్తత్వం ప్రపంచంలో ఒక్క చంద్రబాబుకే ఉంటుందని దుయ్యబట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు నుంచి తయారు చేసిన నెయ్యిని వాడారంటూ దారుణమైన ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇంత దారుణంగా మాట్లాడటం ధర్మమేనా? శ్రీవారికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆడుకోవడం ధర్మమేనా? అని నిలదీశారు. వంద రోజుల పాలన వైఫల్యాలపై.. సూపర్ సిక్స్‌తోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాలపై ప్రజలు అడుగడుగునా నిలదీస్తారనే భయంతో దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు దుర్మార్గమైన కుట్ర చేశారని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించడం (డైవర్షన్ పాలిటిక్స్)లో భాగంగానే తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో తయారు చేసిన నెయ్యి వాడారంటూ దారుణమైన ఆరోపణ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కుట్రపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాస్తామని వైఎస్ జగన్ ప్రకటించారు. తిరుమల పవిత్రతను అపహాస్యం చేసే దుస్సాహసానికి పాల్పడిన వారిని శిక్షించే వరకూ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే...

నెయ్యి, ముడిసరుకుల సేకరణకు పక్కా వ్యవస్థ..

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ప్రసాదాలు, లడ్డూ తయారీలో వినియోగించే నాణ్యమైన

మిగతా IVవ పేజీలో ▶

చంద్రబాబూ.. నీ రాజకీయ స్వార్థం కోసం తిరుమలను అపవిత్రం చేస్తావా?



IIIవ పేజీ తరువాయి

ఆవు నెయ్యి, ముడి సరుకులను సేకరించేందుకు టీటీడీలో గొప్ప వ్యవస్థ ఉంది.

- టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కార్యక్రమం దశాబ్దాలుగా కొనసాగుతోంది. నెయ్యి సరఫరా కోసం ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలుస్తుంది. ఆ టెండర్లలో తక్కువ ధరకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టును టీటీడీ బోర్డు అప్పగిస్తుంది. ఇది టీటీడీలో సాధారణంగా జరిగే ప్రక్రియ. స్వామివారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి, ఇతర ముడిసరుకులను ఈ విధంగానే సేకరిస్తారు.
- టీటీడీకి నెయ్యిని ట్యాంకర్లలో సరఫరా చేస్తారు. అలా సరఫరా చేసిన ప్రతి ట్యాంకర్ నెయ్యి టెండర్‌లో పేర్కొన్న ప్రమాణాల మేరకు నాణ్యంగా ఉన్నట్లు సరఫరా సంస్థే ఎన్‌ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ ల్యాబ్స్) ధ్రువీకరించిన సంస్థ నుంచి సర్టిఫికెట్ తేవాలి. ఆ సర్టిఫికెట్ ఆధారంగా ఆ ట్యాంకర్ నెయ్యిని టీటీడీ మార్కెటింగ్ అధికారి, సరఫరా సంస్థ ప్రతినిధి సమక్షంలో టీటీడీ మూడు శాంపిళ్లను తీసుకుని ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లతో వేర్వేరుగా పరీక్ష చేయిస్తుంది. ఆ మూడు పరీక్షల్లో ప్రమాణాల మేరకు నాణ్యంగా ఉన్నట్లు తేలితేనే ఆ నెయ్యి ట్యాంకర్‌ను ముందుకు అనుమతిస్తారు. ముడి సరుకుల సరఫరాలోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తారు. మూడు పరీక్షల్లో ఏ ఒక్క పరీక్షలోనైనా నెయ్యిగానీ ముడిసరుకుగానీ నాణ్యతగా లేదని తేలితే.. ఆ ట్యాంకర్ నెయ్యి, సరుకులు తెచ్చిన వాహనాన్ని సరఫరా సంస్థకే వెనక్కి పంపిస్తారు.
- 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నాణ్యత లేకపోవడంతో 14–15 సార్లు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నాణ్యత లేకపోవడంతో 18 సార్లు నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపించారు. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ.

అబద్ధాలకు రెక్కలు కడుతూ..

టీటీడీకి నెయ్యిని సరఫరా చేసే ప్రతి ట్యాంకర్ నుంచి మూడు శాంపిళ్లు తీసుకుని వాటిలోని నాణ్యతను ల్యాబ్‌లో పరీక్షిస్తారు. పరీక్షల్లో నాణ్యత బాగుందని తేలితేనే లడ్డూ ప్రసాదంలో వినియోగించడానికి ఉపయోగిస్తారు. నాణ్యత లేదంటే సరఫరా సంస్థకే వెనక్కి పంపిస్తారు. ఇంత గొప్ప విధానం టీటీడీలో ఉన్నందుకు ప్రపంచానికి గొప్పగా చెప్పాల్సింది పోయి అబద్ధాలకు రెక్కలు కడుతున్నారు. అసలు వాస్తవంలో జరగని దానికి కట్టుకథలు అల్లి.. నాసిరకమైన పదార్థాలు, జంతు కొవ్వులతో తయారుచేసిన నెయ్యి తో లడ్డూలు తయారు చేశారని.. భక్తులకు పంపిణీ చేశారని.. వాటిని భక్తులు తినేశారని సీఎం స్థాయిలో ఉన్న చంద్రబాబు చెప్పడం ధర్మమేనా?

- ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయానికి అపవిత్రతను ఆపాదిస్తూ.. లడ్డూ తయారీ ప్రక్రియను అబాసుపాలు చేస్తుండటం దారుణం. మన గుడిని.. మన దేవుడిని మనమే తగ్గించుకోవడం అత్యంత దారుణం. ఇంతకంటే దారుణ పరిస్థితి ఎక్కడైనా ఉంటుందా? ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి.

టీటీడీ ప్రతిష్ఠను పెంచింది మేమే..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. స్వామివారి ప్రసాదాలు, లడ్డూ, అన్న ప్రసాదాల్లో నాణ్యతను పెంచేందుకు అక్కడి ల్యాబ్స్‌ను పటిష్టపరిచాం. సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన (సీఎఫ్‌టీఆర్‌ఐ) వారితో టీటీడీ అనుసంధానమైంది. అక్కడి నుంచి సీనియర్ ఉద్యోగులను నియమించి నాణ్యత, పారదర్శకతలో రాజీ లేకుండా వ్యవహరించాం.

- వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా టీటీడీలో నవనీత సేవ ప్రారంభించాం. దీని కోసం స్వచ్ఛమైన నెయ్యి తయారీకి కొండపై ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేశాం.
- శ్రీవారి ఆలయంలో అర్చకుల జీతాలను రెట్టింపు చేశాం. ప్రసాదాలు తయారు చేసే కార్మికులను క్రమబద్ధీకరించడంతో పాటు వారి జీతాలు పెంచాం.
- చంద్రబాబు దేవాలయాలను కూల్చేస్తే.. ఆలయాల పునరుద్ధరణ కార్యక్రమం చేసింది మేమే. అమరావతి, విశాఖపట్నం, భువనేశ్వర్, హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, జమ్మూ కశ్మీర్, చెన్నైలో టీటీడీ ఆలయాలు నిర్మించింది వైఎస్సార్‌సీపీ హయాంలోనే. చివరికి అమెరికాలో కూడా ఆలయ నిర్మాణానికి మా హయాంలోనే టీటీడీ సహకరించింది.
- స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలందిస్తున్న ఉద్యోగులకు తోడుగా నిలిచేందుకు 9 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది మేమే. టీటీడీలో పని చేస్తున్న వారికి సెంటు స్థలం ఇవ్వడానికి కూడా చంద్రబాబుకు ఏ పొద్దూ మనసు రాలేదు.
- రాష్ట్రంలో మఠాధిపతులు అందరితో మూడు సార్లు విద్వత్తు సదస్సులు జరగగా రెండు సార్లు వైఎస్సార్ హయాంలో.. ఒకసారి మేం నిర్వహించాం. చంద్రబాబు హయాంలో మఠాధిపతులతో ఎప్పుడూ విద్వత్తు కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు.

రెండు నెలలుగా ఏం చేస్తున్నారు?

- నెయ్యి నాణ్యతగా లేదని రిపోర్టు వచ్చిన శాంపిళ్లను జూలై 12న తీసుకున్నారు. అప్పుడు స్వయంగా చంద్రబాబే ముఖ్యమంత్రి. ఆయన సీఎంగా ఉండగా టీటీడీకి వచ్చిన నెయ్యి ట్యాంకర్ నుంచి శాంపిళ్లు తీసుకున్నారు. మూడు పరీక్షలు అక్కడే చేశారు. అవి సరిగా రాలేదు కాబట్టే శాంపిళ్లను జూలై 17న ఎన్‌డీడీబీకి పంపించారు. జూలై 23న రిపోర్టు వచ్చింది. అందులో నాణ్యత లేదని వచ్చింది. ఆ రిపోర్టును టీటీడీ అధికారులు అప్పుడే ఎందుకు బయటపెట్టలేదు? రెండు నెలల నుంచి చంద్రబాబు ఏం చేస్తున్నారు?
- చంద్రబాబు వంద రోజుల పరిపాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ప్రకటనలు ఇస్తే.. సూపర్ సిక్స్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు ఏమైందంటూ ప్రజలు తిరగబడుతుండటంతో వారి దృష్టి మళ్లించేందుకు టాపిక్ డైవర్ట్ చేశారు. అందుకే జూలై 23న ఇచ్చిన రిపోర్టును ఇప్పుడు బయటకు తీసి దానికి వక్రభాష్యం చెబుతూ.. నోటికొచ్చినట్టు చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారు.
- నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) నుంచి రెండు నెలల కిందట రిపోర్టు వస్తే దానిపై ఏ ఒక్క అధికారీ వివరణ ఇవ్వకపోగా ఇప్పుడు టీడీపీ కార్యాలయంలో ఆ రిపోర్టు విడుదల చేయడం వెనుక కచ్చితంగా రాజకీయ దురుద్దేశం ఉంది. ఈ కుట్రపై ప్రధానమంత్రితో పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తాం.
- ఎన్‌డీడీబీ ల్యాబ్ రిపోర్టులో ఏం కనిపిస్తోంది? స్టాండర్డ్ (ఎస్) వాల్యూ ఉండాలి. కానీ డీవియేషన్ ఉంది. అలా ఉంటే శాంపిల్ కంటెయిన్ ఫారిన్ ఫ్యాట్ (ఏమేం ఉండే వీలుందన్న అవకాశాలతో నివేదికలో పొందుపరిచిన వివరాలను ప్రస్తావించారు)

కేఎంఎఫ్‌కు వాళ్లెందుకు ఇవ్వలేదు..?

కర్ణాటక మిల్క్ ప్రొడ్యూసెస్ ఫెడరేషన్ (కేఎంఎఫ్)కు ఉద్దేశపూర్వకంగానే ఆ కంపెనీ బ్రాండ్ నందినీకి టీటీడీ నెయ్యి కాంట్రాక్టు ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. ఇది నిజంగా ఆశ్చర్యకరం. టీటీడీలో టెండర్లు పిలుస్తారు.. అందులో ఎవరైనా పాల్గొనవచ్చు. ఎవరు ఎల్–1గా నిలిస్తే వారికి నెయ్యి సరఫరా బాధ్యత అప్పగిస్తారు. ఇది పద్ధతి. ఇదే చంద్రబాబు హయాంలో 2015 నుంచి 2018 అక్టోబర్ వరకు కేఎంఎఫ్ బ్రాండ్ ఎందుకు లేదని ప్రశ్నిస్తే ఏం సమాధానం చెబుతారు?

టీటీడీ బోర్డుకు ఎంతో విశిష్టత..

టీటీడీ బోర్డు చాలా విశిష్టమైనది. క్యాబినెట్ కూర్పు చేయడం సులభం. కానీ టీటీడీ బోర్డు కూర్పు చాలా కష్టం. టీటీడీ బోర్డులోకి సిఫారసు చేయాలని కేంద్ర మంత్రులు, చుట్టుపక్కల రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష పార్టీల నుంచి సైతం కోరతారు. ఆయా రాష్ట్రాల్లో విశిష్ట వ్యక్తులు, ప్రసిద్ధిచెందిన వారు బోర్డులో సభ్యులు అవుతారు. ఆ బోర్డు కూర్పు విశిష్టమైన వారితోనే ఉంటుంది. టీటీడీలో టెండర్ల ప్రక్రియను బోర్డు సభ్యులే రాటిఫై చేస్తారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జోక్యం ఉండదు. అటానమస్ బాడీగా (స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ) టీటీడీ బోర్డు నిర్ణయాలు తీసుకుంటుంది. పాదర్శకతకు పెద్దపీట వేస్తూ భగవంతుడికి మంచి చేయాలనే దృక్పథంతోనే బోర్డు మెంబర్లు పని చేస్తారు. అలాంటి బోర్డులో 45 సార్లు అయ్యప్పమాల ధరించి గురు స్వామి హోదా పొందిన వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి లాంటి భక్తులను పెట్టాం.

హిందువుల ప్రతినిధులైతే చంద్రబాబుకు అక్షింతలు వేయండి..

- బీజేపీ వాళ్లకు సగం తెలుసు. సగం తెలియదు. చంద్రబాబు పూర్తిగా అబద్ధాలు, మోసాల మనిషి. టీటీడీ బోర్డులో కూడా ఇదే బీజేపీ, సీనియర్ మంత్రుల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నప్పుడు ఈ ప్రక్రియ గురించి వారికి తెలియదా! తెలియకపోతే తెలుసుకోమని చెప్పండి. తప్పు చంద్రబాబు చేసి, దుష్ప్రచారం చేశాడని తేలితే ఆయన మీద అక్షింతలు వేసే ధైర్యం ఈ బీజేపీకి ఉందా అని నేను అడుగుతున్నా. నిజంగానే వారికి చిత్తశుద్ధి ఉంటే, నిజంగానే హిందువుల ప్రతినిధులైతే.. శ్రీవారి పవిత్రతను దెబ్బతీసేలా, భక్తుల మనోభావాలను కించపరిచేలా దుర్మార్గంగా మాట్లాడిన చంద్రబాబుకు చీవాట్లు పెట్టాలి. ఇంత దుర్మార్గం చేయడం ధర్మమేనా? అంటూ చంద్రబాబుని బీజేపీ నేతలు గట్టిగా కడిగేయాలి.
- వాస్తవాలు తెలియని వారిని తప్పుదోవ పట్టిస్తే ఎవరికైనా భావోద్వేగాలు పెరుగుతాయి. అలాంటివి చేయకూడని పనులు. చంద్రబాబు కావాలనే భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ వాస్తవంగా ప్రక్రియ ఏమిటన్నది స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు ఈ విధంగా దుష్ప్రచారం చేయడం ధర్మమేనా?

నేను చెప్పినవి.. మాట్లాడిన ప్రతి మాట నిజమా.. అబద్ధమా అన్నది మీరే (మీడియా) పరిశీలన చేయండి. నేను ప్రతి మాటా నిజమే మాట్లాడుతున్నా, మీ అందరికీ వారు చూపించింది, వినిపించింది.. ఇప్పుడు నేను మీ అందరి దృష్టికి తెచ్చిన దానికి తేడా గమనించండి. రాజకీయాలు ఇలా చేయడం ధర్మమా, న్యాయమా అని మీ మనస్సాక్షిని అడగండి. ఇది ధర్మం కాదు, న్యాయం కాదు. రాజకీయాలు చేయాలనుకుంటే నేరుగా చేద్దాం.

శ్రీవారి లడ్డూపై వివాదం.. బాబు పక్కా స్కెచ్‌తోనే..

- వైఎస్సార్‌సీపీని రాజకీయంగా దెబ్బతీయడానికే భక్తుల మనోభావాలతో చంద్రబాబు చెలగాటం.. టీటీడీ ఈఓగా శ్యామలరావుకు బాధ్యతలు అప్పగిస్తూనే జూన్ 14న కుట్రకు శ్రీకారం
- జంతువుల కొవ్వుతో తయారుచేసిన నెయ్యిని ప్రసాదాల తయారీలో వాడుతున్నారని.. ప్రక్షాళన చేయాలని అప్పుడే ఈఓకు ఆదేశం
- 4 ట్యాంకుల నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్స్ కల్తీ అయ్యాయని జూలై 23న ఈఓ వెల్లడి.. ఈనెల 18న కూటమి శాసనసభా పక్షం సమావేశం వేదికగా కుట్ర అమలుకు తెరతీసిన చంద్రబాబు
- జంతువుల కొవ్వుతో లడ్డూ తయారీ జరిగిందని వైఎస్సార్‌సీపీపై నిందలు
- శ్రీవారి పాదాల చెంత ప్రమాణానికి సిద్ధమా అంటూ బాబుకు వైఎస్సార్‌సీపీ నేతలు వైవీ, భూమన సవాల్
- దీంతో 2 నెలల తర్వాత ఎన్‌డీడీబీ నివేదికలు 19న టీడీపీ ఆఫీసులో విడుదల.. వీటిల్లో కల్తీ నెయ్యి సరఫరా అయ్యింది టీడీపీ హయాంలోనన్నది బట్టబయలు
- ఆత్మరక్షణలో సీఎం చంద్రబాబు, లోకేశ్.. నష్ట నివారణకు ఈఓను సమగ్ర నివేదిక కోరిన సీఎం.. దీంతో ఈఓ శుక్రవారం మీడియా సమావేశం సాక్షిగా బాబు కుట్ర బట్టబయలు
- ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యిలో కల్తీపై జులై 23న తన వ్యాఖ్యలకు భిన్నంగా ఈఓ తాజా వ్యాఖ్యలు.. జంతువుల కొవ్వు కలిసిందంటూ వెల్లడి

వంద రోజుల పాలన మొత్తం మోసమే

- సూపర్ సిక్స్, సూపర్ సెవన్ ఎక్కడా లేదు: వైఎస్ జగన్
- ప్రతి ఇంటికీ 'మోసం' చేసి.. మంచి చేశామంటూ స్టిక్కర్లు అతికించమని బాబు ఆదేశాలు
- ఎన్నికల్లో ప్రజలకు ఆశ చూపి నమ్మించి మోసం చేశారు
- రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు తిరోగమనం
- ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులు, వ్యవసాయం నిర్వీర్యం
- డోర్ డెలివరీ ఆగిపోయి జన్మభూమి కమిటీల ఎదుట ప్రజల పడిగాపులు
- శాంతి భద్రతలను బూతద్దంలో గాలించాల్సిన దుస్థితి
- బాబు ప్రజల ఎదుట దోషిగా నిలిచారు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 181
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'



కాంగ్రెస్ వెనక అర్బన్ నక్సల్స్

కాంగ్రెస్‌లోకి విద్వేష భూతం ప్రవేశించిందని.. ఆ పార్టీని అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్ నడిపిస్తున్నాయని ప్రధాని ఆరోపించారు.

- వివరాలు 6లో ▶



2026కల్లా నక్సలిజం అంతం

దేశంలో 2026 మార్చి నాటికి నక్సలిజం పూర్తిగా అంతమైపోతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో ▶


కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్, దామోదర, తుమ్మల

హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ

అన్ని ప్రభుత్వ శాఖలకు ఉన్న అధికారాలు అప్పగింత

సంస్థకు చట్టబద్ధత కూడా కల్పించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం

- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి
- హైడ్రాకు డిప్యుటేషన్‌పై 169 మంది అధికారులు, 946 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు
- ట్రిపుల్ ఆర్ దక్షిణ అలైన్‌మెంట్ ఖరారుకు 12 మంది అధికారులతో కమిటీ
- మూడు వర్సిటీలకు కొత్త పేర్లు
- కోస్గికి కొత్త ఇంజనీరింగ్ కళాశాల.. హకీంపేటకు జూనియర్ కాలేజీ
- ఎస్ఎల్‌బీసీ అంచనా వ్యయం రూ.4,637 కోట్లకు పెంపు
- వచ్చే నెలలో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం
- సన్నాలకు రూ.500 బోనస్..జనవరి నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం

2 లో

సింగరేణి కార్మికులకు రూ.796 కోట్ల బోనస్

- సగటున ప్రతి కార్మికుడికి రూ.1.90 లక్షల దసరా కానుక
- తొలిసారి 25 వేల మంది కాంట్రాక్టు సిబ్బందికి రూ.5 వేల చొప్పున బోనస్
- సింగరేణి కార్మికుల కుటుంబాల్లో ఆనందం చూసేందుకే బోనస్: సీఎం రేవంత్‌రెడ్డి

- వివరాలు 3లో

ఈసారికి అనుమతి

- స్థానికత విషయంలో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు భారీ ఊరట
- నీట్ కౌన్సెలింగ్‌కు వాళ్లను అనుమతి ఇస్తున్నట్లు సుప్రీంకు తెలిపిన ప్రభుత్వం

3 లో

నాలుగైదు రోజుల్లో మెడికల్ కౌన్సెలింగ్

- సుప్రీంకోర్టు ఉత్తర్వులతో లైన్‌క్లియర్
- మొదట రాష్ట్రస్థాయి మెరిట్ లిస్ట్ విడుదల
- నెలాఖరుకు తొలివిడత కౌన్సెలింగ్ పూర్తి

వరంగల్ స్థానికత కలిగిన ఓ సబ్ రిజిస్ట్రార్ మెదక్‌లో పనిచేస్తుండేవారు. ఆయన 317 జీవో కింద మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లారు. ఆ సబ్ రిజిస్ట్రార్ జీవిత భాగస్వామి కూడా ప్రభుత్వ ఉద్యోగే. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో తనను స్పౌజ్ కోటా కింద పరిగణనలోకి తీసుకుని స్టేషన్ కేటాయించాలని, లేదంటే తనకు స్టేషన్ అవసరం లేదని, చిట్స్‌కయినా, ఆడిట్‌కయినా పంపాలని ఆ సబ్ రిజిస్ట్రార్ కోరారు. కానీ ఆ విజ్ఞప్తిని ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం పనిచేస్తున్న స్థానానికి 100 కిలోమీటర్ల అవతలకు బదిలీ చేశారు.

హైదరాబాద్‌కు సమీపంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ జీవిత భాగస్వామి అదే జిల్లాలోని రాష్ట్ర సరిహద్దులోని నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా తనను స్పౌజ్ కోటా కింద పరిగణనలోకి తీసుకుని తగిన స్థానం ఇవ్వాలని సదరు సబ్ రిజిస్ట్రార్ కోరారు. కానీ ఆయన్ను హైదరాబాద్‌కు మరింత దగ్గరగా బదిలీ చేశారు.

సబ్ రిజిస్ట్రార్ల యూనియన్ పేరుతో చెలామణి అవుతున్న ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లకు వరుసగా మూడోసారి ఫోకల్ పోస్టింగులిచ్చి ఏ గ్రేడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు బదిలీ చేశారు. ఏసీబీ ట్రాప్ రికార్డులు కూడా పట్టించుకోకుండా కావాల్సిన స్థానానికి బదిలీ చేయడం గమనార్హం.

నచ్చిన వారికి మెచ్చిన చోటు!

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇష్టారాజ్యంగా బదిలీలు | ఇద్దరు అధికారుల కనుసన్నల్లోనే అన్ని పోస్టింగులు

జూనియర్లయినా మంచి స్టేషన్లు

ఆప్షన్లు తూచ్.. స్పౌజ్ కేసులూ పట్టించుకోని వైనం

అధికారులను నమ్మి బాధ్యత అప్పగించిన మంత్రి పొంగులేటి

అడ్డగోలుగా బదిలీలపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్: సాధారణ బదిలీల్లో భాగంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో జరిగిన బదిలీలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇద్దరు అధికారుల కనుసన్నల్లో ఈ బదిలీల తంతు జరిగిందని, బదిలీల పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తుండగా, తాజాగా నిఘా వర్గాల నివేదికతో బదిలీలు మరింత హాట్‌టాపిక్‌గా మారాయి. ఆప్షన్లు ఒకచోటుకు పెడితే మరో చోటుకు బదిలీ చేశారని, సింగిల్ డాక్యుమెంట్లు అయ్యే స్టేషన్లకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను పంపి, జిల్లా కేంద్రాల్లో సీనియర్ అసిస్టెంట్లతో సరిపెట్టారని, స్పౌజ్ కేసులను పట్టించుకోలేదని, జీరో సర్వీసు అంటూ అందరినీ బదిలీ చేస్తామని చెప్పి చివరకు పరిపాలనా అవసరాలంటూ పది స్టేషన్ల వరకు బదిలీలు చేయలేదని పలువురు సబ్ రిజిస్ట్రార్లు వాపోతున్నారు. తమకు నచ్చిన వారికి మాత్రం వరుసగా మూడోసారి ఫోకల్ పోస్టింగులు ఇచ్చారని, చార్మినార్ జోన్ పేరుతో కొందరు సబ్ రిజిస్ట్రార్లను ఏ గ్రేడ్ స్టేషన్ల చుట్టూనే తిప్పుతున్నారని, ఇందుకోసం డబ్బులు కూడా పెద్ద ఎత్తున చేతులు మారాయని ఆరోపిస్తున్నారు. డీఐజీల స్థాయిలో సిద్ధమైన జాబితాకు, విడుదలైన బదిలీల జాబితాలకు పొంతన లేకుండా పోయిందని, ఆ ఇద్దరు అధికారులు చక్రం తిప్పి తమ ఇష్టారాజ్యంగా పేర్లు మార్చేశారని ఆరోపిస్తున్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పైరవీలకు అస్కారమివ్వకుండా రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులకు బాధ్యత అప్పగిస్తే, అడ్డగోలుగా బదిలీలు చేసి అంతా బాగానే జరిగినట్టు ఆయన్ను నమ్మించారనే విమర్శలు కూడా వస్తున్నాయి. బదిలీలకు కొద్దిరోజుల ముందే వచ్చిన కమిషనర్‌ను కూడా బురిడీ కొట్టించి మరీ ఈ అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు వస్తుండడం గమనార్హం.



ఆప్షన్లు ఎందుకు అడిగినట్టో..?

సాధారణ బదిలీల్లో భాగంగా సబ్ రిజిస్ట్రార్లను ఆప్షన్లు అడిగారు. ఈ ఆప్షన్ల వారీగా వారి ప్రాధాన్యతలను తెలుసుకోవడం ఎప్పుడూ జరిగే ప్రక్రియే. కాగా సబ్ రిజిస్ట్రార్లందరూ తమ అభీష్టం మేరకు ఆప్షన్లు ఇచ్చి ఆయా స్టేషన్‌లపై ఆశలు పెట్టుకున్నారు. తీరా బదిలీల జాబితా చూస్తే ఆప్షన్లు ఇచ్చిన స్టేషన్లకు, తమను బదిలీ చేసిన స్టేషన్‌కు అసలు పొంతన లేకపోవడంతో విస్తుపోవడం బాధిత సబ్ రిజిస్ట్రార్ల వంతయింది.

నోడల్ జిల్లా రిజిస్ట్రార్లుగా జూనియర్ అసిస్టెంట్లు!


రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ల శాఖకు జిల్లా రిజిస్ట్రార్లు లేరు. ఉమ్మడి జిల్లాల వారీగా జిల్లా రిజిస్ట్రార్లు పనిచేస్తుండగా, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఆయా జిల్లా కేంద్రాల్లో పనిచేసే సబ్ రిజిస్ట్రార్లు నోడల్ జిల్లా రిజిస్ట్రార్లుగా వ్యవహరిస్తున్నారు. అలాంటి జిల్లా కేంద్రాలకు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లుగా పంపడం గమనార్హం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు జిల్లా కేంద్రాలతో పాటు, కరీంనగర్ జిల్లా నుంచి విడిపోయిన మరో జిల్లా కేంద్రానికి బదిలీల తర్వాత కూడా ఇన్‌చార్జులే సబ్ రిజిస్ట్రార్లుగా కొనసాగుతుండగా, రోజుకు ఒకటో, రెండో డాక్యుమెంట్లు అయ్యే స్టేషన్లకు మాత్రం రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను పంపారనే విమర్శలు ఉన్నాయి.

సబ్ రిజిస్ట్రార్లుగా సన్నిహితులు!

బదిలీల్లో అక్రమాలు, అన్యాయాల మాట అటుంచితే.. సాధారణ బదిలీల గడువు ముగిసిన తర్వాత కూడా ఖాళీగా ఉన్న ఏడెనిమిది కార్యాలయాలకు తమకు నచ్చిన జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను పంపడం గమనార్హం. రంగారెడ్డి జిల్లాలోని ఓ నియోజకవర్గ కేంద్రం, హైదరాబాద్ తూర్పు దిక్కున అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగే స్టేషన్, హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఇంకో స్టేషన్‌తో పాటు ఖాళీగా ఉన్న స్టేషన్‌లకు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లుగా డిప్యుటేషన్‌పై పంపారని, వీరంతా బదిలీల ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన అధికారులకు సన్నిహితులేననే చర్చ రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాల్లో జరుగుతోంది. సబ్ రిజిస్ట్రార్లతో పాటు జిల్లా రిజిస్ట్రార్ల విషయంలోనూ ఇష్టారాజ్యంగా బదిలీలు జరిగాయనే విమర్శలు వస్తున్నాయి.

క్లుప్తంగా...

రాష్ట్ర వేడుకగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ పుట్టినరోజైన సెప్టెంబర్ 27వ తేదీన రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి సీఎం నివాళి



సాక్షి, హైదరాబాద్: తొలి, మలి దశ తెలంగాణ పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. 1969లో తన మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగధనుడు కొండా లక్ష్మణ్ అని కొనియాడారు. నైజాం వ్యతిరేక పోరులో ఓ వైపు పాల్గొంటూనే, మరోవైపు ఆంగ్ల పాలనకు వ్యతిరేకంగా వందేమాతరం, క్విట్ ఇండియా ఉద్యమాల్లోనూ భాగస్వామి అయ్యారని తెలిపారు. ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా వివిధ హోదాలలో సేవలందించి.. నిరంతరం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి బాపూజీ తపించారని పేర్కొన్నారు.

తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడిన 'కొండా'

మాజీ సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం జీవితకాలం పోరాడిన తొలితరం నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన బాపూజీ స్ఫూర్తి.. తాను సాగించిన చివరిదశ రాష్ట్ర సాధన పోరాటంలో ఇమిడి ఉందని వ్యాఖ్యానించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ కోసం తాను బయల్దేరినప్పుడు.. నాటి ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణ వ్యతిరేక ప్రభుత్వాల ఒత్తిడికి తలొగ్గకుండా బాపూజీ నివాసమైన జలదృశ్యం ఉద్యమ వేదికగా నిలపడం మరిచిపోలేనిదని గుర్తు చేశారు.



హామీలు నెరవేర్చడం లేదనే అపవాదును తప్పించుకొనేందుకు ఐడియా వచ్చేసింది!!

హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ

అన్ని ప్రభుత్వ శాఖలకు ఉన్న అధికారాలు హైడ్రాకు..

సంస్థకు చట్టబద్ధత కూడా కల్పించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం

- మంత్రివర్గ భేటీ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి
- ట్రిపుల్ ఆర్ దక్షిణ ఎలైన్‌మెంట్ ఖరారుకు 12 మంది అధికారులతో కమిటీ
- వచ్చే నెలలో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ విపత్తు నిర్వహణ- ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ సంస్థ (హైడ్రా)కు పూర్తిస్థాయి స్వేచ్ఛ కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) లోపల ఉన్న చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో, నాలాలపై ఉన్న అక్రమ కట్టడాల కూల్చివేతల విషయంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, రెవెన్యూ, నీటిపారుదల తదితర శాఖలకు ఉన్న విశేష అధికారాలను హైడ్రాకు ఇవ్వాలని నిర్ణయించింది. సంస్థకు చట్టబద్ధత కూడా కల్పించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సుమారు మూడు గంటలకు పైగా జరిగిన ఈ భేటీలో పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సచివాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు.

ట్రిపుల్ ఆర్ దక్షిణ అలైన్‌మెంట్‌పై కమిటీ

'ఓఆర్‌ఆర్‌కు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లోని 24 పురపాలికలు, 51 గ్రామ పంచాయతీల పరిధిలో అన్ని శాఖలకు ఉన్న స్వేచ్ఛ(అధికారాలు)ను హైడ్రాకు కల్పించేలా నిబంధనలను సడలించాం. వివిధ విభాగాలకు చెందిన 169 మంది అధికారులు, 946 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను డిప్యుటేషన్‌పై హైడ్రాలో నియమించాలని నిర్ణయం తీసుకున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఖరారు చేసేందుకు ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో 12 మంది అధికారులతో కమిటీ ఏర్పాటు చేశాం. కమిటీ కన్వీనర్‌గా ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి, సభ్యులుగా పురపాలక, రెవెన్యూ శాఖల కార్యదర్శులు, ఐదారు జిల్లాల కలెక్టర్లు, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే ఆథారిటీ, జియోలాజికల్ విభాగాల అధికారులు ఉంటారు..' అని పొంగులేటి తెలిపారు.

8 కొత్త వైద్య కళాశాలలకు 3 వేల పైచిలుకు పోస్టులు

'హైదరాబాద్ నగరం కోఠిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేర్లను పెట్టాలని నిర్ణయించాం. ప్రస్తుతం అమల్లో ఉన్న పోలీసు ఆరోగ్య భద్రత పథకాన్ని ఎస్పీఎల్ కింద కూడా వర్తింపజేయాలని నిర్ణయించాం. తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మనోహరాబాద్ మండలంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు గాను 72 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ నుంచి పరిశ్రమల శాఖకు బదిలీ చేయాలని నిర్ణయించాం. అలాగే ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు 58 ఎకరాల భూమిని రెవెన్యూ నుంచి పరిశ్రమల శాఖకు బదిలీ చేయనున్నాం. ములుగు జిల్లా ఏటూరునాగారం ఫైర్ స్టేషన్‌కు 34 మంది సిబ్బందిని మంజూరు చేశాం. రాష్ట్రంలో కొత్తగా అనుమతి పొందిన 8 వైద్య కళాశాలలకు బోధన, బోధనేతర సిబ్బంది కలిపి మొత్తం 3 వేల పైచిలుకు పోస్టులను మంజూరు చేశాం. కొద్దిరోజుల్లో నోటిఫికేషన్ జారీ చేస్తాం. కోస్గికి ఇంజనీరింగ్ కాలేజీ, హకీంపేటకు జూనియర్ కళాశాల మంజూరు చేశాం. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీపై తదుపరి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటాం..' అని పొంగులేటి చెప్పారు.

బిల్లులు రావట్లేదు సార్

కేబినెట్ భేటీలో ఆసక్తికర చర్చ జరిగింది. నియోజకవర్గ అభివృద్ధి పనుల నిమిత్తం తాము మంజూరు చేసిన పనులకు సకాలంలో బిల్లులు విడుదల చేయడం లేదని పలువురు మంత్రులు..సీఎం రేవంత్ దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. ఆయా బిల్లులు త్వరితగతిన విడుదల చేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

2027 నాటికి ఎస్‌ఎల్‌బీసీ, డిండి పూర్తి: ఉత్తమ్

'ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం రూ.4,637 కోట్లకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నల్లగొండ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన ఎస్‌ఎల్‌బీసీ, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసి 2027 సెప్టెంబర్‌లోగా ప్రారంభిస్తాం. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్‌ను ఆదేశించాం. డిండి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల సాధనకు, మిగిలిన 5 శాతం పనుల పూర్తికి ఒక ప్రత్యేకాధికారిని నియమించాల్సిందిగా సీఎం సూచించారు. ఖరీఫ్‌లో సన్నాలను పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 1.43 లక్షల మెట్రిక్ టన్నుల పంట రానుంది. వచ్చే నెలలో కొత్త తెల్లరేషన్ కార్డుల జారీని ప్రారంభిస్తాం. జనవరి నుంచి రేషన్‌కార్డులపై సన్నబియ్యం సరఫరా చేస్తాం.. అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ తెలిపారు.

కాంగ్రెస్‌కు పేరొస్తుందనే ఎస్‌ఎల్‌బీసీపై నిర్లక్ష్యం: కోమటిరెడ్డి

'కాంగ్రెస్ పార్టీకి, తనకు పేరు వస్తుందనే అక్కసుతో కేసీఆర్ గత 10 ఏళ్లలో ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. నల్లగొండ జిల్లాలో రూ.6 వేల కోట్ల మిషన్ భగీరథ పనులు జరిగితే, రూ.4 వేల కోట్ల కుంభకోణం జరిగింది. నల్లగొండలో ఫ్లోరైడ్ తగ్గిందంటూ కేసీఆర్ అబద్ధాలు చెప్పారు. వాస్తవానికి ఫ్లోరైడ్ తీవ్రత పెరిగినట్టు కేంద్రం నివేదిక ఇచ్చింది..' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

ఓటుకు నోటు కేసులో జోక్యం చేసుకోవద్దు

సీఎం రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టు ఆదేశం

- ఏసీబీ డీజీ ముఖ్యమంత్రికి రిపోర్ట్ చేయాల్సిన అవసరం లేదు
- ట్రయల్ కోర్టు పారదర్శకంగా విచారణ జరపాలి
- భవిష్యత్తులో సీఎం జోక్యంపై ఆధారాలు ఉంటే కోర్టుకు వెళ్లొచ్చునని స్పష్టీకరణ
- కేసును వేరే కోర్టుకు బదిలీ చేయడానికి నిరాకరణ



సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు నోటు కేసు విచారణలో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణకు సంబంధించి ఏసీబీ డైరెక్టర్ జనరల్ ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వరాదని, ఆయనకు రిపోర్ట్ చేయాల్సిన అవసరం కూడా లేదని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు పారదర్శకంగా విచారణ జరపాలని సూచించింది. ఈ కేసు విచారణను తెలంగాణ నుంచి భోపాల్‌కు బదిలీ చేసేందుకు నిరాకరించింది. ఓటుకు నోటు కేసు విచారణను హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ కోర్టుకు బదిలీ చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది.

నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదన్న పిటిషనర్లు

రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణలో ఈ కేసుపై నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదని పిటిషనర్లు పేర్కొన్నారు. వారి తరఫున సీనియర్ న్యాయవాది సీఏ సుందరం వాదనలు వినిపిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హోం శాఖ బాధ్యతలు కూడా చూస్తున్నందున ఏసీబీ కేసులు నేరుగా ఆయన అధీనంలోనే ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కేసు విచారణను తెలంగాణ నుంచి భోపాల్‌కు మార్చాలని విన్నవించారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దీనిని పర్యవేక్షించేలా ఆదేశాలివ్వాలని కోరారు. అయితే ఈ పిటిషన్ రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని రేవంత్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు తెలిపారు. ఈ కేసు విచారణ సగంలో ఉందని.. విచారణను గత ప్రభుత్వంలో నియమించిన ప్రాసిక్యూటరే నిర్వహిస్తున్నారని చెప్పారు.

సుప్రీం విశ్రాంత జడ్జి పర్యవేక్షణకు నో

వాదనల అనంతరం కేసు విచారణపై సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి పర్యవేక్షణను జస్టిస్ గవాయ్ ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసులో విధంగానూ జోక్యం చేసుకోకూడదని రేవంత్‌రెడ్డిని ఆదేశించిన ధర్మాసనం..భవిష్యత్తులో ఈ కేసు విచారణలో రేవంత్‌రెడ్డి జోక్యంపై ఆధారాలుంటే కోర్టుకు వెళ్లొచ్చునని సూచించింది. రాష్ట్ర హోంశాఖ బాధ్యతలు కూడా చూస్తున్న రేవంత్‌రెడ్డికి ఏసీబీపై ప్రత్యక్ష నియంత్రణ ఉంటుందని, బ్యూరో డైరెక్టర్ నేరుగా ఆయనకు జవాబుదారీగా ఉంటారన్న పిటిషనర్ల ఆందోళనను పరిగణనలోకి తీసుకుంటున్నామని, ప్రాసిక్యూషన్ పనితీరులో ఏ విధంగానూ జోక్యం చేసుకోవద్దని రెండవ ప్రతివాదికి ఆదేశిస్తున్నామని బెంచ్ తెలిపింది. ఒక విచారణను ఉపసంహరించుకోవాలని ఆయన (రేవంత్‌రెడ్డి) ప్రాసిక్యూషన్‌ను ఆదేశిస్తే, అప్పుడు తాము జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది.

కోర్టు ఆదేశాలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి

అంతకుముందు ఈ కేసును విచారిస్తున్న సమయంలోనే, ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన కొన్ని అభ్యంతరకరమైన వ్యాఖ్యలను తాము గమనించామని ధర్మాసనం పేర్కొంది. అయితే ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఇప్పటికే తమ ముందు క్షమాపణలు చెప్పినందున ఈ అంశంలో మరింత ముందుకు వెళ్లాలని తాము భావించడం లేదని తెలిపింది. రాజ్యాంగంలోని మూడు విభాగాలు ఒకరి పనితీరు పట్ల మరొకరు పరస్పర గౌరవాన్ని చూపించాలని సూచించింది. తీర్పులపై న్యాయమైన విమర్శలను ఎప్పుడూ స్వాగతించవచ్చని, అయితే పరిమితులను అతిక్రమించరాదని స్పష్టం చేసింది. కోర్టులు జారీ చేసే ఆదేశాలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు తగినంత జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

సొంతంగానే దక్షిణ రింగు

ఎన్‌హెచ్‌ఏఐ రూపొందించిన అలైన్‌మెంట్ బుట్టదాఖలు

- ఇక సొంతంగా వేరే అలైన్‌మెంట్‌కు రూపకల్పన
- 12 మందితో కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగాన్ని సొంతంగానే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఒక నిర్ణయానికి వచ్చింది. గతంలో ఎన్‌హెచ్‌ఏఐ(నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన కన్సల్టెన్సీ రూపొందించిన అలైన్‌మెంట్‌ను పక్కన పెట్టనుంది. కొత్త అలైన్‌మెంట్ రూపొందించడానికి 12 మందితో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ట్రిపుల్ ఆర్‌ను జాతీయ రహదారిగా నిర్ధారించి కేంద్రమే చేపట్టేందుకు గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో ఉత్తరభాగానికి భూసేకరణ ప్రక్రియ నిర్వహిస్తున్న సంగతి విదితమే. అదే క్రమంలో దక్షిణభాగాన్ని కూడా కేంద్రమే చేపట్టాల్సి ఉంది. ఉత్తర-దక్షిణ భాగాల నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా కేంద్రమే భరించాల్సి ఉంది. భూసేకరణలో సగం వ్యయాన్ని మాత్రం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. రోడ్డు నిర్మాణ వ్యయాన్ని కేంద్రం భరించాలంటే, అలైన్‌మెంట్ ప్రక్రియను కూడా కేంద్రమే నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు మాత్రమే తీసుకుంటుంది. ఇప్పుడు అలా కాదని, రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా అలైన్‌మెంట్ రూపొందించనున్నందున.. రోడ్డు నిర్మాణ బాధ్యతను ఇక కేంద్రం తీసుకోదని దాదాపు తేలిపోయింది. అంటే రోడ్డు నిర్మాణ వ్యయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. దక్షిణ భాగానికి దాదాపు రూ.18 వేల కోట్లకు పైగా ఖర్చు కానుంది. ఇంత భారీ మొత్తాన్ని కేంద్రం భరించాల్సిన అవసరం లేకుండా, తానే భరిస్తానని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కేంద్రంతో సంబంధం లేకుండా, తనకు నచ్చిన ప్రాంతాల మీదుగా, నచ్చినట్టుగా రోడ్డు నిర్మాణానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఏర్పాటు చేసుకునే అలైన్‌మెంట్ ఎలా ఉండబోతోందన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

ఆ అలైన్‌మెంట్ ఖరారుకే ఏడాది సమయం

ఢిల్లీకి చెందిన కన్సల్టెన్సీ దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్‌ను రూపొందించేందుకు దాదాపు ఏడాది సమయం పట్టింది. ఆ సంస్థ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ..వాగులు, వంకలు, గుట్టలుమిట్టలను పరిగణనలోకి తీసుకుని అలైన్‌మెంట్‌ను రూపొందించారు. జల వనరులు, భవిష్యత్‌లో నిర్మించే ప్రాజెక్టులను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా అలైన్‌మెంట్ రూపొందించారు. మూడు అలైన్‌మెంట్లు సిద్ధం చేయగా, వాటిల్లో 189,25 కి.మీ. నిడివి గల అలైన్‌మెంట్‌ను ఎంపిక చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు దఫాలుగా అధికారులు సమావేశమై ఈ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌పై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూపొందిన అలైన్‌మెంట్...తాము ప్రతిపాదిస్తున్న ఫోర్త్ సిటీకి అనుకూలంగా లేదని, అందులో చాలా మార్పులు చేయాల్సి ఉందని తేల్చారు. దానిని అలాగే వదిలేసి పూర్తి కొత్త అలైన్‌మెంట్ ను రూపొందించటమే మేలని సూత్రప్రాయంగా తేల్చారు. ఈ మేరకు గూగుల్ మ్యాపు సహాయంతో ఓ తాత్కాలిక అలైన్‌మెంట్‌ను అధికారులు తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించారు. దాదాపు 194 కి.మీ. నిడివితో దీనిని రూపొందించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి తుది అలైన్‌మెంట్‌గా మార్చేందుకు 12 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. రోడ్లు భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి కన్వీనర్‌గా ఉండే ఆ కమిటీలో పురపాలక, రెవెన్యూ శాఖల కార్యదర్శులు, రోడ్లు భవనాల శాఖ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు ఇందులో సభ్యులుగా ఉంటారు. త్వరలో ఈ కమిటీ ఆధ్వర్యంలో అలైన్‌మెంట్ ఖరారు ప్రక్రియ ప్రారంభం కానుంది.

అలైన్‌మెంట్ మార్పు వెనుక అరాచకం

మాజీ మంత్రి వేముల

- ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగంలో రేవంత్ సర్కారు భూ దందాలు




బీఆర్‌ఎస్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగంలో అలైన్‌మెంట్ మార్పుతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూ దందాలకు తెరలేపుతోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నేతల సొంత లాభం కోసం అలైన్‌మెంట్ మార్చుతూ పేదల భూముల నుంచి రోడ్డును తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అలైన్‌మెంట్ మార్పు వెనకాల దందాలు, అరాచకాలు ఎవరి కోసం జరుగుతున్నాయో ప్రభుత్వం చెప్పాలన్నారు. అలైన్‌మెంట్ మార్పుపై ప్రజలకు ఉన్న అనుమానాలను సీఎం రేవంత్ నివృత్తి చేయాలన్నారు. పార్టీ నేతలు శుభప్రద్ పటేల్, కిషోర్, రాకేశ్‌కుమార్ తదితరులతో కలసి వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రీజనల్ రింగు రోడ్డు ఉత్తరభాగం అలైన్‌మెంట్ ఇప్పటికే ఆమోదం పొందగా, గతంలోనే ఖరారు చేసిన దక్షిణ భాగం అలైన్‌మెంట్‌కు కేంద్రం ఆమోదం లభించాల్సి ఉందన్నారు.

నాలుగు చోట్ల అలైన్‌మెంట్ మార్పు

ఫోర్త్‌సిటీ సౌలభ్యం పేరిట సాగర్ రోడ్డు, శ్రీశైలం రోడ్డులో 4 కిలోమీటర్లు మార్చడంతో పాత, కొత్త అలైన్‌మెంట్‌ల మధ్య 10 నుంచి 12 కిలోమీటర్లకు దూరం పెరిగిందని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్ మండలం కుందారంలో పేదలు సాగు చేసుకుంటున్న 400 ఎకరాల భూమిని రాజవంశీయులతో బేరం చేసుకుని కాంగ్రెస్ నేతలు 'బిగ్ బ్రదర్స్'అండతో లాక్కుంటున్నారని ఆరోపించారు. మాడుగులలో సీఎం బంధువుల భూముల్లో ఏం జరుగుతుందో చెప్పాలని, ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యేకు లబ్ధి జరిగేలా అలైన్‌మెంట్ మారిందన్నారు. బిగ్ బ్రదర్స్‌తో పాటు కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీ మంత్రి, కాంగ్రెస్ నేతలకు మేలు చేసేలా చేవెళ్ల మార్గంలో అంగడి చిట్టెంపల్లి నుంచి 5 కిలోమీటర్లు జరిపి మన్నెగూడ క్రాస్ రోడ్‌కు అలైన్‌మెంట్ మార్చారన్నారు.

నేడు రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో 'పొంగులేటి' భేటీ



సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో జరగనున్న సమావేశానికి హాజరు కావాలని రెవెన్యూ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగ సంఘాలకు ఆహ్వానం అందింది. సమావేశంలో వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరణ, వీఆర్‌ఏల విలీనం, పెండింగ్ పదోన్నతులు, ఎన్నికల బదిలీలు తదితర అంశాలపై చర్చ జరిగే అవకాశముంది.

ఎన్నికల బదిలీలు చేపట్టండి

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా బదిలీ అయిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్‌లతో కూడిన బృందం శుక్రవారం సచివాలయంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు.

పలుకుబడి ఉంటే సీఎంపై ఒత్తిడి తేవాలి

మహేశ్‌కుమార్‌కు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి హితవు



సాక్షి, హైదరాబాద్: పీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితుడైన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పలుకుబడి ఉంటే.. బీసీ వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం సీఎం రేవంత్‌పై ఒత్తిడి తేవాలని శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత ఎస్.మధుసూదనాచారి అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై నూతన పీసీసీ అధ్యక్షుడు దృష్టి పెట్టాలని హితవు పలికారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి కనీసం వారం రోజులు కూడా కాకమునుపే దమ్ముందా.. అంటూ బీఆర్‌ఎస్‌పై మహేశ్ కుమార్ విమర్శలు చేయడాన్ని ఖండించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, పార్టీ నేత పల్లె రవి కుమార్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. బీసీ డిక్లరేషన్ అమలు కోసం రాష్ట్రంలో జరుగుతున్న ఉద్యమం కారణంగానే మహేశ్‌కుమార్‌కు పీసీసీ అధ్యక్ష పదవి దక్కిందన్నారు. వెనుకబడిన తరగతులకు బడ్జెట్‌లో ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం అందులో సగం కూడా ప్రతిపాదించలేదన్నారు. దేశాన్ని దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్.. బీసీల గణన చేపట్టలేదని ఆరోపించారు.

కులగణన చేసి బీసీ రిజర్వేషన్ 42% పెంచాలి

కలెక్టరేట్ ముట్టడిలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య

లక్డీకాపూల్/కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంతవరకు కులగణన చేయలేదని రాజ్యసభ సభ్యుడు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. ఎన్నికల వాగ్దానం ప్రకారం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్ పిలుపులో భాగంగా శుక్రవారం హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42%కు పెంపుదలకు రాహుల్‌గాంధీ అనుకూలంగా మాట్లాడుతున్నప్పటికీ ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అణచివేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 5% సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలేదన్నారు. 50% జనాభా గల పేద కులాలకు రాజ్యాంగ సవరణ చేయడంలో పాలకుల వైఖరిని ఆక్షేపించా రు. ఇప్పటికైనా పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల ఫీజుల బకా యిలు రూ.4,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ముట్టడి కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యర్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శనివారం కాచిగూడలో జరిగిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ.. ఈ నెల 22న హోటల్ అశోకాలో బీసీ సంఘాల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రులపై బురద చల్లొద్దు: ఇందిరాశోభన్



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ దవాఖానాలపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు కాంగ్రెస్ నేత ఇందిరాశోభన్ హితవు పలికారు. అధికారంలో ఉన్నన్ని రోజులు ఆసుపత్రులను నాశనం చేసి ఇప్పుడు పదే పదే గాంధీ హాస్పిటల్, ప్రభుత్వ దవాఖానాలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని శుక్రవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన దారుణాలన్నీ మీడియా, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో అలాగే ఉన్నాయని, వాటిని ఒక్కసారి పరిశీలించుకోవాలని కోరా రు. కరీంనగర్, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి బిడ్డల శవాలను మోసుకుపో యిన ఘటన, 2017లో మాతా, శిశు మరణాలను, 2022లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు విఫలమై బాలింతలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు మర్చిపోయావా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి న పది నెలల్లో ఉచిత వైద్యానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, కొత్తగా 163 ప్రొసీజర్లను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చామని, ఉస్మానియా ఆసుపత్రిని గోషామహల్‌లో నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఈ ఒక్కసారికి అనుమతి

- స్థానికత విషయంలో గతంలో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు భారీ ఊరట
- నీట్ కౌన్సెలింగ్‌కు వారిని అనుమతిస్తున్నట్లు తాజాగా సుప్రీంకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చిన సుప్రీం ధర్మాసనం
- ప్రతివాదులకు నోటీసులు జారీ, అక్టోబర్ 14న తదుపరి విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: నీట్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన స్థానికత వ్యవహారంలో రాష్ట్రానికి చెందిన కొందరు విద్యార్థులకు భారీ ఊరట లభించింది. ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌కు సమయం తక్కువగా ఉండడంతో ఈ ఒక్కసారికి హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్టు సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. ఈ ఏడాదికి గాను సదరు విద్యార్థులకు ఊరట కలిస్తూ మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. అయితే ఈ కేసులో హైకోర్టు ఆదేశాలపై స్టే విధిస్తున్నట్లు తెలిపింది. వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జీవో 33ని తీసుకువచ్చింది. నీట్‌కు ముందు నాలుగేళ్లు స్థానికంగా చదివి ఉండాలని లేదా నివాసం ఉండాలని (జీవో 33 లోని నిబంధన 3 (ఏ)) పేర్కొంది. ఈ జీవోను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి నాగ నరసింహం అభిరామ్‌తో పాటు మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో తమకు అన్యాయం జరుగుతోందని నివేదించారు. హైకోర్టులో వీరికి అనుకూలంగా తీర్పు రావడంతో.. ఆ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ప్రతివాదుల తరఫున సీనియర్ అడ్వకేట్‌లు మురళీధర్, నిరంజన్‌రెడ్డిలు వాదనలు వినిపించారు.

4 తీర్పులు అనుకూలంగా ఉన్నాయి: సింఘ్వీ

నీట్ పరీక్షలో స్థానికతకు సంబంధించి ప్రతి విద్యార్థి స్థానికుడై 9, 10తో పాటు ఇంటర్ రాష్ట్రంలో చదవాల్సి ఉందని సింఘ్వీ చెప్పారు. ఈ వ్యవహారంలో రాజ్యాంగ ధర్మాసనంతో పాటు నాలుగు తీర్పులు తమకు అనుకూలంగా ఉన్నాయని కోర్టుకు నివేదించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు విద్యార్థులు పాఠశాల లేదా కాలేజీ విద్య విదేశాల్లో చదివి నీట్ పరీక్ష మాత్రం తెలంగాణలో రాసిన విషయాన్ని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇలా చేయడం వలన తెలంగాణలో మొదటి నుంచి చదువుకున్న విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు తెలంగాణలో నీట్ తీసుకుంటున్నారని, అదే తెలంగాణ విద్యార్థులకు ఆ అవకాశం ఆంధ్రప్రదేశ్‌లో లభించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

ప్రభుత్వ జీవో సరికాదు

ప్రభుత్వ వాదనలతో విభేదించిన విద్యార్థుల తరఫు న్యాయవాది మురళీధర్.. కేవలం రెండు, మూడేళ్ల చదువుల కోసం రాష్ట్రానికి దూరంగా ఉంటే విద్యార్థులకు స్థానికతను దూరం చేయడం సరి కాదని వాదించారు. నీట్ ఫలితాలకు వారం ముందు జీవో తెచ్చారని, అందుకే ఆ జీవోను హైకోర్టు నిలిపివేసిందని తెలిపారు. ఈ సమయంలో సింఘ్వీ జోక్యం చేసుకొని.. ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించిన 371 (డీ) పదేళ్ల తర్వాత ఎక్స్‌పైరీ అయ్యిందని, అందుకే పదేళ్ల తర్వాత ఈ కొత్త నిబంధనను ప్రభుత్వం తెచ్చిందని తెలిపారు. అయితే వన్ టైం ఎక్సెప్షన్ (ఒక్కసారికి మినహాయింపు) కింద ఈసారి విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సెప్టెంబర్ చివరి వారంలోనే తొలి, అక్టోబర్ మొదటి వారంలో రెండవ కౌన్సెలింగ్ ఉన్నందున కోర్టును ఆశ్రయించిన విద్యార్థుల మేలు కోరి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు.

మెరిట్స్‌లోకి వెళ్లే సమయం లేదు

ఇరుపక్షాల వాదనల అనంతరం.. మెరిట్స్‌లోకి వెళ్లేంత సమయం లేదన్న సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిన నేపథ్యంలో విద్యార్థులు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపింది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో సమాధానం చెప్పాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి విచారణను అక్టోబర్ 14వ తేదీకి వాయిదా వేసింది.

హైకోర్టు ఏమంది?

ఒక విద్యార్థి తెలంగాణ నివాసి లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మా సనం అభిప్రాయపడింది. తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ప్రభుత్వం రూపొందించే మార్గద ర్శకాల మేరకు ప్రతి విద్యార్థికి స్థానిక కోటా వర్తింపజేయాలని పేర్కొంది. ఈ తీర్పును రాష్ట్ర ప్రభు త్వం ఈ నెల 11న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

సింగరేణి కార్మికులకు రూ.796 కోట్ల బోనస్

సగటున ప్రతి కార్మికుడికి రూ.1.90 లక్షల దసరా కానుక

- సంస్థ చరిత్రలో తొలిసారి 25 వేల మంది కాంట్రాక్టు సిబ్బందికి రూ.5 వేల చొప్పున బోనస్
- బోనస్‌తోపాటు సంస్థ కార్యకలాపాల విస్తరణ.. రూ.4,701 కోట్ల లాభం
- రూ.2,289 కోట్లు పెట్టుబడి పెడుతున్నాం.. నైనీ బ్లాక్ దగ్గర పవర్ ప్రాజెక్టు,
- జైపూర్‌లో 800 మెగావాట్ల ప్లాంటు.. మరో 800 మెగావాట్ల ప్లాంట్ జెన్‌కోతో కలిసి ఏర్పాటు
- రామగుండం ఏరియాలో 500 మెగావాట్ల పంప్‌స్టోరేజీ కూడా : డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి
- సింగరేణి కార్మికుల కుటుంబాల్లో ఆనందం చూసేందుకే బోనస్: సీఎం రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కార్మికులకు ప్రభుత్వం దసరా బోనస్ ప్రకటించింది. సంస్థ లాభాల్లో మూడోవంతు సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు దసరా కానుకగా ఇవ్వనున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు రూ.796 కోట్ల బోనస్ ప్రకటిస్తున్నామని, దీని ప్రకారం సింగరేణి పర్మనెంట్ ఉద్యోగులందరికీ సగటున రూ.1.90 లక్షల బోనస్ వస్తుందని, వీరితో పాటు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులకు కూడా తొలిసారి బోనస్ కింద రూ.5 వేలు ఇస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర కేబినెట్ సమావేశానికి ముందు సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రులు, సింగరేణి అధికారులు, ఆ ప్రాంత ఎమ్మెల్యేలు, కార్మిక సంఘాల నేతలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి కార్మికులకు బోనస్ వివరాలను ప్రకటించారు.

ఉద్యమాన్ని పతాకస్థాయికి తీసుకెళ్లారు: ముఖ్యమంత్రి రేవంత్

సింగరేణి సంస్థ లాభాల్లో కార్మికులకు వాటా పంచడం ద్వారా వారి కుటుంబాల్లో ఆనందాన్ని చూడాలనే సింగరేణి యాజమాన్యం, మంత్రివర్గంతో కలిసి బోనస్ ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. 'తెలంగాణ రాష్ట్ర సాధన ప్రక్రియలో అగ్రభాగాన నిలబడ్డ సింగరేణి గని కార్మికులు ఉద్యమాన్ని పతాక స్థాయికి తెల్లారు. వారి పోరాట పటిమ రాష్ట్ర సాధనలో క్రియాశీల పాత్ర పోషించింది. అలాంటి సంస్థ వ్యాపార లాభాల్లో కార్మికులకు వాటా ఇవ్వాలని నిర్ణయించాం. సింగరేణి యాజమాన్యంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి ప్రతిపాదన మేరకు బోనస్ ప్రకటిస్తున్నాం'అని రేవంత్ వెల్లడించారు.

సింగరేణితో తెలంగాణకు పేరు ప్రఖ్యాతులు: డిప్యూటీ సీఎం భట్టి

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ తెలంగాణకు తలమానికమైన సింగరేణిలో సంస్థ కార్మికుల శ్రమశక్తి కారణంగా ఉత్పత్తి పెరుగుతోందని చెప్పారు. సింగరేణి కార్మికులు సాధించిన లాభాలను కార్మికులకు పంచడం సంతోషంగా ఉందన్నారు. పన్నులన్నీ మినహాయించుకున్న తర్వాత ఈ ఏడాది సింగరేణికి రూ.4,701 కోట్ల లాభం వచ్చిందని, అందులో పెట్టుబడి కింద రూ.2,289 కోట్లు పోను మిగిలిన రూ.2,412 కోట్లలో 33 శాతం అంటే రూ.796 కోట్లను సింగరేణి కార్మికులకు బోనస్ కింద ప్రకటిస్తున్నామని చెప్పారు. ఈ ప్రకటన ద్వారా సగటున ప్రతి ఉద్యోగికి రూ.1.90లక్షల బోనస్ లభిస్తుందని, గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.20 వేలు అధికమని చెప్పారు. సింగరేణిలో పనిచేస్తున్న 41,837 మంది శాశ్వత ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు ప్రాతిపదికన 25 వేల మంది పని చేస్తున్నారని, చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్టు సిబ్బందికి కూడా బోనస్ ఇస్తున్నామని చెప్పారు.

విస్తరణ కార్యాచరణ కూడా...

సింగరేణి కార్మికులకు బోనస్‌తోపాటు సంస్థ విస్తరణ కార్యాచరణ కూడా చేపడుతున్నామని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలోని 100 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ విస్తరణ చేపడతామని, 500 మెగావాట్ల పంప్ స్టోరేజీ (రామగుండం ఏరియా) ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని, జైపూర్‌లో 800 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ జెన్‌కోతో కలిసి మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటు ప్రారంభిస్తామని, ఒడిశాలోని నైనీ బ్లాక్‌పైన అంగూల్ జిల్లాలో 2,400 మెగావాట్ల సామర్థ్యం గల సూపర్ క్రిటికల్ థర్మల్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీకే, గోలేటి, నైనీ ఓపెన్‌కాస్ట్‌ల విస్తరణ చేపడతామని తెలిపారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లల కోసం నూతన రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఏరియా ఆస్పత్రుల ఆధునీకరణతోపాటు హైదరాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి వెల్లడించారు.

నాలుగైదు రోజుల్లో మెడికల్ కౌన్సెలింగ్!

- సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఎట్టకేలకు లైన్ క్లియర్
- ఏర్పాట్లపై కాళోజీ వర్సిటీ దృష్టి
- మొదట రాష్ట్రస్థాయి మెరిట్ లిస్ట్ విడుదల.. తర్వాత వెబ్ ఆప్షన్లు తీసుకోనున్న హెల్త్ వర్సిటీ
- వచ్చే నెలాఖరు నాటికి అన్ని విడతల కౌన్సెలింగ్‌లు పూర్తి!

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌కు లైన్ క్లియర్ అయింది. స్థానికత వ్యవహారంలో గతంలో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు ఊరటనిస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో నీట్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేయాలని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం సూత్రప్రాయంగా నిర్ణయించింది. సుప్రీంకోర్టు నుంచి పూర్తిస్థాయి ఆదేశాలు తమకు చేరిన తర్వాత కౌన్సిలింగ్ ప్రక్రియను ఎలా చేపట్టాలన్న దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. నాలుగైదు రోజుల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని కాళోజీ వర్గాలు తెలిపాయి. కౌన్సెలింగ్‌లో భాగంగా మొదట దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో మెరిట్ లిస్ట్ తయారు చేస్తారు. ఆ తర్వాత వారి నుంచి వెబ్ ఆప్షన్లు తీసుకుంటారు. నెలాఖరు నాటికి మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తి అయ్యే అవకాశం ఉంది. ముందుగా కన్వీనర్ కోటా, తర్వాత మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు కౌన్సెలింగ్ జరగనుంది. అక్టోబర్ 15వ తేదీ నాటికి రెండు విడతల కౌన్సెలింగ్‌లు, ఆ నెలాఖరు నాటికి అన్ని కౌన్సిలింగ్‌లు పూర్తి చేస్తారు.

17 వేల మంది దరఖాస్తు

నీట్‌లో అక్రమాలు, సవరణ ఫలితాలతో వైద్య విద్యా సంవత్సరం ఈసారి ఆలస్యమైన సంగతి తెలిసిందే. స్థానికత వ్యవహారం మరింత ఆలస్యానికి కారణమైంది. నీట్‌లో రాష్ట్రం నుంచి 47,356 మంది అర్హత సాధించగా, అందులో 17 వేల మంది రాష్ట్రంలో మెడికల్ సీట్లకు దరఖాస్తు చేసుకున్నారని కాళోజీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం 15 శాతం ఆలిండియా కోటా సీట్లు, డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూ సీట్లకు రెండో విడత కౌన్సెలింగ్ పూర్తయింది. ఇంకా రెండు విడతల కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. వాస్తవానికి జాతీయ స్థాయిలో మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత రాష్ట్రస్థాయిలో మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి. అలాగే రెండో విడత జాతీయ కౌన్సెలింగ్ తర్వాత రాష్ట్రంలో రెండో విడత మొదలవుతుంది. కానీ స్థానికత అంశం కోర్టులో ఉండటంతో ఇప్పటివరకు రాష్ట్రంలో కౌన్సెలింగ్ ప్రారంభం కాలేదు. జాతీయ కౌన్సెలింగ్‌లు జరుగుతున్నా, ఇక్కడ ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతోంది. అనేకమంది విద్యార్థులు తమకు ఇష్టం లేకపోయినా జాతీయ కౌన్సెలింగ్ ద్వారా వివిధ రాష్ట్రాల్లో చేరారు. వారు ఇక్కడ చేరాలనుకుంటే ఎలాంటి వెసులుబాటు ఇస్తారో చూడాల్సి ఉంది. మరోవైపు ఇతర రాష్ట్రాల్లోనూ కౌన్సెలింగ్‌లు జరుగుతున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రాల్లో మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు, జాతీయ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు సాధించిన విద్యార్థులు తరగతులకు హాజరవుతారు.

'స్థానికత'తో ఆలస్యం

రాష్ట్రంలో ఎంబీబీఎస్ సహా ఇతర మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్‌లో భాగంగా రిజిస్ట్రేషన్లు, వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయింది. ఆప్షన్లు పెట్టుకునే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్నా స్థానికత అంశం కోర్టులో ఉండటంతో ఆలస్యమైంది. ఈసారి ప్రభుత్వం స్థానికత అంశంలో మార్పులు చేసిన సంగతి తెలిసిందే. గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ మధ్యలో ఏవైనా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వారిని స్థానికులుగా గుర్తించేవారు. అయితే చాలామంది ఏపీకి చెందినవారు తప్పుడు సర్టిఫికెట్లు తీసుకొచ్చి తెలంగాణ స్థానికులుగా చెప్పుకుంటున్నారని ప్రభుత్వం భావించింది. దీంతో స్థానికత విషయంలో మార్పులు చేసింది. 9, 10, ఇంటర్ రెండేళ్లు కలిపి మొత్తం నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివిన వారినే స్థానికులుగా గుర్తించాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలోనే కొందరు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు.

చవకబారు విమర్శలు మానుకో కేటీఆర్

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర హెచ్చరిక



సాక్షి,హైదరాబాద్: ప్రభుత్వ దవాఖానాలు, ఆరోగ్య వ్యవస్థపై చవకబారు విమర్శలు మానుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును మంత్రి దామోదర రాజనర్సింహ మరోసారి హెచ్చరించారు. ఈహెచ్ఎస్‌పై కేటీఆర్ చేసిన ట్వీట్‌పై మంత్రి ఘాటుగా స్పందించారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ స్కీమ్‌లను పదేళ్ల భ్రష్టు పట్టించి, ఇప్పుడు నీతులు చెబుతారా అంటూ మంత్రి దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ పాలనలో ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదల చేయకపోవడం వల్ల, పేదలకు, ఉద్యోగులకు ఆ స్కీమ్ సేవలు అందకుండా పోయాయన్నారు. ఈహెచ్ఎస్ కింద ట్రీట్‌మెంట్ కోసం పోయిన ఉద్యోగులు, పెన్షనర్లను కార్పొరేట్ హాస్పిటళ్ల యాజమాన్యాలు అవమానిస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు చోద్యం చూశారని విమర్శించారు. ''మా వేతనాల్లో నుంచి కంట్రిబ్యూషన్ ఇస్తాం, స్కీమ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ఉద్యోగులు, పెన్షనర్లు కోరినా పట్టించుకోలేదు. పదేళ్ల మోసం చేసింది చాలదన్నట్టు, ఎన్నికల ముందు హడావుడిగా డమ్మీ జీవో ఇచ్చి మరోసారి ఉద్యోగులను మోసం చేసే కుట్రలు చేశారు. మీ కుట్రలు, కుతంత్రాలు తెలుసుకోలేనంత అమాయకులు కాదు ఉద్యోగులు. ఇకనైనా ఇలాంటి చవకబారు విమర్శలు మానుకోవాల''ని మంత్రి హెచ్చరించారు. ''మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయలేకపోయిన ప్యాకేజీల రివిజన్‌ను 6 నెలల్లోనే చేసి చూపించాం. కొత్తగా 163 రకాల ప్రొసీజర్లను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చాం' అని మంత్రి దామోదర తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై బీఆర్‌ఎస్ త్రిసభ్య కమిటీ

సభ్యులుగా సంజయ్, రాజయ్య, ఆనంద్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్యారోగ్యం పూర్తిగా దిగజారిందని విమర్శిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నిజనిర్ధారణతోపాటు, ఆస్పత్రుల పనితీరుపై అధ్యయనానికి ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ రాజయ్య ఆధ్వర్యంలో ఈ కమిటీ గాంధీతో పాటు రాష్ట్రంలోని పలు ఆస్పత్రులను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేస్తుంది. నిర్మాణాత్మకమైన సూచనలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తుంది.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో గులాబీజెండా ఎగురుతుంది : కేటీఆర్

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయడం ఖాయమని, త్వరలో ఆ నియోజకవర్గానికి జరిగే ఉపఎన్నికలో బీఆర్‌ఎస్ గులాబీ జెండా ఎగురవేస్తుందని కేటీఆర్ అన్నా రు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య శుక్రవారం కేటీఆర్‌ను కలిశారు. ఉపఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహంపై ఈ భేటీలో చర్చించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు త్వరలో నియోజకవర్గంలో పర్యటిస్తామని కేటీఆర్ వెల్లడించారు. త్వరలో పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. పార్లమెంటుతోపాటు శాసనమండలి, శాసనసభలో ప్రాతినిధ్యం కల్పించడంతో ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చినా కడియం శ్రీహరి కేవలం రాజకీయ స్వార్థంతోనే పార్టీని వీడారని కేటీఆర్ అన్నారు. త్వరలో నియోజకవర్గ స్థాయి సమావేశ తేదీని ఖరారు చేస్తామని కేటీఆర్ ప్రకటించారు.

నేటి నుంచి కాంగ్రెస్ జిల్లాల వారీ సమీక్షలు

- పీసీసీ అధ్యక్షుని ఆధ్వర్యంలో భేటీలు
- తొలుత వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నేతలతో భేటీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల తర్వాత కాంగ్రెస్ పార్టీ సమీక్షకు సిద్ధమవుతోంది. పీసీసీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో శనివారం నుంచి జిల్లా స్థాయి సమీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాల వారీగా పార్టీ పరిస్థితి, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల స్థితిగతులు, క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయం, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిన తీరు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ అంశాల ప్రాతిపదికగా ఈ సమీక్షలు జరుగుతాయని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశాల్లో పార్టీ అన్ని స్థాయిల నాయకులు పాల్గొననున్నారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వరంగల్, 2 నుంచి 4 గంటల వరకు కరీంనగర్, 4 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిజామాబాద్ జిల్లాల సమావేశాలు జరగనున్నాయి.

బుధవారం నుంచి మంత్రుల రాక: ప్రతి బుధ, శుక్ర వారాల్లో ఒక్కో మంత్రి చొప్పున గాంధీభవన్‌కు వచ్చే కార్యక్రమం వచ్చే బుధవారం నుంచి ప్రారంభం కానుంది. వాస్తవానికి, శుక్రవారమే ఇది ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ కేబినెట్ సమావేశం జరగడంతో బుధవారానికి వాయిదా పడింది.

అమృత్ టెండర్లలో అవినీతి నిగ్గు తేల్చండి

- టెండర్ల అవకతవకల్లో సీఎం బావమరిదికి భాగస్వామ్యం
- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రులకు కేటీఆర్ లేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమృత్ టెండర్లలో అవినీతికి పాల్పడుతున్న అంశంలో జోక్యం చేసుకొని నిజాలను నిగ్గు తేల్చాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు మనోహర్‌లాల్ కట్టర్, టోచన్ సాహులకు కేటీఆర్ శుక్రవారం లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా రాష్ట్రానికి కేటాయించిన నిధుల్లో దాదాపు రూ.1,500 కోట్లు విలువ చేసే పనులు ముఖ్యమంత్రి సొంత బావమరిది కంపెనీకి అర్హతలు లేకున్నా కట్టబెట్టారన్న ఆరోపణల్లో నిజాలు బయట పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఈ అంశంలో సమాచారం ఇవ్వడం లేదని చెప్పారు. ముఖ్యమంత్రి బావమరిది ఈ మొత్తం వ్యవహారంలో భాగస్వామిగా ఉన్నారన్నారు. అమృత్ పథకంలో గత తొమ్మిది నెలలుగా జరిగిన ప్రతి టెండర్లను సమీక్షించి, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ టెండర్లను రద్దు చేయాలని కేటీఆర్ కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక విమర్శలు చేసిన ఓ కంపెనీకి దాదాపు 40 శాతానికి పైగా అంచనాలు పెంచి మరీ పనులను అప్పగించినట్టు ఆరోపణలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. అమృత్ టెండర్ల సమాచారాన్ని బహిర్గతం చేయాలని, టెండర్లు దక్కించుకున్న కంపెనీల వివరాలను ప్రజల ముందు పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది సుజన్‌రెడ్డికి చెందిన కంపెనీ ఇతర కంపెనీలతో కలిసి రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ ప్రాజెక్టుల కాంట్రాక్టులను ఎలాంటి అర్హతలు లేకున్నా దక్కించుకుంటున్న విషయాన్ని తన లేఖలో కేటీఆర్ ప్రస్తావించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో కొడంగల్ ఎత్తిపోతల కాంట్రాక్టు పనులను సృజన్‌రెడ్డి కంపెనీతోపాటు గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక ఆరోపణలు చేసిన సదరు కంపెనీతో పాటు మరో కంపెనీకి అప్పజెప్పినట్టు కేటీఆర్ తన లేఖలో కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కేఎస్ఆర్ కంపెనీలో ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డికి వాటాలు ఉన్నాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. తగిన చర్యలు తీసుకోకుంటే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేస్తున్న అవినీతి కార్యక్రమాల్లో కేంద్రానికి కూడా భాగస్వామ్యం ఉందని ప్రజలు నమ్ముతారని కేటీఆర్ హెచ్చరించారు.

కాళేశ్వరం తెలంగాణ రైతుకు వెయ్యి ఏనుగుల బలం: హరీశ్



మల్లన్నసాగర్‌ను సందర్శించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

దుబ్బాక: కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతుకు వెయ్యి ఏనుగుల బలమని, మేడిగడ్డ కొట్టుకుపోయిందని, కాళేశ్వరంలో లక్ష కోట్లు గంగపాలయ్యాయని చిల్లర రాజకీయాలు చేసిన కాంగ్రెస్..ఇవాళ సిగ్గుతో తలదించుకోవాలని మాజీమంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో 21 టీఎంసీల నీరు చేరడంతో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీతారెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులతో కలసి శుక్రవారం హరీశ్‌రావు సందర్శించి పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకుపోయి ఉంటే ఈ రోజు మల్లన్నసాగర్‌లోకి ఇంత నీరు ఎక్కడి నుంచి వచ్చిందో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి నుంచి లక్ష్మీబరాజ్, అన్నపూర్ణ బ్యారేజ్ నుంచి రంగనాయకసాగర్, అక్కడి నుంచి మల్లన్నసాగర్.. ఇక్కడి నుంచి కొండపోచమ్మ సాగర్ దాక గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయంటే అది కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉండటం వల్లనే సాధ్యమైందని చెప్పారు.

మల్లన్నసాగర్ వద్ద ఉద్రిక్తత

మల్లన్నసాగర్‌ను సందర్శనకు హరీశ్‌రావు తదితరులు వస్తున్నారని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. కాంగ్రెస్ నాయకులను బలవంతంగా అక్కడి నుంచి పోలీసులు పంపించారు. మధ్యాహ్నం భారీ కాన్వాయ్, వందలాది మంది బీఆర్‌ఎస్ శ్రేణులతో హరీశ్‌రావు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లన్నసాగర్ పరిసరాలు అంతా పోలీస్ నిఘా నీడలోనే కనిపించాయి.



ఎవడు ఆత్మయందు సకల భూతములను, సకల భూతములయందు ఆత్మను జూచునో వాడు జుగుప్స నొందుట లేదు. (జుగుప్స, దయ మొదలగు పాశములు వీని నంటుట లేదు.)

– ఈశావాస్యోపనిషత్తు (హిందూ ధర్మం)

సాక్షి

శనివారం, 21 సెప్టెంబర్ 2024

సహించరాని ఉన్మాదం

ముందు ఇరుగుపొరుగుతో... ఆ తర్వాత పశ్చిమాసియా దేశాలన్నిటితో ఉన్మాద యుద్ధానికి ఇజ్రాయెల్ సిద్ధపడుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థలూ, దేశాలూ ఈ మాదిరిగా చేష్టలుడిగి చూస్తూ ఉండిపోతే ఇది కాస్తా ప్రపంచ యుద్ధంగా పరిణమించే అవకాశం లేకపోలేదని మంగళ, బుధవారాల్లో లెబనాన్, సిరియాల్లో చోటుచేసుకున్న పరిణామాలు తెలియజెబుతున్నాయి. వరసగా రెండురోజులపాటు పేజర్లనూ, వాకీటాకీలనూ, ఇళ్లల్లో వినియోగించే సౌరశక్తి ఉపకరణాలనూ పేల్చటం ద్వారా సాగించిన ఆ దాడుల్లో 37 మంది మరణించగా నాలుగు వేలమందికి పైగా గాయపడ్డారు. లెబనాన్‌లో హిజ్బొల్లా మిలిటెంట్లను అంతం చేయటానికే ఈ దాడులు చేసినట్టు కనబడుతున్నదని అంతర్జాతీయ మీడియాలో వస్తున్న కథనాలు అర్ధసత్యం మాత్రమే. ప్రాణాలు కోల్పోయినవారిలో మిలిటెంట్లతోపాటు పసిపిల్లలూ, అమాయక పౌరులూ, ఆరోగ్యసేవా కార్యకర్తలూ ఉన్నారు. హిజ్బొల్లా మిలిటెంట్ సంస్థ మాత్రమే కాదు... అదొక రాజకీయ పక్షం, ధార్మిక సంస్థ. కనుక ఆ పేజర్లు సామాన్య పౌరులకూ చేరివుండొచ్చు.

గాజాలో దాదాపు ఏడాదిగా మారణ హోమం సాగుతోంది. దాన్ని ఆపటానికీ, శాంతియుత పరిష్కారం సాధించటానికీ ఎవరూ చిత్తశుద్ధితో కృషి చేయటం లేదు. మొన్న ఫిబ్రవరిలో అమెరికా వైమానిక దళ సీనియర్ ఎయిర్‌మాన్ ఆరోన్ బుష్నెల్ ఆత్మాహుతి చేసుకునేముందు ఫేస్‌బుక్‌లో, ఇతర సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన సందేశం ప్రతి ఒక్కరినీ కలచివేస్తుంది. కళ్లెదుట మారణ హోమం సాగుతుంటే ప్రపంచం నిర్లిప్తంగా మిగిలిపోవటాన్ని... తన చేతులకూ నెత్తురంటడాన్ని తట్టుకోలేకపోతున్నానని ఆ సందేశంలో ఆయన రాశాడు. అమెరికాకు చీమ కుట్టినట్టయినా లేదు. లెబనాన్, సిరియాల్లో జరిగిన దాడులపై ఒక మీడియా సమావేశంలో పదే పదే ప్రశ్నించినా వైట్‌హౌస్ ప్రతినిధి జాన్ కిర్బీ జవాబిచ్చేందుకు నిరాకరించటం దీన్నే ధ్రువపరుస్తోంది.

ఉగ్రవాదానికి విచక్షణ ఉండదు. తన విధ్వంసకర చర్యలు ఎవరికి చేటు చేస్తాయన్న ఆలోచన ఉండదు. వ్యక్తులు ఇలాంటి ఉన్మాదానికి లోనయితే జరిగే నష్టంకన్నా రాజ్యాలు ఉగ్రవాదాన్ని ఆశ్ర యిస్తే కలిగే నష్టం అనేక వందల రెట్లు ఎక్కువ. దీన్ని మొగ్గలోనే తుంచకపోతే అలాంటి ధూర్త రాజ్యాలు వేరే దేశాలపై సైతం ఆ మాదిరిగానే దుందుడుకు చర్యలకు దిగి ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోవటానికి కూడా సిద్ధపడతాయి. అఫ్గానిస్తాన్‌లో తాలిబన్‌లను అందరూ వ్యతిరేకించింది అందుకే. ఒక దేశాన్ని దురాక్రమించి, అక్కడి పౌరులకు కనీసం నిలువ నీడ కూడా లేకుండా చేస్తూ అందుకు ప్రతిఘటన ఉండకూడదనుకోవటం తెలివి తక్కువతనం. పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా అడుగులు పడి, చివరకు ఒప్పందం కుదరబోతున్న దశలో సైతం అడ్డం తిరిగి మొండికేసిన చరిత్ర ఇజ్రాయెల్‌ది. అంతేకాదు... ఇరుగుపొరుగు దేశాలతో తరచు గిల్లికజ్జాలకు దిగటంతోపాటు ఇథియోపియా, ఉగాండా, నైజర్, కెన్యావంటి సబ్ సహారా దేశాల, లాటిన్ అమె రికా దేశాల నియంతలకు ఆయుధాలిచ్చి అండదండలందించిన చరిత్ర ఇజ్రాయెల్‌ది. చూస్తూ ఉంటే మేస్తూ పోయినట్టు ప్రపంచం స్థాణువై మిగిలిపోతే ఈ అరాచకాలకు అంతం ఉండదు. సమస్య ఉన్నదని గుర్తించటం దాని పరిష్కారానికి తొలి మెట్టు. కానీ ఇంతవరకూ అమెరికాగానీ, దానికి వంతపాడుతున్న యూరప్ దేశాలుగానీ అసలు పాలస్తీనా అనేది సమస్యే కానట్టు నటిస్తున్నాయి.

తాజాగా జరిగిన పేలుళ్ల వెనకున్న కుట్రలో ఇప్పుడు అందరి అనుమానమూ పాశ్చాత్య ప్రపంచంపై పడింది. ముఖ్యంగా హంగెరీ, బల్గేరియా దేశాల సంస్థల పాత్ర గురించి అందరూ ఆరా తీస్తున్నారు. పేజర్లను తాము తయారుచేయటం లేదనీ, హంగెరీలోని బీఏసీ అనే సంస్థ తమ లోగోను వాడుకుని ఉత్పత్తి చేస్తోందనీ తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో అనే సంస్థ అంటున్నది. ఇందుకు తమకు పశ్చిమాసియా దేశంనుంచి నగదు ముడుతున్నదని సంస్థ వివరించింది. హంగెరీ మీడియా సంస్థ కథనం ఇంకా విచిత్రంగా ఉంది. అది చెప్తున్న ప్రకారం బీఏసీ కాదు, బల్గేరియాలోని నోర్టా గ్లోబల్ అనే సంస్థ ఈ పేజర్లను సరఫరా చేసిందట. బీఏసీకి ఉత్పాదక సామర్థ్యంలేదనీ, అది కేవలం ఒక ఏజెంటు మాత్రమే ఉండే కన్సెల్టింగ్ ఏజెన్సీ అనీ హంగెరీ ప్రభుత్వం చెబుతోంది. ఇక బల్గేరియా అయితే అసలు పేజర్ల ఉత్పాదక సంస్థ తమ గడ్డపైనే లేదంటున్నది. ప్రజల ప్రాణాలు తీసే దుష్ట చర్యకు పాల్పడి నేరం తాలూకు ఆనవాళ్లు మిగల్చకపోవటం, అది ఘనకార్యమన్నట్టు సంబరపడటం ఉగ్రవాద సంస్థల స్వభావం. దాన్నే ఇజ్రాయెల్ కూడా అనుకరిస్తూ పైచేయి సాధించానని భ్రమపడుతున్నట్టుంది. కానీ ఈ మాదిరి చర్యలు మరింత ప్రతీకార వాంఛను పెంచుతాయి తప్ప దాని స్థానాన్ని పదిలం చేయలేవు.

ఇంతవరకూ పేలుళ్ల బాధ్యత తనదేనని ఇజ్రాయెల్ అధికారికంగా ప్రకటించలేదు. తమ శత్రువు ఎక్కడున్నా వెదికి వెదికి పట్టుకుని మట్టుబెట్టడం, అందుబాటులో ఉన్న సాంకేతికతలను అందుకు వాడుకోవటం ఇజ్రాయెల్‌కు కొత్తగాదు. ఫోన్లలోకి, కంప్యూటర్లలోకి చొరబడి మాల్‌వేర్‌ను ప్రవేశ పెట్టడం, పౌరుల గోప్యతకు భంగం కలిగించటం, కొన్ని సందర్భాల్లో ఆ ఫోన్లు పేలిపోయేలా చేయటం ఇజ్రాయెల్ సంస్థల నిర్వాకమే. మిత్రపక్షం కదా అని ధూర్త రాజ్యాన్ని ఉపేక్షిస్తే అది ప్రపంచ మనుగడకే ముప్పు కలిగిస్తుందని అమెరికా, పాశ్చాత్య దేశాలు గుర్తించాలి. ఇజ్రాయెల్ చర్యలు సారాంశంలో అంతర్జాతీయ మానవహక్కుల చట్టాల ఉల్లంఘన. అందుకు పర్యవసానం లేకపోతే శతాబ్దాలుగా మానవాళి సాధించుకున్న నాగరిక విలువలకు అర్థం లేదు.

ఆర్థికాభివృద్ధిని దాయడం సరికాదు!

విశ్లేషణ



టి. హరీశ్ రావు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రాన్ని ఆర్థికంగా దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దింది. అయితే ఆ పరిస్థితిని కాంగ్రెస్ మసిపూసి మారేడుకాయ చేస్తూ దుష్ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత కూడా బీఆర్ఎస్ పాలనపై అబద్ధపు ప్రచారం మానలేదు. తాజాగా 16వ ఆర్థిక సంఘం ముందు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఉంచిన వివరాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. కాంగ్రెస్ తమ ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయలేని దుఃస్థితిని కప్పిపుచ్చుకునేందుకు, తమ అసమర్థ పాలన నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి ప్రచారానికి దిగింది. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారు. తస్మాత్ జాగ్రత్త!

తెలంగాణ ఉద్యమంలో ప్రజానీకం లేవనెత్తిన అంశాల్లో ప్రధానమైంది ఆర్థికాభివృద్ధిలో ఈ ప్రాంతం వివక్షతకు గురికావడం. తెలంగాణలో విశేషమైన వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా అన్ని రంగాలలో ఈ ప్రాంతం వెనుకబడింది. సాగునీటి వనరులు, ఉపాధి అవకాశాలు లేకుండా ప్రజలు పేదరికంలోకి నెట్టివేయబడ్డారు. తెలంగాణ వివక్షపై ఉద్యమించిన బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రాన్ని ఆర్థికంగా దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దింది.

ఎన్నికల ముందు, ఆ తరవాత కూడా బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను అప్పులకుప్పగా మార్చివేశారని, ఆర్థికంగా రాష్ట్రాన్ని దివాళా తీయించారని ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారు. నిరాధారమైన ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు, ఎప్పటికప్పుడు గణాంకాలతో సహా స్పష్టమైన వివరణలు ఇస్తున్నప్పటికీ... వారు దుష్ప్రచారాన్ని మానడం లేదు. చివరకు ఇటీవల 16వ ఆర్థిక సంఘం ముందు కూడా తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై వచ్చి అబద్ధాలను ఉంచారు.

ఈ విధంగా అవాస్తవాలతో మన ఆర్థిక సామర్థ్యాన్ని కించపరుస్తూ ఉంటే, ఇక్కడ పెట్టుబడులు పెట్టాలనుకునే వారిని భయపెట్టడం మినహా ప్రజలకు ఏమైనా ప్రయోజనం ఉంటుందా? కాంగ్రెస్ తమ ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయలేని దుఃస్థితిని కప్పిపుచ్చుకునేందుకు, తమ అసమర్థ పాలన నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై దారుణంగా ప్రచారం చేయడం... తమది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే వారికి తగునా?

ఇటీవల ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ–పీఎం) విడుదల చేసిన నివేదికలో ఆర్థికంగా అన్ని కీలక కొలమానాలలోనూ తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతి కొట్టొచ్చినట్టు స్పష్టమౌతోంది. తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తులను దేశ లేదా రాష్ట్రాభివృద్ధికి కొలమానంగా తీసుకుంటాము. ఈ రెండింటిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉందని నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే తెలంగాణ 94 శాతం ఎక్కువ నమోదు చేసింది. కర్ణాటక 81 శాతం మాత్రమే అధికంగా ఉంది.

తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి. ఆర్థిక సంస్కరణల తర్వాత తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు దేశంలోనే ప్రధాన ఆర్థిక శక్తి కేంద్రాలుగా మారాయి. జాతీయ సగటుతో పోల్చితే తలసరి ఆదాయంలో తెలంగాణ 193.6 శాతం, కర్ణాటక 181 శాతం, తమిళనాడు 171 శాతం, కేరళ 152.5, ఆంధ్రప్రదేశ్ 131.6 శాతం అధికంగా ఉన్నాయి.

జీఎస్డీపీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి, సుసంపన్నమైన



రాష్ట్రంగా తెలంగాణ కొత్త రికార్డు సృష్టించింది. జాతీయ స్థూల ఉత్పత్తిలో 2010–11లో ఆంధ్రప్రదేశ్ ప్రాంతం వాటా 4.6 శాతం ఉండగా, తెలంగాణ ప్రాంతపు వాటా 3.8 శాతం మాత్రమే ఉండింది. అయితే, 2023–24 నాటికి ఏపీ వాటా 4.7 శాతంకు పెరగగా, తెలంగాణ వాటా 4.9 శాతానికి పెరగడం గమనార్హం.

మరోవైపు జీడీపీలో తెలంగాణ వాటా కూడా అంతకంతకూ పెరుగుతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. 2010–11లో దేశ జీడీపీలో తెలంగాణ వాటా 3.8 శాతంగా ఉంటే... 2023–24 నాటికి ఇది 4.9 శాతానికి ఎగబాకింది. 13 ఏండ్ల వ్యవధిలో ఈ స్థాయిలో పెరుగుదల నమోదు చేసిన అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నట్టు నివేదిక వివరించింది. 2014–15లో అప్పటి ధరలను బట్టి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ. 5.05 లక్షల కోట్లుగా నమోదయ్యింది. 2023–24 నాటికి తెలంగాణ జీఎస్డీపీ రూ. 14.64 లక్షల కోట్లకు చేరింది. పదేండ్ల వ్యవధిలో తెలంగాణ జీఎస్డీపీ రూ. 9.59 లక్షల కోట్ల మేర పెరిగింది. దేశం మొత్తం మీద ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ ప్రశంసనీయమైన ప్రగతి గత పదేళ్లలో సాధించినట్లు అన్ని నివేదికలు, ప్రమాణాలు స్పష్టం చేస్తుంటే... 16వ ఆర్థిక సంఘం ముందు కాంగ్రెస్ ప్రభుత్వం గగ్గోలు పెట్టడం రాష్ట్రాభివృద్ధిని కించపరచడమే కాగలదు.

తాజాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిన ఎంఎస్ఎంఈ పాలసీ పత్రంలో, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వృద్ధిరేటు ఎంతో మెరుగ్గా ఉందని తెలిపింది. ఎంఎస్ఎంఈల సగటు పెట్టుబడి రూ. 2.15 కోట్లకు పెరిగినట్టు పేర్కొంది. తరచూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిందించే రాష్ట్ర సర్కారు, పరిశ్రమల అభివృద్ధిలో కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలను ఒప్పుకోక తప్పలేదు. టీజీ–ఐపాస్ పోర్టల్‌లో నమోదైన కొత్త ఎంఎస్ఎంఈ యూనిట్లను పరిశీలిస్తే, గడిచిన పదేండ్లలో వరుసగా వృద్ధి నమోదయ్యింది. పదేండ్లలో 11.15 శాతం నుంచి 15 శాతం వరకు వృద్ధి నమోదైనట్లు ప్రభుత్వం వివరించింది.

నేడు తెలంగాణలో ఎంఎస్ఎంఈల సంఖ్య 26 లక్షలుగా ఉన్నదని వెల్లడించింది. సగటు పెట్టుబడులు కూడా 115 శాతం పెరిగినట్లు తెలిపింది. ఎంఎస్ఎంఈలో ఉపాధి అవకాశాలు 20 శాతం పెరిగినట్టు, ఎస్సీ, ఎస్టీలు 30 శాతం ఎంఎస్ఎంఈల్లో ఉపాధి పొందినట్టు స్పష్టం చేసింది. కోవిడ్ కారణంగా దేశవ్యాప్తంగా పరిశ్రమలు పెద్ద ఎత్తున మూతపడినా తెలంగాణలో మాత్రం అటువంటి పరిశ్రమల సంఖ్య నామమాత్రంగా ఉండడం విశేషం. తెలంగాణ, పదేండ్లలో పారిశ్రామిక రంగంలో ఇతర రాష్ట్రాల కన్నా వేగంగా వృద్ధి సాధించినట్టు రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రకటనే స్పష్టం చేస్తోంది. పరిశ్రమల కోసం జరిపే భూముల కొనుగోలులో స్టాంప్ డ్యూటీ మినహాయింపును యథావిధిగా కొనసాగించడంతో పాటు టీ–ప్రైడ్, టీ–ఐడియా పథకాల రాయితీలను స్వల్పంగా పెంచారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన టీఎస్ ఐపాస్ వంటి సింగిల్ విండో విధానం, స్నేహపూర్వక పారిశ్రామిక పంథా, నిరంతర విద్యుత్తు సరఫరా తదితరమైన పలు కారణాలతో తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో ప్రముఖంగా ఎదిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పకనే చెప్పింది.

మరోవంక బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందంటూ విషప్రచారం చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రికార్డు స్థాయిలో అడ్డగోలుగా అప్పులు చేస్తున్నది. నిరుడు డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 285 రోజుల్లో రూ. 71,495 కోట్లు అప్పు చేసింది. అంటే ప్రతి రోజూ రాష్ట్ర ప్రజలపై రూ. 250 కోట్ల అప్పుల భారం మోపుతోంది. ఆగస్టు 13వ తేదీ వరకే, ఒక్క ఆర్బీఐ నుంచి రూ.42,118 కోట్ల రుణం సేకరించింది. వివిధ కార్పొరేషన్లకు రూ. 24,877 కోట్ల అప్పులకు గ్యారంటీలు ఇచ్చింది. మొత్తంగా రాష్ట్రంలోని నాలుగు కోట్ల జనాభాలో ప్రతి ఒక్కరిపై గత తొమ్మిది నెలల్లోనే రూ. 17,873 భారం మోపింది. బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఏడాది రూ. 52,576 కోట్ల రుణం సమీకరించనున్నట్టు 2023–24 బడ్జెట్లో ప్రతిపాదించింది. ఈ ఏడాది అప్పుల లక్ష్యాన్ని రూ. 62,012 కోట్లకు పెంచింది. ఇందులో బహిరంగ మార్కెట్ నుంచి రూ. 57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ. 1000 కోట్లు సమీకరించనున్నట్టు పేర్కొన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి లెక్కించినా... ఆగస్టు 13వ తేదీ నాటికి బహిరంగ మార్కెట్ నుంచి రూ. 27 వేల కోట్ల రుణాలు సమీకరించింది. అంటే ఏడాది లక్ష్యంలో దాదాపు సగాన్ని కేవలం నాలుగున్నర నెలల్లోనే చేరుకుంది. గ్యారెంటీలు కూడా కలుపుకుంటే ఈ ఏడాది లక్ష్యాన్ని ఇప్పటికే దాటిపోయింది. గత ప్రభుత్వం సాధించిన అసాధారణ ఆర్థిక ప్రగతిని గుర్తించ లేని, గుర్తించినా అంగీకరించలేని, అంగీకరించినా... కావాలని తప్పుడు ప్రచారాలు చేసే కాంగ్రెస్‌వారా నీతులు వల్లించేది? ప్రజలు గమనిస్తున్నారు. తస్మాత్ జాగ్రత్త!

వ్యాసకర్త ఎమ్మెల్యే, మాజీ మంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అసలు కొరత



తరచుగా 'అనువాదకుల కొరత' ఉంది అన్న మాట వింటుంటాం. ఇది నాకు ఎంత ఆగ్రహం కలిగిస్తుందంటే, ప్రత్యేకించి నా సహచరులు ఎందరో ఈ అనువాదం వల్ల రోజువారీ ఖర్చులు కూడా వెళ్లక ఈ వృత్తిని వదిలేస్తున్నారు. నిజంగా కొరత ఉన్నది అనువాదకులకు కాదు, ఆ అనువాదాలకు తగిన చెల్లింపులు.

– సారా హోర్కాస్ రూఫియాన్, స్పానిష్ అనువాదకురాలు

పోటీ పడగలమా?



చైనాలో రెపో రేట్ సుమారు 1.7 శాతం. ఇండియాలో రెపో రేట్ 6.5 శాతం. చైనాలో ప్రధాన వడ్డీ రేటు 3.4 శాతం. అదే ఇండియాలో సగటున 9 శాతం. ఇలా ఉన్నప్పుడు ఇండియాలోని మూలధన ఖర్చులు (క్యాపెక్స్) అత్యధికంగా ఉండే పరిశ్రమలు చైనాతో పోటీపడటం కష్టం.

– సందీప్ సభర్వాల్, రీసెర్చ్ అనలిస్ట్

బెంగాలీని కాదని...



తూర్పు పాకిస్తాన్ కాలం మాదిరిగా ఇప్పుడు బంగ్లాదేశ్ రేడియో ఉర్దూ సేవలను ఇవ్వడానికి ప్రయత్నిస్తోంది. పాకిస్తానీ అనుకూల బంగ్లాదేశీ ఇస్లామిస్టులదే ఇప్పుడు అధికారం. కళాశాలలు, యూనివర్సిటీలు నిర్వహిస్తున్న కచేరీల్లో అప్పుడే ఉర్దూలో ఇస్లామిక్ గీతాలు పాడుతున్నారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

పెద్ద మార్కెట్



భారతదేశంలో ఆటోమొబైల్ మార్కెట్ పరిమాణం – 2014లో: రూ.7.5 లక్షల కోట్లు. 2024లో: రూ.22 లక్షల కోట్లు. జపాన్‌ను పక్కకునెట్టి ఇండియా ప్రపంచంలో మూడో ఆటోమొబైల్ మార్కెట్‌గా అవతరించింది.

– రిషి బాగ్రీ, పన్ను చెల్లింపుదారు

ఎందుకంత మోజు?




ఈ మార్కెటింగ్ హైపులకు పడిపోవద్దు. ఒక ఫోన్ కొనండి. అది పూర్తిగా పాడయ్యేంతవరకూ వాడండి. ఆ తర్వాత మాత్రమే ఇంకోటి కొనండి.

– నితీశ్ రాజ్‌పుత్, యూట్యూబర్

ఇల్లు చక్కదిద్దుకోకుండా...

సందర్భం



ఉల్లి బాలరంగయ్య

భారతదేశంలో ముస్లింలు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఇరాన్ మత నాయకుడు అయతుల్లా ఖొమేనీ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉంది. ఆయన వ్యాఖ్యలపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఘాటుగానే స్పందించింది. కుహనా లౌకికవాద ముసుగు వేసుకున్న కొందరు రాజకీయ నాయకులు స్వదేశంలో, విదేశాల్లో చేసే వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన మాట్లాడిన మాటలను అర్థం చేసుకోవాలి. ఏ దేశంలో అనుభవించని హక్కులను ఈ దేశంలో ముస్లింలు అనుభవిస్తున్నారనేది అక్షర సత్యం. ఈ దేశం నుండి విడిపోయిన పాక్, బంగ్లాదేశ్‌లలో మైనారిటీలైన హిందువుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకుంటే– ఆయన ఈ వ్యాఖ్యలు చేయలేరు. ప్రపంచంలో ఏ దేశంలో కూడా హజ్ యాత్రకు సబ్సిడీలు ప్రభుత్వ ఖజానా నుండి చెల్లించడం జరగదు. దేశ విభజనానంతరం ఇక్కడ మిగిలిపోయిన ముస్లింలకు అనేక ప్రత్యేక హక్కులు రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డాయి. ఆ సామాజిక వర్గం నుండి నలుగురు రాష్ట్రపతి పదవిని చేపట్టారు. అనేక రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా ఎన్నిక అయినారు. నలుగురు ముస్లింలు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తులుగా పనిచేసి రిటైర్ అయ్యారు. ఈ దేశంలో ముస్లింలను ఎలా ట్రీట్ చేస్తున్నారనే విషయానికి కొన్ని ఉదాహరణలు ఇవి.

భారతదేశంలో వాస్తవ పరిస్థితులు ఈ విధంగా ఉన్నాయి. అయితే వీటిని తలకిందులు చేసి, ఈ దేశంలో ముస్లింలకు ఏదో నష్టం జరిగిపోతోందనీ, వాళ్లను అనవసరంగా ఇబ్బంది పెడుతున్నారనీ, వాళ్లను మతపరంగా అణచివేస్తున్నారనే 'ఒక ప్రత్యేకమైన దుష్ప్రచారం' ఈ దేశంలో చాలా కాలం నుండి కొనసాగుతోంది. ముస్లింలు మతపరంగా సంఘటితంగా ఉంటారు. రాజకీయ పార్టీలకు ఓటు వేయడంలో ఆ మత వర్గం వ్యూహాత్మకంగా నడుచుకుంటుంది. దీనికి విరుగుడుగా భారతీయ జనతా పార్టీ అధికారాన్ని కైవసం చేసుకోవడంతో దిక్కుతోచని లౌకికవాద ముసుగు వేసుకున్న రాజకీయ నాయకులు విచక్షణ కోల్పోయి, బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి భారతదేశంలో ముస్లింల హక్కులకు ప్రమాదం ఏర్పడిందని వాపోవడంతో ఖొమేనీకి కోపం వచ్చిందని చెప్పుకోవాలి.

మతోన్మాద ఛాయలతో కునారిల్లుతున్న ఒక ఇస్లామిక్ దేశపు నాయకుడు భారతదేశం గురించి, భారతదేశంలోని ముస్లింల హక్కుల గురించి మాట్లాడడానికి అర్హత ఉందా? తన దేశంలో స్త్రీలు సమాన హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. ఒకవైపు సున్నీ, షియాలు ఘర్షణ పడుతున్నారు. తన దేశంలోని పరిస్థితులను చెక్కబెట్టుకోకుండా భారతదేశంపై వ్యాఖ్యలు చేయడం ఏమిటి? ఖొమేనీ వ్యాఖ్యల నేపథ్యంలో జాతి హితైషులు అప్రమత్తంగా ఉండాలి!

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

ఒంటెత్తు పోకడలు సమాఖ్య స్ఫూర్తికి తూట్లు

అభిప్రాయం




డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

'నేతిబీరలో నెయ్యి చందం దేశంలో సహకార సమాఖ్య స్ఫూర్తి' అని అన్నారు ఎన్.టి. రామారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో. రాష్ట్రాలకు అందించే నిధులు, హక్కులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వపు పోకడల పట్ల విసిగిపోయి తమ రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాలపై ఘాటైన వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రులు గతంలో చాలా మంది ఉన్నారు.

జాతీయ సమైక్యతకు, దేశాభివృద్ధికి కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం సహకార సమాఖ్య స్ఫూర్తితో పని చేయాలని భారత రాజ్యాంగంలోని 256–263 వరకు ఉన్న అధికరణలు నిర్దేశిస్తున్నాయి. అయినప్పటికీ దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హయాం నుంచి నేటి దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలన వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నడుమ హక్కులు, నిధులు, అధికారాలకు సంబంధించి ఘర్షణాత్మక వైఖరి కొనసాగుతూనే ఉంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య మరింత సమన్వయం, సహకారం పెరిగేందుకు గతంలో సర్కారియా కమిషన్, పూంఛ్ కమిషన్‌లు పలు కీలక సిఫార్సులు చేశాయి. కానీ, అవన్నీ అమలునకు నోచుకోకపోవడంతోనే... సహకారం కొరవడింది, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగింది.

గుజరాత్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండగా నరేంద్ర మోదీ నాటి యూపీఏ ప్రభుత్వ కేంద్రీకృత విధానాలను విమర్శిస్తూ రాష్ట్రాల హక్కుల పరిరక్షణకై బలంగా గొంతెత్తిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కానీ, ఆయన ప్రధానమంత్రి అయిన తర్వాత, కాంగ్రెస్ అనుసరించిన మార్గంలోనే పయనిస్తూ, సమాఖ్య స్ఫూర్తికి భిన్నమైన నిర్ణయాలు తీసుకోవడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. మరీ ముఖ్యంగా దక్షిణ భారతం పట్ల మోదీ వివక్ష చూపిస్తున్నారన్న భావన ప్రజలలో క్రమేపీ బలపడుతోంది. ఇది ఎంత దూరం వరకు వెళ్లిందంటే దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం చూపే ఈ వివక్ష ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో దక్షిణ భారతాన్ని ఓ ప్రత్యేక దేశంగా చేయాలన్న డిమాండ్ ఊపందుకుంటుందని కర్ణాటకకు చెందిన కొందరు మంత్రులు ఇటీవల బాహాటంగా వ్యాఖ్యానించారు.

కేంద్ర, రాష్ట్రాల మధ్య ప్రతి ఐదేళ్లకు కేంద్ర ప్రభుత్వ పన్నులు, ఇతర ఆదాయాల్లో విభజించ దగ్గ మొత్తాలను (డివల్యూషన్ ఆఫ్ ఫండ్స్) పంచడానికి, భారత రాజ్యాంగంలోని అధికరణ 290 ప్రకారం, 1951 నుంచి ప్రతి ఐదేళ్లకోమారు ఆర్థిక సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం నియమిస్తోంది. రాష్ట్రాల ఆర్థిక అవసరాలు తీర్చడానికి పన్ను ఆదాయాల్లో గణనీయమైన భాగం రాష్ట్రాలకు అందాలని ఆర్థిక సంఘాలు ఎప్పటికప్పుడు సిఫార్సులు చేస్తూ



వచ్చాయి. 14వ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్ని 32 నుంచి 42 శాతానికి పెంచింది. 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతంకు కుదించి, 1 శాతం పన్నును కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారిన జమ్మూ, కశ్మీర్‌లకు బదలాయించాలని కేంద్రానికి సూచించింది. అయితే, పేరుకు 41 శాతంగా పైకి కనపడుతున్నప్పటికీ వాస్తవంగా 31 శాతం నిధులే అందుతున్నాయని బీజేపీయేతర రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి.

కేంద్రం వద్ద అపారమైన ఆర్థిక వనరులు సమకూర్చుకొనే అవకాశాలు ఉండగా, రాష్ట్రాలకు ఆ వెసులుబాటు లేదు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన ఆదాయం పెంచుకొనేందుకు రకరకాల సెస్సులు, సర్‌చార్జీలను విధిస్తోంది. వీటిద్వారా వచ్చే రాబడిని రాష్ట్రాలతో పంచుకోవడం లేదు. సర్‌చార్జీలు, సెస్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం పొందుతున్న మొత్తం పన్నుల వాటాలో 20 శాతం మేర ఉంటుందని లెక్కలు చెబుతున్నాయి. ఈ విధానాన్ని కొన్ని రాష్ట్రాలు కేంద్రం అనుసరిస్తున్న ఆర్థిక ఉగ్రవాదం అని పిలుస్తున్నాయి. అందువల్లనే ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ అరవింద్ పనగరియా అధ్యక్షతన ఏర్పడిన 16 ఆర్థిక సంఘం... రాష్ట్రాలకు బదిలీ చేసే పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలని బీజేపీయేతర ప్రభుత్వాలన్నీ డిమాండ్ చేస్తున్నాయి.

సెప్టెంబర్ 11న కేరళ రాజధాని తిరువనంతపురంలో బీజేపీయేతర దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం జరిగింది. ఇందులో చర్చించిన అంశాలు, చేసిన డిమాండ్లను పరిశీలిస్తే కేంద్రంతో రాజీలేని పోరాటం చేయడానికి ఈ రాష్ట్రాలు సమాయత్తం అయినట్లుగా కనబడుతుంది.

నిధుల కేటాయింపునకు కేంద్రం అనుసరిస్తున్న విధివిధానాల్లో శాస్త్రీయత లోపించిందన్నది నిర్వివాదాంశం. తక్కువ తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రాలకు కేంద్రం ఎక్కువ నిధులు కేటాయిస్తున్నది. దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నది దక్షిణాది రాష్ట్రాలే. చారిత్రకంగా మొదట్నుంచీ దక్షిణాది రాష్ట్రాలు... ఉత్తరాది రాష్ట్రాలకంటే ఆర్థికంగానూ, ఇతరత్రా పలు అంశాల్లోనూ మెరుగ్గా ఉన్నాయి. దేశ విభజన పరిణామాలు ఉత్తరాది రాష్ట్రాల మీద ప్రతికూల ఫలితాలు చూపాయి. మత, కులపర వైషమ్యాల కారణంగా కూడా ఉత్తరాది రాష్ట్రాల్లో అభివృద్ధి అడుగంటింది. అదే సమయంలో పలు సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల కారణంగా దక్షిణాదిలో విద్యకు ప్రాధాన్యం లభించింది. 1990 దశకంలో దేశంలో ప్రారంభమైన సంస్కరణల ఫలితాలను, ప్రత్యేకించి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయోటెక్, ఫార్మా తదితర రంగాలలో వచ్చిన విప్లవాలను దక్షిణాది రాష్ట్రాలు సద్వినియోగపర్చుకొని ఆర్థికంగా ముందంజ వేశాయి. నిధుల కేటాయింపునకు మానవాభివృద్ధి సూచికల్లో రాష్ట్రాల పనితీరును, ప్రతిభను కొలమానంగా తీసుకోవాలని దక్షిణాది రాష్ట్రాలు గత రెండు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నాయి.

కాగా, వెనుకబాటుతనాన్ని రూపుమాపడానికీ, వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి పర్చడానికీ... ఆయా రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధంగానైతే అధిక నిధుల్ని ఖర్చుచేస్తాయో... అదే నమూనాను జాతీయస్థాయిలో అమలు చేసి వెనుకబడిన రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించడంలో తప్పేముందని ఉత్తరాది రాష్ట్రాల ఆర్థికవేత్తలు వాదిస్తున్నారు. అటువంటి సమతుల్యత సాధించనట్లయితే... దేశ ఐక్యతకు ప్రమాదం వాటిల్లుతుందని వారు హెచ్చరిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశంలో ఈ అంశం కూడా చర్చకు వచ్చింది. వివిధ రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం... భారత కన్సాలిడేషన్ ఫండ్‌కు ఏటా జమ అవుతున్న లక్షల కోట్ల కార్పొరేట్ పన్నుల మొత్తం నుంచి ఖర్చు చేయవచ్చునన్న అభిప్రాయం వ్యక్తం అయింది.

రాష్ట్రాలు తమ వాదనలను నీతి ఆయోగ్ సమావేశాలలో విన్పించే అవకాశం ఉంది. కానీ, ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి, దాని స్థానంలో ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ కేవలం కేంద్రానికి సలహాలిచ్చే ఓ సంఘంగానే మిగిలిపోయింది. 'నీతి ఆయోగ్ సమావేశాలకు వెళ్లడం శుద్ధదండగ' అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షత జరిగిన 9వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని మమతా బెనర్జీతోసహా బీజేపీయేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు బహిష్కరించడం గమనార్హం!

ఇక, జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని కేంద్రం యోచిస్తున్న పూర్వరంగంలో దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం కలగడమేకాక... కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వాల విషయంలో దక్షిణాది రాష్ట్రాలు పోషించే నిర్ణయాత్మక పాత్ర, వాటి పలుకుబడి గణనీయంగా తగ్గిపోతాయి. అదే జరిగితే ఎన్.టి.రామారావు చెప్పినట్లు నేతిబీరలో నెయ్యి చందంగా సహకార సమాఖ్య వ్యవస్థ తయారవుతుంది. రాష్ట్రాల సూచనలను పట్టించుకోకుండా కేంద్రం ఒంటెత్తు పోకడలకు పోతే సహకార సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పడటం తథ్యం!

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు; కేంద్ర మాజీ మంత్రి

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.చవితి రా.11.23 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** అశ్వని ఉ.8.02 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** సా.5.02 నుండి 6.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.53 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** రా.2.01 నుండి 3.33 వరకు, సంకటహర చతుర్థి; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.52, **సూర్యాస్తమయం:** 5.57.

క్లుప్తంగా...

చిల్లిగవ్వ లేదు.. ఏం చేయాలో తెలియదు!!



మృతదేహాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

గుండాల: చేతిలో చిల్లిగవ్వ లేదు.. ఎటెళ్లాలో తెలియని స్థితిలో ఉండగానే భర్త ప్రాణాలు కోల్పోయాడు. చివరకు పంచాయతీ ట్రాక్టర్‌లో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లిన ఆ మహిళ రోదిస్తున్న తీరు వర్ణనాతీతం. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం అడవి రామవరం గ్రామానికి చెందిన మడకం ఉంగయ్య(52) ఈనెల 18న శ్వాసకోశ వ్యాధితో బాధ పడుతుండగా అతడి భార్య దేవమ్మ స్థానికుల సహకారంతో 108లో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ రెండు రోజులు చికిత్స చేసినా తగ్గకపోగా..శుక్రవారం పరిస్థితి విషమించడంతో వైద్యులు వరంగల్ ఎంజీఎంకు రిఫర్ చేశారు. కాగా, ఉంగయ్య భార్య.. వరంగల్‌కు ఎలా వెళ్లాలో తెలియక ఆటోలో భర్తను తీసుకుని అడవి రామవరానికి బయల్దేరింది. ఈ క్రమంలో ఇంటికి చేరకముందే ఉంగయ్య మృతి చెందడంతో ఆటో డ్రైవర్ మర్కోడు గ్రామంలోనే వారిని వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో ఆమె మృతదేహం పక్కన కూర్చుని రోదిస్తుండగా స్థానికులు గమనించి పంచాయతీ ట్రాక్టర్‌లో మృతదేహాన్ని అడవి రామవరం తీసుకెళ్లారు.

ఆత్మహత్యకు అనుమతివ్వండి!

- కలెక్టరేట్ ఎదుట కుటుంబం నిరసన



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న లచ్చయ్య కుటుంబ సభ్యులు

కరీంనగర్: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి లచ్చయ్య కుటుంబ సభ్యులతో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన చేపట్టారు. నక్సలైట్‌గా మారేందుకు లేదా ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకొని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అన్ని అనుమతులతో తాను నిర్మించుకున్న ఇంటిని, ఉద్దేశపూర్వకంగా గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు కూలగొట్టించారని, తనపై దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. సదరు ఏసీపీపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు, గ్రామస్తులు తనను అన్యాయంగా బలి పశువును చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

మేడిగడ్డ బరాజ్‌లో ఏడీసీపీ సర్వే



సర్వే చేస్తున్న శాస్త్రవేత్తలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బరాజ్‌లో ప్రవాహాన్ని అంచనా వేయడానికి శుక్రవారం ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్) సర్వే నిర్వహించారు. పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు నాగరాజు, అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్ వినాయక్‌ఛత్రక్ తదితరులు.. బరాజ్ నీటిలో బోటుకు ఏడీసీపీ మెషీన్‌ను అమర్చి అందులో తిరుగుతూ ప్రవాహం అంచనా వేశారు.

జర్నలిస్టుల మధ్య విభేదాల సృష్టి

- సీపీకి జేఎన్‌జేహెచ్ఎస్ ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల మధ్య ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తూ, వారిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జేహెచ్ఎస్) ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. తమపై దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులు, సంస్థలు, సోషల్ మీడియా ఖాతాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ సొసైటీపై తప్పుడు ఆరోపణలు చేయకుండా, జర్నలిస్టుల మధ్య ప్రాంతీయ విభేదాలు రేకెత్తించకుండా సొంత సోషల్ మీడియా నిర్వాహకులను నిరోధించాలని రాజకీయ పార్టీలను కూడా ప్రతినిధులు కోరారు. ఆనంద్‌ను కలిసిన వారిలో బి.కిరణ్ కుమార్, ఆర్.రవికాంత్ రెడ్డి, ఎస్.వంశీ శ్రీనివాస్, పీవీ రమణారావు, కె.అశోక్‌రెడ్డి, రమేశ్ వైట్ల తదితరులున్నారు.

నెలవారీగా నిధులు | వారం వారం సమీక్ష

- 20 నెలల్లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు పూర్తి చేస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డితో కలిసి టన్నెల్ పరిశీలన
- ప్రాజెక్టుల పురోగతిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష



టన్నెల్ లోపలి భాగాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, వంశీకృష్ణ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎస్ఎఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం పనులను పూర్తి చేసేందుకు నెలవారీగా నిధులు ఇస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. టన్నెల్‌ను ప్రతినెలా రెండు వైపులా 400 మీటర్లు తవ్వితే రూ.14 కోట్లు ఖర్చు అవుతుందని, ఆ నిధులు ఇచ్చేందు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఒక్కోవైపు 300 మీటర్ల చొప్పున తవ్వినా నిధులను ఇస్తామని చెప్పారు. ఈ లెక్కన 20 నెలల్లో ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉంటుందని కాంట్రాక్టు సంస్థ వెల్లడించిందన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా మన్నేవారిపల్లి వద్ద చేపట్టిన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులను శుక్రవారం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం నీటిపారుదల శాఖ, విద్యుత్ అధికారులతో అక్కడే సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ టన్నెల్ పనులకు అయ్యే నిధులను గ్రీన్‌చానల్ ద్వారా ప్రతినెలా ఆర్థికశాఖ నుంచి ఇస్తామని, ఇప్పటికే రూ.42 కోట్లు ఇచ్చి పనులను మొదలు పెట్టించామన్నారు. మంత్రి కోమటిరెడ్డి అమెరికా వెళ్లి టన్నెల్ బోర్‌మిషన్ బేరింగ్ గురించి మాట్లాడారని, బేరింగ్ రాగానే పనులు మరింత వేగం అవుతాయన్నారు. రాష్ట్ర విభజన కంటే ముందే ఎస్ఎల్‌బీసీ సొరంగం 32 కిలోమీటర్లు పూర్తయిందని, మరో 11 కిలోమీటర్లు చేస్తే రూ.వెయ్యి కోట్లతో ఎప్పుడో పూర్తయ్యేదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ వ్యయం రూ.4 వేల కోట్లకు పెరిగిందని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు పాలసీని రూపొందించామని తెలిపారు. ఏడాది, రెండేళ్లు, మూడేళ్లు, నాలుగేళ్లలో అన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను చేస్తూనే వాటికి సంబంధం లేకుండా సాగునీరు వచ్చే ఎత్తిపోతలు, ఆర్‌అండ్‌ఆర్, ఫారెస్ట్ క్లియరెన్స్ పనులను పూర్తి చేయాలన్నారు. సాగర్ ఎడమకాలువ లైనింగ్ పూర్తి చేయాలన్నారు. హై లెవెల్ కెనాల్‌కు సంబంధించి భూసేకరణ, అటవీ భూముల అనుమతి వంటి వాటికి ప్రత్యేక అంచనాలు రూపొందించి పంపాలని అధికారులను ఆదేశించారు. డిండి, నక్కలగండి, ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వంటి వాటికి ఒకే ఫైల్లో ప్రతిపాదనలు పంపిస్తే మంజూరు చేస్తామని, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి నిధులను ఇస్తామని చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని బునాదిగాని కాలువ, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల పనులు కూడా పూర్తి చేస్తామన్నారు.

రూ.4400 కోట్లతో ఎస్ఎల్‌బీసీకి ఆమోదం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు సవరించిన అంచనాల ప్రకారం రూ.4400 కోట్ల పెంచి కేబినెట్‌లో ఆమోదిస్తామని సాగునీటి పారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సొరంగం పనుల కోసం అయ్యే ఖర్చును ఏజెన్సీకి చెల్లిస్తామని, ఈ ప్రాజెక్టు మొత్తాన్ని 2027 సెప్టెంబర్ 20 నాటికి పూర్తి చేసి, సాగునీటిని అందిస్తామన్నారు. డిండి ప్రాజెక్టుపై ప్రతివారం సమీక్ష చేయాలని అధికారులను ఆదేశించారు. అటవీశాఖ అనుమతులు తీసుకొచ్చేందుకు ఢిల్లీ స్థాయిలో చర్యలు చేపడతామన్నారు. దీనిపై దృష్టి సారించాలని ఎంపీ రఘువీర్‌రెడ్డిని కోరారు. పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వ, బునాదిగాని కాలువలు గ్రావిటీ ద్వారా నీటిని అందిస్తాయని, ఈ మూడు కాలువలకు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ద్వారా 4 లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా నీరు అందుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్టంగండి సిస్టర్న్ ద్వారా ఎత్తిపోసే దానికంటే ఇదే శాశ్వత పరిష్కారమన్నారు. అందుకే టన్నెల్‌ను మంజూరు చేయించామని, దానిని పూర్తి చేస్తామని చెప్పారు. పుట్టంగండిలో ప్రస్తుతం మరమ్మతులో ఉన్న నాలుగో మోటార్ ద్వారా తక్షణమే నీటిని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఎల్‌బీసీని వేగంగా పూర్తి చేసేందుకు నెలకు

టన్నెల్‌తో శాశ్వత పరిష్కారం: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రూ.30 కోట్లు ఇవ్వాలని కోరారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం డిండి ఎత్తిపోతల కింద దాదాపుగా పూర్తయిన గొట్టిముక్కల, సింగరాజుపల్లి రిజర్వాయర్లను వర్షాధారంగా నీటిని నింపుకోవచ్చని వాటికి సంబంధించిన పనులను చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, వంశీకృష్ణ, కుందూరు జయవీర్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులకు వరం.. విశ్వకర్మ యోజన

- ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పాయల్ శంకర్



మోదీ సందేశాన్ని వీక్షిస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యేలు బొజ్జు, శంకర్, కలెక్టర్ రాజర్షి షా

ఉట్నూర్ రూరల్: 'కుల, చేతి వృత్తుల వారికి వరం.. విశ్వకర్మ యోజన'పథకం అని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నా రు. పీఎం విశ్వకర్మ యోజన పథకం వార్షికోత్సవం సందర్భంగా ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అతిథులుగా ఎంపీ నగేశ్‌తో పాటు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్‌కలెక్టర్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహారాష్ట్రలోని వార్ధా నుంచి వర్చువల్ పద్ధతిలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎల్ఈడీ తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిని వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పీఎం విశ్వకర్మ యోజన పథకం చేతి, కుల వృత్తుల వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. అర్హులైన వారికి స్వ యం ఉపాధి కోసం ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందన్నారు. గతేడాది సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఐటీఐలో ఈ నెల 2 నుంచి 10 వరకు మొదటి విడత శిక్షణ పొందిన 21మంది వృత్తి కళాకారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాలల ఆర్జేడీ విద్యానంద్, వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు, ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మనసుకు తగిలే గాయాలే కవిత్వాన్ని పండిస్తాయి

- ప్రముఖ సాహితీవేత్త నందిని సిధారెడ్డి



నందిని సిధారెడ్డికి పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

కరీంనగర్ కల్చరల్: బతుకుబాటలో ఎదురయ్యే బాధలు, మనసును ముక్కలు చేసే గాయాల పునాదుల్లోంచి మాత్రమే అసలైన కవిత్వం ఉద్భవిస్తుందని ప్రముఖ సాహితీవేత్త నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలంగాణ తెలుగు భాష సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో బుర్ర నర్సమ్మ–లింగారెడ్డి స్మారక 'తెలంగాణ తెలుగు తేజం'జాతీయ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మట్టి వాసనలే సాహిత్య ఊటలకు ప్రేరణని, అమ్మనాన్నల దీవెనలే మన అస్తిత్వమని గుర్తు చేశారు. జీవితంలో అనుభవించే కన్నీళ్లే సాహితీవేత్తకు సిరాచుక్కలని అభిప్రాయపడ్డారు. పెద్దపల్లి జిల్లా అదనపు పాలనాధికారి జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ మాట్లాడుతూ సమాజహితం కోరుకునే సాహితీవేత్తలు నిస్వార్థంగా అక్షరసేద్యం చేస్తున్నారన్నారు. తమ అమ్మనాన్నల పేరిట జాతీయ పురస్కారం అందిస్తున్న కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బైస దేవదాసు, దాస్యం సేనాధిపతి, నంది శ్రీనివాస్, కిషన్, దయాకర్ పాల్గొన్నారు.

'వేవ్స్'కు భారత్ ఆతిథ్యం

- సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్‌జాజు

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ప్రపంచ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సదస్సు (వేవ్స్)ను నిర్వహించేందుకు భారత ప్రభుత్వం సన్నద్ధం అవుతుంది. భారత మీడియా, వినోదరంగాన్ని మరింత బలోపేతం చేయడానికి, ప్రపంచంలో దాని ప్రభావాన్ని విస్తరించడానికి ఈ సదస్సు దోహదం చేస్తుందని సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. వేవ్స్ ప్రచారం కోసం శుక్రవారం నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వద్ద రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ...వేవ్స్ సదస్సు మొత్తం మీడియా, వినోద రంగాన్ని కవర్ చేసే మొట్టమొదటి ప్రపంచస్థాయి సదస్సు ఇదే అన్నారు. మీడియా, వినోద రంగాన్ని, సాంకేతికతని వేవ్స్ సదస్సు మరింత దగ్గరకు తెస్తుందని వివరించారు. అభివృద్ధి చెందుతున్న మీడియా, వినోద రంగంలో చర్చలు, వాణిజ్య సహకారం, ఆవిష్కరణలను పెంపొందించే ఒక ప్రధాన వేదికగా పనిచేయడమే వేవ్స్ లక్ష్యమన్నారు.

జానీ మాస్టర్‌కు 14 రోజుల రిమాండ్

- బాధితురాలిపై మాస్టర్ అఘాయిత్యాలెన్నో
- 'అల వైకుంఠపురం'తో ఇరువురికి పరిచయం
- షూటింగ్‌ల పేరుతో వేరే ప్రాంతాలకు తీసుకెళ్లి అత్యాచారం
- బాధితురాలి తల్లికి కూడా ఈ విషయాలు చెప్పిన వైనం
- రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు

సాక్షి, హైదరాబాద్/రాజేంద్రనగర్: తీవ్రమైన లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కొరియోగ్రాఫర్ షేక్ జానీ బాషా అలియాస్ జానీ మాస్టర్‌కు న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. జానీ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్న బాధితురాలు (21) తనపై జానీ మాస్టర్ పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఈనెల 15న పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అప్పటినుంచి పరారీలో ఉన్న జానీని గురువారం గోవాలోని గ్రాండ్ లియోనీ రిసార్ట్‌లో సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించారు. ఆస్పత్రిలో వైద్య పరీక్షల తర్వాత నార్సింగి పోలీసులు అతడిని శుక్రవారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలోని కోర్టులో హాజరు పరిచారు. దీంతో జానీ మాస్టర్‌కు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం భారీ బందోబస్తు మధ్య జానీ మాస్టర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. నార్సింగి పోలీసులు న్యాయస్థానానికి సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన అంశాలను పొందుపరిచారు.

చిన్నతనం నుంచే డ్యాన్స్‌పై మక్కువ..

బాధితురాలికి చిన్నతనం నుంచే డ్యాన్స్ అంటే మక్కువ ఉండటంతో ఆమె తల్లిదండ్రులు నృత్య శిక్షణ ఇప్పించారు. తర్వాత వివిధ ప్రాంతాలలో స్టేజ్ షోలు ఇస్తుండేది. ఈ క్రమంలో 2017లో పదో తరగతి చదువుతున్న క్రమంలో బాధితురాలికి ఢీ–11 డ్యాన్స్ షోలో పాల్గొనే అవకాశం వచ్చింది. దీంతో తల్లితో సహా కలసి తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చింది. ఈ షోకు న్యాయనిర్ణేతగా నిందితుడు జానీ



షేక్ జానీ బాషా

మాస్టరే వ్యవహరించాడు. అనంతరం బాధితురాలు ఢీ–12లోనూ పాల్గొంది కానీ మధ్యలోనే ఆమెను తొలగించారు. ఆ తర్వాత కొద్ది రోజులకు జానీ మాస్టర్ బృందంలోని సభ్యురాలు దర్శిని బాధితురాలికి ఫోన్ చేసి మాస్టర్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తావా? అని అడిగింది. దీంతో ఒప్పుకున్న బాధితురాలు 2019 డిసెంబర్ 15న హైదరాబాద్‌కు వచ్చింది.

అల వైకుంఠపురంతో కలిసి..

'అల వైకుంఠపురం'సినిమాలోని ఓ పాట చిత్రీకరణ సమయంలో తొలిసారిగా జానీ మాస్టర్‌తో బాధితురాలికి పరిచయం ఏర్పడింది. అదే రోజు మాస్టర్ మేనేజర్ ఒకరు బాధితురాలికి ఫోన్ చేసి జానీ మాస్టర్, మరో ఇద్దరు అసిస్టెంట్లు రాహుల్, మోయిన్‌లతో కలిసి 2020 జనవరి 10న ముంబై వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించాడు. ముంబైలోని ఓ హోటల్‌లో చెకిన్ అవుతున్న క్రమంలో జానీ తన ఆధార్ కార్డు, ఇతరత్రా డాక్యుమెంట్లను బాధితురాలికి ఇచ్చాడు. అదే రోజు రాత్రి 11–12 గంటల సమయంలో జానీ మాస్టర్ బాధితురాలికి ఫోన్ చేసి ఉదయం తాను ఇచ్చిన ఆధార్, డాక్యుమెంట్లను తీసుకొని గదికి రావాలని ఆదేశించాడు.

డోర్ వెనకాల దాక్కొని..

అప్పటికే జానీ మాస్టర్ గది తలుపులు తెరిచి, వెనకాల దాక్కొని ఉన్నాడు. బాధితురాలు గది లోపలికి వెళ్లగానే ఒక్కసారిగా తలుపులు మూసేసి, లాక్ వేసేశాడు. దీంతో భయపడిపోయిన బాధితురాలు తనను వదిలేయాలని ప్రాధేయపడుతూ తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా.. జానీ మాస్టర్ ఆమెను అడ్డుకొని, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం బయట ఎవరికైనా చెబితే అసిస్టెంట్ జాబ్ నుంచి తీసేయడమే కాకుండా చిత్ర పరిశ్రమలో అవకాశాలు రాకుండా చేస్తానని బెదిరించాడు. బాధితురాలి నిస్సహాయతను ఆసరా చేసుకున్న జానీ మాస్టర్ షూటింగ్‌ల పేరు చెప్పి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి హోటల్ గదులు, వ్యానిటీ వ్యాన్‌లలో అత్యాచారానికి పాల్పడ్డాడు. జానీ మాస్టర్ వేధింపులు, ఆగడాలను తట్టుకోలేకపోయిన బాధితురాలు కొన్ని నెలల పాటు ఇంట్లో ఒంటరిగా ఉండిపోయింది. కానీ, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఏమైనా పని ఉంటే అవకాశం ఇప్పించాలని నిందితుడు జానీ మాస్టర్‌ను సంప్రదించింది. తన లైంగిక వాంఛను తీర్చనన్నందుకు షూటింగ్ సమయంలో అందరి ముందు బాధితురాలిని అవమానపరిచేవాడు.

మతం మార్చుకొని పెళ్లి చేసుకోవాలంటూ..

మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలంటూ జానీ మాస్టర్ బాధితురాలిని బలవంతం పెట్టాడు. ఒక రోజు జానీ మాస్టర్ బాధితురాలికి ఫోన్ చేసి షూటింగ్‌కు రావాలని సూచించాడు. దీంతో తన తల్లి ఇంట్లో లేదని, ఆరోగ్యం బాలేక ఇంట్లో ఉన్నానని తెలిపింది. దీన్ని ఆసరా చేసుకున్న నిందితుడు బాధితురాలి ఇంటికి వెళ్లి బలవంతంగా అఘాయిత్యానికి పాల్పడ్డాడు. జానీ తన భార్య సుమలత అలియాస్ ఆయేషాతో కలిసి బాధితురాలికి ఇంటికి వెళ్లి ఆమెను భయభ్రాంతులకు గురి చేశాడు. చిత్ర పరిశ్రమలో జానీకి ఉన్న పరిచయాల కారణంగా బాధితురాలికి ఎక్కడా పని దొరకుండా ఇబ్బందులకు గురి చేశాడు. ఈ క్రమంలో బాధితురాలు ఇంట్లో లేని సమయం చూసి ఓ రోజు ఆమె ఇంటికి వెళ్లి బాధితురాలితో ఉన్న శారీరక సంబంధం గురించి ఆమె తల్లికి వెల్లడించాడు. ఇక, చిట్టచివరికి బాధితురాలు జానీ అసిస్టెంట్ మోయిన్‌కు ఈ విషయాలు తెలిపింది. అతని సూచన మేరకు బాధితురాలు తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ (టీఎఫ్‌టీడీడీఏ) సంఘం అధ్యక్షుడికి ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న జానీ వెంటనే సంఘం డ్రైవర్ రాజేశ్వర్ రెడ్డిని తీసుకొని గోవాకు పరారయ్యాడు. కాగా, కోర్టు వద్ద జానీ మాస్టర్ భార్యను ఈ విషయమై ప్రశ్నించగా అంతా కోర్టులో తేలుతుందని సమాధానం ఇచ్చారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు



సీఎం రేవంత్‌కు చెక్కు అందజేస్తున్న భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ

సాక్షి, హైదరాబాద్: వరద బాధితులను ఆదుకునేందుకు భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రూ.1.25 కోట్ల విరాళం అందజేశారు. జీఆర్‌టీ జ్యువెలర్స్ అధినేత జితేందర్ రూ.25 లక్షలు, శ్రీ ఇందు గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఇబ్రహీంపట్నం) చైర్మన్ వెంకట్ రావు రూ.10 లక్షల విరాళం అందజేశారు.

పెసర రైతుకు ఎసరు!

- తడిసిన పెసర్లను కొనాల్సింది పోయి వ్యాపారులకు మార్క్‌ఫెడ్ అండ!
- తక్కువ రేటుకు కొంటూ వ్యాపారుల ఇష్టారాజ్యం

సాక్షి, హైదరాబాద్: పెసర వ్యాపారులకు మార్క్‌ఫెడ్ అండగా నిలుస్తోందనే విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రస్థాయిలోని కొందరు అధికారులు వ్యాపారులతో కుమ్మక్కైనట్టు ఆరోపణలున్నాయి. నాఫెడ్ నిబంధనల ప్రకారం నాణ్యత లేకపోయినా, 12 శాతానికి మించి తేమ ఉన్నా నిబంధనల ప్రకారం కొనబోమని మార్క్‌ఫెడ్ తేల్చిచెబుతోంది. ఇది పరోక్షంగా వ్యాపారులకు లాభిస్తోంది. తడిసిన పెసరను కొనే విషయంలో మార్క్‌ఫెడ్ చేతులెత్తేయడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వాటిని అత్యంత తక్కువ ధరకు కొంటున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవలి భారీ వర్షాలు, వరదలకు పెసర పంట దెబ్బతిని రంగుమారింది.

ఖమ్మం జిల్లాలో అధిక నష్టం..: రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలంలో 64,175 ఎకరాల్లో పెసర పంట వేశారు. ఈ పంట ఖమ్మం జిల్లాలోనే అత్యధికంగా సాగవుతోంది. అక్కడ చేతికొస్తున్న సమయంలోనే వరదలు రావడంతో పంట దెబ్బతింది. రాష్ట్రవ్యాప్తంగా 17,841 మెట్రిక్ టన్నుల పెసర్లు ఉత్పత్తవుతాయని భావించగా, అందులో సగానికిపైగా వరదలకు, వర్షాలకు దెబ్బతిందని అంచనా. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.8,682 పలుకుతుండగా, తడిసిన పెసరను వ్యాపారులు అందులో సగానికీ కొనడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన మార్క్‌ఫెడ్ చోద్యం చూస్తుండటంతో వ్యాపారులు అయినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. పెసర పంటకు సంబంధించి మార్క్‌ఫెడ్ సేకరణ విభాగం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇవ్వకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి.

పాకాలలో మొసళ్లకు జియో ట్యాగింగ్

- డిసెంబర్ లేదా జనవరిలో గణన



పాకాల సరస్సు వద్ద మొసలి (ఫైల్)

ఖానాపురం: వరంగల్ జిల్లా పాకాల సరస్సులో ఎన్ని మొసళ్లున్నాయో తెలుసుకోవడానికి జియో ట్యాగింగ్ చేయాలని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు నిర్ణయించారు. సరస్సులో చేపల వేటకు వెళ్లిన వారిపై మొసళ్లు దాడి చేసిన సంఘటనలు అనేకం. కానీ సరస్సులో ఎన్ని మొసళ్లున్నాయనేది ఎవరికీ తెలియదు. జిల్లా పరిధిలోని వాగులు, కాల్వలు, చెరువుల్లో ఎక్కడ మొసళ్లున్నా.. అటవీ అధికారులు వాటిని పట్టుకొచ్చి పాకాల సరస్సులో వదిలేయడం పరిపాటిగా మారింది. సరస్సులో ఎన్ని మొసళ్లున్నాయనే విషయాన్ని తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. ఇందుకు ప్రణాళికలు పంపినట్లు స్థానిక జూలాజికల్ అధికారులు తెలిపారు. డిసెంబర్ లేదా జనవరిలో సరస్సులోని మొసళ్లను పట్టుకుని వాటికి జియో ట్యాగింగ్ చేసి వదిలేయనున్నారు. ఇందుకు జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వెస్ట్‌బెంగాల్‌కు చెందిన నిపుణులను తీసుకురానున్నట్లు వెల్లడించారు.

కాటేసిన కుటుంబ కలహాలు

- బావిలో దూకి తల్లీకూతురు బలవన్మరణం



శారద, స్పందన

బెజ్జంకి(సిద్దిపేట): కుటుంబ కలహాలతో కూతురితో సహా ఒక తల్లి బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. జనగాం జిల్లా తరిగొప్పుల గ్రామానికి చెందిన రాజేశ్వర్ భార్య శారద (35), కూతురు స్పందన (14), కుమారుడు రఘువరన్‌తో కలిసి నాలుగేళ్లుగా బెజ్జంకి మండల కేంద్రంలోనే నివసిస్తున్నారు. దంపతులిద్దరూ కూలి పనులు చేస్తుంటారు. స్పందన బెజ్జంకిలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో మద్యానికి బానిసైన రాజేశ్వర్ నిత్యం ఇంట్లో గొడవలు పడుతుండేవాడు. గురువారం రాత్రి రాజేశ్వర్ భార్య, కూతురితో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన శారద శుక్రవారం తెల్లవారుజామున కూతురు స్పందన, కుమారుడు రఘువరన్‌ను తీసుకొని బెజ్జంకి శివారులోని దొరబావి వద్దకు వెళ్లింది. అనంతరం కుమారుడికి సెల్‌ఫోన్ ఇచ్చి ఇంటికి పంపేసింది. రఘువరన్ వెళ్లాక తల్లి, కూతురు ఇద్దరూ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజఈతగాళ్ల సాయంతో ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. మృతురాలి తల్లి వడ్లాల రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

‘ప్రళయ’ గ్లేసియర్‌తో... విలయమే!

- 200 ఏళ్లలోపే పూర్తిగా కరగడం ఖాయం
- పదడుగులు పెరగనున్న సముద్రమట్టం
- తీరప్రాంతాలు, మహానగరాలు సర్వనాశనం



మనిషి అత్యాశ భూమి మనుగడకే ఎసరు పెట్టే రోజు ఎంతో దూరం లేదని మరోసారి రుజువైంది. గ్లోబల్ వార్మింగ్ దెబ్బకు అంటార్కిటికాలోని ‘డూమ్స్‌డే’ గ్లేసియర్ ఊహించిన దానికంటే శరవేగంగా కరిగిపోతోందట. అది మరో 200 ఏళ్లలోపే పూర్తిగా కరగడం ఖాయమని తాజా అంతర్జాతీయ అధ్యయనం ఒకటి కుండబద్దలు కొట్టింది. ‘‘అప్పుడు సముద్రమట్టాలు కనీసం పదడుగుల దాకా పెరిగిపోతాయి. అమెరికా నుంచి ఇంగ్లాండ్ దాకా, బంగ్లాదేశ్ నుంచి పసిఫిక్ దీవుల దాకా ప్రపంచమంతటా తీర ప్రాంతాలన్నీ నీటమునుగుతాయి. తీరప్రాంత మహానగరాలన్నీ కనుమరుగైపోతాయి. పైగా మనం అంచనా కూడా వేయలేనన్ని మరిన్ని దారుణ ఉత్పాతాలకు కూడా ఈ పరిణామం దారితీస్తుంది’’ అని స్పష్టం చేసింది. 2018 నుంచి ఆ గ్లేసియర్ కరుగుదల తీరుతెన్నులను ఆరేళ్లపాటు లోతుగా పరిశీలించిన మీదట ఈ నిర్ధారణకు వచ్చింది. ‘‘శిలాజ ఇంధనాల వాడకాన్ని పూర్తిగా ఆపేయడం వంటి చర్యలతో గ్లోబల్ వార్మింగ్‌కు ఇప్పటికిప్పుడు ఏదోలా అడ్డుకట్ట వేసినా లాభమేమీ ఉండకపోవచ్చు. ఈ గ్లేసియర్ కరుగుదల రేటును తగ్గించడం ఇక దాదాపుగా అసాధ్యమే’’ అని గురువారం విడుదల చేసిన నివేదికలో హెచ్చరించింది! అంటార్కిటికాలో థ్వైట్స్ గ్లేసియర్ విస్తృతిలో ప్రపంచంలోనే అతి పెద్దది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం సైజులో ఉంటుంది. ఇది కరిగితే సముద్ర మట్టాలు ప్రమాదకర స్థాయిలో పెరిగి ప్రపంచ మానవాళి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తాయి. దాంతో సైంటిస్టులు దీన్ని డూమ్స్‌డే (ప్రళయకాల) గ్లేసియర్‌గా పిలుస్తుంటారు. అందుకే ‘ఇంటర్నేషనల్ థ్వైట్స్ గ్లేసియర్‌కొలాబరేషన్’ పేరిట దిగ్గజ సైంటిస్టులంతా బృందంగా ఏర్పడి 2018 నుంచీ దీని కరుగుదల తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తూ వస్తున్నారు. ఇందుకు ఐస్ బ్రేకింగ్ షిప్పులు, అండర్‌వాటర్ రోబోలను రంగంలోకి దించారు. ఐస్‌ఫిన్ అనే టార్పెడో ఆకారంలోని రోబోను ఐస్‌బర్గ్ అడుగుకు పంపి పరిశోధించారు. అది అత్యంత ప్రమాదకరమైన వేగంతో కరిగిపోతూ వస్తోందని తేల్చారు. నివేదికలోని ముఖ్యాంశాలు...

- డూమ్స్‌డే గ్లేసియర్ కరగడం 1940 నుంచీ క్రమంగా ఊపందుకుంది. గత 30 ఏళ్లుగా శరవేగంగా కరిగిపోతోంది. అది ఈ శతాబ్దంలో ఊహాతీతంగా పెరిగిపోనుంది.
- మరో 200 ఏళ్లలోపే గ్లేసియర్ తాలూకు మంచుపొరలన్నీ కుప్పకూలి కరగడం ఖాయం. ఫలితంగా వచ్చి కలిసే నీటి దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా సముద్రమట్టం కనీసం రెండడుగులు పెరుగుతుంది.
- అంటార్కిటికాలోని విస్తారమైన మంచు పలకల సమూహాన్ని కరగకుండా పట్టి ఉంచేది డూమ్స్‌డే గ్లేసియరే. కనుక దానితో పాటే ఆ భారీ మంచు పలకలన్నీ కరిగి సముద్రంలో కలుస్తాయి. దాంతో సముద్రమట్టం ఏకంగా పదడుగులకు పైగా పెరిగిపోతుంది.
- డూమ్స్‌డే గ్లేసియర్ వాలుగా ఉంటుంది. దాంతో అది కరుగుతున్న కొద్దీ అందులోని మంచు వెచ్చని సముద్ర జలాల ప్రభావానికి మరింతగా లోనవుతూ వస్తుంది. వెచ్చని జలాలు గ్లేసియర్ అడుగుకు చొచ్చుకుపోతున్నాయి. దాంతో అది కరిగే వేగం మరింతగా పెరుగుతోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా కమాండర్

అకీల్ మృతి?

12 మంది మృతి • 66 మందికి గాయాలు

బీరుట్: వాకీటాకీల పేలుళ్లతో మొదలైన ఇజ్రాయెల్, హెజ్బొల్లా ఘర్షణ రోజురోజుకూ క్షిపణులు, డ్రోన్ల దాడులతో మరింత ముదురుతోంది. శుక్రవారం తమ ఉత్తర సరిహద్దు ప్రాంతాలపై హెజ్బొల్లా దాడులు చేసినందుకు ప్రతిగా ఇజ్రాయెల్ ఏకంగా లెబనాన్ దేశ రాజధాని బీరుట్ నగర సమీప ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంది.



అకీల్ (ఫైల్)

శుక్రవారం సాయంత్రం బీరుట్‌కు దక్షిణాన ఉన్న దహియే జిల్లాలోని జన సమ్మర్ద జామాస్ ప్రాంతంలో జరిపిన దాడుల్లో 12 మంది చనిపోయారని లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ దాడుల్లో 66 మంది గాయపడ్డారు. హెజ్బొల్లాకు గట్టిపట్టున్న ఈ ప్రాంతంపై జరిగిన ఈ దాడిలో ఒక బహుళ అంతస్తుల భవంతి నేలమట్టమైంది. మృతుల సంఖ్య పెరిగే వీలుంది. హెజ్బొల్లా సీనియర్ మిలటరీ అధికారి, ఆపరేషన్స్ కమాండర్ ఇబ్రహీం అకీల్ సైతం చనిపోయారని ఇజ్రాయెల్ పేర్కొంది. అకీల్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేశామని ప్రకటించింది. హెజ్బొల్లా ‘రద్వాన్ ఫోర్స్’ సాయుధ యూనిట్‌తో ఇతను సమావేశం అయిన సందర్భంగా దాడి చేసి అంతమొందించామని ఇజ్రాయెల్ ఆర్మీ అధికార ప్రతినిధి అవిచాయ్ అడ్రేయీ చెప్పారు. అయితే అకీల్, ఇతర కమాండర్ల మరణాన్ని హెజ్బొల్లా ధృవీకరించలేదు. అయితే అదే ప్రాంతంలో అకీల్ ఉన్నమాట వాస్తవమేనని హెజ్బొల్లా అధికార ప్రతినిధి చెప్పారు. బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. జూలైలో జరిపిన దాడుల్లో సీనియర్ హెజ్బొల్లా కమాండర్ ఫాద్ షుక్ర్ చనిపోయారు.

170 రాకెట్లతో విరుచుకుపడిన హెజ్బొల్లా

హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లాహ్ గురువారం టెలివిజన్ ప్రసంగం వేళ తమ రాకెట్ లాంచర్లను ఇజ్రాయెల్ దాడి చేసి ధ్వంసం చేసినందుకు ప్రతిగా హెజ్బొల్లా శుక్రవారం ఉదయం ఉత్తర ఇజ్రాయెల్‌పై మెరుపు దాడికి దిగింది. ఇజ్రాయెల్‌కు చెందిన గగనతల రక్షణ స్థావరాలు, బ్రిగేడ్ ప్రధాన కార్యాలయాలపైకి హెజ్‌బొల్లా పలు దఫాల్లో 170 కత్యూషా రాకెట్లను ప్రయోగించింది. అయితే ఇందులో జరిగిన ప్రాణనష్టంపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

ఎవరీ ఇబ్రహీం అకీల్?

రద్వాన్ ఫోర్స్ ఆపరేషన్స్ కమాండర్. గతంలో హెజ్బొల్లా అత్యున్నత సాయుధ విభాగం ‘జిహాద్ కౌన్సిల్’ సభ్యుడు. ఇతనిపై అమెరికా గతంలోనే ఆంక్షలు విధించింది. 1983లో బీరుట్‌లోని అమెరికా రాయబార కార్యాలయం, నావికాదళ బ్యారెక్‌లపై ఉగ్రదాడుల్లో 300 మందికిపైగా చనిపోయారు. వీటిలో అకీల్ పాత్ర ఉందని అమెరికా ఆరోపిస్తోంది. 1980 దశకంలో కొందరు జర్మన్లు, అమెరికన్లను బంధించాడని ఇతనిపై ఆరోపణలున్నాయి. తహసీన్ అనే మారుపేరుతో తిరిగే ఇతని వివరాలు చెప్పినా, పట్టిచ్చినా రూ.58 కోట్లు ఇస్తానని గతేడాది అమెరికా నజరానా ప్రకటించింది. 2019లోనే ఇతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది.

లా ఫైనల్ విద్యార్థులు బార్ పరీక్ష రాయొచ్చు

ఈ ఏడాదికి అనుమతించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: న్యాయశాస్త్రం ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు ఊరట లభించింది. వారిని ఆలిండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబీఈ) రాయడానికి అనుమతించాల్సిందిగా సుప్రీంకోర్టు శుక్రవారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ని ఆదేశించింది. ఎల్ఎల్‌బీ ఫైనలియర్ విద్యార్థులను పరీక్షకు అనుమతించడంపై బీసీఐ ఇప్పటిదాకా మార్గదర్శకాలు రూపొందించకపోవడంపై సీజేఐ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. నవంబరు 24న నిర్వహించనున్న బార్ పరీక్షకు ఫైనలియర్ విద్యార్థులు అనర్హులని బీసీఐ నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంలో పిటిషనర్ల వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఫైనలియర్ విద్యార్థులను పరీక్షకు అనుమతించకపోతే విలువైన ఏడాది సమయం వృథా అవుతుందని అభిప్రాయపడింది. బార్ పరీక్ష ఉత్తీర్ణులైతేనే న్యాయవాదులుగా రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకోవడానికి అర్హత లభిస్తుంది.

హ్యాకయిన సుప్రీంకోర్టు యూట్యూబ్ చానల్

న్యూఢిల్లీ: హ్యాకింగ్ బెడద సుప్రీంకోర్టుకు సైతం తప్పలేదు. సుప్రీంకోర్టు యూట్యూబ్ చానల్ శుక్రవారం హ్యాక్ అయ్యింది. క్రిప్టోకరెన్సీని ప్రోత్సహిస్తూ అమెరికాకు చెందిన రిపుల్ ల్యాబ్స్ రూపొందించిన వీడియోలు ఈ యూట్యూబ్ చానల్‌లో దర్శనమిచ్చాయి. ఎలాంటి దృశ్యాలు లేని ఓ లైవ్ వీడియో సైతం కనిపించింది. ఈ విషయం గుర్తించిన నిర్వాహకులు చానల్ ప్రసారాలు వెంటనే నిలిపివేశారు. అతి త్వరలో పునఃప్రారంభించనున్నట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఓ నోటీసు పోస్టు చేశారు.

శ్రీలంకలో నేడే అధ్యక్ష ఎన్నికలు

ముక్కోణపు పోరు

- రణిల్, సజిత, అనూర అమీతుమీ
- అనూరకే అవకాశమంటున్న పోల్స్

కల్లోల శ్రీలంకలో కీలకమైన అధ్యక్ష ఎన్నికల పోరుకు సర్వం సిద్ధమైంది. శనివారం దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. పెను రాజకీయ రగడకు దారితీసి దేశాన్ని కుప్పకూల్చిన 2022 ఆర్థిక సంక్షోభం అనంతరం జరుగుతున్న తొలి ఎన్నికలివి. మాజీ ఆర్మీ చీఫ్ శరత్ పోన్సెకాతో పాటు 38 మంది బరిలో ఉన్నా ప్రధాన పోరు మాత్రం ముగ్గురి మధ్యే కేంద్రీకృతమైంది. అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె, విపక్ష నేత సజిత్ ప్రేమదాస, జనాదరణతో దూసుకుపోతున్న అనూర కుమార దిస్సనాయకె అమీతుమీ తేల్చుకోనున్నారు. 1982 తర్వాత శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొనడం ఇదే తొలిసారి. ముగ్గుర్లో అనూరకే స్పష్టమైన మొగ్గు కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఎవరు నెగ్గినా కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ది దేశాన్ని గాడిన పెట్టడం పెను సవాలుగానే కనిపిస్తోంది. మోయలేని భారంగా మారిన 300 కోట్ల డాలర్ల ఐఎంఎఫ్ అప్పు భయపెడుతున్న నేపథ్యంలో ఎకానమీయే ప్రధాన అభ్యర్థులందరికీ ప్రధాన ఎన్నికల అంశంగా మారింది...

ప్రచారమంతా ఐఎంఎఫ్ రుణం చుట్టే...

2022 సంక్షోభం అనంతరం లంకను ఆదుకోవడానికి ఏ దేశమూ పెద్దగా ముందుకు రాలేదు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 290 కోట్ల డాలర్ల రుణం సాధించడం రణిల్ సాధించిన ఘనవిజయమని ఆయన మద్దతుదారులు చెప్పుకుంటున్నారు. కానీ అందుకోసం ప్రజల బతుకులనే పణంగా పెట్టారని, సంక్షేమ పథకాలన్నింటికీ కోత పెట్టి వారిని రోడ్డు పాలు చేశారని ప్రత్యర్థులు దుయ్యబడుతున్నారు. ఈ రెండేళ్లలో ద్రవ్యోల్బణం 74 శాతం పెరగడం రణిల్ అసమర్థ పాలన ఫలితమేనని మండిపడుతున్నారు. నిజానికి 2022 నాటి ఆర్థిక సంక్షోభానికి బీజాలు అంతకు పన్నెండేళ్ల ముందే పడ్డాయి. 2009లో అంతర్యుద్ధం ముగిశాక పునర్నిర్మాణం, అభివృద్ధి పథకాలకు లంక విపరీతంగా అప్పులు చేసింది. 2020 నాటికే వాటిని తీర్చలేని పరిస్థితికి చేరుకుంది. పులిమీద పుట్రలా కరోనా వచ్చిపడటంతో ప్రధాన ఆదాయ వనరైన పర్యాటకం పూర్తిగా నిలిచిపోయి గుడ్లు తేలేసింది. 2022 నాటికి చమురు ధరలు ఆకాశాన్నంటడం, అమెరికా వడ్డీ రేట్లు అమాంతంగా పెంచేయడంతో పూర్తిగా చేతులెత్తేసింది. అంతర్జాతీయ రుణ భారం 5,100 కోట్లు దాటేసింది. చమురుతో పాటు తిండి గింజలు, ఔషధాల వంటి అత్యవసరాలను కూడా దిగుమతి చేసుకోలేని దుస్థితికి దిగజారింది. ద్రవ్యోల్బణం దెబ్బకు ఒక్క గుడ్డు ధర ఏకంగా 300 రూపాయలు దాటేసింది. కడుపు కాలిన ప్రజలు రాజపక్స సర్కారుపై తిరగబడ్డారు. జనాగ్రహానికి జడిసి ఆయన దేశం వీడి పలాయనం చిత్తగించాక అన్ని పక్షాల అంగీకారంతో రణిల్ గద్దెనెక్కారు. ఐఎంఎఫ్ రుణానికి బదులుగా సంక్షేమ పథకాల్లో భారీ కోతకు ఆయన అంగీకరించడంతో కరెంటు తదితరాలపై సబ్సిడీలు అటకెక్కాయి. వ్యాట్ మోత రెండింతలైంది. పేదరికం రెట్టింపైంది. కాకపోతే ఆర్థిక సంక్షోభం నుంచి దేశం కాస్తో కూస్తో తేరుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్



రణిల్ విక్రమసింఘె (75)

- దేశాధ్యక్షుడు. 2022లో గొటబయ రాజపక్స పదవీచ్యుతుడయ్యాక పగ్గాలు చేపట్టారు.
- ఆరుసార్లు దేశ ప్రధానిగా చేశారు.
- యునైటెడ్ నేషనల్ పార్టీ నాయకుడు.
- స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగడం విశేషం!
- ఆర్థిక సంక్షోభం నుంచి ఒడ్డున పడేశానని చెప్పుకుంటున్నారు.
- ఐఎంఎఫ్‌తో ఒప్పందంలో భాగంగా సంక్షేమ పథకాలకు కోత పెట్టారంటూ విమర్శలు ఎదుర్కొంటున్నారు.

సజిత్ ప్రేమదాస (57)

- పార్లమెంటులో విపక్ష నేత. మాజీ అధ్యక్షుడు రణసింఘే కుమారుడు.
- యూఎన్‌పీ నుంచి బయటికొచ్చి 2020లో సమగి జన బలవేగయ (ఎస్‌జేబీ) పేరుతో వేరు కుంపటి పెట్టుకున్నారు.
- 2019 ఎన్నికల్లో తమిళ ఓట్లను గుండుగుత్తగా కొల్లగొట్టారు.
- విక్రమసింఘే పెంచేసిన పన్ను భారాన్ని బాగా తగ్గిస్తానన్న హామీతో ఆకట్టుకుంటున్నారు.
- సంక్షేమ పథకాలను పణంగా పెట్టి మరీ ఐఎంఎఫ్ నుంచి రుణం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

అనూర దిస్సనాయకె (55)

- విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని సర్వేలన్నీ చెబుతున్న నేత.
- 1970లు, 80ల్లో ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాట్లలో విస్తృతంగా పాల్గొన్న జనతా విముక్తి పెరమున (జేవీపీ) అధ్యక్షుడు.
- వామపక్ష భావజాలా లున్న నేషనల్ పీపుల్స్ పవర్ సంకీర్ణం తరఫున బరిలో ఉన్నారు.
- గత ఈ రెండేళ్లలో ప్రజాదరణ పొందిన నేత.
- అవినీతి నిరోధక చర్యలు, ఐటీ మినహాయింపు పరిమితి పెంపు వంటి సంక్షేమ హామీలకు విపరీతమైన ఆదరణ లభిస్తోంది.

డీవీసీతో సంబంధం తెంచేసుకుంటాం

ప్రధాని మోదీకి సీఎం మమత హెచ్చరిక



కోల్‌కతా: దామోదర్ వ్యాలీ కార్పొరేషన్(డీవీసీ)తో తమ రాష్ట్రం అన్ని సంబంధాలను తెంచేసుకుంటుందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రధాని మోదీని హెచ్చరించారు. ఇటీవల రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల్లో సంభవించిన ఆకస్మిక వరదలకు డీవీసీ ఏకపక్షంగా నీటిని విడుదల చేయడమే కారణమని ఆమె ఆరోపించారు. సీఎం మమత శుక్రవారం ఈ మేరకు ప్రధానికి నాలుగు పేజీల లేఖ రాశారు. రాష్ట్రంలోని చిన్న చిన్న నదులు ప్రమాదకర స్థాయి, అంతకు మించి ప్రవహిస్తున్న విషయం తెలుపుతూ తమ అధికారులు, నీటి విడుదలను వాయిదా వేయాలంటూ లేఖ రాసినా డీవీసీ పట్టించుకోలేదని మమత ఆరోపించారు. డీవీసీ నియంత్రణలో ఉన్న మైథోన్, పంచెట్ జలాశయాల నుంచి కొద్ది గంటల వ్యవధిలోనే ఏకంగా 5 లక్షల క్యూసెక్కుల నీటిని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఏకపక్షంగా విడుదల చేశారన్నారు. ఒక్కసారిగా భారీగా వరదలు చుట్టుముట్టడంతో పూర్బ వర్ధమాన్, పశ్చిమ బర్ధమాన్, బీర్భూమ్, బంకురా, హౌరా, హుగ్లీ, పూర్బ మేదినీపూర్, పశ్చిమ మేదినీపూర్ జిల్లాలకు చెందిన 50 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు.

నేనోడితే మీరే బాధ్యులు: ట్రంప్

హారిస్‌కు అమెరికన్ యూదుల మద్దతు నేపథ్యంలో వ్యాఖ్యలు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తానోడితే అందుకు యూదు–అమెరికన్ ఓటర్లు పాక్షికంగా బాధ్యులవుతారని రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన ఇజ్రాయెల్–అమెరికన్ కౌన్సిల్ నేషనల్ సమ్మిట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికన్ యూదుల్లో తాను హారిస్ కంటే వెనుకబడి ఉన్నానని విచారం వ్యక్తం చేశారు. హారిస్ గెలిస్తే రెండేళ్లలో ఇజ్రాయెల్ ఉనికి కనుమరుగవుతుందని హెచ్చరించారు. డెమొక్రాట్లకు ఓటేసే యూదులే అందుకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

అత్యాచారం కేసులో బీజేపీ ఎమ్మెల్యే అరెస్ట్



బెంగళూరు: అత్యాచారం, లైంగిక వేధింపుల ఆరోపణలపై కర్ణాటకకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే ఎస్.మునిరత్న(60)ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కగ్గలిపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ రిసార్టులో తనపై అత్యాచారం జరిగిందంటూ ఓ మహిళ(40) ఇచ్చిన ఫిర్యాదుపై ఎమ్మెల్యేతోపాటు మరో ఆరుగురిపైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రజాప్రతినిధులపై కేసులను విచారించే ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు బెయిలిచ్చిన మరునాడే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. కులం పేరుతో దూషించడం వంటి ఆరోపణలపై అరెస్టయిన మునిరత్న మూడు రోజులపాటు పరప్పన అగ్రహారం జైలులో ఉన్నారు. గురువారం ప్రత్యేక కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిలిచ్చింది. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే ఎమ్మెల్యే మునిరత్నంను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేయడం గమనార్హం.

ఆ ఐటీ నిబంధనలు రాజ్యాంగవిరుద్ధం

ఫేక్ న్యూస్ రూల్స్‌పై బాంబే హైకోర్టు

ముంబై: ఫాల్స్ న్యూస్ కట్టడికి తీసుకొచ్చిన కొత్త ఐటీ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికలపై తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించేందుకు, అందుకు కారకులను గుర్తించేందుకు ఐటీ చట్టానికి కేంద్రం 2023 ఏప్రిల్ 6న పలు సవరణలు చేసింది. అవి రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వపు హక్కు, వృత్తి హక్కులతో పాటు వాక్ స్వేచ్ఛను కూడా హరించేవిగా ఉన్నాయంటూ న్యాయస్థానం ఆక్షేపించింది. కొత్త ఐటీ చట్టాలను సవాలు చేస్తూ స్టాండప్ కమేడియన్ కునాల్ కమ్రాతో పాటు ఎడిటర్స్ గిల్డ్ తదితర సంస్థలు గతంలో బాంబే హైకోర్టును ఆశ్రయించాయి. ఈ అంశంపై గత జనవరిలో ఇద్దరు న్యాయమూర్తులు పరస్పర విరుద్ధమైన తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సదరు నిబంధనలను కొట్టేస్తూ జస్టిస్ చందూర్కర్ తాజాగా నిర్ణాయక తీర్పు వెలువరించారు. అవి వ్యక్తులపై, ముఖ్యంగా సోషల్ మీడియా యూజర్లపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. తప్పుడు సమాచార వ్యాప్తికి కారకులను కనిపెట్టే ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ (ఎఫ్‌సీయూ)కు విస్తృతాధికారాలు కట్టబెట్టిన తీరు రాజ్యాంగ విరుద్ధమని న్యాయమూర్తి ఆక్షేపించారు.

న్యాయమూర్తులు హద్దు మీరొద్దు

జడ్జీలు చేసే వ్యాఖ్యలు మర్యాదపూర్వకంగా, చట్టాలకు లోబడి ఉండాలి: సీజేఐ

న్యూఢిల్లీ: కర్ణాటక హైకోర్టులో ఓ కేసు విచారణ సందర్భంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన న్యాయమూర్తి జస్టిస్ వేదవ్యాసాచార్ శ్రీశానందాపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై నివేదిక ఇవ్వాలని కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. ‘‘న్యాయమూర్తులు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి. హద్దు మీరడం తగదు. న్యాయ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉంది’’ అని హితవు పలికింది. దీన్ని సుమోటోగా విచారణకు స్వీకరించింది. 25న విచారణ చేపడతామని వెల్లడించింది.

అసలేం జరిగింది?

బెంగళూరులో ఓ ఇంటి యజమాని, కిరాయిదారుకు వివాదంపై కర్ణాటక హైకోర్టు ఇటీవల విచారణ జరిపింది. బెంగళూరులోని ముస్లిం ప్రాబల్య ప్రాంతాన్ని జస్టిస్ శ్రీశానందా పాకిస్తాన్‌తో పోల్చారు. అంతేగాక, ‘‘ప్రత్యర్థి వర్గంతో మీకు చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నట్టున్నాయి. వారి లోదుస్తుల రంగు కూడా మీకు తెలిసే ఉంటుంది’’ అని మహిళా న్యాయవాదిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లింది. కోర్టుల్లో న్యాయమూర్తుల వ్యాఖ్యలపై మార్గదర్శకాలు విడుదల చేయాల్సిన అవసరం కనిపిస్తోందని సీజేఐ పేర్కొన్నారు. ‘‘కోర్టుల కార్యకలాపాలను గమనించడంలో సోషల్ మీడియా చురుగ్గా ఉంది. కనుక న్యాయమూర్తుల వ్యాఖ్యలు చట్టాలకు లోబడి మర్యాదపూర్వకంగా ఉండాలి’’ అన్నారు.



కొలీజియం సిఫార్సులను అమలు చేయాల్సిందే

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కొలీజియం అంటే సెర్చ్ కమిటీ కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టులో, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకానికి అర్హుల పేర్లను సిఫార్సు చేసే కొలీజియంపై కీలక వ్యాఖ్యలు చేసింది. దానికి సెర్చ్ కమిటీ హోదా మాత్రమే ఉంటుందని వెల్లడించింది. కొలీజియం రెండోసారి సిఫార్సు చేసిన పేర్లను కేంద్రం తప్పనిసరిగా ఆమోదించాల్సిందేనని స్పష్టంచేసింది. కొలీజియం సిఫార్సుల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న పేర్ల జాబితాను విడుదల చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. వాటి ఆమోదానికి ఇబ్బంది ఏమిటో చెప్పాలని పేర్కొంది. కొలీజియం సిఫార్సులను నోటిఫై చేయడానికి కేంద్రానికి స్పష్టమైన గడువు నిర్దేశించాలంటూ హర్ష సింఘాల్ అనే లాయర్ పిల్ దాఖలు చేశారు. జార్ఖండ్ హైకోర్టు సీజేగా జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావును నియమించాలన్న కొలీజియం సిఫార్సును కేంద్రం పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేసింది. వీటిపై సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కొలీజియం సిఫార్సుల ఆమోదంపై కేంద్రానికి కాలావధి నిర్దేశించాలని పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. ఆలోగా స్పందించకపోతే వాటిని ఆమోదించినట్లుగానే భావించేలా నిబంధన తీసుకురావాలని చెప్పారు. కొలీజియం రెండోసారి సిఫార్సుల్లో పెండింగ్‌లో ఉన్నవాటి వివరాలివ్వాలని అటార్నీ జనరల్‌ను ధర్మాసనం ఆదేశించింది.

అపవాదు వేస్తారా?

- బెంగాల్ న్యాయవ్యవస్థనే శంకిస్తారా
- సీబీఐకి సుప్రీంకోర్టు అక్షింతలు

న్యూఢిల్లీ: బెంగాల్ న్యాయవ్యవస్థ మీద అపవాదులు మోపడం సరికాదంటూ సుప్రీంకోర్టు శుక్రవారం సీబీఐని మందలించింది. 2021 అసెంబ్లీ ఎన్నికల అనంతర హింస కేసులను బెంగాల్ బయటికి బదిలీ చేయాలని సుప్రీంకోర్టును సీబీఐ గత డిసెంబరులో కోరింది. ‘‘లేదంటే సాక్షులను భయపెట్టే అవకాశముంది. బెంగాల్ కోర్టులలో శత్రుత్వభావంతో కూడిన వాతావరణం నెలకొంది’’ అని పేర్కొంది. దీనిపై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ‘‘కేసుల బదిలీకి ఇదేం ప్రాతిపదిక? మొత్తం న్యాయవ్యవస్థపైనే అపవాదు వేస్తారా? బెంగాల్ కోర్టులన్నింటిలోనూ విరోధభావం నెలకొందన్నట్లుగా చూపుతున్నారు. ఒక రాష్ట్రంలోని న్యాయమూర్తులను సీబీఐ అధికారులు ఇష్టపడనంత మాత్రాన మొత్తం న్యాయవ్యవస్థే పనిచేయడం లేదనకండి. జిల్లా జడ్జిలు, సివిల్ జడ్జిలు, సెషన్స్ జడ్జిలు తమను తాము సమర్థించుకోవడానికి సుప్రీంకోర్టు దాకా రాలేరు’’ అని సీబీఐ తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజును ఉద్దేశించి పేర్కొంది. పిటిషన్‌లో వాడిన పదజాలాన్ని ఆయన సమర్థించుకొనే ప్రయత్నం చేశారు. కోర్టులపై అపవాదు వేసే ఉద్దేశం తమకు లేదని పేర్కొంటూ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

అర్బన్ నక్సల్స్, తుక్డే గ్యాంగ్ కాంగ్రెస్‌ను నడిపిస్తున్నాయి

ఆ పార్టీలోకి విద్వేష భూతం ప్రవేశించింది: మోదీ

వార్ధా: విపక్ష కాంగ్రెస్‌లోకి విద్వేష భూతం ప్రవేశించిందని, అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్ (సమాజాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులు) ఆ పార్టీని నడిపిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ‘‘కాంగ్రెస్ అత్యంత అవినీతి పార్టీ. కాంగ్రెస్ రాజ కుటుంబం అత్యంత అవినీతి కుటుంబం’’ అని ధ్వజమెత్తారు. ‘ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన’కు ఏడాది పూర్తయిన మహారాష్ట్రలోని వార్ధాలో శుక్రవారం బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు విదేశీ గడ్డపై దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని రాహుల్‌గాంధీని ఉద్దేశించి ఆరోపించారు. ‘‘గణపతి పూజను సైతం కాంగ్రెస్ ద్వేషిస్తోంది. నేను గణపతి పూజలో పాల్గొంటే కాంగ్రెస్ నాయకులు బుజ్జగింపు రాజకీయాల కోసం నాపై ఆరోపణలకు దిగారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో వినాయక విగ్రహాన్ని పోలీసు జీపెక్కించారు. అయినా మహారాష్ట్రలోని కాంగ్రెస్ మిత్రపక్షాలు నోరు విప్పలేదు. తెలంగాణలో ఇచ్చిన ఎన్నికల హామీలను అధికారంలోకి రాగానే పక్కన పెట్టింది. కాంగ్రెస్ అంటే అబద్ధం, మోసం’’ అని దుయ్యబట్టారు.



అంతర్జాతీయ స్థాయికి మన వస్త్ర పరిశ్రమ

విశ్వకర్మ యోజనతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు అధికంగా లబ్ధి పొందుతున్నారని మోదీ తెలిపారు. ‘‘మన వస్త్ర పరిశ్రమ అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం. ఏడాది కాలంలో 20 లక్షల మందికిపైగా విశ్వకర్మ యోజనలో చేరారు. 8 లక్షల మంది నైపుణ్య శిక్షణ పొందారు’’ అని వెల్లడించారు.

2026కల్లా నక్సలిజం అంతం

మావోయిస్టులు లొంగిపోవాలి: అమిత్ షా

న్యూఢిల్లీ/షహీబ్‌గంజ్ (జార్ఖండ్): దేశంలో నక్సలిజం 2026 మార్చి నాటికి పూర్తిగా అంతమైపోతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ‘‘2026 మార్చి 31లోగా నక్సల్స్ హింసను, భావజాలాన్ని దేశం నుంచి తుడిచిపెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించారు. అంతకంటే ముందే నక్సలిజాన్ని అంతం చేస్తాం’’ అని పేర్కొన్నారు. హింసను విడనాడి ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలని మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. నక్సల్ హింసకు గురైన 55 మంది బాధితులనుద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు. ‘‘మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లలో భద్రతా దళాలు భారీ విజయాలు సాధించాయి. సమస్య ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లోని నాలుగు జిల్లాలకు మాత్రమే పరిమితమైంది. పశుపతినాథ్ (నేపాల్) నుంచి తిరుపతి (ఏపీ) దాకా కారిడార్ ఏర్పాటు చేయాలని మావోయిస్టులు ఒకప్పుడు అనుకున్నారు. కానీ ఆ ప్రణాళికలను మోదీ ప్రభుత్వం తిప్పికొట్టింది. ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కేంద్ర హోం శాఖ త్వరలో సంక్షేమ పథకం రూపొందిస్తుంది. ఉద్యోగాలు, ఆరోగ్య సంరక్షణ, ఇతర రంగాల్లో సంక్షేమ కార్యక్రమాల ద్వారా సాయం చేస్తుంది’’ అని వెల్లడించారు.




జార్ఖండ్‌లో జేఎంఎం–కాంగ్రెస్ సంకీర్ణ సర్కారు బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను విపరీతంగా ప్రోత్సహిస్తోందని అమిత్ షా ధ్వజమెత్తారు. దీనికి అడ్డుకట్ట వేయని పక్షంలో మరో పాతికేళ్లలో చొరబాటుదారులే రాష్ట్రంలో మెజారిటీ ప్రజలుగా మారిపోతారని హెచ్చరించారు. స్థానిక గిరిజన సంస్కృతిని వాళ్లు సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. జార్ఖండ్‌లోని గిరిడ్‌లో పరివర్తన్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులను రాష్ట్ర ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. వీటి దెబ్బకు సంతాల్ పరగణాల్లో స్థానిక గిరిజనుల జనాభా 44 శాతం నుంచి 28 శాతానికి తగ్గిందన్నారు.

అంతరిక్షంలో 370 రోజులకు పైగా!

రికార్డు సృష్టించిన ఇద్దరు రష్యా వ్యోమగాములు

మాస్కో: రష్యా వ్యోమగాములు ఒలెగ్ కొనొకెంకో, నికోలాయ్ చుబ్ శుక్రవారం సరికొత్త రికార్డు సృష్టించారు. వారిద్దరూ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో 370 రోజుల 21 గంటల 22 నిమిషాలకుపైగా ఉన్నారు. పాత రికార్డును తిరగరాశారు. ప్రస్తుతం వారిద్దరూ అక్కడే పరిశోధనల్లో భాగస్వాములవుతున్నారు. వ్యోమగాములు నిరాటంకంగా ఇన్ని రోజులు ఐఎస్ఎస్‌లో ఉండడం ఇదే మొదటిసారి. ఇప్పటిదాకా ఎక్కువ కాలం ఐఎస్ఎస్‌లో ఉన్న రికార్డు రష్యా ఆస్ట్రోనాట్స్ సెర్గీ ప్రొకోపీవ్, దిమిత్రి పెటెలిన్, అమెరికా ఆస్ట్రోనాట్ ఫ్రాన్సిస్కో రుబియో పేరిట ఉంది. వారు 370 రోజుల 21 గంటల 22 నిమిషాలు ఐఎస్ఎస్‌లో గడిపారు. ఈ రికార్డును ఒలెగ్ కొనొకెంకో, నికోలాయ్ చుబ్ బద్దలు కొట్టారు. వారు సోమవారం భూమిపైకి తిరిగి రాబోతున్నారు. 59 ఏళ్ల కొనొకెంకో మరో రికార్డు కూడా సృష్టించబోతున్నారు. సోమవారం నాటికి ఆయన ఐఎస్ఎస్‌లో ఏకంగా 1,110 రోజులు గడిపినట్లు అవుతుంది. ఇప్పటిదాకా ఇన్ని రోజులు అక్కడ ఉన్నవారెవరూ లేరు.





సాక్షి హైదరాబాద్

శనివారం ǀ 21 ǀ సెప్టెంబర్ ǀ 2024



86 కిలోల గంజాయి పట్టివేత

ఎస్‌ఓటీ రాజేందర్‌నగర్, దుండిగల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 86 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. -8లో



ఏఐ.. హాయ్!

కృత్రిమ మేధ(ఏఐ)..సాంకేతిక విప్లవంలో మానవుడి ఆలోచనలకు అందనంత దూరం వెళ్లిపోయింది. మనిషి కూడా చేయలేని ఎన్నో పనులకు పరిష్కారం చూపుతోంది. -సిటీ ప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
35.0/24.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళ కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. రాత్రికి చల్లని గాలులు వీస్తాయి.

మళ్లీ ఆశలు!

కొత్త 'రేషన్' కార్డులకు గ్రీన్ సిగ్నల్



అక్టోబర్ 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ

- నాలుగేళ్లుగా ఆగిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ
- ఇప్పుడు ఆన్‌లైనా? ఆఫ్‌లైనా?..లభించని స్పష్టత

సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో నిరుపేద కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైనా..? ఆఫ్‌లైనా..? అనే అంశంపై స్పష్టత లేకుండా పోయింది. ఇప్పటి వరకు పౌరసరఫరాల శాఖ ఆన్‌లైన్ లాగిన్ ద్వారానే దరఖాస్తులను స్వీకరించి కొత్త కార్డులను మంజూరు చేస్తోంది. వాస్తవంగా నాలుగేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్ ఆన్‌లైన్ లాగిన్ కూడా నిలిచిపోయింది. అప్పటి నుంచి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. తాజాగా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రకటించడంతో ఆ లాగిన్ పునఃప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పది లక్షలపైనే కుటుంబాలు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల కోసం సుమారు పది లక్షలకు పైగా కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. సుమారు కోటిన్నర జనాభా కలిగిన మహానగరంలో సుమారు 40 లక్షల కుటుంబాలు ఉండగా అందులో దారిద్ర్యరేఖకు దిగువ నున్న కుటుంబాలు 27.21 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం 17.21 లక్షల కుటుంబాలు మాత్రమే తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నాయి.

ఆఫ్‌లైన్‌లో ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన కొత్తలో నిర్వహించిన ప్రజాపాలనలో సుమారు 5.73 లక్షల కుటుంబాలు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించగా సుమారు 24 లక్షల 74 వేల 325 కుటుంబాలు వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అందులో ఐదు గ్యారంటీ పథకాల కోసం సుమారు 19,01,256 కుటుంబాలు, ప్రత్యేకంగా రేషన్ కార్డు కోసం 5,73,069 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఏం చేస్తారు..కొత్తగా ఎలా దరఖాస్తులు స్వీకరిస్తారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.



చెత్త వేయొద్దు!

ఏఐతో పారిశుద్ధ్య సమస్యలకు చెక్

చెత్త వేసేవారిని గుర్తించి పెనాల్టీలు

- కార్మికుల్లేకుండానే చెత్త సేకరణ
- కార్యాచరణకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎన్ని చర్యలు చేపట్టినా చెత్త సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వివిధ రంగాల్లో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను చెత్త సమస్య పరిష్కారానికి వినియోగించుకునేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. ఏఐ వినియోగంతో చేసే పనుల్లో బహిరంగ ప్రదేశాల్లో ఎవరు చెత్తను వేస్తున్నారో గుర్తించి హెచ్చరించడంతో పాటు వారి వైఖరి మారకుంటే పెనాల్టీలు విధించడం ఒకటి కాగా..పారిశుద్ధ్య కార్మికుల ప్రమేయం లేకుండానే కాంటాక్ట్‌లెస్‌గా చెత్తను సేకరించడం మరొకటి. ఈ రెండు పనులను చేసేందుకు రెండు ప్యాకేజీలుగా జీహెచ్‌ఎంసీ ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్ ఆహ్వానించింది. ఏఐ ఆధారిత కెమెరాలు, సెన్సర్ల ద్వారా బహిరంగ ప్రదేశాల్లో చెత్త పోగవుతున్న (వల్నరబుల్)ప్రాంతాల్లో ఎవరు చెత్తను వేస్తున్నారో గుర్తిస్తారు. ఎవరైనా అక్కడ చెత్త వేస్తున్నప్పుడు అక్కడ అమర్చే మైకు ద్వారా 'హలో.. ఇక్కడ చెత్త వేయవద్దు.. భారీ పెనాల్టీ పడుద్ది' అనే వ్యాఖ్యానాలు వినిపించేలా ఏర్పాట్లుంటాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటివల్ల ఆశించిన ఫలితం కనిపించలేదు. కొత్తగా ఏర్పాటు చేయబోయే కెమెరాలు ఏ ఉపరితలంపైన అయినా అమర్చవచ్చు. అవి 360 డిగ్రీల కోణంలో పనిచేస్తాయని సంబంధిత అధికారి తెలిపారు. దాంతో తరచూ చెత్తవేసే వారిని గుర్తించి పెనాల్టీలు విధించడం ద్వారా వారు మారేలా చేస్తారు.

కాంటాక్ట్‌లెస్‌గా చెత్త సేకరణ..

పారిశుద్ధ్య కార్మికుల ప్రమేయం లేకుండానే కాంటాక్ట్‌లెస్‌గా చెత్త సేకరణ జరిగేందుకు ప్రత్యేక యంత్రాలు కలిగిన వాహనాలను వినియోగిస్తారు. వీటిల్లో ఉండే ట్రాష్ కలెక్షన్ మిషన్లు చెత్తను లాక్కుంటాయి. తద్వారా కార్మికుల అవసరం తగ్గడంతోపాటు సమయం కలిసి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. తొలుత రోడ్లపై చెత్త ఎక్కువగా పోగుపడుతున్న ప్రాంతాల్లో కానీ, జూబ్లీహిల్స్,బంజారాహిల్స్ వంటి వీఐపీలుండే ప్రాంతాల్లో కానీ వీటిని ఏర్పాటుచేసే యోచనలో అధికారులున్నారు. ఈ ప్రత్యేక వాహనాల ద్వారా రోడ్ల వెంబడి ఉండే చెత్తను రోజుకు దాదాపు రెండు టన్నుల వరకు తొలగించవచ్చునని చెబుతున్నారు. చెత్త పోగుపడే ప్రాంతాల నుంచి అందే ఫిర్యాదులను పరిష్కరించడంలోనూ ఈ వాహనాలు ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు. మరోవైపు చెత్తను విభజించే సాంకేతికతను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అంటే చెత్తలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలు, సీసాలు, ఫుడ్ ప్యాకేజీ, కాగితాలు, సిగరెట్ పీకలు వంటి వాటిని వేర్వేరుగా గుర్తించగలిగే సాంకేతికతను వినియోగించుకుంటారు. ఇలా ఏఐతో జీహెచ్‌ఎంసీ చెత్త సమస్యలకు పరిష్కారం లభించగలదని అధికారులు భావిస్తున్నారు.చెత్త సమస్య పరిష్కారమైతే చెత్త, దుర్గంధం, వాటివల్ల వ్యాప్తి చెందే వ్యాధులను కూడా నివారించవచ్చునని అధికారులు చెబుతున్నారు.

23న తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా ఫేజ్–3 రింగ్ మెయిన్–1 పరిధిలోని ప్రశాసన్ నగర్ నుంచి అయ్యప్ప సొసైటీ వరకు ఉన్న 1200 ఎంఎం డయా పీఎస్సీ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీల మరమ్మతు పనుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో 24 గంటల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జలమండలి ఒక ప్రకటనలో తెల్పింది. ఈ నెల 23న సోమవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు మంగళవారం ఉదయం 6 గంటల వరకు హకీంపేట్, గోల్కొండ, టోలిచౌకి, లంగర్ హౌజ్, షేక్ పేట్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, తట్టిఖానా, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొంది. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి చేసింది.

29న ఎఫ్‌ఎన్‌సీసీ ఎన్నికలు

బంజారాహిల్స్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్‌ఎన్‌సీసీ) కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 29న జరగనున్నాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగా, శనివారం సాయంత్రం నామినేషన్ ఉపసంహరణ ఉంటుంది. అధ్యక్ష పదవికి ప్రముఖ నిర్మాత కేఎస్ రామారావు, టి.ప్రసన్నకుమార్, డాక్టర్ జ్యోతిప్రసాద్ కోసరాజు, వైస్ ప్రెసిడెంట్ పదవికి కె.అశోక్‌కుమార్, ఎస్ఎన్‌రెడ్డి, సెక్రటరీ పదవికి పాలిశెట్టి కృష్ణారావు, తుమ్మల రంగారావు, జాయింట్ సెక్రటరీ పదవికి కె.సదాశివరెడ్డి, కోశాధికారి పదవికి జె.శైలజ, సీహెచ్. శ్రీనివాసరావు, ప్రమోటీ కమిటీ మెంబర్లు ఐదు మందికి గాను తొమ్మిది మంది, పర్మినెంట్ కమిటీ మెంబర్లు నలుగురికి గాను 13 మంది నామినేషన్లు దాఖలు చేశారు. 2024–26 సంవత్సరానికి గాను ఈ కమిటీని ఎన్నుకుంటారు. మొత్తం 2,000 మంది ఎఫ్‌ఎన్‌సీసీ ఓటర్లు ఈ కమిటీని ఎన్నుకోనున్నారు. ఎఫ్‌ఎన్‌సీసీలో మెగాస్టార్ చిరంజీవి, అల్లు అర్జున్, మంజు మోహన్‌బాబు, శ్రీకాంత్, రాంచరణ్‌తేజ్, దర్శకులు కె. రాఘవేంద్రరావు, ఏ.కోదండరామిరెడ్డి, బి. గోపాల్, రచయిత పరచూరి గోపాలకృష్ణ, నిర్మాత ఆదిశేషగిరిరావు, కేఎల్ నారాయణ, ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజ సూర్యనారాయణ తదితర ప్రముఖులు ఉన్నారు.

నిమ్స్‌లో డే కేర్ సేవలు

లక్డీకాపూల్: అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి సైతం నిమ్స్‌లో ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ విధానం కింద నిమ్స్– సీడీఎఫ్‌డీ విభాగం 85 మంది బాధితులకు చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్, డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఆస్పత్రిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెడికల్ జెనెటిక్స్ విభాగంలో ఏర్పాటు చేసిన డే కేర్ సదుపాయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగపర్చుకోవాల్సిందిగా అరుదైన వ్యాధుల బాధపడుతున్న వారిని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ షగున్ అగర్వాల్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ దలాల్, డిపార్ట్‌మెంట్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్లు డా.రాకేష్, డా.చరణ్‌తో పాటు పలువురు సీనియర్ వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

నీటి నిర్వహణ ఇక ఆన్‌లైన్‌లో..



పక్కాగా లాగ్‌బుక్, రికార్డుల నమోదు

- నీటిశుద్ధి ప్రక్రియలో ఆటోమేషన్
- ట్రాన్స్‌మిషన్, క్యూఏటీ విభాగాలతో సమీక్ష
- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి సరఫరా చేస్తున్న తాగునీటి నిర్వహణ సమగ్ర వివరాలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకోస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ట్రాన్స్‌మిషన్, క్యూఏటీ వింగ్స్ అధికారులతో సమావేశమై కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపు, సరఫరాపై సమీక్షించారు. ట్రాన్స్‌మిషన్, ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, వాటర్ క్వాలిటీ, క్లోరినేషన్ వివరాలపై కూలంకషంగా చర్చించారు. ఇక ట్రాన్స్‌మిషన్ లైన్లు, నిర్వహణ, వాల్వ్ లీకేజీలు, ఆకస్మికంగా ఏర్పడే పైపులైన్ లీకేజీల పునరుద్ధరణ, చెల్లించిన వ్యయం మొత్తం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో ఉండాలని సూచించారు. పంపుహౌజ్‌ల మోటార్లు పంపు చేసే క్వాంటిటీకి సంబంధించిన లాగ్‌బుక్‌లు, పంపుల రిపేర్లు, నిర్వహణ పూర్తి వివరాల రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు.

నీటి నాణ్యతపై సరికొత్త యాప్

నీటి శుద్ధి కేంద్రాల్లో జరిగే శుద్ధి ప్రక్రియలో ఎప్పటికప్పుడు నీటి నాణ్యత, క్లోరినేషన్, క్లీనింగ్ తదితర వాటిని ఆటోమేషన్ చేసేందుకు సరికొత్త యాప్ అందుబాటులో తీసుకొస్తున్నట్లు ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. ఆటోమేషన్ వివరాలన్నీ..ఒక యాప్‌లో నమోదు చేసేలా నూతన అప్లికేషన్‌ను రూపొందించాలని ఐటీ అధికారులను ఆయన ఆదేశించారు. నీటిశుద్ధి కేంద్రాల్లో పని చేసే సిబ్బంది హాజరు, వారికి చెల్లించే వేతనాలకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. పంపింగ్‌కు సంబంధించిన మోటార్ల పవర్ బిల్లు తగ్గించుకోవడానికి అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

నీటి శుద్ధి కేంద్రాల్లో నిఘా

నీటిశుద్ధి కేంద్రాల్లో రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. ప్రతి ప్రాంగణంలో సీసీ కెమెరాలను అమర్చి పర్యవేక్షించాలని సూచించారు. గత పదేళ్ల నుంచి గోదావరి ప్రాజెక్టులో వర్షాకాలంలో ఎల్లంపల్లి నుంచి నీరు ఎత్తి పోసే సమయంలో వరద నీరు, టర్బిడిటీకి సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని చెప్పారు. తద్వారా భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు ముందు జాగ్రత్తలు తీసుకోవడానికి సులువు అవుతుందన్నారు. ఈ సమీక్షలో టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ట్రాన్స్‌మిషన్ సర్కిల్ సీజీఎం రవీందర్ రెడ్డి, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

అధికారులకూ ఫేషియల్ రికగ్నిషన్

బల్దియా ప్రధాన కార్యాలయంలో శ్రీకారం

- ఇక పక్కాగా ఉద్యోగులు, సిబ్బంది హాజరు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: మేయర్ తనిఖీలు చేసిన ప్రతిసారీ ఉద్యోగులు, అధికారులు సకాలంలో విధులకు హాజరు కాకపోవడం వెల్లడి కావడంతో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని అధికారులు, రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికీ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్‌కు శుక్రవారం శ్రీకారం చుట్టారు. తొలిరోజు 14 విభాగాల్లో పనిచేస్తున్న వారి ముఖాల్ని సంబంధిత మొబైల్ యాప్‌లో ఐటీ విభాగం సిబ్బంది క్యాప్చర్ చేసి నమోదు చేశారు. అడ్వర్టయిజ్‌మెంట్ అండ్ పబ్లిసిటీ, ఆడిట్/అకౌంట్స్, సీపీఆర్ఓ సెక్షన్, ఎలక్షన్ బ్రాంచ్, ఎస్టేట్ ఆఫీస్, ఫైనాన్స్ అకౌంట్స్ సెక్షన్, జనరల్ టాక్సేషన్, లేబర్ వెల్ఫేర్ సెక్షన్, ల్యాండ్ అక్విజేషన్, లీగల్ సెక్షన్ అండ్ మున్సిపల్ కోర్ట్, సెక్రెటరీ సెక్షన్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ కమిషనర్ ఆఫీస్, వెటర్నరీ, విజిలెన్స్ సెక్షన్ల అధికారులు, సిబ్బంది ముఖాల్ని క్యాప్చర్ చేసి యాప్‌లో నమోదు చేశారు. ఇది ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై పని చేస్తుంది. శని, సోమవారాల్లో మరో 39 విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది ముఖాలు కూడా క్యాప్చర్ చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. వీధుల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచే ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేస్తుండగా, ఆరంభంలో ఎదురైన కొన్ని సమస్యల్ని పరిష్కరించారు. ఈ విధానం వల్ల ఇక అధికారులు, ఉద్యోగులు కూడా కార్యాలయాలకు ఎన్ని గంటలకు వస్తున్నారు..తిరిగి ఎన్ని గంటలకు వెళ్తున్నారు వంటి వివరాలు నమోదవుతాయి. ప్రధాన కార్యాలయంలోని రెండు ప్రవేశ ద్వారాల వద్దా సంబంధిత కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లో



మొబైల్ యాప్‌లో నమోదైన ఉద్యోగుల వివరాలు ఐడీనెంబరుతో సహ నమోదవుతాయి. అంతే కాకుండా వారు వచ్చే..పోయే సమయాలు కూడా నమోదవుతాయి.

ఉద్యోగాల పేరుతో మోసం: కేసు నమోదు

బంజారాహిల్స్: ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసి బురిడీ కొట్టించిన సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకులపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బచ్చు వెంకట శివరామకృష్ణ రెడ్డి అనే వ్యక్తి జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లో ట్రిసన్ టెక్నాలజీస్ అండ్ సర్వీసెస్ పేరుతో గత ఏడాది డిసెంబర్‌లో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొంతమంది నిరుద్యోగుల వద్ద రూ.లక్ష నుంచి 2 లక్షల దాకా డబ్బులు వసూలు చేశారు. అయితే నెలలు గడిచినా సంస్థ కార్యకలాపాలు ప్రారంభించకపోవడంతో పాటు జీతాలు కూడా చెల్లించడం లేదు. దీంతో పాటు తామిచ్చిన డబ్బులు సైతం తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. స్నేహలత అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్వాహకుడు రామకృష్ణారెడ్డి తదితరుల మీద చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు..అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.





ఉరుములు మెరుపులతో భారీ వర్షం

నగరంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఎల్బీ నగర్, బంజారాహిల్స్, హిమాయత్ నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, తార్నాక, కోఠి, సరూర్‌నగర్, జీడిమెట్ల, బాలానగర్, ఉప్పల్, నాంపల్లి, పెద్దఅంబర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. బన్సీలాల్‌పేటలో 7.4 సెం.మీ వర్షపాతం నమోదైంది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. మ్యాన్‌హోళ్లు పొంగాయి. దీంతో రహదారులు చెరువుల్లా తయారయ్యాయి. నీటి ప్రవాహానికి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సుమారు గంటపాటు వర్షం ధాటికి వాహనదారులు ముందుకెళ్లలేక వంతెనలు, మెట్రో స్టేషన్ల కింద నిలిచిపోయారు. పెద్ద వాహనాలు సైతం వరద నీటిలో కష్టంగా ముందుకెళ్లాయి. వరద నీటిని తొలగించేందుకు, వాహనదారులు సాఫీగా వెళ్లేందుకు జీహెచ్‌ఎంసీ, పోలీసు సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. శుక్రవారం ఉదయం నుంచి నగరమంతా వేడి వాతావరణం, ఉక్కపోతగా ఉండగా..సాయంత్రం అకస్మాత్తుగా భారీ వర్షం కురియడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. - సాక్షి, సిటీబ్యూరో



2036లో ఒలింపిక్స్‌కు

ఆతిథ్యమే లక్ష్యం

క్రీడాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

గచ్చిబౌలి: దేశంలోని విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సూచించారు. శుక్రవారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆయన గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంను సందర్శించారు. అనంతరం అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలు, క్రీడా వసతులు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. సాయిసెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భారతదేశం 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని సంకల్పించిందని గుర్తు చేశారు. ఒలింపిక్స్ స్థాయిలో మన క్రీడాకారులను తీర్చిదిద్దే ప్రణాళికతో అన్ని క్రీడా సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. పారా ఒలింపియన్ దీప్తి జీవన్‌జీతోపాటు సాయి హైదరాబాద్ సెంటర్ అథ్లెట్స్ మెడలిస్టులను ఆయన ఈ సందర్భంగా సత్కరించారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుతో కలిసి కొద్దిసేపు ఆయన బ్యాడ్మింటన్ ఆడారు. హాకీ, కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడాకారులతో కొద్దిసేపు సంభాషించారు.

తెలంగాణలో క్రీడల అభివృద్ధికి సహకరించాలి

తెలంగాణ రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కోరారు. ఈ మేరకు ఆయన ఒక వినతిపత్రాన్ని అందించారు. నైపుణ్యాల నేల తెలంగాణకు ఘనమైన క్రీడా చరిత్ర ఉందని, ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ చాంపియన్‌షిప్‌లలో రాణించిన అనేక మంది క్రీడాకారులను తెలంగాణ అందించిందన్నారు. తెలంగాణలో అంతర్జాతీయ ప్రామాణిక స్విమ్మింగ్ పూల్స్, బహుళార్థక ఇండోర్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, షూటింగ్, సైక్లింగ్ విలోడ్రమ్, టెన్నిస్ కాంప్లెక్స్, ఫుట్‌బాల్ మైదానాలు, స్కేటింగ్ ట్రాక్స్, వాటర్ స్పోర్ట్స్ క్రీడా సౌకర్యాలు కలిగిన గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఎల్‌బీ స్టేడియం, కేవీఆర్ ఇండోర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్ ఉన్నాయన్నారు.

భవిష్యత్తులో ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలతోపాటు వివిధ ప్రపంచ చాంపియన్‌షిప్‌లు, ఖేలోఇండియా యూత్ గేమ్స్ నిర్వహించడానికి తెలంగాణకు అవకాశం కల్పించాలని లేఖలో కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, క్రీడలు, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, శాట్స్ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, ఒలింపిక్ అసోషియేషన్ ప్రతినిధి ఎస్.వేణుగోపాల చారి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా సీహెచ్ భాస్కరాచారిలను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి సభ్యులుగా దోమలపల్లి అంజయ్య, మేకం లక్ష్మి, చిన్నరెడ్డి రఘుపతి రెడ్డి, చుంచు నర్సింహా, చిలకూరి రామచంద్రారెడ్డి, మెగావత్ గణేష్, జయపాల్ రెడ్డి, కులపతి నవరాజ్, బండి మధుసుదన్ రావు, బోయపల్లి గోవర్ధన్, మహమ్మద్ అబ్దుల్ ఇబ్రహీం, జి.వెంకటేశ్వర్లుతో పాటు హయత్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ కమిటీ అధికారి, హార్టికల్చర్ ఏడీ, తుర్కయాంజాల్ మున్సిపల్ చైర్మన్‌లు ఉంటారు.

భార్యను కడతేర్చిన భర్తకు జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ శుక్రవారం రంగారెడ్డి జిల్లా 3వ అదనపు కోర్టు న్యాయమూర్తి సి.రత్న పద్మావతి తీర్పునిచ్చారు. కోర్టు ఏపీపీ డి.రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ జిల్లా, కూచూరు గ్రామానికి చెందిన చిటోళ్ల వీరయ్య (50) జయమ్మ దంపతులు బతుకు దెరువు నిమిత్తం నగరానికి వలసవచ్చి మీర్‌పేట్ ఠాణా పరిధిలోని నందనవనంలో స్థిరపడ్డారు. తాగుడికి బానిసైన వీరయ్య నిత్యం భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో అతను 2022, డిసెంబర్ 22న మద్యంమత్తులో భార్యపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన జయమ్మను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం శుక్రవారం పై విధంగా తీర్పు వెలువరించింది. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన మీర్‌పేట్ పోలీసులు యాదగిరి, కవితలను ఉన్నతాధికారులు అభినందించారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ వ్యాప్తంగా పోలీస్ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లను ఆధునీకరించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. కొత్తగా పోలీస్ స్టేషన్ల నిర్మాణం, సిబ్బందికి క్వార్టర్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి అధికారిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు గురునాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అధికారిక భవనాల నిర్మాణ బాధ్యతలను పోలీస్ గృహ నిర్మాణ సంస్థకు దక్కేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తా, ఉన్నతాధికారులు నాగిరెడ్డి, సౌమ్య మిశ్రా, రమేశ్, తులసీధర్, ఆర్‌సీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైన్ లాంగ్వేజ్‌పై 'కేఎఫ్‌సీ' శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్నేషనల్ సైన్ లాంగ్వేజ్ డే సందర్భంగా కేఎఫ్‌సీ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందని కేఎఫ్‌సీ భారత్ జీఎం మోక్ష చోప్రా తెలిపారు. క్షమతా కార్యక్రమంలో భాగంగా 240 నగరాలు, 1200పైబడి శాఖలు, 17 వేల మందికి పైగా సిబ్బందికి వంద శాతం మూగ, సైగ భాషపై శిక్షణ ఇస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విభిన్న ప్రాంతాలు, భాషలు ఉన్నాయి. వాటన్నింటినీ కేఎఫ్‌సీ ఉద్యోగులు నేర్చుకోవడం సాధ్యంకాదు. అదే సైగల ద్వారా సహచర సిబ్బంది ఏం చెబుతున్నారు, వినియోగదారుని ఆర్డర్‌పై అవగాహన వస్తుందని పేర్కొన్నారు. మెజారిటీ కేఎఫ్‌సీ శాఖల్లో మూగ, చెవుడుతో బాధపడుతున్న సిబ్బంది పనిచేస్తున్నారని, సైన్ లాంగ్వేజ్‌ని ఎవరైనా నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. 2026 నాటికి కేఎఫ్‌సీ రెస్టారెంట్లలో సిబ్బందిని రెండింతలు చేయాలన్నదే లక్ష్యమన్నారు. శుక్రవారం ఢిల్లీలో సైన్ లాంగ్వేజ్ యంత్రాన్ని ప్రారంభించారు. త్వరలోనే దేశంలోని అన్ని శాఖల్లో అందుబాటులోకి తెస్తామన్నారు.



ప్రక్షాళనకు వేళాయె..!

- 'లోపభూయిష్టంగా' నగర పోలీసు కమిషనరేట్
- ఎవరికి వారుగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు
- పట్టులేని వారితో పాటు కట్టు తప్పిన వాళ్లు సైతం
- దృష్టి పెట్టిన నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్
- వివిధ మార్గాల్లో సమాచారం సేకరిస్తూ విశ్లేషణలు



సాక్షి, సిటీబ్యూరో: కొందరికి సిటీ పోలీసింగ్‌పై అవసరమైన స్థాయిలో పట్టు లేదు... మరికొందరికి కింది స్థాయి వారికి వేధించడం మినహా మరో పని తెలీదు... ఇంకొందరు కట్టు తప్పి వసూళ్లు ప్రారంభించారు.. ఇలా లోపభూయిష్టంగా మారిన నగర పోలీసు కమిషనరేట్‌పై రెండోసారి కొత్వాల్‌గా వచ్చిన సీవీ ఆనంద్ ప్రత్యేక దృష్టి పెట్టారు. గడిచిన ఎనిమిది నెలల్లో చోటు చేసుకున్న పరిణామాలు, వాటి పర్యవసానాలను బేరీజు వేస్తున్నారు. గణేష్ ఉత్సవాలు, మిలాదున్నబీ ముగియడంతో భారీ స్థాయిలో ప్రక్షాళనకు కొత్వాల్ సిద్ధమవుతున్నారు. ఇందుకు గాను ఆయన వివిధ మార్గాల్లో అవసరమైన సమాచారం సేకరిస్తున్నారు.

ఐపీఎస్‌లలో అనేక రకాలు...

ఇతర యూనిట్లలో మాదిరిగానే నగర కమిషనరేట్‌లో పని చేస్తున్న ఉన్నతాధికారుల్లో ఐపీఎస్‌లు, రాష్ట్ర పోలీసు సర్వీసుకు చెందిన వారు ఉన్నారు. ఇక్కడ పని చేస్తున్న ఐపీఎస్ అధికారుల్లో అనేక రకాలైన వారు ఉన్నారు. కొందరికి సిటీ పోలీసింగ్‌పై ఏ మాత్రం పట్టులేకపోవడంతో తమకు అప్పగించిన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారు. ఈ ప్రభావం సామాన్యుడి దైనందిన జీవితంపై అనునిత్యం ఉంటోంది. మరోపక్క కొందరు అధికారులను కలవడం సామాన్యులతో పాటు సమాచారం అందించే వారికీ దుర్లభంగా మారుతోంది. ఈ కారణంగానే ఇటీవల ఉద్రిక్తతల సమయంలో పోలీసులు అవసరమైన స్థాయిలో స్పందించలేకపోయారనే ఆరోపణ ఉంది. ఇంకో అధికారిని తన కింద పని చేస్తున్న వారు కలవాలన్నా అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన దుస్థితి. మరో అధికారి అయితే కింది స్థాయి వారిపై ఒత్తిడి తెచ్చి, వేధించి 'ముడి సరుకు' తెప్పిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో వివాదాస్పదుడిగా మారిన మరో అధికారి ప్రవర్తనకు సంబంధించిన అసంతృప్తులు కోకొల్లలు.

రాజ్యమేలుతున్న 'రాష్ట్ర అధికారులు'...

నగరంలో పని చేస్తున్న ఉన్నతాధికారుల వైఖరిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్న 'రాష్ట్ర అధికారులు' రెచ్చిపోతున్నారు. ఓ జోన్‌లో పని చేస్తున్న 'లెఫ్టినెంట్' తన పై అధికారిని ఏ మాత్రం పట్టించుకోవట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా సదరు ఉన్నతాధికారిని కలవాలని, విషయం ఉప్పందించాలని ప్రయతిస్తే ఆయనే అడ్డుకుంటున్నారు. తనకు అనువైన, అనుకూలమైన అంశాలను మాత్రమే పైకి పంపిస్తున్నారు. ఓ ఏసీపీ స్థాయి అధికారి సివిల్ వివాదంలో తలదూర్చాడు. స్థలం పొజిషన్ ఇప్పించడానికి రూ.30 లక్షలు దండుకున్నాడు. ఈ వ్యవహారంలో ఆయన కింద, పైన పని చేసే అధికారులనూ తప్పుదోవ పట్టించాడు. మరో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ల 'మర్దన' వ్యవహారం జోరుగా సాగుతోంది. వీరు ఎవరికి వారుగా తమ పరిధిలోని మసాజ్ సెంటర్ల నుంచి భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎవరికి వారు తమకు కప్పం కట్టని పార్లర్స్‌పై దాడులు, కేసులు అంటూ బెదిరిస్తున్నారు. కొన్ని స్పా సెంటర్లలో పని చేసే థెరపిస్టులనూ బెదిరిస్తూ తమ వసూళ్ల టార్గెట్లు పూర్తి చేసుకుంటున్నారు. వీరి వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది.

అన్ని స్థాయిల్లోనూ భారీ మార్పు చేర్పులు...

నగర నిఘా విభాగమైన స్పెషల్ బ్రాంచ్ పని తీరు కొన్నాళ్లుగా గతి తప్పింది. దీనికి జాయింట్ సీపీ లేకపోవడం, ఉన్న డీసీపీ సైతం ఇన్‌చార్జ్ కావడం, ఆయన తన జోన్‌కు సంబంధించిన పనులతోనే తలమునకలు కావడంతో పనితీరు కుంటుపడింది. కేవలం కొన్ని అంశాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ సమాచార సేకరణకు పరిమితమైంది. ఇలాంటి అనేక అంశాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న కొందరు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు భారీ స్థాయిలో వసూళ్లకు తెరలేపారని తెలుస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న కొత్త కొత్వాల్ సీవీ ఆనంద్ నగర పోలీసు విభాగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రతి అధికారికీ సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారు. కేవలం స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్‌లపై ఆధారపడట్లేదు. తనకు ఉన్న విస్తృత పరిచయాలను వినియోగించుకుని వివిధ మార్గాల్లో సంగ్రహిస్తున్నారు. వీటన్నింటినీ ఆధారంగా చేసుకున్న నగర కమిషనరేట్‌లో భారీ ప్రక్షాళనకు కసరత్తు చేస్తున్నారు. ఎస్సై నుంచి అదనపు సీపీ వరకు అన్ని స్థాయిల్లోనూ పెద్ద ఎత్తున మార్పుచేర్పులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

86 కిలోల గంజాయి పట్టివేత

సుభాష్‌నగర్: ఎస్‌ఓటీ రాజేంద్రనగర్, దుండిగల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 86 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు..శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లో డీసీపీ కోటి రెడ్డి వివరాలు వెల్లడించారు. ఒడిశా బరంపూర్ నుంచి ఢిల్లీకి గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, దుండిగల్ పోలీసులు దుండిగల్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద హోండా సిటీ కారును తనిఖీ చేయగా 86 కిలోల గంజాయిని గుర్తించారు. ఒడిశాకు చెందిన సునీందర్‌కుమార్ సింగ్, లక్ష్మి(30)లను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీకి చెందిన అమీత్ అగర్వాల్, బరంపూర్‌కు చెందిన రాజు, శివ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. గతంలోనూ వీరిపై పలు కేసులు ఉన్నాయని, హోండా సిటీ కారుతో పాటు గంజాయి, సెల్‌ఫోన్లను సీజ్‌చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులను పట్టుకోవడంతో కీలకంగా వ్యవహరించిన రాజేందర్ ఎస్‌ఓటీ, దుండిగల్ పోలీసులను డీసీపీ అభినందించారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

మియాపూర్: బైక్ ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు జిల్లాకు చెందిన అలివేలమ్మ(52) మియాపూర్‌లోని ఓల్డ్ మియాపూర్‌లో తమ్ముడి సోదరుడి ఇంట్లో ఉంటూ మదినాగూడలోని శ్రీకర ఆసుపత్రిలో ఆయాగా పని చేస్తుంది. గురువారం రాత్రి ఆమె విధులు ముగించుకుని సోదరి కావమ్మతో కలిసి ఇంటికి వెళ్లేందుకు మదినాగూడలోని మైత్రి కమాన్ ఎదుట జాతీయ రహదారిపై దాటుతుండగా ఆల్విన్ క్రాస్ రోడ్డు నుంచి చందానగర్ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో కిందపడిన అలివేలమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో మరో బైక్ ఆమె ఛాతీపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను శ్రీకర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి సోదరి కావమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సాయి కుమార్ (40) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం 10 గంటల ప్రాంతంలో సాయికుమార్ చాతిలో నొప్పి రావడంతో అతన్ని అమీర్‌పేట్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు ప్రకటించారు. 2010 బ్యాచ్‌కు చెందిన సాయికుమార్‌కు మృదు స్వభావిగా పేరుంది. ఇతనికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సాయికుమార్ మృతి పట్ల బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్, సెక్టార్ ఎస్ఐలు , బోరబండ, రహమత్‌నగర్ కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సీఎన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ నాయకుడు భవాని శంకర్, బోరబండ బీజేపీ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్‌లు సంతాపం వ్యక్తం చేశారు.

వార్డెన్ చితకబాదుతోంది సారూ..

పోలీసులకు హాస్టల్ విద్యార్థినుల ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన విద్యార్థినులు

రాజేంద్రనగర్: హాస్టల్ వార్డెన్ తమను చితకబాదుతోందని, తాము హాస్టల్‌కు వెళ్లమని పలువురు విద్యార్థినిలు ఉపాధ్యాయుల ఎదుట బోరున విలపించారు. దీంతో ఉపాధ్యాయులు షీ టీమ్‌కు ఫిర్యాదు చేయడంతో వారి సూచనమేరకు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తాము హాస్టల్‌కు వెళ్లమని... వార్డెన్ వేధింపులు భరించలేమని పోతున్నామని ఇన్‌స్పెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కిస్మత్‌పూర్‌లో చెర్రీస్ స్వచ్ఛంద సంస్థ హాస్టల్‌ను నీలిమా అనే మహిళ నిర్వహిస్తుంది. సదరు హాస్టల్‌లో సునీతా వార్డెన్‌గా పని చేస్తోంది. బుద్వేల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ఈ హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్నారు. వార్డెన్ సునీతా తరుచూ తమను సూటిపోటీ మాటలతో వేధించడంతో పాటు కొడుతుందని శుక్రవారం ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం స్కూల్ విడిచినా తాము హాస్టల్‌కు వెళ్లమని, ఇక్కడే ఉంటామని చెప్పడంతో ఉపాధ్యాయులు షీ టీమ్‌కు ఫిర్యాదు చేశారు.అక్కడికి చేరుకున్న షీ టీమ్ సభ్యులు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో వారు ఉపాధ్యాయులతో కలిసి సాయంత్రం రాజేంద్రనగర్ పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో వార్డెన్ సునీత, సంస్థ నిర్వాహకులు నీలిమాను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టామని విద్యార్థినులకు భద్రతా కల్పిస్తామని ఇన్‌స్పెక్టర్ హామీ ఇచ్చారు.

70 ఏళ్ల వృద్ధురాలిపై లైంగికదాడి

బండమాదారంలో ఘటన

మేడ్చల్‌రూరల్: మద్యం మత్తులో ఇంట్లో ఉన్న 70 ఏళ్ల వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని బండమాదారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండమాదారం గ్రామంలో ఓ మహిళ(70) ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు ఆమెతో సన్నిహితంగా ఉండేవారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సదరు మహిళ ఇంటికి వెళ్లిన వారు వంట చేసి పెడతామని చెప్పి లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలియడంతో స్థానికులు ఓ వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు బాధితురాలిని వైద్య పరీక్షల కోసం మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అత్యాచారానికి పాల్పడింది ఒక్కరా లేక మరికొందరు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగించి దారుణం..

మద్యం మత్తులో ముగ్గురు వ్యక్తులు వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. బాధితురాలి ఇంటి సమీపంలో ఉండే వారు తరచూ ఆమె ఇంటికి వెళ్లి, ఆమెతో కలిసి మద్యం సేవించేవారని తెలిపారు. ఈ క్రమంలోనే శుక్రవారం కూడా వారు ఆమెకు మద్యం తాగించి దారుణానికి ఒడిగట్టారని వారు ఆరోపిస్తున్నారు. నిందితుల్లో ఒకడిని పట్టుకోగా మిగతా ఇద్దరు పరారైనట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం


శంకరయ్య (ఫైల్)

దుండిగల్: వేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డీపోచంపల్లికి చెందిన శంకరయ్య(63) శుక్రవారం మధ్యాహ్నం గండిమైసమ్మ మీదుగా మేడ్చల్‌కు బైక్‌పై వెళ్తుండగా నిర్మాణ్ ఫంక్షన్ హాల్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శంకరయ్యను బహదూర్‌పల్లిలోని ఎస్వీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


సాయిగణేష్ (ఫైల్)

మూసాపేట: ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా, మామిడాల గ్రామానికి చెందిన నలుగూరి సాయి గణేష్ (24) కూకట్‌పల్లి బాగ్ అమీర్‌లో ఉంటూ ఉప్పల్‌లోని సీసీ కెమెరాల కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. బంధువుల అమ్మాయితో గత రెండేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. సదరు అమ్మాయి ఎవరితో మాట్లాడినా అనుమానం వ్యక్తం చేస్తుండటంతో ఆమె గత ఆరు నెలలుగా అతడికి దూరంగా ఉంటోంది. దీంతో మనస్తాపానికిలోనైన సాయి గణేష్ గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

11 రోజుల్లో 996 మంది చిక్కారు

సాక్షి, సిటీబ్యూరో: ఖైరతాబాద్ బడా గణేషుడి సహా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఉత్సవాల్లో పోకిరీలు రెచ్చిపోయారు. యువతులు, మహిళలు కనిపిస్తే చాలు వారిని తాకుతూ, అభ్యంతరకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు దిగారు. వీరిపై నిఘా ఉంచిన షీ-టీమ్స్ 11 రోజుల్లో 996 మందికి చెక్ చెప్పాయి. రహస్య కెమెరాల ద్వారా వారి నిర్వాకాలను రికార్డు చేసి మరీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. వీరిపై కేసులు నమోదు చేసి ఆధారాలతో సహా న్యాయస్థానాల్లో హాజరుపరిచాయి. కొందరు పోకిరీల చేష్టలు వీడియో, ఫొటోల్లో చిక్కకపోవడంతో వారిపై ఆధారాలు లభించలేదు. ఇలాంటి వారిని అదుపులోకి తీసుకున్న షీ-టీమ్స్ కుటుంబీకులను పిలిపించి, వారి సమక్షంలో కౌన్సెలింగ్ చేసి పంపాయి. షీ-టీమ్స్‌కు చిక్కిన వారిలో యువకులతో పాటు వృద్ధులు సైతం ఉన్నారు.

మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటుకు చొరవ చూపాలి



రాయదుర్గం: దేశంలో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుతం ప్రత్యేక చొరవ తీసుకోవాలని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఆర్బిట్ భవనంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన వాలుక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమీ కండక్టర్ల రంగంలో విప్లవాత్మక మార్పులకు ఐటీ రంగం సిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం ప్రతి రంగంలో సెమీ కండక్టర్ల పాత్ర కీలకమని, వీటి ఉత్పత్తికి, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించేందుకు ముందుంటుందన్నారు. ప్రస్తుతం మనదేశం చైనా, తైవాన్ నుంచి పెద్ద ఎత్తున సెమీ కండక్టర్లను దిగుమతి చేసుకుంటున్నాయని, ఆదేశాలకు ధీటుగా ఉత్పత్తి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఇటీవల నగరంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అంతర్జాతీయ స్థాయి సదస్సులు నిర్వహించినట్లు గుర్తు చేశారు. వాలుకా సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు సునీల్‌జాస్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్టార్టప్ కంపెనీ లను ప్రోత్సహిస్తున్నదని, దీంతో యువతకు మంచి ఉపాధి అవకాశాలు లభ్యమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు, ఉద్యోగులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షా కేంద్రం తనిఖీ

సాక్షి,సిటీబ్యూరో: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం హైదరాబాద్ కోఠి మహిళా యూనివర్సిటీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష కేంద్రం లోనికి వెళ్లే ముందు ఆయన తన సెల్ ఫోన్‌ను సెక్యూరిటీ పోలీసులకు అందజేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని తాగునీరు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపాలని, సెల్‌ఫోన్‌ను అనుమతించ వద్దని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

'శబ్ద కాలుష్యంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?'

సాక్షి, హైదరాబాద్: పబ్‌లలో విపరీత శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్నారంటూ వస్తున్న ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి రాయదుర్గంలోని రెడ్ రైనో పబ్, పోస్ట్ కార్డ్ రెస్టారెంట్, గ్లోబల్ తపస్ బార్‌లు విపరీతంగా శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్నాయని, చుట్టూ ఉన్న వారి ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నాయని హైకోర్టులో బర్కత్‌పురాకు చెందిన ఆనంద్ పిటిషన్ దాఖలు చేశారు. పబ్‌లకు జారీ చేసిన అనుమతులను పూర్తిగా ఉల్లంఘించినందున, విచారణ జరిపి లైసెన్సు, అనుమతులు రద్దు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం.. అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


శిబిరంలో చింతల రామచంద్రారెడ్డి

ఫిలింనగర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలందరికీ ఉచితంగా కరోనా వ్యాక్సిన్ ఇచ్చిన ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. మోదీ వల్లే దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉందన్నారు. ఆయన పుట్టిన రోజు నుంచి 20 రోజులపాటు సేవా కార్యక్రమాలు నడుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, బీజేవైఎం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్ ప్రయాణాలు ఎంతో ప్రమాదకరం

- వెస్ట్‌జోన్ పరిధిలో 202 వాహనాలు సీజ్
- కౌన్సెలింగ్ ఇచ్చిన ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా


రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు చేయడం వల్ల వారి ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదకరమని ఏసీపీ కట్టా హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు చేస్తున్న వారిపై బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝళిపించారు. ఉదయం ఒకే సమయంలో ఈ నాలుగు పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్‌రూట్‌లో వస్తూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిని పట్టుకోవడమే కాకుండా వారి వాహనాలను తాత్కాలిక సీజ్ చేసి ఆయా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు తరలించినట్లు ఏసీపీ హరిప్రసాద్ తెలిపారు. అంతేకాకుండా రాంగ్‌రూట్‌లో వస్తూ పట్టుబడ్డ ప్రాంతం నుంచి సీజ్ చేసిన వాహనాలను ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించడానికి సదరు వాహనదారుల నుంచి క్రేన్ చార్జీలను వసూలు చేశారు. రాంగ్‌రూట్‌లో వచ్చి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి, హెల్మెట్ పెట్టుకోకుండా, నెంబర్ ప్లేట్ సరిగ్గా లేకుండా, ఆర్సీ బుక్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా గుర్తించిన వారిని కూడా ఆయా ఉల్లంఘనుల కింద జరిమానాలు విధించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో రెండు గంటల పాటు జరిపిన స్పెషల్ డ్రైవ్‌లో 202 మంది వాహనదారులు పట్టుబడగా వారికి ఏసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు. మీరు రాంగ్‌రూట్‌లో రావడం వల్ల మీతో పాటు ఎదుటి వారి ప్రాణాలకు కూడా ప్రమాదమని హెచ్చరించారు.

ఎంజీఎం టీచర్‌కు ఇన్‌స్పైరింగ్ అవార్డు


అవార్డు పొందిన ఎంజీఎం టీచర్ రాజ్యలక్ష్మి

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ మారుతీనగర్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉప్పాడ రాజ్యలక్ష్మికి ఇన్‌స్పైరింగ్ టీచర్ అవార్డు లభించింది. హైదరాబాద్ సహోదర స్కూల్స్ కాంప్లెక్స్ (అంబర్‌పేట) ఆధ్వర్యంలో సెలబ్రిటీ టీచర్స్–2024 పేరుతో శుక్రవారం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంజీఎం స్కూల్‌లో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మికి ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ మేరకు స్కూల్‌లో ఆమెకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనను ప్రోత్సహిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్ ఎంఎం నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్కూల్ టీచర్లు ఆమెను అభినందించారు.

జలవిహార్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

ఖైరతాబాద్: హుస్సేన్ సాగర్‌ను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలను చేపట్టిన జలవిహార్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులోని జలవిహార్ ఆవరణంలో అక్రమ కట్టడాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ జలవిహార్ నిర్వాహకులు మాత్రం నిబంధనలు అతిక్రమించి యథేచ్ఛగా శాశ్వత నిర్మాణాలు చేపట్టారని, ఆ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని హైడ్రాను కోరారు. నిర్వాహకులు ఆక్రమణలతో పాటు కోట్ల రూపాయల టాక్స్ కూడా ప్రభుత్వానికి ఎగ్గొట్టారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్న జలవిహార్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జలవిహార్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వారధిగా పనిచేస్తా

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం


కోదండరాంను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ఖైరతాబాద్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసేందుకు వారధిగా పని చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం మింట్ కాంపౌండ్‌లోని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కోదండరాం ఆత్మీయ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాంను ఘనంగా సన్మానించారు. అనంతరం యూనియన్ తరఫున సమస్యలతో కూడిన మెమోరాండంను అందజేశారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ 75 సంవత్సరాలు చరిత్ర ఉన్న 1104 యూనియన్ సన్మాన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగులకు ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఖచ్చితంగా వారధిగా ఉంటానని, సమస్యలను పరిష్కరించేలా కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సుధీర్, అడిషనల్ సెక్రటరీ ఎ.వరప్రసాద్, గౌరవ సలహాదారులు అర్.జనార్దన్‌రెడ్డి, టీఎస్‌పీడీసీఎల్ అధ్యక్షులు ఎ.వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్వారీ స్థలంలో వడ్డెరలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

తెలంగాణ రాష్ట్ర వడ్డెర ఐక్య వేదిక సంఘం


సమావేశంలో మాట్లాడుతున్న వేముల యాదయ్య

రహమత్‌నగర్: క్వారీ స్థలంలో వడ్డెర కులస్తులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర ఐక్యవేదిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో శుక్రవారం ఆ సంఘం నాయకుడు వేముల యాదయ్య మాట్లాడుతూ దివంగత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు యూసుఫ్‌గూడ ఎస్పీఆర్‌హిల్స్ పరిధిలోని 126,127 సర్వే నెంబరులోని తొమ్మిది ఎకరాలు 16 గుంటల క్వారీ స్థలాన్ని వడ్డెర కులస్తులకు కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. ఆ తరువాత దివంగత మహానేత పీజేఆర్ అప్పట్లో వడ్డెర కులస్తులకు ఇదే క్వారీలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు సైతం పంపించడం జరిగిందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఎన్నికైన మాగంటి గోపీనాథ్ తమకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తానని ఇందుకు సంబంధించిన పత్రాలు సైతం తమ వద్ద నుంచి తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. తమ కులస్తులకు ఇళ్ల స్థలాలతో పాటు జీహెచ్ఎంసీలో ఉగ్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడని యాదయ్య ఆరోపించారు. ఎన్నో ఏండ్లుగా క్వారీ స్థలాన్నే నమ్ముకున్న తమ కులస్తులకు ఇళ్లను కేటాయించకుండా తన అనుచరులతో క్వారీ స్థలంలో కేసీఆర్‌నగర్ పేరుతో బస్తీని ఏర్పాటు చేయించడాన్ని తాము తీవ్ర వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఇదే విషయమై తాము ఐదు నెలల క్రితం లోకాయుక్త న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే చేసిన మోసంతో తామంత నష్టపోయామని యాదయ్య మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో వివాదాలకు కేరాఫ్ ఈఎండీ..!

- తరుచుగా పేషెంట్ అటెండర్లు, వైద్యుల మధ్య ఘర్షణలు
- ఎమర్జెన్సీలో అడ్మిషన్ల కన్నా వెనక్కి పంపించే కేసులే అధికం
- రోగి సహాయకులపై సెక్యూరిటీ సిబ్బంది జులుం
- ప్రక్షాళన చేసి సకాలంలో సేవలు అందించాలని సహాయకుల విజ్ఞప్తి



లక్డీకాపూల్: నిమ్స్ అత్యవసర వైద్య విభాగం (ఈఎండీ) వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. ఆస్పత్రికి అత్యవసర వైద్య సేవల కోసం వచ్చే రోగుల పట్ల ఈఎండీ సిబ్బంది అనుసరిస్తున్న వైఖరే ఇందుకు కారణం. నిన్న మొన్నటి వరకు ఈఎండీలో అడ్మిషన్ అంటే పైరవీ తప్పనిసరి. అయితే ఇటీవల కాలంలో యాజమాన్యం మారిన నేపథ్యంలో కొంత మేరకు పడకల కొరత తీరింది. కానీ గత కొద్ది రోజులుగా ఈఎండీ విభాగంలో నిత్యం ఘర్షణ వాతావరణం నెలకొంటుంది. ముఖ్యంగా అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులను తిప్పిపంపించడంతో ఆయా రోగుల సహాయకులు వైద్య సిబ్బందితోపాటు చివరకు వైద్యులపైన కూడా దాడులకు పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గురువారం తెల్లవారుజామున 3.15 గంటల ప్రాంతంలో ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి వైద్యం అందించే విషయంలో రోగి సహాయకులకు, డ్యూటీ డాక్టర్ల మధ్య మాటమాటా పెరడగంతోపాటు ఘర్షణ వాతావరణంగా మారి పరస్పరం కేసులు పెట్టుకునే వరకు వెళ్లింది. ఈ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలోనే మరో రోగి సహాయకురాలిపై ఈఎండీ సెక్యూరిటీ సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడడం గమనార్హం. లోపల తమ తండ్రి చికిత్స పొందుతున్నాడని, డాక్టర్ సహాయకులను పిలుస్తున్నారు లోపలికి వెళ్లాలంటూ వచ్చిన ఆ రోగి సహాయకులపై అక్కడి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు దురుసుగా ప్రవర్తించాడు. ఇదే ధోరణిలో అక్కడి ప్రవేశమార్గంలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులు నిత్యం రోగుల సహాయకుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. వాస్తవానికి యాజమాన్యం పాస్ లేనిదే లోపలికి అనుమతించొద్దని గార్డులకు ఆదేశాలు ఇచ్చింది. అదీ కూడా నకిలీ పాస్‌లను నియంత్రించే అంశంలో సెక్యూరిటీ గార్డులకు స్పష్టమైన సూచనలు చేసింది. ఈ క్రమంలో ఎంట్రన్స్ పాస్‌ల విషయంలో రూ.500 జరిమానా విధింపు విధానాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. కాలం చెల్లిన, నకిలీ పాస్‌లు, డబుల్ పాస్‌లు, పాస్ పోగొట్టుకున్న ఈ జరిమానా వర్తింపచేస్తున్నారు. అయితే రోగులు, వారి సహాయకుల విషయంలో సెక్యూరిటీ గార్డులు కొంతమంది దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఫిర్యాదులు అధికారులకు వస్తూనే ఉన్నాయి. మరికొంత మంది ఈఎండీ సిబ్బంది నిమ్స్‌కు వచ్చిన రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారని పలు సందర్భాల్లో తేలింది. ఇదిలా ఉండగా ఈఎండీకి వచ్చిన రోగులను కొంతమంది డ్యూటీ డాక్టర్లు తమకు ఇష్టమైతే చేర్పించుకుంటున్నారు లేదంటే తిప్పి పంపించేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా అత్యవసర వైద్య సేవలకు వచ్చే రోగులు ఆస్పత్రి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రుల సిఫార్సులు ఉంటేనే చేర్చుకుంటున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దుస్థితి నుంచి నిమ్స్ అత్యవసర వైద్య విభాగాన్ని ప్రక్షాళన చేసి రోగులకు సకాలంలో వైద్యం అందించే దిశగా యజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని పలువురు రోగి సహాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

23న ఉచిత ఫొటోగ్రఫీ వర్క్‌షాపు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సాలార్‌జంగ్ మ్యూజియం, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన సైఫాబాద్‌లోని రవీంద్రభారతిలో 'ఫొటోగ్రఫీ'పై ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మెరుగు చంద్రశేఖర్ తెలిపారు. ఫొటోగ్రఫీ అభిరుచి గలవారు, వృత్తిగా స్వీకరించే వారికి ప్రాథమిక ఫొటోగ్రఫీతో పాటు పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలను, కంపోజిషన్, లైటింగ్, ఫ్రేమింగ్‌లలో అనుభవం కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సెల్: 8008021075లో సంప్రదించవచ్చునని తెలిపారు.

ద్వారకానాథ్‌కు ఘన సత్కారం


ద్వారకానాథ్‌ను సత్కరిస్తున్న శ్రీనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

వెంకటేశ్వరకాలనీ: అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా బాధ్యతలు చేపట్టిన శ్రీనగర్‌కాలనీకి చెందిన ఎస్.ద్వారకానాథ్‌ను శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించింది. ద్వారకానాథ్‌కు ఈ పదవిని ఇటీవలే ప్రకటించగా ఆయన బాధ్యతలు కూడా తీసుకున్నారు. ఈ పదవి పొందిన తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన ఆయనను అసోసియేషన్ బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించింది. శ్రీనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారునిగా కూడా అయన ఉన్నారు. సన్మానించిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ సాయిప్రసాద్, కమిటీ మెంబర్లు శంకర్‌రెడ్డి, విజయారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న హ్యాండ్లూమ్ ఎక్స్‌పో



హ్యాండ్లూమ్ ఎక్స్‌పో కార్యక్రమంలో డైరెక్టర్ సంజనారెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో శుక్రవారం దస్తకారి ఆర్ట్స్ వారి క్రాఫ్ట్స్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభమైంది. ఈ ఎక్స్‌పోను టాలీవుడ్ మూవీ డైరెక్టర్ సంజనారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, డిజైనర్లు, చేనేత ఔత్సాహికులతో ఈ ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సోమనాథ్ బౌమిక్ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి 50కి పైగా మాస్టర్ వీవర్ల నుంచి చేతితో నేసిన వస్త్రాలు, సంప్రదాయ క్రాఫ్ట్‌ల అసాధారణ ప్రదర్శనతో సందర్శకులను అబ్బురపరిచేలా ఏర్పాటు చేయబడినట్లు వారు తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని వారు వెల్లడించారు.

సమగ్ర కులగణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలి

పంజగుట్ట: దళితుల్లో సమగ్ర కుల గణన చేసిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భైరి వెంకటేశం అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం వేసిన ఉపసంఘం కో–చైర్మన్, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీరగొండ బుచ్చన్న, టి.ఎస్.స్వామిలతో కలిసి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయినా దళిత ఉపకులాలకు ఇప్పటి వరకు అందాల్సిన ఫలాలు అందలేవని కేవలం మాల, మాదిగలే అనుభవించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణలో ఉప కులాలైన 57 కులాలను ఏ గ్రూపులో పెట్టి 7శాతం రిజర్వేషన్లు కేటాయిచాలని, అందుకు విధివిధానాలు రూపొందించేందుకు సిట్టింగ్ జడ్జితో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చెయ్యాలని సూచించారు. తమ కులాల తక్షణ అభివృద్ధికై ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, కర్నె రామారావు, కురువ బాలరాజు, సంపత్, యాదగిరి, మహేష్, రాంచంద్రయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌కాలనీలో పెట్రోలింగ్‌ను పెంచాలి


ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మధురానగర్ నేతలు

వెంగళరావునగర్: మధురానగర్ కాలనీలో పెట్రోలింగ్‌ను పెంచాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను కోరారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ నేతలు శుక్రవారం మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలబొకేను అందజేసి సత్కరించారు. అనంతరం కాలనీలోని పలు సమస్యలను ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా ఎలాంటి సమస్య వచ్చినా తక్షణమే స్పందిస్తున్న సెక్టార్ ఎస్ఐ సాయినాథ్‌రెడ్డిని అసోసియేషన్ నేతలు సన్మానించారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, కోశాధికారి సుగుణమ్మ, ఇతర కమిటీ నేతలు ఉన్నారు.

పార్కు స్థలాల కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని వెంకటేశ్వర కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో పార్కులకు కేటాయించిన ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, దీనిపై దర్యాప్తు చేపట్టాలంటూ బాల్‌నర్సింగ్ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆక్రమణదారులు తమ స్థలాలను జీఓ 59 కింద క్రమబద్ధీకరించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. లేఅవుట్‌లో ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న వారిపై చర్యలు తీసుకుని వాటిని కూల్చివేయాలన్నారు. రోడ్లు, పార్కు లు, ఓపెన్ స్థలాలు ఈ కాలనీ లేఅవుట్‌లో చాలా వరకు కబ్జాకు గురయ్యాయన్నారు. ఎక్కడెక్కడ కబ్జాకు గురయ్యాయో తెలుసుకుని వాటిని కూల్చివేయాలని కోరా రు. హెచ్ఎండీఏ స్థలాలు కూడా పెద్ద ఎత్తున ఆక్రమణకు గురయ్యాయని, వాటిని కూడా గుర్తించి ప్రజావసరాలకు వినియోగించాలని కోరారు. సర్వేనెంబర్ 102/ 1లో ఎమ్మెల్యే కాలనీ లే అవుట్ ఉందని, దానికి సంబంధించిన వివరాలను కూడా ఆయన అందజేశారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేం

పంజగుట్ట: బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన (నేడు) ట్యాంక్‌బండ్ జలదృశ్యంలో మూడు తరాల ఉద్యమ యోధుడు ఆచార్య కొండ లక్ష్మణ్‌బాపూజీ 12వ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ తొలి, మలి దశ మూడు తరాల ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. తెలంగాణ కోసం ఆయన మంత్రి పదవినే తృణప్రాయంగా వదిలేశారని, ఆయన సేవలు ఎన్నటికీ మరువలేమన్నారు. ఆయన వర్ధంతి పురస్కరించుకుని ఉద్యమ కారులందర్నీ గౌరవించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావులతో పాటు అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు, ఉద్యమకారులు పాల్గొంటారని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన


సభ్యత్వ నమోదులో చింతల రామచంద్రారెడ్డి

కాచిగూడ: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి, దంత పరీక్షలు చేయించుకోవాలి


పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

శ్రీనగర్‌కాలనీ: కంటి, దంత పరీక్షలు ప్రతి ఒక్కరూ తప్పక చేయించుకోవాలని డాక్టర్లు సూచించారు. శుక్రవారం రాజీవ్‌నగర్‌కాలనీలోని బడ్స్ అండ్ బ్లూమ్స్ ప్రైమరీ స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో కంటి, దంత పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు పరీక్షలు నిర్వహించి డాక్టర్లు తగు మందులను అందించి పలు సలహాలు, సూచనలు చేశారు. పిల్లలు, పెద్దలు తరచుగా పరీక్షలు చేసుకోవాలని, సమస్యలను ముందుగా గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు డాక్టర్ విజేందర్, రాజు, డెంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున, స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి సత్కారం


మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న విజయారెడ్డి తదితరులు

బంజారాహిల్స్: టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, బంజారాహిల్స్ కాంగ్రెస్ నేత ధన్‌రాజ్ రాథోడ్‌తోపాటు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ఘనంగా సత్కరించారు. శుక్రవారం విజయారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు గాంధీభవన్‌కు తరలివెళ్లి మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరించడమే కాకుండా ఆయనతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. కాంగ్రెస్ శ్రేణులన్నీ ఐకమత్యంగా ఉండి ప్రజా ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా నిలబడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నూతన రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం


జీహెచ్ఎంసీ ఈఈతో భేటీ అయిన వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లో చేపట్టనున్న నూతన రోడ్ల నిర్మాణంపై కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్‌తో శుక్రవారం భేటీ అయ్యారు. రోడ్ల నిర్మాణం, వాటి అంచనా వ్యయం ఇతర అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఇంద్రానగర్‌లోని స్ట్రీట్ నెంబర్ 2, 3లతో పాటు ఫిలింనగర్‌లోని వినాయకనగర్, పటేల్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, గ్యానీ జైల్‌సింగ్‌నగర్, మాగంటి కాలనీ, రోడ్డునెంబర్–9, అంబేడ్కర్ నగర్, బాలిరెడ్డినగర్ బస్తీల్లో నిర్మించాల్సిన రోడ్లకు సంబంధించి అంచనా కాపీలను సిద్ధం చేశారు. ఈ నూతన రోడ్ల నిర్మాణంతోపాటు పెండింగ్‌లోని రోడ్ల నిర్మాణం గురించి త్వరలో కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తెలిపారు.

సీఎం సహాయనిధికి రూ.5లక్షల విరాళం

కాచిగూడ: ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వరదల్లో నష్టపోయిన ప్రజలకు సహాయం చేద్దామనే సదుద్దేశంతో తమవంతు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రూ.5లక్షల విరాళం అందజేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సంఘం ప్రతినిధులు ఆయనకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీపీఏ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు, కార్యదర్శి పి.గోపాల్, కోశాధికారి కె.హుస్సేన్ వల్లి, ఎం.దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెలెక్ట్ మొబైల్స్‌లో ఐఫోన్ 16 సిరీస్ లాంచ్



సాక్షి, సిటీబ్యూరో: ఐ ఫోన్ 16 సిరీస్ కొనుగోలు చేసిన వారికి తక్షణ క్యాష్ బ్యాక్ ఆఫర్‌గా రూ.5 వేలు, అప్‌డేట్ బోనస్‌గా రూ.6 వేలు పొందవచ్చని సెలెక్ట్ మొబైల్స్ సీఎండీ వై.గురు తెలిపారు. ఐ ఫోన్ 16ను శుక్రవారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ ఫోన్ 16కు సంబంధించిన అన్ని వేరియంట్లు సెలెక్ట్ షో రూంలలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎక్స్ఛేంజీలో అద్భుతమైన ఆఫర్లు ఉన్నాయన్నారు.

ముగిసిన డ్యూక్స్ ఎలైట్ క్రికెట్ టోర్నమెంట్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అత్తాపూర్ విజయ్ ఆనంద్ గ్రౌండ్ వేదికగా నిర్వహించిన డ్యూక్స్ ఎలైట్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో భాగంగా రవి ఫుడ్స్ ఆధ్వర్యంలోని యూనిట్ 1, యూనిట్ 2 మధ్య మొదటి మ్యాచ్‌లో యూనిట్ 1 విజయం సాధించింది. 2వ మ్యాచ్‌లో యూనిట్ 2, యూనిట్ 3పై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్స్‌లో యూనిట్ 1 జట్టు యూనిట్ 2పై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. సంస్థ ఎండీ రవీందర్ అగర్వాల్ విజేత జట్టుకు ట్రోఫీ, ప్రతి క్రీడాకారుడికి ప్రశంసా పత్రాలను అందించారు.

25న ఖురాన్ కంఠస్థ పోటీలు




సాక్షి, సిటీబ్యూరో: జాతీయ స్థాయి ఖురాన్ కంఠస్థ ఫైనల్ పోటీలు ఈనెల 25న నిర్వహిస్తున్నామని, అదే రోజు సాయంత్రం గుడిమల్కాపూర్‌లోని కింగ్ ప్యాలెస్‌లో విజేతలకు బహుమతులను అందజేస్తామని, మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.50 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.25 వేల నగదు ఇస్తామని, అంతేగాకుండా ఈ ముగ్గురు విజేతలతో ఉచితంగా ఉమ్రా యాత్ర చేయిస్తామన్నారు. ఈ పోటీలను ఖో ఎంటర్‌ప్రైజెస్ నిర్వహిస్తోందని ఆ సంస్థ చైర్మన్ ఖారీ అబ్దుర్రహ్మాన్ తెలిపారు. మీడియా ప్లస్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన పై వివరాలను వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి దేశ నలుమూలల నుంచి హాఫిజె ఖురాన్‌లో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఫైనల్ పోటీలకు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రహ్మానీ అధ్యక్షత వహిస్తారన్నారు. హైదరాబాద్ ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. హఫీజ్ వకార్ యూనస్ అలీఖాన్, ముఫ్తీ ముహమ్మద్ ముబీన్ ఖాస్మీ, హఫీజ్, ఖారీ ముహమ్మద్ అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

నేడే తెలుగు ఇండియన్ ఐడల్ గ్రాండ్ ఫినాలే



సాక్షి, సిటీబ్యూరో: సంగీత స్వరాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన ఆహా తెలుగు ఇండియన్ ఐడల్ 3 గ్రాండ్ ఫినాలే శనివారం జరగనుంది. ఈ సీజన్ ఫైనలిస్టులు కీర్తన, నసీరుద్దీన్, అనిరుధ్ సుస్వరం, స్కంద, శ్రీకీర్తిలో ఎవరు తెలుగు ఇండియన్ ఐడల్ టైటిల్ సాధిస్తారనేది నేడు తెలియనుంది. న్యూజెర్సీ మొదలు హైదరాబాద్ వరకు నిర్వహించిన ఆడిషన్‌లలో దాదాపు 5 వేల మంది యువ సింగర్లు పాల్గొన్నారని ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ తెలిపారు. ఇందులోంచి టాప్ 12 ఫైనలిస్టులను ఎంపిక చేశామని సింగర్ గీతా మాధురి పేర్కొన్నారు. 28 ఎపిసోడ్‌లలో కఠినమైన ఎలిమినేషన్ల తరువాత ఈ గ్రాండ్ ఫినాలే జరుగుతోంది.

ప్రజావాణిలో అర్జీల వెల్లువ



లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలతో పాటు ఆరు గ్యారంటీల అమలు కోరుతూ లబ్ధిదారులు అర్జీలు పెట్టుకుంటున్నారు. ఉద్యోగ సమస్యలపై కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వర్తిస్తున్న వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 401 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 116, విద్యుత్ శాఖ సింగరేణికి 51, ఎస్సీ సంక్షేమం 46, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 45, హోంశాఖ 28 ఇతర శాఖలకు సంబంధించి 115 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే సమస్యలపై అధికారులతో ఫోన్‌లో చర్చించి పరిష్కారానికి ఆదేశించడం గమనార్హం.

ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రెండు రోజుల పాటు జరిగిన తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలు ముగిశాయి. శుక్రవారం జరిగిన వివిధ ఈవెంట్లలో 200 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. 14, 16, 18, 20 సంవత్సరాల క్రీడాకారుల అథ్లెటిక్స్ పోటీల నుంచి 100 మంది నేషనల్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌డీఏఏ అధ్యక్షులు ప్రొ రాజేష్‌కుమార్ తెలిపారు. వచ్చే నెల 17, 18 తేదీల్లో గుంటూరులో నేషనల్స్ పోటీలు జరగనున్నట్లు ఆయన చెప్పారు.

అక్షరాలు దిద్దే చోటుకి

భిక్షాటన చేసే చిన్నారులు అక్షరాలు దిద్దుతున్నారు. దీనంగా సాయం కోసం చాపే చిట్టిచేతులు పలక, బలపం, పెన్సిల్ పట్టి చదువు నేర్చుకుంటున్నారు. బ్రిడ్జి కోర్సు నుంచి ఓపెన్ టెన్త్, డిగ్రీ వరకూ పరీక్షలకు హాజరవుతున్నారు. రోడ్డు పక్కనే చిన్న గుడారంలో ఐదారుగురితో ఆరంభమైన అక్షర శిబిరం క్రమంగా నాలుగు కేంద్రాలుగా విస్తరించింది. ప్రస్తుతం హైదరాబాద్ మహానగరంలో 'చోటుకి ఎడ్యుకేషన్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రెండు వందలకు పైగా చిన్నారులు చదువు కొనసాగిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

భిక్షాటన చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తూ..



- 200 మందికి 'చోటుకి ఎడ్యుకేషన్'లో పాఠాలు
- బ్రిడ్జి కోర్సు నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షల వరకు..
- మహానగరంలో నాలుగు కేంద్రాలు
- ఆదర్శంగా నిలుస్తున్న ఇద్దరు ఫార్మాస్యూటికల్ ఉద్యోగులు

ఒకరు చెన్నై, మరొకరు గుంటూరు. యువనేశ్వరి, మాధవి అనే యువతులు ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వచ్చి ఫార్మాస్యూటికల్ కంపెనీలో ఒకరు సైంటిస్ట్‌గా, మరొకరు ప్రాజెక్టు మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకే కంపెనీ కావడంతో ఇద్దరు మధ్య పరిచయం పెరిగింది. సరిగ్గా ఎనిమిదిన్నరేళ్ల క్రితం 2016 మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా ఇద్దరూ కలిసి సరదాగా కేపీహెచ్‌బీ కాలనీ వైపు వెళ్లారు. అక్కడ ఒక షాపింగ్ కాంప్లెక్స్ వద్ద బడీడు చిన్నారులు నలుగురు భిక్షాటన చేస్తూ కనిపించడం వారిని కలిచివేసింది. వీరికి తమవంతు ఆర్థిక చేయూత అందిద్దామని అనుకున్నారు. వారి జీవితాల్లో వెలుగు నింపితే ఎలా ఉంటుందని భావించి కొద్ది సేపు పిచ్చపాటిగా చర్చించారు. చిన్నారుల్లో చదువుతోనే మార్పు సాధ్యమని భావించారు.

అనుకున్నదే తడవుగా..

ఆ చిన్నారులతో ముచ్చటించిన తర్వాత అనుకున్నదే తడవుగా.. 'సే నో టు బెగ్గింగ్ – ఎస్ టు ఎడ్యుకేషన్' ట్యాగ్‌లైన్‌తో రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. మదిలో మెదిలిందే తరువాయి ఒక రోజు వెసులుబాటు చేసుకొని నగరంలోని వాణిజ్య కేంద్రాల ప్రాంతాలు, మురికి వాడలను తిరిగి భిక్షాటన చేసేవారిని, వీధి బాలలను గుర్తించారు.

అంత సులువేం కాదు..

మురికివాడల్లోని బడీడు పిల్లల తల్లిదండ్రులను కలిసి చదువు కోసమని ఒప్పించడం అంత సులువేం కాలేదు. ఒకటికి రెండుసార్లు వారిని కలిస్తే కానీ, సాధ్యపడలేదు. ఉచితవైద్య శిబిరాలు, ఆహార పంపిణీ, తదితర కార్యక్రమాలతో పిల్లల తల్లిదండ్రులను ఆకర్షిస్తూ వారిలో చేతన్యం కలిగించారు. దీంతో సంస్థ ప్రయత్నాలు ఫలించాయి. రోడ్డు పక్కనే చిన్న గుడారం వేసి రోజుకు రెండు గంటలు నలుగురు చిన్నారులతో శిబిరాన్ని ప్రారంభించారు.

చోటుకి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ పేరుతో అక్షర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. క్రమంగా కేంద్రాలను విస్తరించారు. నగరంలోని మియాపూర్, జీడిమెట్ల, బొల్లారం తదితర ప్రాంతాలకు కార్యక్రమాలను విస్తరించి అక్కడ 'చోటుకి ఎడ్యుకేషన్' పేరుతో కేంద్రాలు ఏర్పాటు చేశారు. సేవా దృక్పథంతో పనిచేసే తమ కొలీగ్స్, మిత్రుల సహకారంతో భిక్షాటన చేసే వారిని, మురికివాడల్లో నివసించే బడీడు పిల్లలను గుర్తించి అందులో చేర్పించడం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నారు.

అక్షర కేంద్రాల విస్తరణ



చదువుతోపాటు చిరుతిండి ఇవ్వడం, నీతి కథలు చెప్పడంతో వారిలో ఆసక్తి పెరిగింది. చిన్నారులు సైతం క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. చిన్నారుల వయసును బట్టి సిలబస్ సిద్ధం చేస్తూ విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఆ తర్వాత సామర్థ్యాలను బట్టి సర్కారు బడుల్లో చేర్పించడం, ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, డిగ్రీ పరీక్షలకు హాజరుపర్చడం లాంటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీంతో తల్లిదండ్రుల్లో సైతం తమ పిల్లల భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి.

నగరంలో నేడు

- వరల్డ్ అల్జీమర్స్ డే వేడుకలు ఉదయం 10 గంటలకు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో జరుగుతాయి.
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఉదయం 11 గంటలకు రవీంద్రభారతిలో ఉంటుంది.
- తెలంగాణ స్టేట్ క్రిస్టియన్స్, కన్వర్ట్ క్రిస్టియన్స్ యూనైటెడ్ స్ట్రగుల్ కమిటీ ఉదయం 11.30 గంటలకు హైదర్‌గూడలోని న్యూస్ సెంటర్‌లో సమావేశం అవుతుంది.
- ఏబీఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో కోఠిలోని ఉస్మానియా యూనివర్సిటీలో ఉదయం 10 గంటలకు మహిళా సదస్సు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

పార్ట్‌టైం లెక్చరర్లకు వేతనాలు చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకు నెలకు రూ.50 వేల చొప్పున 12 నెలలపాటు వేతనాలు చెల్లించాలని టీజీఏయూపీటీఏ నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు వేతనాలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రవీందర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్, శ్రీలక్ష్మీరెడ్డి, భిక్షపతి, ప్రధాన కార్యదర్శి ఎర్రం నాగేంద్రం, శేఖర్, వేణుగోపాల్ ఉన్నారు.

మెరుగైన విద్యను అందించడమే క్యాథలిక్ విద్యా సంస్థల లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్డినల్ ఆర్చ్ డయాసిస్ బిషప్ పూల ఆంథోనీ

రాంగోపాల్‌పేట్: భవిష్యత్ తరాలకు అత్యుత్తమ, నాణ్యమైన, మెరుగైన విద్య అందించడమే క్యాథలిక్ చర్చిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా సంస్థల లక్ష్యమని కార్డినల్, హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ బిషప్ రెవరెండ్ పూల ఆంథోని అన్నారు. విద్యా సంస్థలు విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంపై రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్‌లో టీసీబీసీ కమిషన్ ఫర్ ఎడ్యుకేషన్, క్యాథలిక్ స్కూల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం, సాంకేతికపరంగా వినూత్న పద్ధతుల ద్వారా క్యాథలిక్ సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయని ఆయన అన్నారు. విద్య విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నాయని చెప్పారు. టీసీబీసీ కమిషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీకే స్వామి, బ్రదర్ షాజహాన్ ఆంటోని మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు అందరి, సూచనలు సలహాలు స్వీకరించేందుకు విద్యావేత్తలు, పరిశోధకులతో సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫాదర్ రెవరెండ్ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాయుధ దళాల అవసరాలను తీర్చగలగాలి



డిఫెన్స్ ఆస్పిరెంట్ వింగ్ ఆవిష్కరణలో లెఫ్టినెంట్ జనరల్ వైవీకే మోహన్

- డిఫెన్స్ ఆస్పిరెంట్స్ వింగ్ ఆవిష్కరణలో లెఫ్టినెంట్ జనరల్ మోహన్

పోచారం: రక్షణ రంగంలో చేరాలనుకునే విద్యార్థులు క్రమశిక్షణ, సమయ నిర్వహణ, శారీరక సామర్థ్యం, తాజా సమాచారంతో అప్రమత్తంగా ఉండాలని లెఫ్టినెంట్ జనరల్ వైవీకే మోహన్ అన్నారు. యంనంపేట్‌లో శ్రీనిధి ఎడ్యుకేషన్ గ్రూప్ ఆధ్వర్యంలో డిఫెన్స్ ఆస్పిరెంట్స్ వింగ్ ఆవిష్కరణ శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని వింగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత దేశ సాయుధ దళాల్లో విజయవంతంగా చేరాలనుకునే యువతీ యువకులను తీర్చిదిద్దడానికి శ్రీనిధి క్యాంపస్‌లో డిఫెన్స్ ఆస్పిరెంట్స్ వింగ్(డీఏడబ్ల్యూ) ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్(సీడీఎస్), ఇతర ప్రధాన రక్షణ రంగాల పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి సమగ్ర శిక్షణతో పాటు మార్గదర్శకత్వం వహించేందుకు డిఫెన్స్ వింగ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సాయుధ దళాల అవసరాలను తీర్చగలిగే సామర్థ్యాలను విద్యార్థులు కలిగి ఉండాలన్నారు. విశిష్ట అతిథి లెఫ్టినెంట్ కల్నల్ డా.ఎస్ఎస్ రావు మాట్లాడుతూ.. అభ్యర్థుల మానసిక, శారీరక, నాయకత్వ, కమ్యూనికేషన్ సామర్థ్యాలను సర్వీసెస్ సెలక్షన్ బోర్డు(ఎస్ఎస్‌బీ) ఎలా పరీక్షిస్తుందో వివరించారు. శ్రీనిధి ఎడ్యుకేషనల్ గ్రూప్ సీఈఓ కటికనేని అభిజిత్‌రావు మాట్లాడుతూ.. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడానికి యువ ఇంజినీర్లు రక్షణాధికారులుగా అవతరించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. రక్షణ దళాల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు డిఫెన్స్ వింగ్‌ను శ్రీనిధి గ్రూప్ ఏర్పాటు చేసి ఓ ముఖ్యమైన అడుగు వేసిందన్నారు. కార్యక్రమంలో కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ వాసుదేవరావు యెల్లారపు, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ దివ్య, లెఫ్టినెంట్ ప్రవీణ్, ఎన్‌సీసీ ఆఫీసర్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఎక్సెలెన్సియా బాస్కెట్ బాల్ టోర్నీ షురూ


- తెలుగు రాష్ట్రాల నుంచి 1400 మంది క్రీడాకారులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఎక్సెలెన్సియా ఇన్ఫినిటమ్ స్కూల్ ఆధ్వర్యంలో సీబీఎస్సీ క్లస్టర్ 7 బాలికల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించింది. శుక్రవారం ప్రారంభమైన ఈ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో తిరుపతి, తెనాలి, గుంటూరు, అనంతపురం, విజయవాడ, కర్నూలు, గద్వాల్ వంటి ప్రాంతాలతో పాటు నగరంలోని చిరాక్, డీపీఎస్, ఓక్రిడ్జ్ గచ్చిబౌలి, హెచ్‌పీఎస్ రామంతపూర్, ఓబుల్‌రెడ్డి, సుచిత్ర అకాడమీ, గాడియం, ది శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్ వంటి పాఠశాలల నుంచి 1400 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌ను ఇండియన్ ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ టీమ్ క్రీడాకారిణి పుష్పా సెంథిల్‌కుమార్, ఫిబా వరల్డ్ టెక్నికల్ డెలిగేట్ నార్మన్ ఇస్సాక్ ప్రారంభించారు. ఈ నెల 23 వరకు పోటీలు కొనసాగనున్నాయని ఎక్సెలెన్సియా వ్యవస్థాపకులు వెంకట్ మురికి తెలిపారు. క్రీడలు–విద్యావేత్తలను సమతుల్యం చేయడంలో నిబద్ధతకు ప్రసిద్ధి చెందిన ఎక్సెలెన్సియా ఈ అత్యుత్తమ పోటీలకు అనువైన వేదిక్యాన్ని అందించిందని పేర్కొన్నారు.

చేప పిల్లలతో జీవవైవిధ్యం మెరుగు

టీజీఎఫ్‌డీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి



బొటానికల్ గార్డెన్ చెరువులో చేపలను వదులుతూ..

గచ్చిబౌలి: చెరువుల్లో చేప పిల్లలను వదలడంతో జీవ వైవిధ్యం మెరుగుపడే అవకాశం ఉంటుందని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. చేప పిల్లలను చెరువుల్లో వదలడం ద్వారా ఎన్నో రకాల పక్షులు ఆవాసాలుగా చేసుకుంటాయని, తద్వార జీవవైవిధ్యం పెంపొందుతుందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఉన్న చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బొటానికల్ గార్డెన్ చెరువులో 7వేలు, పైట్ షపారీ చెరువులో 8 వేలు, సైక్లింగ్ పార్క్ చెరువులో 6 వేలు, ఫారెస్ట్ ట్రెక్‌పార్క్ చెరువులో 11 వేలు, చిన్న చెరువులో 6 వేల వివిధ రకాల చేపపిల్లలను వదిలారు. ఆయా పార్కులలో బార్బెట్, ఆసియా కొయెల్, మాల్కోవా, అయోరా, బ్లాక్ డ్రోన్గో, వుడ్‌సాండ్ పైపర్, శిక్రా, ఇండియన్ రాబిన్ పర్పుల్ బర్డ్ తదితర అరుదైన పక్షులున్నాయని అధికారులు తెలిపారు. ఎర్రచందనం, కదంబం, వెదురు, నేరెడు, మద్ది, రేల, మహగని తదితర చెట్లు పక్షులకు అవాసాలుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ జనరల్ మేనేజర్ స్కైలాబ్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ మోకాలి శస్త్ర చికిత్సలో అత్యుత్తమ శిక్షణ

- కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు

గచ్చిబౌలి: 300 ఫుల్లీ ఆటోమేటెడ్ రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను కొండాపూర్ కిమ్స్ అడ్వాన్స్‌డ్ రోబోటిక్ సెంటర్(ఏఆర్‌సీ) విజయవంతంగా పూర్తి చేశారని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండి డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు పేర్కొన్నారు. కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్‌లో ఫెలోషిప్‌లకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీల్లో ఫెలోషిప్‌లకు ఉత్తమ శిక్షణ ఇచ్చి సొంతంగా సర్జరీలు చేసే విధంగా ఏఆర్‌సీ తీర్చిదిద్దినట్లు చెప్పారు. మోకాలి మార్పిడి సర్జరీల్లో 20 శాతం మంది రోగుల్లో పెయిన్, బ్లడ్ లాస్‌తో పాటు 7, 8 రోజులు రోగులు హాస్పిటల్‌లో ఉండాల్సి వస్తుందన్నారు. రోబోటిక్ సర్జరీలతో రెండు రోజుల్లోనే రోగి ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుందని, త్వరగా వాళ్ల పనులు చేసుకోవచ్చన్నారు. బ్లడ్‌లాస్, వీక్‌నెస్ ఉండదన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అడ్వాన్స్‌డ్ పరికరాలతో ఆర్థోపెడిక్ విభాగం రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. ఆర్థోపెడిక్ చీఫ్ కన్సల్టెంట్, జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ అన్నే సాయిలక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి వైద్యులు, టెక్నీషియన్లు, నర్సులు, రేడియాలజిస్ట్‌లు, థెరపిస్ట్‌ల కోసం ఫెలోషిప్ ప్రోగ్రాంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. రోబోటిక్ మోకాలి శస్త్ర చికిత్సలో కొత్త విధానాలు నేర్చుకొని తమ ప్రాంతాల్లోనూ అమలు చేయడానికి వీలుంటుందన్నారు. ఆరు నెలలు ఫెలోషిప్ పూర్తి చేసి పరీక్షలో పాసైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్ డాక్టర్లు సీఆర్.సురేష్‌బాబు, పి.అజయ్ కుమార్, కృష్ణ చైతన్య, ప్రదీప్ పర్వతనేని, మనోజ్ తదితరులు ఉన్నారు.

15 నుంచి ఎస్ఎఫ్ఏ ప్రొ తొలి ఎడిషన్



సాక్షి, సిటీబ్యూరో: స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) 2024–25 చాంపియన్‌షిప్‌లో భాగంగా అడ్వాన్స్‌డ్ అథ్లెట్ల కోసం ప్రత్యేకంగా ఎస్ఎఫ్ఏ ప్రొ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఇందులో భాగంగా వచ్చేనెల 15న హైదరాబాద్ వేదికగా 8 క్రీడాంశాల్లో ఎస్ఎఫ్ఏ ప్రొ తొలి ఎడిషన్ మొదలవుతుంది. ఈ ఎలైట్ కేటగిరీ.. ఆయా నగరాల్లోని అత్యుత్తమ క్రీడాకారులను గుర్తించి, వారు ప్రొఫెషనల్ అథ్లెట్లుగా మారడానికి సహాయపడేందుకు రూపొందించినట్లు ఎస్ఎఫ్ఏ వ్యవస్థాపక సభ్యుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజస్ జోషి తెలిపారు. హైదరాబాద్‌లో వచ్చేనెల 30వ తేదీ వరకు జరిగే ఎస్ఎఫ్ఏ ప్రొ మొదటి ఎడిషన్ తర్వాత ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్‌లను బెంగళూరు, పుణె, ముంబైలో నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లా, జోనల్, రాష్ట్రం, జాతీయ స్థాయిలో రాణించిన అథ్లెట్లు లేదా గత ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్‌లలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్, స్విమ్మింగ్, టెన్నిస్ ఆటల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి ఎస్ఎఫ్ఏ ప్రొ ఎడిషన్‌లో అవకాశం కల్పిస్తారు. ఎస్ఎఫ్ఏ ప్రొ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్ఎఫ్ఏప్లే.కామ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నేతల నిరసన

కవాడిగూడ: అమెరికాలో కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భారతదేశంలోని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను బీజేపీ పార్టీ తొలగిస్తుందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ డిమాండ్ చేశారు. బీజేపీ తెలంగాణ ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, విదేశాల్లో రాహుల్ గాంధీ ప్రచారం చేయడం ఆయన రాజకీయ దివాల కోరుతనానికి నిదర్శనం అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన బంగారు లక్ష్మణ్‌ను జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. బీజేపీని రాజకీయంగా ఎదుర్కోలేకే విదేశాల్లో రాహుల్‌గాంధీ చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. నిరసనలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శులు క్రాంతి కిరణ్, శివాజీ, ఉపాధ్యక్షులు ఓంప్రకాష్, చంద్రశేఖర్, నేతలు కాంచన కృష్ణ, ఎస్.రాజు, మీడియా కన్వీనర్, జనపాల మధు, బీజేపీ సీనియర్ నాయకులు మీసాల విఠల్‌రావు, ముషీరాబాద్ నియోజకవర్గ ఎస్సీమోర్చా కన్వీనర్ పి.పరుశురాం, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శనివారం, 21, సెప్టెంబర్, 2024



ఏఐ.. హాయ్!

ప్రతి సమస్యకూ కృత్రిమ మేధతో చెక్!

కృత్రిమ మేధ.. సాంకేతిక విప్లవంలో మానవుడి ఆలోచనలకు అందనంత దూరం వెళ్లిపోయింది. మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ సాయంతో మనిషి కూడా చేయలేని ఎన్నో పనులకు పరిష్కారం చూపుతోంది. భవిష్యత్తు మొత్తం కృత్రిమ మేధదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ ప్రభుత్వం కూడా కృత్రిమ మేధపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఏఐ సిటీ నిర్మించాలని ప్రణాళికలు కూడా రచిస్తోంది. యువత కూడా ఏఐలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. తమ సృజనాత్మకతకు పదును పెడుతోంది. ఏఐతో నడిచే కొత్త కొత్త యాప్‌లను సృష్టించి.. ఎన్నో చిక్కుముడులను విప్పుతోంది. ఏదో ఒక ఉద్యోగం చేయడం కన్నా.. సొంతంగా స్టార్టప్‌లు స్థాపించి ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నారు. సమాజానికి తమ చేతనైన సాయం చేస్తున్నారు. ఇప్పటికే టీ-హబ్ వేదికగా ఎన్నో ఏఐ ఆధారిత స్టార్టప్‌లు పురుడుపోసుకున్నాయి. ఎన్నో స్టార్టప్‌లకు టీ-హబ్ ప్రోత్సాహం అందిస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో



సాధారణంగా మనుషుల జాతకం గురించి వినే ఉంటాం. కానీ వాహనాలకు కూడా జాతకం ఉంటుందా అనే కదా మీ అనుమానం. ఏఐతో వాహనం జాతకం గురించి చెప్పే యాప్‌ను చరణ్ సింగ్, మల్లికారెడ్డి అనే ఇద్దరు యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ తీసుకొచ్చారు. వీళ్లు రూపొందించిన చిన్న పరికరం ఏఐ సాయంతో పనిచేస్తుంది. దాన్ని కనుక వాహనానికి అమర్చుకుంటే వాహనం కండీషన్ ఎలా ఉందో ఎప్పటికప్పుడు మన మొబైల్ ఫోన్‌కు సమాచారం అందిస్తుంది. ఎప్పుడు బ్రేక్‌డౌన్ అవుతుంది.. ఎప్పుడు సర్వీసింగ్ చేయించాలి.. అన్న వివరాలను మనకు తెలుపుతూ ఉంటుంది. వాహనం ఆరోగ్యం ఎలా ఉందనే విషయాన్ని మనకు చెబుతుందన్న మాట. 2018లోనే ఈ ఐడియాతో ఓ స్టార్టప్ మొదలుపెట్టాలని భావించారు. చివరకు 2022లో దీన్ని ప్రారంభించి ఔరా అనిపించుకుంటున్నారు. సాధక్ అనే ఈ పరికరంతో వాహనాల లైఫ్‌టైం భారీగా పెంచుకోవచ్చని చరణ్ సింగ్ చెబుతున్నారు. ఏదైనా సమస్య వస్తుందని ముందే పసిగట్టి చెబుతుంది కాబట్టి అవసరమైన చిన్న చిన్న మరమ్మతులు చేయించుకోవడం లేదా జాగ్రత్తలు పాటించడం ద్వారా వాహనం షెడ్డుకు వెళ్లకుండా కాపాడుకోవచ్చని వివరించారు. వేక్.ఇన్ అనే పోర్టల్ ద్వారా వీరు సేవలు అందిస్తున్నారు.

మూసీ పరిరక్షణలోనూ ఏఐ..



మూసీ ప్రక్షాళనకు ఎంత ప్రయత్నం చేసినా ప్రయోజనం కనిపించట్లేదు. అసలు సమస్య ఎక్కడ మొదలైందో కనుక్కొని ప్రయత్నాలు చేస్తే ఫలితం ఉంటుందని పలువురు చెబుతున్నారు. అయితే కృత్రిమ మేధతో పరిష్కారం చూపుతామని కొందరు ఇంజనీరింగ్ విద్యార్థులు ముందుకొచ్చారు. నాలుగు దశల్లో మూసీని పూర్తిగా పరిశుభ్రం చేయొచ్చని చెబుతున్నారు. తొలుత డ్రోన్ల సాయంతో మూసీ నదిలో, పరీవాహక ప్రాంతంలోని చెత్తను తొలగించాలని పేర్కొంటున్నారు. సెన్సార్ల ద్వారా మూసీలో చెత్త వేస్తే వెంటనే అధికారులకు సమాచారం అందిస్తుంది. అంతేకాదు.. వరదలు, విపత్తులను గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. వరదలు రావడానికి ముందే ముప్పును పసిగట్టి స్థానికులకు సమాచారం అందజేస్తుంది. దీంతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా అధికారులు త్వరగా సహాయక చర్యలు చేపట్టే వీలు కల్పిస్తుంది. అర్బన్ ప్లానింగ్‌లో కూడా కృత్రిమ మేధను వినియోగించుకుని, భవిష్యత్తు తరాలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రణాళికలు రచించవచ్చని పేర్కొంటున్నారు. ఇక, ఎక్కడెక్కడ బ్రిడ్జిలు అవసరం ఉన్నాయనే విషయం కూడా కృత్రిమ మేధ చెప్పేస్తుందని చెబుతున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలను పట్టేసేలా..

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిని సులువుగా గుర్తించేందుకు కృత్రిమ మేధ సాయంతో వినూత్నంగా కళ్లద్దాలను పర్స్యూ ఎక్స్ అనే కంపెనీ అభివృద్ధిపరిచింది. వీటిని ధరించిన పోలీసు జస్ట్ అలా వాహనాన్ని తరచి చూస్తే చాలు.. కృత్రిమ మేధ సాయంతో సమాచారం మన ముందుంచుతుంది. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, అద్దాలు ఉన్నాయా లేదా ఇలా అన్ని వివరాలను ఫోన్‌కు పంపుతుంది. ఏవైనా ఉల్లంఘనలు జరిగితే వెంటనే చలాన్లు కూడా జెనరేట్ చేసి, వాహనదారుడికి పంపుతుంది. ఉన్నతాధికారులకు ఈ విషయాలను పంపుతుంది. వాయిస్ రూపంలో సదరు అధికారికి వివరాలను చెబుతోంది. అలాగే ట్రాఫిక్ ఎలా ఉందనే వివరాలను కూడా అంచనా వేసి, ట్రాఫిక్ నియంత్రణలో మేలు చేస్తుంది. చాలా కచ్చితత్వంతో వివరాలను నమోదు చేస్తుంది. అలాగే దీంతో కింది స్థాయి సిబ్బంది ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పారదర్శకత పెంపొందించేందుకు ఉపయోగపడుతుంది.



భవిష్యత్తు ఏఐదే..



భవిష్యత్తులో మనం ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఏఐ నిర్ణయించే రోజు వస్తుంది. మనం చేయాల్సిన ప్రతి పనినీ ఏఐ అధీనంలోకి తీసుకుంటుంది. కృత్రిమ మేధతో చాలా జాగ్రత్తగా ఉండాలి. భవిష్యత్తులో నిరుద్యోగం పెరిగే ప్రమాదం ఉంది. కాకపోతే ఏఐని సరైన క్రమంలో మలుచుకుని, స్కిల్స్ పెంచుకుంటే మాత్రం కృత్రిమ మేధ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి.

- చరణ్‌సింగ్, వేక్ వ్యవస్థాపకుడు

స్టార్టప్‌లో పనిచేస్తూ సొంతంగా..



స్టార్టప్ ఏర్పాటు చేసే ముందు ఏదైనా స్టార్టప్ కంపెనీలో పనిచేస్తే మంచిది. అందులో ఉండే కష్టనష్టాలు తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో అలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా జాగ్రత్త పడితే.. నిర్వహణలో విజయం సాధించవచ్చు. నేను కూడా అలా ముందు ఓ కంపెనీలో పనిచేసి.. సొంతంగా స్టార్టప్ స్థాపించాను. ఇప్పుడు సక్సెస్‌ఫుల్‌గా సంస్థను నడిపిస్తున్నాను. మా బాబాయి మెకానిక్. ఆయన లాంటి మెకానిక్‌లకు ఉపయోగపడేలా ఏదైనా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో వేక్‌ను స్థాపించాను.

- మల్లికారెడ్డి, వేక్ సహ వ్యవస్థాపకురాలు

యువతలో పోషకలోపం..



- దేశంలో 81 శాతం మందిలో ఇదే సమస్య
- ఆహారపు అలవాట్లలో మార్పే కారణం
- పని ఒత్తిడితో అలసట
- సర్వే వివరాలు విడుదల చేసిన సుప్రదిన్, నేషనల్ న్యూట్రిషన్ వీక్

దేశంలో 81 శాతం మంది యువత పోషకాహార లోపంతో బాధపడుతున్నారని న్యూట్రిషన్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుప్రదిన్, నేషనల్ న్యూట్రిషన్ వీక్ సంయుక్తంగా విడుదలచేసిన సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. ఈ సర్వేలో 20 మిలియన్ల మంది 25 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు గల యువత నుంచి అభిప్రాయాలు సేకరించామని తెలిపారు. 96 శాతం మంది భారతీయులు తమకు అవసరమైన సూక్ష్మ పోషకాలు, మల్టీవిటమిన్లు అందుబాటులో లేవని భావిస్తున్నారని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ నగరాల్లో ప్రధానంగా ఉదయం లేచింది మొదలు, నిత్యం ఉద్యోగంలో, ఇతర పనుల్లో అన్ని స్థాయిల్లోనూ వేగంగా అలసటకు గురవుతున్నారట. - సాక్షి, సిటీబ్యూరో

పెరుగుతున్న పోషకాహార లోపంపై అవగాహన కల్పించడం, స్వీయ సంరక్షణను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలని సూచిస్తోంది. సర్వే సంస్థ వన్ నేషన్ 100% న్యూట్రిషన్ మిషన్‌లో భాగంగా ఉద్యోగ, శ్రామిక జనాభాలో అలసట పెరుగుతోందని తేలింది. ఈ సమస్యకు గల కారణాలు, పరిష్కార మార్గాలు, తక్షణ పోషక విలువలు మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలు అందులో వివరించారు. విధి నిర్వహణలో 83 శాతం మంది అలసట కారణంగా తరచూ విరామాలు అవసరమని అభిప్రాయపడుతున్నారు. 74 శాతం మంది పగటిపూట నిద్రతో ఇబ్బంది పడుతున్నారు. 69 శాతం మంది పనులు ప్రారంభించడం లేదా పూర్తి చేయడం కష్టంగా ఉందని తెలిపారు. 66 శాతం మంది రోజువారీ కార్యకలాపాలను పూర్తి చేయలేకపోతున్నామని, 25 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు వారిలో 78% మంది, 36 ఏళ్ల నుంచి 45 ఏళ్లలో 72% మంది పగటిపూట మగతగా ఉంటున్నారని అభిప్రాయపడ్డారు.

ముందే గుర్తించారు..

యువతలో అలసట పెరగడం చాలా మంది ఆరోగ్య నిపుణులు గుర్తించారు. పోషకాహార అంతరాలను తగ్గించడానికి మల్టీవిటమిన్‌లను ప్రోత్సహించడం ద్వారా 70% వరకూ అవసరమైన సూక్ష్మ పోషకాలను అందించవచ్చు. రోజువారీ సప్లిమెంట్‌లతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

- డాక్టర్ కేతన్ కె మెహతా, సీనియర్ కన్సల్టెంట్

ఇంటికి వచ్చేసరికే నీరసం..




నగర జీవనంలో శారీరక వ్యాయామం తగ్గుతోంది. నిత్యం పని ఒత్తిడి ఉంటోంది. ఇటువంటి సందర్భంలో అలసటకు గురవుతున్నాం. దీనికి తగ్గట్లే ఆఫీస్‌లో విరామం ఇస్తున్నారు. ఇంటికి వచ్చే సరికి నీరసం అనిపిస్తుంది. సెలవు రోజుల్లో ప్రశాంతంగా రెస్ట్ తీసుకోవడానికే ఇష్టపడుతున్నాం.

- ఆలేటి గోపి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, కొండాపూర్

ఔరా.. 'ఔకేరా'..

సాక్షి, సిటీబ్యూరో: ల్యాబ్‌లో తయారు చేసే నాణ్యమైన డైమండ్ జ్యువెలరీకి ప్రసిద్ధి చెందిన 'ఔకేరా' బ్రాండ్ నగరంలోని సోమాజిగూడలో నూతన స్టోర్‌ను ప్రారంభించింది. దీంతో పాటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఇనార్బిట్ మాల్‌లో మరో 3 నూతన స్టోర్లను ఆవిష్కరించనున్నామని ఔకేరా వ్యవస్థాపకులు ఓలిసా ముఖేద్కర్ తెలిపారు. ఔకేరా ల్యాబ్‌లో సానబెట్టిన వజ్రాలను అందిస్తూ.. మహిళలకు సాధికారత కల్పించడానికి అంకితం చేశామని అన్నారు. ముత్యాల నగరంగా ప్రసిద్ధిగాంచిన హైదరాబాద్‌లో సుపీరియర్ కట్, క్లారిటీ, కలర్, కాస్ట్ ఎఫిషియెన్సీపై ఔకేరా దృష్టి సారించిందని అన్నారు.





మిస్ ఇండియా మిస్సవ్వదు..

బ్యూటీ పేజెంట్స్, ఫ్యాషన్ కాంపిటీషన్స్ అంటే కేవలం అందం, సౌందర్యం మాత్రమే కాదని.., నిత్య జీవితంలో మన ఆలోచనా విధానం, సామాజిక అవగాహన, మానవీయ విలువలు తదితర అంశాలతో సంపూర్ణ వ్యక్తిత్వమే 'మిస్ క్రౌన్'కు ఎంపిక చేస్తాయని తెలుగు రాష్ట్రాల నుంచి ఫెమినా మిస్ ఇండియా ఫైనలిస్టులు ప్రకృతి, భవ్య రెడ్డి తెలిపారు. న్యూయార్క్ ఫ్యాషన్ వీక్, లండన్ ఫ్యాషన్ వీక్, దుబాయ్ ఫ్యాషన్ వీక్, లాక్మే ఫ్యాషన్ వీక్ వంటి ప్రఖ్యాత అంతర్జాతీయ ఈవెంట్‌లలో సత్తా చాటిన ప్రముఖ సంస్థ ఎన్ఐఎఫ్‌డీ గ్లోబల్ ఆధ్వర్యంలో ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ ప్రకృతి కంభం, ఫెమినా మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ భవ్య రెడ్డిలతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు.

- సాక్షి, సిటీబ్యూరో

మరికొద్ది రోజుల్లో జరగనున్న ఫెమినా మిస్ ఇండియా 2024 పోటీల్లో ఈ ఇరువురూ తెలుగు రాష్ట్రాల తరఫున పోటీ పడనున్న నేపథ్యంలో ఫ్యాషన్, అందం, లైఫ్‌స్టైల్ తదితర అంశాలపై వారి అనుభవాలను సాక్షితో పంచుకున్నారు. ఈ రంగంలో రాణించడానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తమ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన ఇరువురినీ ఎన్ఐఎఫ్‌డీ గ్లోబల్ సెంటర్ డైరెక్టర్ సంజయ్ సరస్వత్ ప్రత్యేకంగా అభినందించారు.

రేసులో ఇద్దరు తెలుగమ్మాయిలు

డ్రెస్‌లు వ్యక్తిత్వానికి ప్రతీక కాదు..

దక్షిణాది అమ్మాయిలకు బ్యూటీ పేజెంట్స్‌లో గుర్తింపు పెరిగింది. హైదరాబాద్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు వంటి ప్రాంతాల నుంచి ఈ రంగంలో అద్భుత నైపుణ్యాలున్న అమ్మాయిలు రాణిస్తున్నారు. యువతలో పరిపక్వత పెరిగింది. కానీ అవగాహన పెరగాలి. పిల్లలు ఫ్యాషన్ రంగంలో ఆసక్తి చూపిస్తుంటే ఇబ్బందిగా భావిస్తున్నారు. మంచి చెడులు అనేవి అన్ని రంగాల్లో ఉన్నాయి. కానీ ఫ్యాషన్, మోడలింగ్, సినిమాలు అనే సరికి సమాజం సులభంగా జడ్జ్ చేస్తున్నారు. మోడ్రన్ డ్రెస్‌లు మా వ్యక్తిత్వానికి ప్రతీక కాదు. మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లే ఈ స్థాయికి రాగలిగాము. మా సోషల్ మీడియా అకౌంట్స్‌లో చూస్తే తెలుస్తుంది.. సంస్కృతి, సంప్రదాయాలకు ఎంత విలువ ఇస్తున్నామనేది. నార్త్ ఫ్యాషన్ ఔత్సాహికులను సైతం హైదరాబాద్ అక్కున చేర్చుకుంటోంది. దక్షిణాదిలో సృజనాత్మకత, ఐడియాలజీ, నైపుణ్యాలను వారు అద్భుతంగా వాడుకుంటారు. అదే రీతిలో మనవారినీ ప్రోత్సహించాలి. ఈ రంగంలో బాహ్య, అంతర సౌందర్యం రెండూ ముఖ్యమే. మన రంగూ, రూపు మాత్రమే విజేతగా నిలబెట్టలేవు. ఆలోచనా విధానం, అవగాహన ఇందులో కీలకాంశాలు. - ప్రకృతి కంభం.



అలాంటి రోజులు రావాలి..

ఈ రోజు సెషన్‌లో ఎంతో మంది ఫ్యాషన్ ఔత్సాహికులు.. వారి ప్రయాణాన్ని తమ కుటుంబ సభ్యులే ఒప్పుకోవట్లేదని, ఫ్యాషన్, మోడలింగ్ అంటే ఎవరు పెళ్లి చేసుకుంటారని వారిస్తున్నారు. కానీ మాలాంటి అవగాహన, పరిపక్వత, నైపుణ్యాలు ఉన్న అమ్మాయిలు దొరకడం వారి అదృష్టం అని తెలుసుకునే రోజులు రావలి. వ్యవస్థనో, ఫ్యాషన్ పరిశ్రమపై పడిన ముద్ర మమ్మల్ని డిసైడ్ చేయలేవు. కళాత్మకత, సేవ, విద్య, సామాజిక విలువలు తదితర అంశాల్లో మేమెంతో ఉన్నతంగా ఆలోచిస్తాం. కెమెరా, వీఎఫ్ఎక్స్, డైరెక్షన్, సినిమాలు, యాక్టింగ్ అంటూ బాలీవుడ్ వరకూ ఎందరో నగరానికి వస్తున్నారు. కొందరి లోపాలు ఎంచుకుని పరిశ్రమను నిర్ధారిస్తున్నారంటే అది అవగాహనా లోపమే. అందుకే ఎంతో ఇష్టమున్నా రాణించలేకపోతున్నారు. పరిమితులు లేకుండా నచ్చగలిగింది చేయగలిగినప్పుడే మహిళా సాధికారత వస్తుంది. ఒకప్పటిలా స్టిగ్మా లేకపోయినప్పటికీ, పూర్తిగా లేదు అనలేము. గతంలో ఒక ఆటో డ్రైవర్ కూతురు సైతం విజేతగా నిలిచిన సందర్భాలున్నాయి. పోటీలు పారదర్శకంగా జరుగుతున్నాయి. ఫిజికల్, మెంటల్, ఎమోషనల్‌గా స్థిరంగా ఉంటూ, గ్లోబల్ వేదికపై సత్తా చాటడానికి వినూత్నంగా ప్రయత్నిస్తున్నాం. దేశంలో ఫెమినా మిస్ ఇండియా, మిస్ యూనివర్స్ ఇండియా వేదికలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపునిస్తాయి. సాధారణంగా జరిగే పేజెంట్‌లో పాల్గొనే సమయంలో ఇంతకు ముందు విజేతల ప్రొఫైల్స్ తప్పకుండా గమనించాలి. - భవ్య రెడ్డి

గాయని చిత్రామృతం..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ గాయని కెఎస్ చిత్ర తన స్వరమాధుర్యాలతో నగరవాసులను అలరించనున్నారు. ఎన్ చాంట్ మీడియా, ఎమ్-3 ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో నగరంలోని శిల్పకళా వేదికగా డిసెంబర్ 22న 'చిత్రామృతం' సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ మ్యూజిక్ కాన్సర్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ సింగర్ సునీత ఉపద్రష్ట ఆవిష్కరించారు. సింగర్ చిత్రకు తాను పెద్ద అభిమానినని, ఆమె గాత్రంలోని దైవికతను ఆస్వాదిస్తుంటానని సునీత తెలిపారు. ఈ సంగీత విభావరి కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని అన్నారు. చిత్రామృతం కార్యక్రమానికి సంబంధించిన టిక్కెట్లు బుక్ మై షోలో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన ప్రముఖ గాయని సునీత



టీచర్ల సర్దుబాటుకు అనుమతి

విద్యాశాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని అన్ని జిల్లా కలెక్టర్లు, డీఈవోలకు పాఠశాలవిద్య డైరెక్టరేట్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే క్రమంలో ఒకే గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే రెండు స్కూళ్లను విలీనం చేసే అధికారాన్ని జిల్లా యంత్రాంగానికి అప్పగించారు. పాఠశాల విద్య డైరెక్టర్ ఇ.నర్సింహారెడ్డి శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. తాజా యూడైస్ డేటాను పరిగణనలోనికి తీసుకుని ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని సూచించారు. చాలా స్కూళ్లలో విద్యార్థులున్నా, టీచర్లు ఉండటం లేదని, టీచర్లు ఎక్కువగా ఉన్నచోట విద్యార్థులు ఉండటం లేదని గుర్తించారు. టీచర్లు లేని స్కూళ్లలో విద్యార్థులు చేరినా, తిరిగి వారు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోతున్నారని చెప్పారు. దీన్ని నివారించేందుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే కాంప్లెక్స్‌లో రెండు స్కూళ్లు ఉంటే, వాటిని విలీనం చేసేందుకు విద్యాశాఖ అనుమతించింది. ఎంతమంది విద్యార్థులకు ఎంతమంది టీచర్లు ఉండాలో విద్యాశాఖ సూచించింది.

ప్రైమరీ... యూపీఎస్ స్కూళ్లలో

విద్యార్థులు	ఉండాల్సిన టీచర్లు
1-10	1
11-60	2
61-90	3
91-120	4
121-105	5
153-200	6
అప్పర్ ప్రైమరీ ఆ పైన	
1-20	సబ్జెక్టు టీచర్లు - 2 (1 లాంగ్వేజ్, 1 సబ్జెక్టు)
21 ఆపైన	సబ్జెక్టు టీచర్లు - 4

చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ బదిలీ

కొత్త సూపరింటెండెంట్‌గా రామచంద్రం

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్ బదిలీ అయ్యారు. చర్లపల్లి నూతన సూపరింటెండెంట్‌గా జి.రామచంద్రంను నియమిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యదర్శి రవిగుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంతోష్‌కుమార్ రాయ్‌ను సంగారెడ్డి సెంట్రల్ జైలు ఎస్పీగా బదిలీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న జి.రామచంద్రం ఎస్పీగా పదోన్నతి పొందారు. 15 రోజుల్లో సూపరింటెండెంట్ పోస్టులో చేరాలని ఆదేశించారు.

గుర్తు లేదు..మరిచిపోయిన!

జస్టిస్ పీసీ ఘోష్ ఎదుట నీళ్లు నమిలిన ఇంజనీర్లు

సాక్షి, హైదరాబాద్: 'నాకు తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయిన..' కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ వేసిన ప్రశ్నలకు కొందరు నీటిపారుదల శాఖ ఇంజనీర్లు చెప్పిన వింత సమాధానాలు ఇవి. తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ లేబొరేటరీ(టీఎస్ఈఆర్ఎల్) చీఫ్ ఇంజనీర్‌గా వ్యవహరించిన శ్రీదేవిని కమిషన్ ఏ ప్రశ్న అడిగినా 'తెలీదు..గుర్తు లేదు'అని సమాధానాలివ్వగా, కమిషన్ ఆమెపై తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేసింది. బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన మోడల్ స్టడీస్ విషయంలో కీలకపాత్ర పోషించిన ఆమెపై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించగా, సమాధానాలు ఇవ్వలేక నీళ్లు నమిలారు. బరాజ్‌లను నిర్మించడానికి ముందే మోడల్ స్టడీస్ చేశామని తొలుత చెప్పిన ఆమె, ఆ వెంటనే మాట మార్చారు. దీంతో మీరు ఇచ్చిన అఫిడవిట్‌లోని సమాచారానికి సైతం కట్టుబడి ఉండకపోతే ఎలా? అని ఆమెపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో పలువురు ఇంజనీర్లకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది.

- స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్డీఎస్ఓ) సీఈగా సైతం శ్రీదేవి వ్యవహరించగా, ఆ పోస్టులో ఉండి బరాజ్‌ల పరిరక్షణకు ఐఎస్ కోడ్‌ను అమలు చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా, మౌనంగా ఉండిపోయారు.
- బరాజ్‌లకు వరదలు ఎప్పుడొచ్చాయన్న ప్రశ్నకు సైతం తెలియదు అని బదులిచ్చారు.
- బరాజ్‌లకు 2020లో త్రీడీ మోడల్ స్టడీస్ నిర్వహించినట్టు ఆమె చెప్పగా, 2023లో జరిగినట్టు టీఎస్ఈఆర్ఎల్ నివేదిక ఇచ్చిందని కమిషన్ ఆమెకు తెలియజేసింది. అయితే ఆ విషయం తనకు గుర్తు లేదని ఆమె బదులివ్వడంతో కమిషన్ అసహనం వ్యక్తం చేసింది.

బరాజ్‌లకు తనిఖీలు చేయలేదు

బరాజ్‌ల పరిరక్షణకు ఏం చర్యలు తీసుకున్నారని ఎస్డీఎస్ఓ సీఈ ప్రమీళను కమిషన్ ప్రశించగా, ఆ బాధ్యత ప్రాజెక్టు అథారిటీదేనని ఆమె బదులిచ్చారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ అమల్లోకి వచ్చినా బరాజ్‌ల భద్రత వాటి చీఫ్ ఇంజనీర్‌దేనని స్పష్టం చేశారు. గేట్ల నిర్వహణలో మ్యానువల్స్, బరాజ్‌ల నిర్వహణ ప్రొటోకాల్స్ అమలు చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా, ఆమె సమాధానమివ్వడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో పేర్లు చెప్పకుండా వివరాలు తెలపాలని కమిషన్ ఆమెను కోరింది. చట్టం ప్రకారం వర్షకాలానికి ముందు, తర్వాత తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వలేదని ఆమె వివరించారు.

- ఎస్డీఎస్ఓ ఈఈ విజయలక్ష్మి సైతం ఇదే విషయాన్ని కమిషన్‌కు తెలిపారు.

అధ్యయనాలు, నిర్వహణ లేకపోవడమే కారణం

బరాజ్‌ల వైఫల్యానికి కేవలం నిర్వహణ, పర్యవేక్షణ లోపాలే కాకుండా వాటికి ఎగువ, దిగువన రక్షణ చర్యలు తీసుకోకపోవడం కూడా కారణమేనని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) ఈఈ రఘునాథ శర్మ తెలిపారు. 2019 లోనే వరదల తర్వాత బరాజ్‌లలో లోపాలు బయటపడగా, 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బరాజ్ కుంగే వరకు మరమ్మతులు చేయలేదని ఆరోపించారు. వైఫల్యానికి కారకులు ఎవరు? నాటి ప్రభుత్వ అధినేతనా? అని కమిషన్ అడగ్గా, 3డీ మోడల్ అధ్యయనాలు జరపకపోవడం, నిర్వహణ ప్రొటోకాల్స్ పాటించకపోవడం కారణమని ఆయన బదులిచ్చారు.

- మోడల్ స్టడీస్ పూర్తికాక ముందే బరాజ్‌ల నిర్మాణం ప్రారంభించడంతోనే విఫలమయ్యాయని పలువురు టీఎస్ఈఆర్ఎల్ ల్యాబ్ ఇంజనీర్లు కమిషన్‌కు తెలిపారు. బరాజ్‌లను నీటి మళ్లింపుకోసం నిర్మిస్తారని, నిల్వ చేయడంతోనే కుంగిపోవడం, సీపేజీలు ఏర్పడడం జరిగిందన్నారు. వరదల సమయంలో కూడా గేట్లు మూసి ఉంచడంతో ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు.

తిరుమల లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి

- లేదా విచారణ కోసం ఓ కమిటీని ఏర్పాటుచేయండి
- వాస్తవాల నిగ్గు తేల్చండి
- సీజే ధర్మాసనం ముందు వైవీ సుబ్బారెడ్డి తరఫున పొన్నవోలు ప్రస్తావన
- వచ్చే బుధవారం విచారణ జరుపుతామన్న ధర్మాసనం



సాక్షి, అమరావతి : తిరుమల శ్రీవారి లడ్డూలో ఉపయోగించే నెయ్యి కల్తీపై వాస్తవాలను తేల్చేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టును కోరారు. ఒకవేళ సిట్టింగ్ జడ్జితో విచారణ సాధ్యం కాకపోతే, విచారణ నిమిత్తం ఓ కమిటీని ఏర్పాటుచేయాలని ఆయన హైకోర్టును అభ్యర్థించారు. తద్వారా వాస్తవాల నిగ్గుతేల్చాలని కోరారు. ఈ అభ్యర్థనతో తాము ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయనున్నామని, దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనాన్ని కోరారు. శ్రీవారి లడ్డూలో ఉపయోగించే నెయ్యి విషయంలో వాస్తవాలను తెలుసుకోకుండా ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుతున్నారని.. అందువల్ల నిజానిజాలు బయటకు రావాల్సి ఉందన్నారు. అందుకోసమే తాము ఈ వ్యాజ్యం దాఖలు చేస్తున్నామన్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా వందల కోట్ల మంది శ్రీవారి భక్తుల మనోభావాలకు సంబంధించినది కాబట్టి ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని సుధాకర్‌రెడ్డి న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను తాము బుధవారమే విచారిస్తామని, ఈలోపు పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది.

నివేదిక కోరిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై నెలకొన్న వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కేంద్రం సమగ్ర నివేదిక కోరింది. లడ్డూ వివాదంపై అందుబాటులో ఉన్న నివేదికలను సత్వరమే తమకు నివేదించాలని చెప్పింది. వివాదం నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ప్రకటించారు. 'ఈ వివాదంపై సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడాను. కొన్ని వివరాలు అడిగి తెలుసుకున్నా. అందుబాటులో ఉన్న నివేదికను పరిశీలించడానికి వీలుగా కేంద్రానికి పంపాలని కోరాను. నేను రాష్ట్ర నియంత్రణ అధికారులతో కూడా మాట్లాడి దీనిపై దర్యాప్తు చేస్తాం. నివేదికను పరిశీలించి ఆహార భద్రతా ప్రమాణాల ప్రకారం చర్యలు తీసుకుంటాం'అని ఆయన ఢిల్లీలో తెలిపారు.

సమగ్ర దర్యాప్తు జరగాలి : ప్రహ్లాద్ జోషి

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగా ఇది చాలా గంభీరమైన విషయం. దర్యాప్తు తర్వాత ఎవరైతే తప్పు చేశారో వారికి శిక్ష పడాలి.

బాధ్యులపై చర్యలు తప్పవు: జితేంద్ర సింగ్

తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో బాధ్యులపై చర్యలు తప్పవని తాను విశ్వసిస్తున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయన్నారు. ఇలాంటి ఘటన ఊహించలేదని అన్నారు. భక్తుల విశ్వాసాలను తిరిగి పెంపొందించే విధంగా సమగ్ర దర్యాప్తు జరుగుతుందని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ కుట్ర : పవన్ ఖేరా

ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారంలో కుట్ర చేస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఆరోపించారు. సోషల్ మీడియాలో కొత్త కొత్త వాదనలు వినిపిస్తున్నాయని, దీనివల్ల ఎవరికి లాభమని ఆయన ప్రశించారు. తిరుపతి బాలజీపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు భక్తి విశ్వాసాలున్నాయని, వాటితో ఆడుకునే వారిని క్షమించరని అన్నారు. వెంటనే ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ కన్నుమూత



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ (72) శుక్రవారం కన్నుమూశారు. జయప్రకాష్ లంగ్ ఇన్‌ఫెక్షన్‌తో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాకాని వెంకటరత్నం అనుచరుడిగా ఉంటూ ఆంధ్రోద్యమంలో జయప్రకాష్ చురుకుగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుడుగా ఉన్న అడుసుమిల్లి జయప్రకాష్ 1983లో ఆ పార్టీ తరఫున విజయవాడ ఈస్ట్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. సమైక్యాంధ్ర ఉద్యమంలోనూ పాల్గొన్నారు. శుక్రవారం జయప్రకాష్ భౌతిక కాయాన్ని విజయవాడ మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న ఆయన ఇంటి దగ్గరకు తీసుకొచ్చారు. నాయకులు, అభిమానులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. జయప్రకాష్ అంతిమ యాత్ర శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

చంద్రబాబు ఆరోపణలను నేను నమ్మడం లేదు



సీఎం వ్యాఖ్యలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలి

బీజేపీ నేత, మాజీ ఐఏఎస్ ఐవైఆర్ కృష్ణారావు

సాక్షి, అమరావతి : 'తిరుమల లడ్డు వ్యవహారంలో సీఎం చంద్రబాబు చేసిన కీలకమైన ఆరోపణను నేను నమ్మడంలేదు, అది జరిగి ఉండదనే అనుకుంటున్నా'.. అంటూ బీజేపీ నేత, మాజీ ఐఏఎస్ ఐవైఆర్ కృష్ణారావు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన వీడియో సందేశం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ ఆరోపణను రాష్ట్రంలో అత్యున్నత రాజకీయ స్థానంలో ఉన్న వ్యక్తి చేసినందున తప్పకుండా దీనిని పూర్తిస్థాయిలో విచారించి, పూర్వాపరాలను నిర్ధారించి సంబంధీకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ చంద్రబాబు ఆరోపణ నిజం కాకపోతే ఆయన ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఐవైఆర్ ఆ వీడియోలో చెప్పారు.

పవన్.. ఇదేం తీరు?

- దోషులను గుర్తించి చర్యలు తీసుకోండి
- అది మానేసి జాతీయ స్థాయిలో ఆందోళనలను వ్యాపింపజేస్తారా?
- సినీ నటుడు ప్రకాశ్ రాజ్ అసహనం


Prakash Raj
@prakashraaj
Follow
Dear @PawanKalyan ...It has happened in a state where you are a DCM .. Please Investigate ..Find out the Culprits and take stringent action. Why are you spreading apprehensions and blowing up the issue Nationally ... We have enough Communal tensions in the Country. (Thanks to your friends in the Center)#justasking

సాక్షి, అమరావతి : శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు రాజేసిన వివాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'ఎక్స్' వేదికగా చేసిన వ్యాఖ్యలపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. 'మీరు డిప్యూటీ సీఎంగా ఉన్న రాష్ట్రంలో ఈ ఘటన జరిగింది. దానిపై విచారణ జరిపి.. దోషులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోండి. ఆ పని చేయడం మానేసి ఈ ఆందోళనను జాతీయ స్థాయిలో వ్యాపింపజేస్తున్నారు. ఇప్పటికే దేశంలో ఉన్న మత కల్లోలాలు చాలవా?' అంటూ ప్రకాశ్ రాజ్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కేఐపీసీఎల్‌పై ప్రైస్‌హౌస్ వాటర్ కూపర్‌తో ఆడిటింగ్

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న రుణాలపై ప్రైస్‌హౌస్ వాటర్ కూపర్ అనే అంతర్జాతీయ సంస్థతో ఆడిటింగ్ జరిపించాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నిర్ణయించింది. కార్పొరేషన్ పేరుతో గత ప్రభుత్వం రూ.68,806 కోట్ల రుణాలను తీసుకుంది. ఈ రుణాల సమీకరణకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలతో కార్పొరేషన్ చేసుకున్న ఒప్పందాలు, సేకరించిన రుణాల వినియోగం, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు, తిరిగి రుణాల చెల్లింపు ప్రక్రియ తదితర అంశాలపై ప్రైస్ హౌస్ వాటర్ కూపర్‌తో ఆడిట్ నిర్వహించాలని కమిషన్ భావిస్తోంది. ఆడిటింగ్ సేవల రంగంలో అత్యంత నైపుణ్యం కలిగిన ఈ సంస్థకు బాధ్యతలు అప్పగిస్తే ఒప్పందాల్లోని లొసుగులు, లోపాలు తెలుస్తాయని కమిషన్ భావిస్తున్నట్టు సమాచారం.

సాక్షి రియల్టీ

ఢమాల్!

- గ్రేటర్‌లో తగ్గిన రిజిస్ట్రేషన్లు
- నెల రోజుల్లో 27% తగ్గుదల
- జూలైలో 8,781 ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్
- ఆగస్టు నాటికి 6,439 యూనిట్లకే పరిమితం
- నైట్‌ఫ్రాంక్ తాజా నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ రియల్టీ రంగంపై హైడ్రా ప్రత్యక్ష ప్రభావం చూపిస్తోంది. ఏ కారణంతో ఏ భవనం నేలమట్టం చేస్తారేమోననే భయం డెవలపర్లకు, కొనుగోలుదారులకు ఇద్దరికీ పట్టుకుంది. దీంతో హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో గ్రేటర్ హైదరాబాద్‌లో రూ.4,043 కోట్ల విలువైన 6,439 యూనిట్ల రిజిస్ట్రేషన్ జరిగాయి. అంతక్రితం నెలలో రూ.5,285 కోట్ల విలువైన 8,781 ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. అంటే నెల రోజుల్లో అమ్మకాలు 27 శాతం, ప్రాపర్టీల విలువలు 24 శాతం మేర క్షీణించాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది.

- హైదరాబాద్‌లో లగ్జరీ ప్రాపర్టీ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. రూ.కోటి, అంతకంటే ఎక్కువ ఖరీదైన గృహాలకే కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాది ఆగస్టులో ఈ విభాగం ఇళ్ల విక్రయాలు 9 శాతంగా ఉండగా.. ఈ ఏడాది ఆగస్టు నాటికి 15 శాతానికి పెరిగాయి. రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర ఉన్న యూనిట్ల అమ్మకాలు గతంలో 24 శాతం నుంచి ఇప్పుడు 26 శాతానికి వృద్ధి చెందాయి. ఇక, రూ.50 లక్షల లోపు ధర ఉండే అఫర్డబుల్ హౌసింగ్‌ల వాటా గతంలో 67 శాతం నుంచి ఇప్పుడు 59 శాతానికి తగ్గింది.
- 1,000 చ.అ. నుంచి 2,000 చ.అ. మధ్య విస్తీర్ణం ఉండే గృహాలకే ఎక్కువగా కొనుగోలుదారులు మొగ్గు చూపిస్తున్నారు. గత నెలలోని విక్రయాల్లో ఈ విభాగం వాటా 69 శాతంగా ఉండటమే ఇందుకు నిదర్శనం. ఇక, 500-1,000 చ.అ. ఫ్లాట్ల వాటా 13 శాతం, 2 వేల నుంచి 3 వేల చ.అ. యూనిట్ల వాటా 11 శాతం, 3 వేల కంటే విస్తీర్ణమైన గృహాల వాటా 3 శాతంగా ఉన్నాయి.

ఈ ఏడాది గ్రేటర్‌లో రిజిస్ట్రేషన్లు

నెల	యూనిట్లు (రూ.కోట్లలో)	విలువ
జనవరి	5,444	3,293
ఫిబ్రవరి	7,135	4,362
మార్చి	6,870	4,275
ఏప్రిల్	6,696	4,310
మే	6,062	3,760
జూన్	7,056	4,314
జూలై	8,781	5,285
ఆగస్టు	6,439	4,043

బంజారాహిల్స్‌లోనే..

గత నెలలోని టాప్-5 రిజిస్ట్రేషన్లన్నీ బంజారాహిల్స్‌లోనే జరిగాయి. రూ.7.78 కోట్ల మార్కెట్ విలువ చేసే 3 వేల చ.అ. కంటే విస్తీర్ణమైన లగ్జరీ ప్రాపర్టీతో పాటు రూ.5.60 కోట్ల విలువైన మరో నాలుగు యూనిట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి.

కాంప్లెక్స్ ఎరువుల సబ్సిడీల సవరణ

- సబ్సిడీ పెంపుతో తగ్గనున్న డీఏపీ ధర
- 28-28, 24-24 తదితరాల సబ్సిడీ తగ్గింపు
- వచ్చేనెల ఒకటో తేదీ నుంచి కొత్త ధరలు అమలు

సాక్షి, హైదరాబాద్: పోషక కాంప్లెక్స్ ఎరువుల సబ్సిడీలను కేంద్రం సవరించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఏపీ సబ్సిడీని టన్నుకు రూ.21,675 నుంచి రూ.21,912కు పెంచింది. దీంతో దాని ధర కాస్త తగ్గుతుంది. 28-28 ఎరువుల సబ్సిడీ టన్నుకు రూ.538 తగ్గించింది. దీంతో దాని ధర పెరగడం వల్ల రైతులపై స్వల్పంగా భారం పడే అవకాశం ఉందని అంటున్నారు. 24-24 ఎరువుల సబ్సిడీని టన్నుకు రూ.461 తగ్గించడంతో దాని ధర కూడా కొంత పెరుగుతుంది. అలాగే 24-24-0-8 సబ్సిడీని రూ.461, 19-19-19 సబ్సిడీని రూ.365, 16-16-16 సబ్సిడీని రూ. 307 తగ్గించడంతో వీటి ధరలు కూడా మార్కెట్లో పెరుగుతాయి. సవరించిన, పెంచిన సబ్సిడీ మేరకు మారిన ధరలను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అంటే యాసంగి సీజన్‌లో ఈ ధరలతోనే రైతులు ఎరువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది మార్చి వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయి.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు జీఆర్ఎల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాల్లో 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం జనరల్ ర్యాంకు లిస్ట్ (జీఆర్ఎల్)ను ప్రకటించింది. ఈ పోస్టులకు ఈ ఏడాది జూన్ 24 నుంచి 29 వరకు కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్టీ) విధానంలో పరీక్షలు నిర్వహించగా, 82,873 మంది పరీక్షలు రాశారు. సంక్షేమ వసతి గృహాలు, దివ్యాంగుల సంక్షేమ వసతి గృహాల్లోని పోస్టులకు వేర్వేరుగా జీఆర్ఎల్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసింది. తుది కీ, మరిన్ని వివరాల కోసం కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ సూచించారు.

అప్పీళ్లను పరిష్కరించాలి

సాక్షి, హైదరాబాద్: బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసి 80 రోజులు గడుస్తున్నా అప్పీళ్లను పరిష్కరించకపోవడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ఒక ప్రకటనలో విమర్శించారు. వెబ్ కౌన్సెలింగ్ పద్ధతిలో కొన్ని సాంకేతిక కారణాలు, అధికారుల తప్పిదాలు, సమయాభావం, అవగాహనా లోపంతో నష్టపోయిన ఉపాధ్యాయులకు విద్యాశాఖే అప్పీళ్లకు వారం రోజులు గడువు ఇచ్చిందన్నారు. ఆమేరకు కొందరు ఉపాధ్యాయులు తమకు నష్టం జరిగిందని అప్పీల్ చేసుకున్నా పట్టించుకోలేదని తెలిపారు.

సవరించిన చట్టాన్ని ఎప్పుడు అమలు చేస్తారు?

- ఎంవీ యాక్ట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు
- తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: సవరించిన మోటార్ వాహనాల చట్టం- 2019ను ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా వేస్తూ, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర రవాణాశాఖ కార్యదర్శి, రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు నోటీసులిచ్చింది. మద్యం తాగి, అధిక బరువుతో, హెల్మెట్ లేకుండా.. ఇలా పలు ఉల్లంఘనలకు శిక్షలను కఠినతరం చేస్తూ మోటార్ వాహనాల చట్టంలో ఆగస్టు 2019లో కేంద్రం సవరణ తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే వీటిని అమలు చేయలా.. వద్దా.. అన్నది రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయానికే వదిలేశారు. సవరణ తీసుకొచ్చి ఐదేళ్లు కావొస్తున్నా రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయడం లేదని, అమలు చేసేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో హైదరాబాద్ గొలిగూడకు చెందిన రమణ్‌జీత్‌సింగ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని హైదరాబాద్‌లో తగిన సంఖ్యలో ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసి, సవరించిన ఎంవీ కింద నేరస్తులను విచారించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ప్రమాదాలు తగ్గేందుకు దోహదపడుతుందని, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని అరికట్టేందుకు సాయపడుతుందని.. దీని అధ్యయనానికి ఓ కమిటీ వేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం.. సమస్యను న్యాయస్థానం కూడా పరిగణనలోకి తీసుకుంటోందని వ్యాఖ్యానించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

సవరించిన చట్టప్రకారం నిబంధనలు కొన్ని..

డీలర్ల వద్దే రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సుల జారీ, రహదారి భద్రతానిధి, ప్రైవేట్ క్యాబ్ వ్యవస్థల స్థిరీకరణ, రవాణా వ్యవస్థలో సంస్కరణలు తదితర అంశాలను దశలవారీగా అమల్లోకి తేవాలని నిర్ణయించారు. సరుకు రవాణా వాహనాలు అధిక బరువుతో పట్టుబడితే ప్రస్తుతం రూ.2 వేలు ఫైన్ విధిస్తుండగా, అదనపు బరువు కింద టన్నుకు రూ.1,000 అదనంగా వసూలు చేస్తున్నారు. ఆ మొత్తాన్ని రూ.20,000 పెంచారు. అదనపు బరువు కింద ప్రతి టన్నుకు రూ.2,000 నిర్ణయించారు. అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకుంటే ఫైన్ కింద ఒక్కొక్కరికి రూ.1,000 వసూలు చేస్తారు. హెల్మెట్ ధరించకపోతే రూ.100 నుంచి రూ.1,000కి, మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.2,000 నుంచి రూ.10,000కు, సీటుబెల్టు పెట్టుకోకపోతే రూ.1,000, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5,000, లైసెన్స్ రద్దు చేసినా వాహనం నడిపి పట్టుబడితే రూ.10,000, వేగంగా నడిపితే రూ.1,000 నుంచి రూ.2,000, ఎమర్జెన్సీ వాహనాలకు దారి ఇవ్వకపోతే రూ.10,000 జరిమానా.. ఇలా మరికొన్నింటిని కఠినతరం చేశారు.

రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతం చేయాలి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



చిన్నారులను పరామర్శిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించి ప్రజలందరికీ మరింత చేరువయ్యేందుకు చర్యలు చేపట్టాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యానగర్‌లోని రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ కమిటీకి సూచించారు. ఇందులో భాగంగా అత్యాధునికమైన వసతులతో కూడిన సెంట్రలైజ్డ్ నూతన బ్లడ్ బ్యాంకును నగరంలోని గడ్డి అన్నారంలోని రెడ్‌క్రాస్ సొసైటీ స్థలంలో నిర్మాణానికి తగిన రూపకల్పన చేసిన తనకు పంపించాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని సొసైటీ సభ్యులకు గవర్నర్ సూచించారు. ప్రస్తుతం రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న ఎనిమిది బ్లడ్ బ్యాంకులతో పాటు మూడు జిల్లాల్లో నూతన బ్లండ్ బ్యాంకుల ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నగరంలోని విద్యానగర్‌లో శుక్రవారం బ్లడ్‌బ్యాంకును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంకులో అందిస్తున్న సేవలను ఆయన అన్ని విభాగాల్లో స్వయంగా పరిశీలించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతూ బ్లడ్‌బ్యాంకులో రక్తమార్పిడి చేయించుకుంటున్న బాధిత చిన్నారులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి పండ్లు అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది బ్లడ్ బ్యాంకులు కొనసాగుతున్నాయన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్, రంగారెడ్డి జిల్లాలోని గొలిదొడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ పట్టణంలో మరో మూడు కొత్త బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఎఫ్‌టీఎల్‌ను ఎలా నిర్ధారిస్తారు?

- ఏవైనా నిబంధనలు అమలు చేస్తున్నారా?
- రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను ఎలా నిర్ధారిస్తారో వివరాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రత్యేకించి ఏవైనా నిబంధనలు అమలు చేస్తారా? అని ప్రశ్నించింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 160 ఎకరాలుగా ఎలా నిర్ధారించారో చెప్పాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేస్తూ, ఆలోగా వివరాలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్‌లోని తన ప్లాట్‌లో అధికారులు జోక్యం చేసుకుంటున్నారని, మెమైర్స్ (చిత్రపటాల) ప్రకారం దుర్గం చెరువు పరిధి 65 ఎకరాల 12 గుంటలు కాగా, నీటి పారుదల శాఖ అధికారులు 160 ఎకరాలని నిర్ధారించడం చట్టవిరుద్ధం అని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఉర్మిళదేవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అధికారుల నిర్ణయం కారణంగా సర్వే నంబర్ 47లోని తమ ప్లాట్ నంబర్ 79 ప్రభావితం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ ప్లాట్‌లో జోక్యం చేసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. 65 ఎకరాల దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 160 ఎకరాలుగా ఎలా నిర్ధారించారో అధికారులు చెప్పడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది రాయ్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం .. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ఎలా చేస్తారో చెప్పాలని లేనిపక్షంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలనే అమలు చేయాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. రాష్ట్రంలో కొత్తగా మార్గదర్శకాలు జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని చెబుతూ విచారణను వాయిదా వేసింది.



ప్రపంచ కృతజ్ఞతా దినోత్సవం సందర్భంగా పాఠకులు తెలుపుకుంటున్న కృతజ్ఞతలు

నేనెవరికి థ్యాంక్స్ చెప్తానంటే

థాంక్యూ అమ్మమ్మా!

నేను ఎవరికైనా కృతజ్ఞతలు చెప్పాలనుకుని చెప్పలేకపోయింది మా అమ్మమ్మకే. తన ప్రవర్తన ద్వారా మాకు ఒక జీవన విధానాన్ని నేర్పించిందామె. ముఖ్యంగా జీవన సహచరుడితో ఎలా నడుచుకోవాలో, ఎవరితో ఎలా మెలగాలో, కొట్టకుండా... తిట్టకుండానే పిల్లలను క్రమశిక్షణతో ఎలా పెంచాలో మా అమ్మమ్మ మా అందరితో మెలిగిన తీరు నుంచే మేము నేర్చుకున్నాం. పొదుపు పాఠాల సంగతి సరేసరి. మేమందరం చిన్నప్పుడు మా ప్రతి సెలవులకూ మా అమ్మమ్మ వాళ్లింటికే వెళ్లేవాళ్లం. తన పిల్లలతో పాటు మమ్మల్ని అందరినీ చదువుల వైపు, ఉద్యోగాల వైపు ముఖ్యంగా నిజాయితీతో కష్టపడి పనిచేయాలనే తలంపు వైపు, కుల మతాలకు తావు లేని ఆదర్శాలవైపు తమ జీవన విధానంతోనే మళ్లించిన మా అమ్మమ్మ, తాతయ్యలు శ్రీమతి వావిలాల సీతాదేవి, వెంకటేశ్వర్లు గార్లకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో మాకు అప్పట్లో తెలియలేదు. ఇప్పుడు తెలిసినా, చెప్పడానికి భౌతికంగా వారు మా మధ్య లేదు. అయితేనేం, మా జ్ఞాపకాలలో పదిలంగా ఉన్న మా అమ్మమ్మ, తాతయ్యలకు ఈ రోజున గుండెలనిండుగా థాంక్స్ చెప్పుకునే అవకాశం మాకు కల్పించిన సాక్షికి కూడా థాంక్స్.

– తెల్కపల్లి ఇందిరా ప్రియదర్శిని, కంభం

•••

మా వారికే నా థాంక్స్

నేను థాంక్స్ చెప్పేది ముందుగా మా వారికే. ఎందుకంటే కుటుంబ పరిస్థితుల రీత్యా పెళ్లయ్యే సమయానికి నేను అతి కష్టం మీద డిగ్రీ పూర్తి చేయగలిగాను. అయితే ఇంకా చదువుకోవాలని ఉందన్న నా మనసు గ్రహించింది మా వారు జేవీఎస్ రామారావు గారే. ఇంటిలో పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా, నేను చదువుకునేందుకు ఎంతగానో ప్రోత్సహించారు. ఆయనతోపాటు మా అత్తగారు, మా మామగారు, వదిన గారు కూడా చదువుకుని ఉద్యోగం చేయడంలో ఎంతగానో సహకరించారు. ఇప్పుడు నేను మూడు పీజీలు, రెండు డిగ్రీలు, రెండు డిప్లొమాలు, ఎం.ఈడీ. చేసి ఉద్యోగం చేస్తూ కూడా మరికొద్దికాలంలోనే పీహెచ్‌డీ కూడా పూర్తి చేయబోతున్నానంటే అందుకు మా వారి ప్రోత్సాహ సహకారాలే కారణం. అందుకే మా వారికే నా ధన్యవాదాలు.

– డి.ఎల్. అనూరాధ, భద్రాద్రి కొత్తగూడెం

•••

తండ్రి తర్వాత తండ్రి లాంటి...

నేను నా జీవితంలో నా తల్లిదండ్రుల తర్వాత అంతగా రుణ పడిన ఏకైక వ్యక్తి మా మేనమామ కొన్నూరు సత్యారెడ్డిగారే. నా చిన్నప్పుడు నా సోదరుడి అనారోగ్య పరిస్థితుల్లో, నా తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతుంటే వారికి అండగా ఉంటూ, నన్ను గుండెలపై పెట్టి పెంచుకున్న ఆ రోజులను నేను ఎప్పటికీ మరచిపోలేను. ఆయన ప్రేమతో పెట్టిన గోరు ముద్దలతో పెరిగిన ఈ దేహం పడిపోయే వరకూ ఆయన పేరు కాపాడుకుంటూ నిలబడే ఉంటుంది. నన్ను పెంచి పెద్ద చేసి, విలువలు నేర్పి, ఇంతవాణ్ణి చేసిన నా మేనమామకు సాక్షి పత్రిక వేదికగా కృతజ్ఞతలు తెలుపుతున్నందుకు సంతోషిస్తున్నాను.

– లంకల అన్వేశ్వర్ రెడ్డి, కుమార లింగం పల్లి, మహబూబ్‌నగర్ జిల్లా

పంజాబ్‌లో హెరాయిన్‌ని 'చిట్టా' అంటారు.
దీని అడిక్షన్‌లో పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.
డ్రగ్స్‌ను వ్యతిరేకించడానికి నేడు తల్లులే రంగంలోకి దిగారు.
పంజాబ్‌లో 'మదర్స్ ఎగైనెస్ట్ డ్రగ్స్' మొదలైంది.
నిజానికి ఇది ప్రతి రాష్ట్రంలో జరగాలి.
డ్రగ్స్ నీడ లేని ఇల్లే సమాజానికి వెలుగు.



● రక్ష 'మామ్'

అమ్మే దిగివస్తే మత్తు దిగదా..

పంజాబ్‌లో 'డ్రగ్స్' మహమ్మారి వ్యాపించి ఉంది. ప్రకృతిలోని మహమ్మారికి మందు ఉంది వాక్సిన్‌లు ఉన్నాయి... కాని ఈ మహమ్మారికి మందు లేదు. దీనిని నివారించాలంటే మానవశక్తి కావాలి. మహా శక్తి కావాలి. ఆ శక్తి తల్లే తప్ప మరెవరూ కాలేరని పంజాబ్‌లో 'మదర్స్ ఎగైనెస్ట్ డ్రగ్స్' ఉద్యమం మొదలైంది. 'పంజాబ్ లిటరేచర్ ఫౌండేషన్' అనే సంస్థ సెప్టెంబర్ 15న హోషియార్ పూర్‌లో ఈ ఉద్యమం మొదలెట్టింది. ఈ కార్యక్రమానికి తల్లులు భారీగా తరలి వచ్చారు. పిల్లలు వ్యసనాల బారిన పడితే కడుపుకోతకు గురయ్యేది మొదట తల్లులే. పిల్లల్ని కాపాడుకోవాల్సింది మొదట వారే.

13 నుంచి 18 ఏళ్ల మధ్యలో

పిల్లల వయసు 13 నుంచి 18 ఏళ్ల మధ్య వరకు తల్లులు వారిని జాగ్రత్తగా గమనించుకుంటే డ్రగ్స్ నుంచి కాపాడుకోవచ్చని 'పంజాబ్ లిటరేచర్ ఫౌండేషన్' స్థాపకుడు, రచయిత కుష్వంత్ సింగ్ అన్నాడు. పంజాబ్‌లోని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ఆయన 'మదర్స్ ఎగైనెస్ట్ డ్రగ్స్' ఉద్యమానికి అంకురార్పణ చేశాడు. 'పంజాబ్‌లో 13 నుంచి 18 ఏళ్ల మధ్యలో పిల్లలు డ్రగ్స్‌కు పరిచయం అవుతున్నారు. 14 నుంచి 24 ఏళ్ల మధ్య వీళ్లు అడిక్ట్స్‌గా మారుతున్నారు. వీరిని తీసుకెళ్లి రీహాబిలిటేషన్ సెంటర్స్‌లో పడేస్తే మారే వారు ఒక శాతం మాత్రమే ఉంటున్నారు. అంటే డ్రగ్స్ బాని సత్వం ఎంత ప్రమాదమో అర్థం చేసుకోవాలి' అన్నాడాయన. 'పంజాబ్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గత సంవత్సరం చండీగఢ్ నుంచి భగత్ సింగ్ స్వగ్రామమైన ఖట్కర్ కలాన్ వరకూ పాదయాత్ర చేసినప్పుడు దారిలో ఎందరో తల్లులు వచ్చి మా పిల్లలు బాగుపడే మార్గం లేదా అని అడిగేవారు. తల్లులే మొదటి రక్షకులుగా మారితే పిల్లలను డ్రగ్స్‌వైపు వెళ్లకుండా ఆపొచ్చని నాకు అనిపించింది. దాని ఫలితమే ఈ ఉద్యమం' అని తెలిపాడతడు.

> **అమ్మ వల్లే మారాను**
>
> 'మదర్స్ ఎగైనెస్ట్ డ్రగ్స్' ఉద్యమంలో భాగంగా డ్రగ్స్ నుంచి బయటపడి సామాన్య జీవితం గడుపుతున్న వారి కథనాలు కూడా స్వయంగా వినిపించారు. 'నేను డ్రగ్స్ నుంచి కేవలం మా అమ్మ వల్ల బయట పడ్డాను. ఒక దశలో హెరాయిన్ డోస్ కోసం 2 లక్షలు కూడా ఖర్చు పెట్టడానికి వెనుకాడలేదు. మా అమ్మ నా కోసం అనేక త్యాగాలు చేసి మామూలు మనిషిని చేసింది' అని ఒకతను తెలిపాడు.

మంచాలకు సంకెళ్లు

పంజాబ్‌లో హెరాయిన్ వ్యసనపరులు లెక్కకు మించి ఉన్నారు. దీనిని అక్కడ 'చిట్టా' అంటారు. దాని కోసం పిల్లలు ఎంతకైనా తెగిస్తారు. వారిని డ్రగ్స్ కోసం వెళ్లకుండా ఉంచేందుకు తల్లిదండ్రులు మంచాలకు సంకెళ్లు వేసి కట్టేసి ఉంచడం సర్వసాధారణం. పంజాబ్‌లో కొన్ని ఊళ్లు డ్రగ్స్ వల్ల చనిపోయిన వ్యక్తుల భార్యలతో నిండి 'వితంతువుల పల్లెలు'గా పేరు పడటం సమస్య తీవ్రతను తెలుపుతుంది.

తల్లులకు ట్రైనింగ్ ఇస్తే

మదర్స్ ఎగైనెస్ట్ డ్రగ్స్ ఉద్యమంలో తల్లులను ఒకచోట చేర్చి డ్రగ్స్ గురించి అవగాహన కలిగిస్తారు. ఉదాహరణకు ఢిల్లీకి చెందిన గౌరవ్ గిల్ అనే బాడీ లాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్ డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నవారి శారీరక కదలికలు ఎలా ఉంటాయి, వారి ప్రవర్తన ఎలా ఉంటుందో ఈ సందర్భంగా తల్లులకు తెలియచేసి పిల్లల్లో ఈ మార్పు చూడగానే అలెర్ట్ అవ్వాలని కోరాడు. 'తొలి రోజుల్లోనే గమనిస్తే చాలా మేలు జరుగుతుంది. చాలాసార్లు పరిస్థితి చేయి దాటి పోయాకే పిల్లలు డ్రగ్ ఎడిక్ట్స్ అయ్యారని తల్లిదండ్రులు గమనిస్తున్నారు' అని అక్కడకు వచ్చిన పోలీసు అధికారులు తెలిపారు. అందుకే ఈ ఉద్యమంలో డ్రగ్స్ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసుల హెల్ప్‌లైన్‌కు ఎలా తెలపాలి, పోలీసుల సహాయం ఎలా తీసుకోవాలో తెలియచేస్తారు. 'గ్రామీణ స్త్రీలకు ఈ శిక్షణ ఉంటే గ్రామాల్లో యువకులు డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోగలరు' అంటున్నారు ఈ ఉద్యమ బాధ్యులు.

ఎన్నో రకాలు

మత్తు పదార్థాలంటే హెరాయిన్, గంజాయి మాత్రమే కాదు. వైటెనర్స్‌తో మొదలు దగ్గుమందు వరకు ఎన్నో ఉన్నాయి. డ్రగ్స్ చలామణి కోసం పంజాబ్‌లో దగ్గు మందు ముసుగులో ఫ్యాక్టరీలు తయారయ్యి ప్రాణాంతక స్థాయిలో దగ్గుమందులోని రసాయనాలను ఇంజెక్షన్లుగా ఎక్కించునే విధంగా తయారు చేస్తున్నారు. అంతేకాదు గ్రాము బరువుకు ఎక్కువ పొడి వచ్చే విధంగా తయారు చేయడంతో ఒక్క గ్రాముతో కూడా రోజు గడపొచ్చనుకుని అలవాటు పడుతున్నారు.

ఏం చేయాలి?

తల్లిదండ్రులు పిల్లలతో తరచూ సమయం గడపాలి. వారితో విహారాలు చేయాలి. ఆ సమయంలో వారి మనోభావాలు విని స్నేహాలు తెలుసుకోవాలి. చదువుల్లో మార్కులు తెలుసుకోవాలి. ప్రవర్తనను గమనించాలి. ఇవన్నీ ఏమాత్రం తేడా వున్న అనుమానించి ఆదుకోవాలి. ఈ స్పీడు యుగంలో ఎవరూ ఈ పని చేయడం లేదు. తల్లులకు తప్పదు. వారే రక్షకులు.

హెల్దీ డైట్

క్యారట్ – చీజ్ బ్రెడ్ రోల్



కావలసినవి: క్యారట్ తురుము – కప్పు; చీజ్– పావు కప్పు; టొమాటో కెచప్ – టేబుల్ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; మిరియాల పొడి– పావు టీ స్పూన్; సెలరీ లేదా కొత్తిమీర తరుగు – 2 టీ స్పూన్‌లు; బ్రెడ్ స్లయిస్‌లు – 6.

తయారీ: ● ఒక పాత్రలో క్యారట్ తురుము, చీజ్, సెలరీ, టొమాటో కెచప్, ఉప్పు, మిరియాల పొడి వేసి కలిపి ఈ మిశ్రమాన్ని పక్కన పెట్టాలి ● బ్రెడ్ స్లయిస్‌ల అంచులు కట్ చేసి తీసేయాలి. బ్రెడ్ స్లయిస్‌లను రోలింగ్ పిన్‌తో వత్తాలి. ఇలా చేయడం వల్ల గుల్లగా, ఒత్తుగా ఉన్న బ్రెడ్ స్లయిస్ పలుచగా, గట్టిగా మారుతుంది ● బ్రెడ్ స్లయిస్‌లను తేమ లేని ప్లేట్‌లో పెట్టి ఒక్కో స్లయిస్ మీద ఒక స్పూన్ క్యారట్, చీజ్ మిశ్రమాన్ని వేసి సమంగా సర్దాలి. ఇప్పుడు క్యారట్ మిశ్రమం పడిపోకుండా జాగ్రత్తగా స్లయిస్‌ని రోల్ చేయాలి. ఇలా అన్నింటినీ చేసి సర్వ్ చేయాలి.



దాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

టోస్ట్ చేయాలంటే...
● పెనం వేడి చేసి అందులో టీ స్పూన్ వెన్న కరిగించి బ్రెడ్ రోల్స్‌ని అమర్చి సన్న మంట మీద గోధుమరంగులోకి వచ్చే వరకు కాలనివ్వాలి. ఇవి కరకరలాడుతుంటాయి. పిల్లలు బాగా ఇష్టపడతారు.

పోషకాలు: (మొత్తం ఆరు స్లయిస్‌లలో సుమారుగా): క్యాలరీలు – 800.

● బొమ్మ గీచిన బొమ్మ

కళ 'నైనా' కనని కాలం చెల్లని..



నైనా దలాల్

కొన్ని దశాబ్దాల క్రితం...

నైనా దలాల్ వేసిన చిత్రాలు ఆనాటి కళాభిమానులకు షాకింగ్‌గా అనిపించాయి. ఆమె చిత్రాలు కాలం కంటే చా...లా ముందు ఉండడమే దీనికి కారణం.

లండన్‌లో వెస్టర్న్ ఆర్ట్‌ను అధ్యయనం చేసిన తొలి భారతీయ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందిన తొంభై సంవత్సరాల నైనా దలాల్ సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ న్యూ ఢిల్లీలోని ట్రావెన్ కోర్ హౌస్‌లో జరుగుతోంది.



సాధారణ ప్రజల కథలను చెప్పడమే లక్ష్యంగా నైనా దలాల్ కుంచె సామాన్యుల జీవితాల్లోకి వెళ్లింది. ఆమె చిత్రాలలో నాస్టాల్జియా తొంగి చూస్తుంది.

'నైనా దలాల్ ఆర్ట్ వర్క్‌ను చాలా తక్కువ మంది అర్థం చేసుకున్నారు' అంటారు కొద్దిమంది విశ్లేషకులు.



కామన్వెల్త్ స్కాలర్‌షిప్ అందుకొని లండన్‌కు వెళ్లింది దలాల్. లండన్‌లో వెస్టర్న్ ఆర్ట్‌ను అధ్యయనం చేసిన మొదటి భారతీయ ఆర్టిస్ట్‌గా తన ప్రత్యేకత చాటుకుంది. నైనా దలాల్ ప్రింట్ మేకింగ్ కోర్సులో చేరినప్పుడు చాలామంది ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ప్రింట్ మేకింగ్ అనేది పురుషాధిక్య మాధ్యమంగా గుర్తింపు పొందింది. భారీ యంత్రాలతో పనిచేయాల్సి వచ్చేది. అయితే నైనా దలాల్ అసాధారణ ప్రతిభ ముందు అపోహలు నిలబడలేకపోయాయి.

ఫెమినిజంకు సంబంధించి ఫస్ట్ వేవ్ బలాన్ని సంతరించుకుంటున్న కాలంలో, మన దేశంలోని మహిళా కళాకారులు ఫెమినిస్ట్ భావాలతో స్ఫూర్తి పొందుతున్న కాలంలో ఆమె తన కుంచెను బలమైన మాధ్యమంగా ఉపయోగించింది. మాతృత్వం నుంచి ఒంటరితనం వరకు తన చిత్రరచనకు నైనా ఎన్నో ఇతివృత్తాలు ఎంచుకుంది.

బెంచీలు, బూట్లు, రాళ్లు, గోడలు, కొండలలాంటి నిర్జీవమైన వాటి నుంచి జంతువులు, పక్షుల వరకు ఆ చిత్రాలలో కనిపిస్తాయి. ప్రతి ఒక్కరూ వాటితో తమ జ్ఞాపకాలను పంచుకునేలా చేస్తాయి. ఆ జ్ఞాపకాలు ఒక వ్యక్తికి మరో వ్యక్తికి భిన్నంగా ఉంటాయి. నైనా దలాల్‌ను ఇతర ప్రముఖ భారతీయ మహిళా కళాకారుల నుండి వేరు చేసిన అంశం ప్రింట్ మేకింగ్‌తో చేసిన లిథోగ్రాఫ్, కొలాగ్రాఫ్‌లు.

1960లో నైనా దలాల్ లండన్‌కు మకాం మార్చింది.

ఇండియాలో ఉన్నప్పుడు స్పాన్సర్ షోల కంటే సొంత ఆర్ట్ షోలే ఎక్కువ చేసింది.

'నైనా దలాల్ వివిధ మాధ్యమాల్లో వందలాది చిత్రాలను సృష్టించింది. ఈ ప్రదర్శన ఒక మినీ –రెట్రోస్పెక్టివ్ లాంటిది' అంటున్నారు నైనా దలాల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు.

> **సహనం నుంచి సంకల్పబలం వరకు...**
>
> మహిళల గురించిన నా ఆలోచనలు కాలంతో పాటు మారుతూ వచ్చాయి. అవి నా చిత్రాల్లో ప్రతిఫలిస్తాయి. మహిళల్లో ఉండే సహనం నుంచి సంకల్పబలం వరకు ఎన్నో వెలుగులు నా చిత్రాల్లో కనిపిస్తాయి. నా కళలో కాల్పనిక విషయాలు కనిపించవు. నా చుట్టూ కనిపించే సాధారణ ప్రజల జీవితాలే కనిపిస్తాయి. శ్రామిక జీవుల గురించి చదివినప్పుడు, విన్నప్పుడు వారికి సంబంధించిన ఆలోచనలు నా మనసులో సుడులు తిరుగుతుంటాయి. ఆ అలజడిని నా చిత్రాల్లోకి తీసుకువస్తుంటాను. నా కళ వారికి గొంతు ఇస్తుందని అనుకుంటున్నాను.
>
> – నైనా దలాల్

వంటిల్లు

రాగి కోసం ఓ రోజు

వీక్లీ మెనూలో రాగికి చోటివ్వండి.
ఉదయం రాగి ఉప్మా మంచి బ్రేక్‌ఫాస్ట్.
రాగి కుకీస్ చేసి డబ్బాలో పెట్టండి.
టీ తాగుతూ డబ్బా మూత తీయండి.

రాగి కుకీస్



కావలసినవి: రాగిపిండి – కప్పు; గోధుమపిండి – కప్పు; చక్కెర పొడి – కప్పు; బేకింగ్ పౌడర్ – టీ స్పూన్; యాలకుల పొడి– అర టీ స్పూన్; నెయ్యి – 15 టేబుల్ స్పూన్‌లు; పాలు – 4 టేబుల్ స్పూన్‌లు (అవసరమైతేనే వాడాలి).

తయారీ: ● నెయ్యి కరిగించి పక్కన పెట్టాలి ● వెడల్పు పాత్రలో రాగిపిండి, గోధుమ పిండి, చక్కెర పొడి, యాలకుల పొడి, బేకింగ్ పౌడర్ వేసి అన్నీ సమంగా కలిసేటట్లు గరిటెతో బాగా కలపాలి. ఇప్పుడు నెయ్యి వేసి మళ్లీ కలపాలి. చపాతీల పిండిలా ముద్దగా వస్తుంది. తగినంత తేమలేదనిపిస్తే పాలు కలపాలి. ఈ పిండి మీద మూత పెట్టి అరగంట పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి ● ఒవెన్‌ను 170 డిగ్రీలు వేడి చేయాలి ● పిండిని ఫ్రిజ్‌లో నుంచి తీసి పెద్ద నిమ్మకాయంత గోళీలు చేయాలి. ఒక్కో గోళీని అరచేతిలో వేసి వత్తాలి. ఫోర్క్‌తో నొక్కి గాట్లు పెట్టి బేకింగ్ ట్రేలో సర్దాలి ● ట్రేని ఒవెన్‌లో పెట్టి 12 నిమిషాల సేపు ఉంచాలి. కుకీ మందంగా ఉందనిపిస్తే మరో నిమిషం అదనంగా ఉంచాలి ● ఒవెన్ లేకపోతే ప్రెషర్ కుకర్‌లో కూడా బేక్ చేసుకోవచ్చు. కుకర్‌లో ఉప్పు చల్లి గాస్కెట్, వెయిట్ తీసేసి మూత పెట్టి వేడి చేయాలి. ఆ తర్వాత కుకీలను అమర్చిన ట్రేని జాగ్రత్తగా కుకర్‌లో పెట్టి సన్న మంట మీద 15 నిమిషాల సేపు ఉంచాలి. అయితే కుకర్‌లో ఒకేసారి అన్నింటినీ బేక్ చేయడం కుదరకపోవచ్చు. కుకర్ సైజ్, ట్రే సైజ్‌ను బట్టి నాలుగైదు సార్లుగా చేయాలి ● ఈ బిస్కట్‌లను గాలి దూరని బాటిల్‌లో నిల్వ చేస్తే మూడు వారాల పాటు తాజాగా ఉంటాయి.

రాగి ఉప్మా



కావలసినవి: రాగి రవ్వ– కప్పు; నీరు – రెండున్నర కప్పులు; ఉల్లి పాయ ముక్కలు – పావు కప్పు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె లేదా నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు; కరివేపాకు – 2 రెమ్మలు; పచ్చిమిర్చి – 2 (తరగాలి); ఇంగువ – చిటికెడు; ఆవాలు – అర టీ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; వేరుశనగ పప్పు – 3 టేబుల్ స్పూన్‌లు; అల్లం తరుగు – టీ స్పూన్; పచ్చి శనగపప్పు – అర టేబుల్ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; నిమ్మకాయ –1 (పలుచగా తరగాలి).

తయారీ: ● రాగి రవ్వను కడిగి నీటిని వడపోయాలి. రవ్వ మునిగేటట్లు నీటిని పోసి అరగంట సేపు నాన పెట్టాలి. తర్వాత నీటిలో నుంచి రవ్వను తీసి పిడికిలితో గట్టిగా నొక్కి నీరంతా పోయేటట్లు చేసి (ఇడ్లీ రవ్వలాగానే) పక్కన పెట్టాలి ● బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, వేరుశనగపప్పు, శనగపప్పు, మినప్పప్పు వేసి దోరగా వేగిన తర్వాత అందులో ఉల్లిపాయ ముక్కలు, అల్లం, పచ్చిమిర్చి, కరివేపాకు, ఇంగువ వేయాలి. ఉల్లిపాయ ముక్కలు వేగిన తర్వాత రవ్వ వేసి సన్నమంట మీద దోరగా వేయించాలి. ఈ లోపు పక్కన మరో స్టవ్ మీద నీటిని వేడి చేయాలి. రవ్వ వేగి మంచి వాసన వచ్చేటప్పుడు ఉప్పు వేసి నీటిని పోసి కలిపి రుచి చూసి అవసరమైతే మరికొంత ఉప్పు కలిపి బాణలి మీద మూత పెట్టాలి. రెండు నిమిషాల తర్వాత మూత తీసి కొత్తిమీర చల్లి మళ్లీ మూత పెట్టాలి ● నీరంతా ఇంకి పోయిన తర్వాత స్టవ్ ఆపేయాలి.

గమనిక: కొత్తిమీర చల్లే ముందు రవ్వను పట్టుకుని చూసి ఉడకలేదనిపిస్తే మరో అరకప్పు నీటిని పక్క స్టవ్ మీద వేడి చేసి ఉప్మాలో కలపాలి. రాగి రవ్వకు బొంబాయి రవ్వకంటే ఎక్కువ నీరు పడుతుంది.

● వర్క్... వల్చర్

పని.. ప్రాణం మీదకు

'ల్యాప్‌టాప్ అనేది నా శరీరంలో ఒక భాగం అయింది' ఇచట, అచట అనే తేడా లేకుండా ఎప్పుడూ ఆఫీసు పనిలో తలమునకలయ్యే ఉద్యోగి మాట ఇది. 'మాకు ఉగాదులు లేవు ఉషస్సులు లేవు' అని కవి అన్నట్లు పనిభారంతో ఒత్తిడికి గురవుతున్న చాలామంది ఉద్యోగులకు జీవితం లేకుండా పోతోంది. పని కోసం జీవితాన్నే పణంగా పెట్టాల్సి వస్తోంది.

26 ఏళ్ల తన కుమార్తె మరణానికి 'అధిక పనిభారం' కారణం అని ఆరోపిస్తూ ఆమె తల్లి 'ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా' కంపెనీ చైర్మన్‌కు రాసిన లేఖ ఇంటర్‌నెట్ సెన్సేషన్ అయింది. విషపూరిత పని సంస్కృతిని ఎత్తి చూపేలా ఉన్న ఈ లేఖపై సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతోంది...



అన్నా సెబాస్టియన్

కొచ్చికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ అన్నా సెబాస్టియన్ కొన్ని నెలల క్రితం పుణెలోని 'ఎర్నెస్ట్ అండ్ యంగ్' కంపెనీలో చేరింది. అధిక పనిభారం కారణంగా అన్నా సెబాస్టియన్ ఆరోగ్యం త్వరగా క్షీణించిందని ఆమె తల్లి అనితా అగస్టీన్ 'ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా' హెడ్ రాజీవ్ మెమానికి రాసిన లేఖలో ఆరోపించింది.

'ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా'లాంటి పెద్ద కంపెనీలో ఉద్యోగం రావడంతో అన్నా సెబాస్టియన్ చాలా సంతోషించింది. అయితే ఆ సంతోషం కొద్ది నెలల్లోనే ఆవిరైపోయింది. 'అధిక పని వల్ల రాత్రి పొద్దుపోయే వరకు, వారాంతాల్లో కూడా పనిచేసేది. ఎప్పుడూ అలిసిపోయి కనిపించేది' అని కుమార్తె గురించి రాసింది అనిత అగస్టీన్.

'నా బిడ్డ తన ప్రాణాలను మూల్యంగా చెల్లిస్తుందని అనుకోలేదు' అని కళ్లనీళ్ల పర్యంతం అయింది అనిత.

'ఎక్స్'లో ఆమె రాసిన లేఖకు రెండు మిలియన్‌లకు పైగా వ్యూస్ వచ్చాయి.

అనిత అగస్టీన్ లేఖ నేపథ్యంలో ఆగ్రహావేశాలు వెల్లువెత్తడంతో, అన్నా మృతికి సంతాపం తెలుపుతూ 'ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా' కంపెనీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఉద్యోగులకు సంబంధించి ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని కల్పించడానికి కంపెనీ ప్రాధాన్యత ఇస్తుందని హామీ ఇచ్చింది.

అయితే వారి హామీ నెటిజనుల ఆగ్రహాన్ని తగ్గించలేదు.

'కంపెనీ నుండి ఎవరూ నా కుమార్తె అంత్యక్రియలకు హాజరుకాలేదు' అంటూ అనిత వెల్లడించిన తరువాత నెటిజనుల కోపం మరింత ఎక్కువ అయింది. 'కంటి తుడుపు మాటలు కాదు కార్యాచరణ ముఖ్యం' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనితా అగస్టీన్ లేఖపై కళాకారులు, రచయితలు స్పందించారు.

'చిన్న వయసులోనే కూతురుని కోల్పోయిన అనితను చూస్తుంటే, ఆమె రాసిన లేఖ చదువుతుంటే కన్నీళ్లు ఆపుకోవడం కష్టంగా మారింది. ఆమె అంత్యక్రియలకు హాజరు కావాలనే కనీస మర్యాద లేని యజమానులు ఉండడం సిగ్గు చేటు. కార్పొరేటు శక్తుల కోసం మీ ఆరోగ్యాన్ని, మీ జీవితాన్ని బలి చేసుకోవద్దు' అని స్పందించింది రచయిత్రి నందితా అయ్యర్.

ఒకానొక సమయంలో రోజుకు 14 గంటలకు పైగా పనిచేసిన సింగర్ పౌశాలి సాహు తన గతాన్ని గుర్తు తెచ్చుకుంది.

'అన్నా సెబాస్టియన్ గుర్తుకు వచ్చినప్పుడల్లా మనసు భారం అవుతోంది. నా గత కాలం గుర్తుకు వస్తుంది. తీరిగ్గా కూర్చోలేని పని ఒత్తిడి... చివరికి వీకెండ్స్‌లో కూడా పనిచేయాల్సి వచ్చేది. అప్పటి పనిభారం ఇప్పటికీ ఏదో రూపంలో నాపై ప్రభావం చూపుతూనే ఉంది' అంటూ స్పందించింది పౌశాలి సాహు.

'మన దేశంలో పని భారం భయంకరంగా ఉంది. వేతనం నిరాశాజనకంగా ఉంది. నిత్యం కార్మికులను వేధిస్తున్న యజమానులలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించడం లేదు' అని ఒక యూజర్ స్పందించాడు.

అన్నా సెబాస్టియన్ మరణం హాస్టల్ కల్చర్, విషపూరిత పని ప్రదేశాల ప్రమాదాల గురించి కూడా చర్చను రేకెత్తించింది.

లైఫ్@360

హెల్త్ టిప్స్



- ఆహారాన్ని బాగా నమిలి తినడం వల్ల చర్మం త్వరగా ముడతలు పడదు. ఎక్కువ సేపు నమలడం ద్వారా ముఖంలోని కండరాలు శ్రమిస్తాయి. చర్మపు మెటబాలిజమ్ మెరుగవుతుంది. కాబట్టి ముడతలు పడవు.
- బెల్లంలో మిరియాల పొడి, పెరుగు కలిపిన మిశ్రమాన్ని నిద్రించే ముందు తీసుకుంటే జలుబు తగ్గుతుంది.
- ఒక గ్లాసు మంచినీరు, ఐదు లేక ఆరు మిరియాలు, ఒక వెల్లుల్లి రెబ్బ, చితక్కొట్టిన అల్లం ముక్క ఒకటి, చిన్న బెల్లం ముక్క ఇవన్నీ వేసి నీరు సగం అయ్యేంత వరకు కాచండి. వేడిగా ఉండగానే తాగండి. దీనిని సేవించడం వల్ల దగ్గు, జలుబు, గొంతు గరగర వంటి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- బాదం పప్పు, గసగసాలు కలిపి తింటే రక్తం శుద్ధి అవుతుంది.
- బొప్పాయి కాయను కానీ, ఆకుని కానీ మెత్తగా కాటుకలా నూరి ఆ ముద్దని అరికాళ్ళ ఆనెల మీద పెట్టి, కట్టుకడితే అవి మెత్తబడతాయి.
- మజ్జిగలో కొంచెం పసుపు, కాస్త ఉప్పు కలుపుకొని తాగితే విరేచనాలు తగ్గుతాయి.



80/20 నా డైట్ సీక్రెట్

నటి మసాబా గుప్తా జిహ్వాచాపల్యం, తిండి పుష్టి గురించి అందరికీ తెలిసిందే! ఇంట్లో తయారు చేసే రకరకాల చిరుతిళ్లు అంటే ఆమెకు మహా మక్కువ. నోరూరించే రకరకాల తినుబండారాలకు నో చెప్పలేని బలహీనత ఆమెది. అయితే వాసికీ, రాశికీ మధ్య సమతూకాన్ని పాటించడం ఆమెకు తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో అనిపిస్తుంది. డైట్ విషయంలో తాను 80/20 సూత్రాన్ని పాటిస్తానని చెప్పిన మసాబా గుప్తా ఇన్‌స్టాగ్రామ్‌లో కరోసెల్ అనే క్యాప్షన్ కింద తన రోజువారీ డైట్ గురించిన వివరాలు ఇలా పంచుకుంది.

''80/20 రూల్ అనేది నా పాలిట బంగారం లాంటిది. ఇక్కడ 80 అనేది ప్రోటీన్లతో కూడిన బలవర్థకమైన ఆహారాన్ని సూచిస్తే, 20 నాకు నచ్చిన ఆహారాన్ని సూచిస్తుంది. (పేస్ట్రీలు, ఫ్రెంచ్ ఫ్రైస్, పిజ్జా బర్గర్‌లను సూచిస్తూ ఇమోజీలు పెట్టింది) వారంలో ఆరు రోజులూ నేను నా శరీరానికి ఏది అవసరమో అది ఇవ్వడానికే ప్రాధాన్యత ఇస్తాను. ఒకరోజు మాత్రం నా నాలుక ఏది కోరిందో అది తీసుకోవడానికే ప్రయత్నిస్తాను'' అని చెప్పింది.

తాను రోజువారీ తీసుకునే డైట్ గురించిన వివరాలు ఇలా పంచుకుంది మసాబా.

''ఉదయం ఆరున్నరకు టేబుల్ స్పూన్ జీలకర్ర, టేబుల్ స్పూన్ సోంపు గింజలను బాగా నమిలి తిని గ్లాసు గోరువెచ్చటి నీళ్లు తాగుతాను. నా దృష్టిలో ఇది అమృత జలం.


తొమ్మిది గంటలకు పెద్ద కప్పు నిండా ముసేలీ, బెర్రీలు. దాంతోపాటు వీలయితే అత్తిపళ్లు (రాస్‌బెర్రీ), నేరేడు పళ్లు.

వర్క్ అవుట్స్ చేసిన తర్వాత పెద్ద గ్లాసు నిండా ప్రొటీన్ షేక్ తీసుకుంటాను. నానబెట్టిన ఐదు బాదం, ఐదు వాల్‌నట్స్ తీసుకుంటా. మధ్య మధ్యలో చల్లటి మజ్జిగ సిప్ చేస్తుంటా.

ఒంటిగంటకు ఆలూ లేదా బెండకాయ ఫ్రై, చికెన్ కర్రీ, రైస్, స్ప్రౌట్స్‌తో చేసిన సలాడ్‌తో సంతృప్తికరమైన లంచ్ చేస్తాను. 5 గంటలకు చికెన్ లేదా చీజ్, కూరగాయలతో టాపింగ్ చేసిన హోల్ వీట్ లేదా మల్టిగ్రెయిన్స్‌తో చేసిన పిజ్జా..

రెండు ఉడకబెట్టిన గుడ్లు, కొద్దిగా చికెన్ గ్రేవీతో ఏడింటికల్లా డిన్నర్ ఫినిష్ చేస్తాను. మొత్తం మీద నా డైట్‌లో కార్బ్స్ కంటే ప్రోటీన్లు ఎక్కువగా ఉండేలా చూసుకుంటాను'' అంటూ ఆమె చేసిన పోస్టింగ్‌కు చాలా లైకులు వచ్చాయి.

'వాచ్' దిస్ ట్రెండ్
కాలం కలిసొస్తోంది



స్మార్ట్ ఫోన్ వచ్చినా రిస్ట్ వాచ్‌లకు 'కాలం' చెల్లలేదు. నిజమే, సెల్ ఫోన్ వచ్చిన తర్వాత రిస్ట్ వాచ్‌లకు కాలం చెల్లిందనిపించింది. ఓ దశాబ్దం పాటు వాచీల మార్కెట్ డీలా పడిన మాట కూడా నిజమే. అయితే ఆ రోజుల్లో కూడా సెలబ్రిటీలు, సంపన్నులు, తరచూ విదేశీ టూర్లు చేసే వాళ్లు లక్షల ఖరీదు చేసే వాచ్‌లు పెట్టుకోవడం మాత్రం కొనసాగింది. మన సినీ సెలబ్రిటీలైతే రిచర్డ్ మిల్లె, టగ్ హెయర్, హబ్లాట్, ఫ్రాంక్ ముల్లర్, ఆడెమర్స్ పిగ్యూట్, రాడో, పటేక్ ఫిలిప్పె, ఓమెగా, రోలెక్స్ నుంచి ఐడబ్ల్యూసీ వరకు ఐదు కోట్ల విలువ చేసే వాచ్‌ల నుంచి ఐదు లక్షల రూపాయల వాచ్‌లు వాడుతున్నారు. ఈ ట్రెండ్ సెలబ్రిటీల దగ్గరే ఆగిపోకుండా గడచిన రెండేళ్లుగా కామన్ మ్యాన్ వరకు విస్తరించింది. ఎగువ మధ్యతరగతి, మధ్య తరగతి కూడా యాభై వేల నుంచి లక్షల రూపాయల రిస్ట్ వాచ్‌లు కొనుగోలు చేస్తోంది. ప్రపంచ గడియారాల తయారీ కేంద్రం స్విట్జర్లాండ్ నుంచి మనదేశానికి దిగుమతి అవుతోన్న వాచ్‌ల సంఖ్య ఏడాదకేడాదికీ పెరుగుతోంది. 2026 నాటికి స్విస్ నుంచి వాచ్‌లు దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ టాప్‌టెన్‌లో ఉంటుందని చెబుతున్నారు ఆ దేశ మార్కెట్ నిపుణులు.

బాలీవుడ్ హీరో షారూక్ ఖాన్ చేతికి ఒకసారి సుమారు 4.75 కోట్ల విలువ చేసే నీలంరంగు ఆడెమర్స్ పిగ్యూట్ వాచ్‌తో మెరిపించాడు. కోట్ల నుంచి ఐదు లక్షల విలువ చేసే టగ్ హెయర్ వరకు ఏడెనిమిది వాచ్‌లతో కనిపిస్తాడు ఎస్ఆర్‌కే. టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్టీఆర్ అయితే నాలుగు కోట్ల విలువైన రిచర్డ్ మిల్లె ఎఫ్ 1లో టైమ్ చూసుకుంటాడు. రామ్‌చరణ్ దగ్గర మూడు కోట్ల విలువ చేసే రిచర్డ్ మిల్లె నుంచి ఆరు లక్షల విలువ చేసే రోలెక్స్ యాచ్ మాస్టర్ వరకు అరడజనుకు పైగా వాచ్‌లున్నట్లు సమాచారం. ఇక నటీమణుల విషయానికి వస్తే నయనతార కోటికి పైగా ధర పలికే రిచర్డ్ మిల్లె ఆర్ ఎమ్ 11 వాచ్‌తో కాలాన్ని వాచ్ చేస్తుంది.

ఉంగరంలా

మనదేశంలో 40 ఏళ్లుగా వేళ్లూనుకుని ఉన్న టైటాన్‌తోపాటు దాదాపు 30 కంపెనీలున్నాయి. వీటి మార్కెట్ వీటికి ఉంది. మన దేశీయ కంపెనీలు వందల నుంచి లక్షల విలువ చేసే గోల్డ్ వాచ్‌లు కూడా తయారు చేస్తున్నాయి.

రెండు దశాబ్దాల కిందట సంపన్న మహిళలు బంగారు వాచ్ ధరించి మురిసిపోయేవాళ్లు. ఇప్పుడు రోలెక్స్, రాడో కపుల్ వాచ్‌లు, రోజ్‌గోల్డ్ మీద మనసు పడుతున్నారు. యూఎస్‌కి చెందిన ఫాజిల్ కంపెనీ మహిళల కోసం తయారు చేస్తున్న రోజ్ గోల్డ్ ఫినిషింగ్ వాచ్‌ల మీద మనసు పారేసుకుంటున్నారు. ఇందుకు కారణం ఇండియా నుంచి యూఎస్‌కి మైగ్రేషన్ ఎక్కువ కావడమే. యూఎస్‌లో సెటిలైన యువత వాళ్ల తల్లులకు ఈ వాచ్‌లను బహుమతిగా ఇస్తున్నారు. దాంతో వేడుకల్లో మహిళల మణికట్టుకు రోజ్‌గోల్డ్ వాచ్ మెరుస్తోంది. మొత్తానికి మనదేశంలో వాచ్‌ల ప్రేమికులు ఒక్కొక్కరు ఒకటి కంటే ఎక్కువ వాచ్‌లు కొంటున్నారు. యువతులు మాత్రం వాచ్ అంటే మణికట్టుకే ఎందుకు పెట్టుకోవాలంటూ వేలికి ఉంగరంలా ధరించే వాచ్‌లకు మొగ్గుచూపుతున్నారు.

– వి.ఎమ్.ఆర్.

అదర్‌సైడ్
నువ్వు విజిలేస్తే...

ప్రతి సంవత్సరం మన దేశంలో నిమజ్జనోత్సవాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. రకరకాల వేషాల్లో వినాయకుడు సరదాగా ఉన్నాడు. లడ్డూ వేలాలు కోట్లకు చేరుకుంటున్నాయి. ఇన్ని జరుగుతున్నా, ఇన్ని మారుతున్నా ఒక్కటి మాత్రం మారలేదు - నిమజ్జనం లాంటి సమయాల్లో పోగైన జనాల మధ్యనుంచి స్త్రీలని వేధించే పోకిరీ వేషాలు.



కడలి సత్యనారాయణ, రచయిత్రి

నిమజ్జనాలు మొదలైన మూడో రోజు అనుకుంటా. ఒక మీటింగ్ ముగించుకుని ఊబర్ బైక్‌పై ఇంటికొస్తున్నాను. ట్రాఫిక్ మెల్లగా కదుల్తోంది. మా బైక్‌కి కొంచెం ముందు ఒక చిన్న ట్రాలీ ఆటోలో ఒక బుజ్జి వినాయకుడు. క్యూట్‌గా ఉన్నాడు. వినాయకుడి విగ్రహం కంటే చుట్టూ పెట్టిన సౌండ్ సిస్టం పెద్దదిగా ఉంది. డుబ్ డుబ్ అని డీజే సౌండ్లతో మారుమోగిపోతోంది రోడ్డంతా. ట్రాలీలో ఒక పదిమందికి పైగానే కుర్రాళ్ళు ఫుల్ డ్యాన్స్ చేస్తున్నారు. అంతా బావుంది అనుకుంటుండగా ఆ గుంపులో ఒకడు నన్ను చూసి కన్ను కొట్టాడు. అప్పటివరకూ నేనూ సరదాగా చూస్తున్న ఆ దృశ్యం వికృతంగా మారింది.

అంతటితో అయిపోలేదు. నా వైపు చూసి కన్ను కొట్టినోడు, పక్కనున్న మరొకడి చెవిలో ఏదో చెప్పాడు. వాళ్లిద్దరూ ఏం మాట్లాడుకున్నారో ఏమో గట్టిగా నవ్వుకుంటూ అప్పటిదాకా నిలబడి చూస్తున్న వీళ్లిద్దరూ డ్యాన్స్ చేస్తున్న కుర్రాళ్లతో కలిసి అదో రకంగా స్టెప్స్ వేయడం మొదలుపెట్టారు. మామూలుగా అయితే నేను మొహం తిప్పేసుకోవడమో లేదా మొబైల్ చూసుకోవడమో చేసేదాన్ని. కానీ ఆ రోజు మాత్రం వాళ్లవైపే గుడ్లురుమి చూస్తుండిపోయాను. ఎంత కోపంగా చూస్తే అంత రెచ్చిపోతున్నారు. ట్రాఫిక్ కదలడం లేదు. కాసేపటికి నేనే తల తిప్పుకున్నాను.

ట్రాఫిక్ కొంచెం మూవ్ అయింది. మా ఊబర్ డ్రైవర్ ఒక కారు వెనక ఆగిపోయాడు. ఆ ట్రాలీ ఆటో ముందుకు వెళ్లిపోయింది. పాట మారింది. అప్పుడే మమ్మల్ని దాటుకొని ఒక స్కూటీ వెళ్లింది. ఆ స్కూటీ నడుపుతున్న అమ్మాయి మీదకి మారింది ఆ కుర్రాళ్ల చూపు. ఆ అమ్మాయిని చూసి కూడా అవే కోతలు, అవే కేకలు, అవే కుప్పి గంతులు. ఆ అమ్మాయి చున్నీ సర్దుకోవడం నాకు కనిపించింది. ఆ అమ్మాయి ఆ ట్రాలీని కూడా దాటుకొని ఫాస్ట్ గా అక్కడి నుండి వెళ్లిపోయింది. ఓయ్ ఓయ్ అని తరిమాయి ఆ పిల్లని ఈ గాలి మాటలు.

ఆ కుర్రాళ్లు ఆ రాత్రికెప్పుడో నిమజ్జనం పూర్తి చేసుకుని, ఏ అర్ధరాత్రో ఇంటికి చేరుకుని హాయిగా నిద్రపోయుంటారు. కానీ వాళ్ల చేసిన అల్లరికి ఎంతమంది అమ్మాయిలకు ఆ రాత్రి నిద్రపట్టకుండా చేసుంటారో, వాళ్లలో ఎంత భయాందోళనలు కలుగ చేసి ఉంటారో వాళ్లకి తెలిసుండదు.

ఏదో దార్లో అమ్మాయి కనిపిస్తే జస్ట్ విజిలేసా, అంతే అని మగాళ్లకి అనిపించవచ్చు. అదేం పెద్ద విషయం కాదని మన సినిమాలు నార్మలైజ్ చేసుండొచ్చు. కానీ ఈ రకమైన వేధింపులు స్త్రీలకు తీవ్రమైన మానసిక, శారీరక ఇబ్బందులను కలుగచేస్తాయనేది ఇప్పటికైనా అందరూ తెలుసుకోవాల్సిన విషయం.

ఇదో పెద్ద సమస్యా అని తీసిపారేసే విషయం కాదు. 2014లో న్యూయార్క్ లో సోషానా రాబర్ట్స్ అనే మహిళ 10 గంటల పాటు నడిచినప్పుడు దాదాపు 100 సార్లు ఇలాంటి వేధింపులకు గురైంది. ఆమె ఈ అనుభవాన్ని వీడియోగా చిత్రీకరించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ వీడియో వైరల్ అయి, ప్రపంచవ్యాప్తంగా క్యాట్ కాలింగ్‌పై చర్చకు తెరలేపింది.

అంటే ఒకమ్మాయి రోడ్డు మీద గంటసేపు నడిస్తే కనీసం పదిసార్లు ఎవరో ఒకరు ఆమెను అదోలా చూడడమో, ఏదో ఒకటి అనడమో జరుగుతుంది. ఒక్కసారి ఆలోచిస్తే భయంగా లేదా?




సరే ఇది ఒక వైపైతే, నిమజ్జనం చివరి రోజు ఆ జనాల మధ్య ఎంతమంది మగాళ్లు ఆడవాళ్లని తాకరాని చోట తాకుతూ ఎంత హింసకు గురిచేస్తారో, ఈ దేశంలోని ప్రతి మహిళ ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి అనుభవానికి గురయ్యే ఉంటారు. ఇది కేవలం నిమజ్జనానికి సంబంధించిన విషయం కాదు. ఎక్కడ ఎప్పుడు జనాలు గుమిగూడినా జరిగే విషయమే.

ఒక్క ఖైరతాబాద్ గణేష్ మండపం దగ్గర, కేవలం వారం రోజుల్లో మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న 285 మందిని అరెస్ట్ చేశారంటే ఈ సమస్య ఎంత తీవ్రంగా ఉందో ఆలోచించండి.

లైంగిక వేధింపు అనేది కేవలం స్త్రీల సమస్య కాదు, ఇది మన సమాజం మొత్తం ఎదుర్కొంటున్న సమస్య. ఈసారి ఎదురుగా వస్తున్న అమ్మాయిని చూసి ఏదైనా అనాలన్నా, ఏదైనా చెయ్యాలన్నా అక్కడ మీ అమ్మో, అక్కో, చెల్లో ఉంటే ఏం చేస్తారు అని ఒక్కసారి ఆలోచించమని మై డియర్ మగాళ్లను రిక్వెస్ట్ చేస్తున్నాను. అంతేకాదు ఈ సమస్య బయటవేరేవరో కాదు మీ అక్క, మీ చెల్లి కూడా ఎదుర్కొంటున్నారని ఆలోచించమంటున్నాను.

సినిమా



ప్రభాస్

దసరాకి ఖుషీ

దసరా పండగకి ఫ్యాన్స్‌ని ఖుషీ చేయనున్నారట ప్రభాస్. అది కూడా గ్లింప్స్ రూపంలో. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్'లో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇంకా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా అంగీకరించారు. 'స్పిరిట్' చిత్రీకరణ వచ్చే ఏడాది ఆరంభం అవుతుందట. హను రాఘవపూడి దర్శకత్వంలోని సినిమా షూట్ ఆరంభమైంది. మధురైలో ఫస్ట్ షెడ్యూల్ జరుగుతోంది. అయితే ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ పాల్గొనడంలేదు. రెండో షెడ్యూల్ నుంచి పాల్గొంటారట. ఈ సినిమా వీడియో గ్లింప్స్‌ని దసరాకి విడుదల చేయాలనుకుంటున్నారట. 1940ల నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ అనుకుంటున్నారట. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ వచ్చే మార్చికి పూర్తవుతుందని సమాచారం.

దీపావళికి షణ్ముఖ



ఆది, అవికా

ఆది సాయికుమార్ హీరోగా అవికా గోర్ హీరోయిన్‌గా నటించిన డివోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. పాన్ ఇండియా మూవీగా షణ్ముగం సాప్పని దర్శకత్వంలో సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని ఈ చిత్రాన్ని నిర్మించారు. దీపావళికి ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. షణ్ముగం సాప్పని మట్లాడుతూ – ''ఆది సాయికుమార్ కెరీర్‌లో ఓ మైల్‌స్టోన్ మూవీలా నిలిచిపోతుంది. ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో రూపొందించిన చిత్రం ఇది. గ్రాఫిక్స్ ప్రాధాన్యంగా సాగే ఈ చిత్రం విజువల్ వండర్‌లా ఉంటుంది. రవి బస్రూర్ 'షణ్ముఖ'కి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. దీపావళి సీజన్‌లో కుటుంబమంతా కలిసి చూసేలా ఈ సినిమా ఉంటుంది. ఈ పాన్ ఇండియా మూవీని పలు భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.

తీన్ మార్‌తో జోర్‌గా...



'లడ్డు గాని పెళ్లి...' పాట పోస్టర్

లడ్డూగాని పెళ్లి వేడుక మొదలైంది. బంధువులు వచ్చారు. స్నేహితులు వచ్చారు. ఇక స్నేహితులు తమ ఫ్రెండ్ కోసం పాట అందుకున్నారు. హిట్ మూవీ 'మ్యాడ్'కి సీక్వెల్‌గా సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ కాంబినేషన్‌లోనే రూపొందుతోన్న చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'లోని పెళ్లి ఎపిసోడ్ ఇది. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య ఈ సీక్వెల్‌ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'లడ్డు గాని పెళ్లి...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. చిత్ర సంగీతదర్శకుడు భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, మంగ్లీతో కలిసి భీమ్స్ పాడారు. ''తీన్మార్ బీట్‌తో జోర్‌గా సాగే 'లడ్డు గాని పెళ్లి...' పాట థియేటర్లలో ప్రతి ఒక్కరూ కాలు కదిపేలా ఉంటుంది. 'మ్యాడ్'ని అందరూ మెచ్చుకునేలా రూపొందించిన కల్యాణ్ శంకర్ రెట్టింపు వినోదంతో సీక్వెల్‌ని తెరకెక్కిస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది.



ఏఎన్నార్ శత జయంతి కార్యక్రమంలో అక్కినేని కుటుంబ సభ్యులు...

నాన్నగారి పోస్టల్ స్టాంప్ రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది

- అక్కినేని నాగార్జున

''నాన్నగారి (అక్కినేని నాగేశ్వరరావు) శత జయంతి రోజున ఆయన పోస్టల్ స్టాంప్ రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇందుకు పోస్ట్ మాస్టర్ జనరల్ బీఎస్ రెడ్డి గారికి థ్యాంక్స్. శత జయంతిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లోని నాన్నగారి అభిమానులు రక్తదానం, అన్నదానం లాంటి మంచి కార్యక్రమాలు చేశారు. వారందరికీ కృతజ్ఞతలు. మీ ప్రేమ, అభిమానం మర్చిపోలేనిది'' అని నాగార్జున అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి (సెప్టెంబర్ 20) సందర్భంగా ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ ఎన్ఎఫ్‌డీసీ, నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా కలిసి 'ఏఎన్ఆర్ 100– కింగ్ ఆఫ్ ది సిల్వర్ స్క్రీన్' ఫిల్మ్ ఫెస్టివల్‌ని నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఏఎన్ఆర్ కుటుంబ సభ్యులు, అభిమానుల సమక్షంలో అక్కినేని ఐకానిక్ ఫిలిం 'దేవదాసు' స్క్రీనింగ్‌తో ఈ ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా ఏఎన్నార్ 'దేవదాసు, మిస్సమ్మ, మాయాబజార్, భార్యాభర్తలు, 'గుండమ్మ కథ, డాక్టర్ చక్రవర్తి, సుడిగుండాలు, ప్రేమనగర్, ప్రేమాభిషేకం, మనం' సహా ఏఎన్ఆర్ ల్యాండ్‌మార్క్ మూవీస్‌ని దేశవ్యాప్తంగా ప్రదర్శించనున్నారు. ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, అన్నపూర్ణ స్టూడియోస్ పైన పేర్కొన్న చిత్రాల ప్రింట్‌లను 4కేలో పునరుద్ధరించాయి.

'దేవదాసు' స్క్రీనింగ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో **నాగార్జున మాట్లాడుతూ–** ''నాన్నగారు నవ్వుతూ మాకు జీవితాన్ని నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుంటే నవ్వుతూనే ఉంటాం. 31 సిటీల్లో ఈ ఫెస్టివల్ చేస్తున్నారు. నార్త్‌లో అద్భుతమైన స్పందన వస్తోందని శివేంద్ర చెప్పడం ఆనందాన్నిచ్చింది. గోవా ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నాన్నగారి పేరు మీద ఒక చాప్టర్ చేయడం సంతోషంగా ఉంది.

నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ– ''అక్కినేనిగారితో కలసి నటించే అవకాశం రావడంతో పాటు ఆయన బ్యానర్‌లో నిర్మించిన తొలి సినిమాలో నేను నటించడం నా అదృష్టం. హైదరాబాద్‌కి ఫిల్మ్ ఇండస్ట్రీని తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కింది'' అని పేర్కొన్నారు. **నిర్మాత వెంకట్ అక్కినేని మాట్లాడుతూ–** ''నాన్నగారి శత జయంతి రోజున ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ రిలీజ్ చేసింది. బాపుగారు ఆ ఫొటో గీశారు. దాంట్లో నాన్నగారి లక్షణాలన్నీ కలగలిపి ఉంటాయి'' అన్నారు.



అక్కినేని పోస్టల్ స్టాంప్ విడుదల చేస్తున్న దృశ్యం

దర్శకుడు కె. రాఘవేంద్ర రావు మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు, మా నాన్నగారు, నేను, నాగార్జున కలిసి ప్రయాణం చేశాం. నాగేశ్వరరావుగారు హైదరాబాద్‌కి అన్నపూర్ణ స్టూడియోను తలమానికంగా ఇచ్చి వెళ్లారు. 'దేవదాసు, కాళిదాస్, విప్రనారాయణ'.. ఇలా ఎన్నో క్లాసిక్ సినిమాలు ఇచ్చారు. తండ్రీ కొడుకులతో సినిమాలు చేసిన అదృష్టం నాకు దొరికింది'' అని చెప్పారు. **నిర్మాత శివేంద్ర సింగ్ దుంగార్పూర్ మాట్లాడుతూ–** ''ఈ ఫెస్టివల్‌ని దేశంలోని 31 సిటీస్‌లో సెలబ్రేట్ చేసుకుంటున్నాం. ఇదొక హిస్టారికల్ డే. ఈ మూడు రోజుల్లో అక్కినేనిగారి పది క్లాసిక్ సినిమాలు దేశవ్యాప్తంగా ప్రేక్షకులు చూడబోతున్నారు'' అన్నారు. **ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ–** ''నాగేశ్వరరావుగారు 1955లో లక్ష రూపాయలు విరాళం ఇచ్చి గుడివాడలో కళాశాల కట్టించారు. ఆయన దగ్గర పాతిక వేలే ఉంటే 75 వేలు అప్పు తీసుకొచ్చి మరీ లక్ష ఇచ్చారు. 70 ఏళ్ల క్రితమే ఆయన జన్మభూమి కాన్సెప్ట్ అనుకొని ఊర్లో స్కూల్ కట్టించారు. అనేక విద్యాలయాలకు విరాళాలు ఇచ్చారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. బుడమేరుపై వంతెన కట్టించిన ఘనత ఆయనది. కానీ, చేసిన సాయం గురించి ఎప్పుడూ ప్రచారం చేసుకోలేదు'' అని తెలిపారు. **జాయింట్ కలెక్టర్ సంజయ్ మాట్లాడుతూ–** ''ఈ ఏడాది ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఏఎన్ఆర్‌గారి శత జయంతిని భారత ప్రభుత్వం తరపున సెలబ్రేట్ చేసుకోబోతున్నాం. ఈ వేడుకలో భాగం కావడం ఆనందంగా ఉంది'' అన్నారు.


కాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని అక్కినేని అభిమానుల్లో 600 వందల మందికి దుస్తులు బహూకరించారు.

చిరంజీవికి ఏఎన్ఆర్ అవార్డు

''ప్రతి రెండేళ్లకు ఏఎన్ఆర్ అవార్డు ఇస్తున్నాం. ఈ ఏడాది ఈ అవార్డుని చిరంజీవిగారికి ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఈ విషయం చెప్పగానే చిరంజీవిగారు ఎమోషనల్‌గా నన్ను హత్తుకుని.. 'ఏఎన్ఆర్‌గారి శత జయంతి ఏడాదిలో నాకు అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉంది. దీనికంటే పెద్ద అవార్డు లేదు' అని అన్నారు. అక్టోబర్ 28న నిర్వహించే ఈ ఫంక్షన్‌లో అమితాబ్ బచ్చన్‌గారి చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేస్తాం'' అని నాగార్జున తెలిపారు.

యాక్షన్ స్టార్ట్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీర మల్లు పార్ట్–1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఈ నెల 23న విజయవాడలో ఆరంభమయ్యే కొత్త షెడ్యూల్‌లో పవన్ కల్యాణ్ పాల్గొంటారని యూనిట్ పేర్కొంది. ''ఈ షెడ్యూల్‌లో హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశం చిత్రీకరించనున్నాం. పవన్ కల్యాణ్ పాల్గొననున్న ఈ సన్నివేశాన్ని 400 మంది సిబ్బందితో భారీ సంఖ్యలో జూనియర్ ఆర్టిస్టులు, ఫైటర్లతో చిత్రీకరించనున్నాం'' అని నిర్మాత తెలిపారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ ఏడాదే ఈ చిత్రం విడుదల కానుంది.



పవన్ కల్యాణ్

తర్వాత ఏం జరుగుతుంది?



ధన్సిక

'మంత్ర , మంగళ' వంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న ఓషో తులసీరామ్ తెరకెక్కించిన తాజా చిత్రం 'దక్షిణ'. ధన్సిక లీడ్ రోల్‌లో అశోక్ షిండే నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 4న రిలీజ్ కానుంది. ''సైకో థ్రిల్లర్ జానర్‌లో 'దక్షిణ' ట్రెండ్ సెట్టర్ అవుతుందనే నమ్మకం ఉంది. తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ ప్రేక్షకులకు కలిగించేలా తులసీరామ్ తెరకెక్కించారు. నైజాంలో మా సినిమాను మైత్రి మూవీస్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది'' అన్నారు నిర్మాత.

ఫియర్ చాలా సంతృప్తినిచ్చింది

- వేదిక



వేదిక, అరవింద్ కృష్ణ

''ఫియర్' సినిమా కోసం టీమ్ అంతా చాలా కష్టపడ్డాం. హరితగారికి దర్శకురాలిగా ఇది తొలి చిత్రం అని ఈ సినిమా చూసినవారెవరూ నమ్మరు. ఈ మూవీ టీజర్ చూశాక నా ఒత్తిడి పోయింది. 'ఫియర్'లో నేను చేసిన పాత్ర చాలా సంతృప్తినిచ్చింది'' అని వేదిక అన్నారు. హరిత గోగినేని దర్శకత్వంలో వేదిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఫియర్'. ఈ సినిమాలో అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్ర చేశారు. ఏఆర్ అభి నిర్మించారు. సుజాత రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా తెలుగు టీజర్‌ను రానా, తమిళ టీజర్‌ను విజయ్ సేతుపతి, కన్నడ టీజర్‌ను కిచ్చా సుదీప్, మలయాళ టీజర్‌ను దిలీప్, హిందీ టీజర్‌ను ఇమ్రాన్ హష్మీ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఆర్ అభి మాట్లాడుతూ– ''ఫియర్'తో హరిత ప్రేక్షకులను భయపెడుతుంది'' అని తెలిపారు. ''కొన్ని అనుకోని సందర్భాల్లో ఒక అమ్మాయి భయపడితే ఆ పర్యవసానాలు ఎలా ఉంటాయి? అనేది ఈ సినిమా కథ'' అని చెప్పారు హరిత గోగినేని.

సాక్షి **బిజినెస్**

శనివారం
21-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,360	84,544
నిఫ్టీ ▲	375	25,791

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,977	▽	37
డోజోన్స్	42,113	▲	88
ఎఫ్‌టీఎస్ఈ 100	8,230	▽	99
డాక్స్	18,720	▽	282
షాంఘై	2,737	▲	1
నికాయ్	37,724	▲	569

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,485	▲	608
బంగారం (99.5 స్వచ్ఛత)	72,964	▲	605
వెండి (కిలో)	88,917	▲	499

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.23	84.25
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	109.42	112.04
€	యూరో	ఒకటి	92.32	94.71
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	58.25	59.59
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.17	58.12
S$	సింగపూర్ డాలర్	ఖాయమైనది	62.37	67.04
SAR	సౌదీ రియాల్	ఖాయమైనది	21.39	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయమైనది	21.86	23.64
¥	చైనా యువాన్	ఖాయమైనది	10.97	12.79



ముంబైలో ఐఫోన్ 16 కొనుగోళ్ల కోసం యాపిల్ స్టోర్ బయట అర్ధరాత్రి నుంచే బారులు తీరిన జనం

బెంగళూర్ యాపిల్ స్టోర్‌లో ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లను పరిశీలిస్తున్న కస్టమర్లు

హుబ్లీలో కొనుగోలు చేసిన కొత్త ఐఫోన్లతో యువతుల ఆనందం

బీఎస్ఎన్ఎల్ యూజర్లు
30 లక్షలు అప్..

జూలై ట్రాయ్ గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ: జూలైలో మొబైల్ టారిఫ్‌లను పెంచిన ప్రభావం ప్రైవేట్ రంగ టెల్కోలపై కనిపించింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా యూజర్లు తగ్గగా ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు పెరిగారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన జూలై గణాంకాల ప్రకారం బీఎస్ఎన్ఎల్ యూజర్ల సంఖ్య 29.4 లక్షల మేర పెరిగింది. ఎయిర్‌టెల్ సబ్‌స్క్రయిబర్స్ 16.9 లక్షలు, వొడాఫోన్ ఐడియా కస్టమర్లు 14.1 లక్షలు, రిలయన్స్ జియో యూజర్లు 7.58 లక్షల మంది తగ్గారు. దేశీయంగా టెలికం యూజర్ల సంఖ్య జూన్ నాటి 120.56 కోట్ల నుంచి జూలైలో స్వల్పంగా క్షీణించి 120.51 కోట్లకు పరిమితమైంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర టెలికం సర్కిల్స్‌లో మొబైల్ కనెక్షన్లు తగ్గాయి. జూలై తొలి వారంలో జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా సుమారు 10–27 శాతం శ్రేణిలో టారిఫ్‌లను పెంచడం తెలిసిందే.

అక్టోబర్ 1 నుంచి వివాద్ సే విశ్వాస్ 2.0



న్యూఢిల్లీ: పన్ను వివాదాల పరిష్కారానికి వీలుగా వివాద్ సే విశ్వాస్ 2.0 పథకం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ పథకాన్ని 2024–25 బడ్జెట్‌లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. రూ.35 లక్షల కోట్ల పన్నుకు సంబంధించి 2.7 కోట్ల ప్రత్యక్ష పన్ను డిమాండ్లు వివిధ దశల్లో, న్యాయ వేదికల వద్ద అపరిష్కృతంగా ఉండడం గమనార్హం. వీటికి పరిష్కారంగా గతంలో అమలు చేసిన వివాద్ సే విశ్వాస్ పథకాన్ని మరో విడత కేంద్రం తీసుకురావడం గమనార్హం.

జీఆర్‌టీ జ్యువెలర్స్ 'మెన్ కలెక్షన్'



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ పురుషుల కోసం ప్రత్యేకంగా 'మెన్ కలెక్షన్' ఆవిష్కరించింది. ఇందులో స్టైలిష్ బ్రాస్‌లైట్లు, ఆకర్షణీయమైన చైన్‌లు, బోల్డ్ కడాలు, చూడచక్కని రింగులతో పాటు అందమైన మరెన్నో ఆభరణాలున్నాయి. ఈ కలెక్షన్ ప్రచార చిత్రాన్ని భారత బౌలర్ అశ్విన్ విడుదల చేశారు. మెన్ కలెక్షన్‌లో ప్రతీ ఆభరణమూ ఆధునిక పురుషుడి శైలిని మరింత మెరుగుపరుస్తుందని జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

రెండంకెల స్థాయిలో విక్రయాల వృద్ధి

- ఈ ఏడాది మరో10 నగరాలకు విస్తరణ
- మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కొత్త ఉత్పత్తుల దన్ను, లగ్జరీ కార్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది విక్రయాల్లో రెండంకెల శాతాల స్థాయిలో వృద్ధి నమోదు చేయగలమని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. గతేడాది 17,408 వాహనాలను విక్రయించినట్లు చెప్పారు. జనవరి–డిసెంబర్ వ్యవధిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే మెర్సిడెస్ బెంజ్ గత సంవత్సరంలో సుమారు రూ. 10,000 కోట్ల ఆదాయం ఆర్జించింది. విక్రయాల్లో తెలంగాణ వాటా 8–9% స్థాయిలో ఉంటోందని అయ్యర్ పేర్కొన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన మేబాక్ ఈక్యూఎస్ ఎస్‌యూవీకి 50 బుకింగ్స్ రాగా ఇందులో 12 శాతం తెలుగు రాష్ట్రాల నుంచే ఉన్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా తమకు 50 నగరాల్లో 100 అవుట్‌లెట్లు ఉండగా ఈ ఏడాది ఆఖరు నాటికి ద్వితీయ శ్రేణి పట్టణాలు సహా మరో 10 నగరాలకు విస్తరించనున్నట్లు చెప్పారు. దేశీయంగా తాము విక్రయించే వాహనాల్లో 95 శాతం ఇక్కడ తయారు చేసినవే ఉంటున్నాయన్నారు. వీటిలో లోకలైజేషన్ స్థాయి దాదాపు 30 శాతంగా ఉన్నట్లు వివరించారు.

ఎలక్ట్రిక్ కార్లకు పెరుగుతున్న ఆదరణ ..

తమ మొత్తం వాహనాల అమ్మకాల్లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 5 శాతం పైగా ఉంటోందని అయ్యర్ చెప్పారు. లగ్జరీ ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా మరిన్ని వాహనాలను ప్రవేశపెట్టడంతో వీటి సంఖ్య ఆరుకి చేరిందని తెలిపారు. 100 పైచిలుకు చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు అయ్యర్ చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలపై వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాల పన్ను విధానాలు ప్రభావం చూపుతున్నాయని తెలిపారు.

జోయాలుక్కాస్ 'చెయిన్ ఫెస్ట్' ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ 'చెయిన్ ఫెస్ట్' పేరుతో ఆఫర్ ప్రకటించింది. ఇందులో భాగంగా అన్ని రకాల చెయిన్స్‌పై మజూరీ చార్జీల్లో 4.99% తగ్గింపు అందిస్తోంది. ఈ ప్రత్యేక ఆఫర్ అక్టోబర్ 6 వరకు ఉంటుంది. ''చెయిన్ ఫెస్ట్ పేరుతో అందమైన చైన్లను కస్టమర్లకు తక్కువ ధరకే అందించాలని కోరుకుంటున్నాము'' అని జోయాలుక్కాస్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

బుల్.. కొత్త రికార్డుల్!



- సెన్సెక్స్ లాభం 1,360 పాయింట్లు
- తొలిసారి 84,500పైన ముగింపు
- 375 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- కలిసొచ్చిన ఫెడ్ రేట్ల కోత ఉత్సాహం

ముంబై: ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గింపు, అమెరికా, ఆసియా మార్కెట్లలో సానుకూల సంకేతాలు కలిసిరావడంతో దేశీయ స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ శుక్రవారం కూడా కొనసాగింది. సెన్సెక్స్ 1,360 పాయింట్లు ఎగసి తొలిసారి 84 వేల స్థాయిపైన 84,544 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 375 పాయింట్లు పెరిగి 25,750 ఎగువున 25,791 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది ఇది సరికొత్త రికార్డు ముగింపు. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,510 పాయింట్లు బలపడి 84,694 వద్ద, నిఫ్టీ 433 పాయింట్లు ఎగసి 25,849 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. ముఖ్యంగా ప్రైవేట్ రంగ బ్యాంకులు, మెటల్, ఆటో, రియల్టీ రంగాలకు చిన్న, మధ్య తరహా షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. దీంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.37%, 1.16 శాతం చొప్పున పెరిగాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ పది పైసలు పెరిగి 83.55 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు ఒకటిన్నర శాతం నష్టపోయాయి.

- రంగాల వారీగా రియల్టీ ఇండెక్స్ 3.21%, ప్రైవేటు రంగ బ్యాంక్ సూచీ 3%, క్యాపిటల్ గూడ్స్ ఇండెక్సు 2.32% లాభపడ్డాయి. ఆటో, ఇండస్ట్రియల్, మెటల్, కన్జూమర్ సూచీలు 2% పెరిగాయి.
- పసిడి రుణాల వ్యాపారంపై గతంలో విధించిన ఆంక్షలను ఆర్‌బీఐ ఎత్తివేయడంతో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ షేరు భారీగా లాభపడింది. బీఎస్ఈలో 7% పెరిగి రూ.531 వద్ద స్థిరపడింది.
- ఐటీడీ సిమెంటేషన్ ఇండియా షేరు 20% లాభపడి రూ.566 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. ఈ కంపెనీలో అదానీ ఈ కంపెనీలో 46.64% వాటా కొనుగోలు చేయనుందన్న వార్తలతో ఈ షేరుకుడిమాండ్ నెలకొంది.

■ సెన్సెక్స్ 1,330 పాయింట్లు ర్యాలీ చేయడంతో ఒక్క రోజులో రూ.6.24 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.472 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లో 30కి గానూ 26 షేర్లు లాభపడ్డాయి. నాలుగు షేర్లు నష్టపోయాయి. సెన్సెక్స్ ఈ ఏడాదిలో ఒక్క ట్రేడింగ్ సెషన్‌లోనే 1000కి పైగా పాయింట్లు లాభపడటం ఇది పదోసారి కావడం విశేషం.

■ ఐసీఐసీఐ(4%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(2%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఆర్జించిన మొత్తం 1,360 పాయింట్లలో సగ భాగం ఈ షేర్ల నుంచి వచ్చాయి. ఇంట్రాడేలో ఐసీఐసీఐ బ్యాంకు అయిదున్నర శాతం ర్యాలీ చేసి రూ.1361 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

ఐపీవోకు హెచ్‌డీబీ ఫైనాన్షియల్

న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిస్టింగ్‌కు ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అనుగుణంగా రూ. 10 ముఖ విలువగల రూ. 2,500 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను జారీ చేసేందుకు సూత్రప్రాయ అంగీకారాన్ని తెలిపింది. దీంతోపాటు అర్హతగల ప్రస్తుత వాటాదారులు సైతం ఈక్విటీని ఆఫర్ చేసేందుకు అనుమతించినట్లు బ్యాంక్ వెల్లడించింది. ఈ బాటలో నిబంధనలకు అనుగుణంగా ఇసాప్ 2014, 2017, 2022 పథకాలలో సవరణలు చేపట్టేందుకు మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిర్ణయించింది. వెరసి పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ప్రస్తుతం హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌లో మాతృ సంస్థకు 94.64 శాతం వాటా ఉంది. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ నెట్‌వర్త్ రూ. 13,300 కోట్లను తాకింది. అప్పర్ లేయర్ గుర్తింపు పొందిన ఎన్‌బీఎఫ్‌సీల లిస్టింగ్‌పై 2022 అక్టోబర్‌లో ఆర్‌బీఐ మార్గదర్శకాలను జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటికి అనుగుణంగా హెచ్‌డీబీ పబ్లిక్ ఇష్యూకి రానుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

పిజిక్స్‌వాలాకు 1,753 కోట్ల నిధులు | రిలయన్స్ ఇన్‌ఫ్రాలో భారీ పెట్టుబడులు

సాక్షి **స్పోర్ట్స్**



చైనా ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో మాళవిక పరాజయం

చాంగ్జౌ: చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నమెంట్‌లో భారత్ పోరాటం ముగిసింది. మహిళల విభాగంలో ముందంజ వేసిన ఏకైక భారత ఆశాకిరణం మాళవిక బన్సోడ్‌కు క్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. జపాన్ స్టార్, నాలుగో సీడ్ అకానె యామగుచి ధాటికి మాళవిక నిలువలేకపోయింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో మాళవిక 10–21, 16–21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ యామగుచి జోరుకు వరుస గేమ్‌లలో ఓడిపోయింది. బన్సోడ్‌పై యామగుచికి వరుసగా ఇది మూడో విజయం కావడం గమనార్హం. ఈ టోర్నీలో మిగతా భారత షట్లర్లు ఇదివరకే నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్, మహిళల ఈవెంట్‌లో ఆకర్షి కశ్యప్, సామియా ఇమాద్‌లు తొలి రౌండ్ పోటీల్లోనే ఇంటిదారి పట్టారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి–సుమిత్ జోడీలు కూడా తొలి రౌండ్ అడ్డంకిని దాటలేకపోయాయి.



పురుషుల జట్టుకు అన్నీ 'డ్రా'లే

అమెరికాతో మహిళల బృందం 'టై'

బుడాపెస్ట్: ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల జట్టు అజేయంగా సాగుతోంది. శుక్రవారం ఉజ్బెకిస్తాన్ జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను భారత పురుషుల జట్టు 2–2తో టై చేసుకుంది. ఈ పోరులో బరిలోకి దిగిన నలుగురు ఆటగాళ్లు కూడా తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. ఈ టోర్నీలో వరుసగా ఎదురులేని విజయాలతో దూసుకెళ్తున్న భారత్‌ను నిలువరించిన జట్టుగా ఉజ్బెకిస్తాన్ నిలిచింది. దొమ్మరాజు గుకేశ్... నొదిర్బెక్ అబ్దుసత్తొరొవ్‌తో, ప్రజ్ఞానంద.... జవొఖిర్ సిందరొవ్‌తో, విదిత్ గుజరాతి... జకొంగిర్ వఖిదొవ్‌తో, ఇరిగేశి అర్జున్... షంసిద్దీన్‌తో తమ తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. 9 రౌండ్లు ముగిసేసరికి భారత్ 17 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. మహిళల విభాగంలో తొమ్మిదో రౌండ్‌లో భారత బృందం 2–2తో అమెరికా జట్టుతో టై చేసుకుంది. మూడు మ్యాచ్‌లు ముగిసిన తర్వాత 2–1తో అమెరికా ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో వంతిక అగర్వాల్ వేసిన ఎత్తులు భారత్‌ను పైఎత్తుకు చేర్చింది. తప్పక గెలవాల్సిన నాలుగో మ్యాచ్‌లో ఆమె ఇరినా క్రుష్‌ను ఓడించి 2–2తో స్కోరును సమం భారత మహిళల జట్టు ఊపిరి పీల్చుకుంది. అంతకుముందు ఎనిమిదో రౌండ్‌లో అమ్మాయిల జట్టు పోలండ్ చేతిలో ఓడింది. దీంతో ఏడురౌండ్ల దాకా అజేయంగా నిలిచిన భారత మహిళల జట్టుకు ఈ టోర్నీలో తొలిసారి ఓటమి ఎదురైంది.

ఉత్తమ ఆటగాళ్లుగా కార్ల్‌సన్, పోల్గర్

అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) తమ శతాబ్ది ఉత్సవాలను బుడాపెస్ట్‌లోనే ఘనంగా నిర్వహించింది. 'ఫిడే 100' పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఒలింపియాడ్‌లో ఎనిమిదో రౌండ్ పోటీలు ముగిసిన తర్వాత ఆటగాళ్లంతా ఇందులో పాల్గొన్నారు. తమ వందేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని మొత్తం 18 కేటగిరీల్లో 'ఫిడే' అవార్డులు అందజేసింది. శతాబ్ది అత్యుత్తమ ఆటగాళ్లుగా పురుషుల విభాగంలో మాగ్నస్ కార్ల్‌సన్, మహిళల విభాగంలో జూడిట్ పోల్గర్ ఎంపికయ్యారు. కార్ల్‌సన్ క్లాసిక్ విభాగంలో ఐదు సార్లు, ర్యాపిడ్ విభాగంలో ఐదు సార్లు, బ్లిట్జ్ విభాగంలో ఐదు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. ప్రపంచ చెస్ చరిత్రలోనే అత్యుత్తమ రేటింగ్ (2882) సాధించిన ఘనత కార్ల్‌సన్ సొంతం. మహిళల చెస్‌కు సుదీర్ఘ కాలం చిరునామాగా నిలిచిన పోల్గర్ 15 ఏళ్లకే గ్రాండ్‌మాస్టర్ అయింది. 12 ఏళ్లకే టాప్–100 ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్న పోల్గర్ 2700 రేటింగ్ దాటిన ఏకైక మహిళ.

రెండో రోజు మనదే జోరు

భారత గడ్డపై టెస్టు మ్యాచ్ అంటే ప్రతీ విదేశీ జట్టుకూ సవాలే... బంగ్లాదేశ్‌కు కూడా అది తొలి టెస్టు తొలి రోజే చాలా వరకు అర్థమైంది. రెండో రోజుకు వచ్చేసరికి బంగ్లా పూర్తిగా చేతులెత్తేసింది. తొలి రోజు ఆట ఆరంభంలో పదునైన బౌలింగ్‌తో భారత్‌ను ఇబ్బంది పెట్టిన బంగ్లా ఆ తర్వాత టీమిండియా జోరుకు తలవంచింది. శుక్రవారం కూడా భారత్ చివరి నాలుగు వికెట్లను త్వరగా తీసిన ఆనందం ముగియక ముందే మన పేసర్ల దెబ్బకు జట్టు కుప్పకూలింది. బంగ్లా పతనంలో బుమ్రా కీలక పాత్ర పోషించాడు. ఫాలో ఆన్ ఆడించకుండా మళ్లీ బ్యాటింగ్‌కు దిగిన రోహిత్ బృందం ఆధిక్యం ఇప్పటికే 300 దాటింది... మ్యాచ్ తీరు చూస్తే మూడో రోజే ముగిసినా ఆశ్చర్యం లేదు...రెండో రోజు ఆటలో ఇరు జట్లు కలిపి మొత్తం 17 వికెట్లు కోల్పోవడం చెప్పుకోదగ్గ అంశం.

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు ఆలౌట్

- భారత్‌కు 227 పరుగుల భారీ ఆధిక్యం
- బుమ్రాకు 4 వికెట్లు
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 81/3



బుమ్రాకు సహచరుల అభినందన



ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో జాకీర్ క్లీన్ బౌల్డ్

చెన్నై: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుపై భారత్ రెండో రోజే పట్టు బిగించింది. భారత బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 47.1 ఓవర్లలో 149 పరుగులకే ఆలౌటైంది. షకీబ్ అల్ హసన్ (64 బంతుల్లో 32; 5 ఫోర్లు)దే అత్యధిక స్కోరు. జస్‌ప్రీత్ బుమ్రా 4 వికెట్లతో ప్రధాన పాత్ర పోషించగా...జడేజా, ఆకాశ్‌దీప్, సిరాజ్ తలా 2 వికెట్లతో అండగా నిలిచారు. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్‌కు ఏకంగా 227 పరుగుల ఆధిక్యం దక్కింది. అయితే ఫాలో ఆన్ ఇవ్వడంకంటే మళ్లీ బ్యాటింగ్ చేసేందుకే రోహిత్ మొగ్గు చూపించాడు. శుక్రవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 23 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు సాధించింది. శుబ్‌మన్ గిల్ (64 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు), రిషభ్ పంత్ (12 నాటౌట్) ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్నారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 339/6తో ఆట కొనసాగించిన భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 376 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు 11.2 ఓవర్లు మాత్రమే ఆడగలిగిన జట్టు మరో 37 పరుగులు జోడించగలిగింది. చేతిలో మరో 7 వికెట్లు ఉన్న టీమిండియా ప్రస్తుతం తమ ఓవరాల్ ఆధిక్యాన్ని 308 పరుగులకు పెంచుకుంది.

బౌలర్ల జోరు...

బుమ్రా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ చివరి బంతిని ఆడలేక వదిలేసిన షాద్‌మన్ ఇస్లామ్ (2) క్లీన్‌బౌల్డయ్యాడు. అలా మొదలైన బంగ్లా పతనం వేగంగా సాగింది. ఆకాశ్ దీప్ తన రెండో ఓవర్లో తొలి రెండు బంతుల్లో రెండు వికెట్లతో బంగ్లా పని పట్టాడు. ఆకాశ్ బంతికి జాకీర్ హసన్ (3) స్టంప్ ముక్కలవగా...తర్వాతి బంతికే మోమినుల్ హక్ (0) ప్యాడ్లకు తాకుతూ వెళ్లిన బంతి వికెట్లను పడగొట్టింది. బౌల్డ్ కాకపోయినా మోమిన్ ఎల్బీగానైనా వెనుదిరిగేవాడే! రెండో సెషన్‌లో కూడా భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కోవడంలో బంగ్లా బ్యాటర్లు విఫలమయ్యారు. ఈ సెషన్‌లో బంగ్లా ఐదు వికెట్లు కోల్పోయింది. నజ్ముల్ (20)ను సిరాజ్...ముష్ఫికర్ రహీమ్ (8)ను బుమ్రా అవుట్ చేయడంతో స్కోరు 40/5 వద్ద నిలిచింది. ఈ దశలో షకీబ్, లిటన్ దాస్ (22) కొద్ది సేపు ప్రతిఘటించారు. కొన్ని చక్కటి షాట్లు ఆడిన వీరిద్దరు ఆరో వికెట్‌కు 51 పరుగులు జోడించారు. అయితే జడేజా వరుస ఓవర్లలో స్వయంకృతంతో వీరిద్దరు పరుగు తేడాతో వెనుదిరగడం బంగ్లా ఆశలు కోల్పోయేలా చేసింది. అనవసరపు భారీ షాట్‌కు ప్రయత్నించి దాస్ అవుట్ కాగా, రివర్స్ స్వీప్‌కు ప్రయత్నించి షకీబ్ వికెట్ ఇచ్చేశాడు. ఆ తర్వాత హసన్ (9) వికెట్ బుమ్రా ఖాతాలో చేరింది. టీ విరామం తర్వాత మిగిలిన రెండు వికెట్లు తీసేందుకు భారత్‌కు ఎక్కువ సమయం పట్టలేదు.

కోహ్లి దురదృష్టవశాత్తూ...

ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే యశస్వి (10) పది పరుగులు రాబట్టగా...రోహిత్ శర్మ (5) తొలి బంతికే ఫోర్‌తో మొదలు పెట్టాడు. అయితే వీరిద్దరు ఎక్కువ సేపు నిలవలేకపోయారు. మరో వైపు గిల్ కొన్ని చక్కటి షాట్లు ఆడి క్రీజ్‌లో పాతుకుపోయాడు. రెండో రోజు ఆట ముగియడానికి కొద్ది సేపు ముందు మిరాజ్ బౌలింగ్‌లో ఫ్లిక్ చేయబోయి విరాట్ కోహ్లి (17) వికెట్ల ముందు దొరికిపోయాడు. గిల్‌తో మాట్లాడిన అనంతరం కోహ్లి రివ్యూ చేయకుండానే వెళ్లిపోయాడు. తర్వాత రీప్లేలో బంతి ప్యాడ్‌కు తగలక ముందే బ్యాట్‌కు తాకినట్లు తేలింది. రివ్యూ చేసి ఉంటే కోహ్లి నాటౌట్ అయ్యేవాడు. ఆ తర్వాత మరో 3.4 ఓవర్ల పాటు గిల్, పంత్ వికెట్ పడకుండా ఆటను ముగించారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) షాద్‌మన్ (బి) నాహిద్ 56; రోహిత్ (సి) నజ్ముల్ (బి) హసన్ 6; గిల్ (సి) దాస్ (బి) హసన్ 0; కోహ్లి (సి) దాస్ (బి) హసన్ 6; పంత్ (సి) దాస్ (బి) హసన్ 39; రాహుల్ (సి) జాకీర్ (బి) మిరాజ్ 16; జడేజా (సి) దాస్ (బి) తస్కిన్ 86; అశ్విన్ (సి) నజ్ముల్ (బి) తస్కిన్ 113; ఆకాశ్ (సి) నజ్ముల్ (బి) తస్కిన్ 17; బుమ్రా (సి) జాకీర్ (బి) హసన్ 7; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 30; **మొత్తం** (91.2 ఓవర్లలో ఆలౌట్) 376. **వికెట్ల పతనం:** 1–14, 2–28, 3–34, 4–96, 5–144, 6–144, 7–343, 8–367, 9–374, 10–376. **బౌలింగ్:** తస్కిన్ 21–4–55–3, హసన్ మహమూద్ 22.2–4–83–5, నాహిద్ రాణా 18–2– 82–1, మెహదీ హసన్ మిరాజ్ 21–2–77–1, షకీబ్ 8–0–50–0, మోమినుల్ 1–0–4–0.

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: షాద్‌మన్ (బి) బుమ్రా 2; జాకీర్ (బి) ఆకాశ్ 3; నజ్ముల్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 20; మోమినుల్ (బి) ఆకాశ్ 0; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) బుమ్రా 8; షకీబ్ (సి) పంత్ (బి) జడేజా 32; లిటన్ దాస్ (సి) (సబ్) జురేల్ (బి) జడేజా 22; మిరాజ్ (నాటౌట్) 27; హసన్ (సి) కోహ్లి (బి) బుమ్రా 9; తస్కిన్ (బి) బుమ్రా 11; నాహిద్ (బి) సిరాజ్ 11; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (47.1 ఓవర్లలో ఆలౌట్) 149. **వికెట్ల పతనం:** 1–2, 2–22, 3–22, 4–36, 5–40, 6–91, 7–92, 8–112, 9–130, 10–149. **బౌలింగ్:** బుమ్రా 11–1–50–4, సిరాజ్ 10.1–1–30–2, ఆకాశ్ దీప్ 5–0–19–2, అశ్విన్ 13–4–29–0, జడేజా 8–2–19–2.

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (సి) దాస్ (బి) నాహిద్ 10; రోహిత్ (సి) జాకీర్ (బి) తస్కిన్ 5; గిల్ (బ్యాటింగ్) 33; కోహ్లి (ఎల్బీ) (బి) మిరాజ్ 17; పంత్ (బ్యాటింగ్) 12; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (23 ఓవర్లలో 3 వికెట్లకు) 81. **వికెట్ల పతనం:** 1–15, 2–28, 3–67. **బౌలింగ్:** తస్కిన్ 3–0–17–1, హసన్ మహమూద్ 5–1–12–0, నాహిద్ 3–0–12–1, షకీబ్ 6–0–20–0, మిరాజ్ 6–0–16–1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్పీడ్ తక్కువ.. సమయం ఎక్కువ

మనోహరాబాద్–గజ్వేల్–సిద్దిపేట రైల్వేమార్గంలో ప్రయాణికులు అంతంత మాత్రమే

రోజూ రెండు ట్రిప్పులున్నా.. వందమందికి మించడం లేదు

సిద్దిపేట టు సికింద్రాబాద్‌కు..
బస్సులో 2 గంటలు
రైలులో 3:30 గంటలు

కొత్తపల్లి వరకు లింకు పూర్తయితేనే మహర్దశ

గజ్వేల్: మనోహరాబాద్ మీదుగా సిద్దిపేటకు వచ్చే రైలు స్పీడ్ తక్కువగా ఉండటం, ప్రయాణానికి సమయం ఎక్కువ తీసుకోవడంతో ఈ రైలు ఎక్కేందుకు ప్రయాణికులు పెద్ద ఆసక్తిగా చూపడం లేదు. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లడానికి రైలులో మూడున్నర నుంచి నాలుగు గంటల వరకు సమయం పడితే...బస్సులో అయితే సుమారు రెండు గంటల సమయమే పడుతోంది. దీంతో మనోహరాబాద్–గజ్వేల్–సిద్దిపేట మార్గంలో ప్రయాణికులు లేక రైలు వెలవెలబోతోంది. 8 బోగీలతో నడుస్తున్న ఈ రైలులో ఒకటి గార్డు, ఇతర అవసరాలుపోగా, ఏడింటిలో మొత్తంగా ఒక్క ట్రిప్పులో 644 మంది ప్రయాణం చేయొచ్చు. రోజుకూ రెండు అప్ అండ్ డౌన్ ట్రిప్పులు నడుస్తున్నా, వంద మందికి మించి ప్రయాణించడం లేదు. రైలు వేగం కేవలం 60 కిలోమీటర్లకే పరిమితమై సికింద్రాబాద్ వరకు ప్రయాణ సమయం 4 గంటలు పట్టడమే ఇందుకు ప్రధాన కారణం.



ఖాళీగా ఉన్న రైలు బోగీలు

మనోహరాబాద్ టు కొత్తపల్లి

మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151.36 కిలోమీటర్ల పొడవున ఈ న్యూబ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం జరుగుతుండగా, రూ. 1160.47 కోట్లు వెచ్చిస్తున్నారు. 2017లో ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఈ లైన్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మనోహరాబాద్ మీదుగా కొత్తపల్లి వరకు, అక్కడి నుంచి పెద్దపల్లి గ్రాండ్ ట్రంక్ లైన్‌తో అనుసంధానం కానుంది. ఫలితంగా ఈ లైన్ హైదరాబాద్, న్యూఢిల్లీ, కోల్‌కత్తా లాంటి మహానగరాలను కలుపుతూ జాతీయ లైన్‌గా ఆవిర్భవించనున్నది. మనోహరాబాద్– కొత్తపల్లి రైల్వేలైన్ పూర్తయితే.. ప్రయాణికులకు దూరభారం తగ్గుతుంది. మొత్తానికి ఈలైన్‌తో ఉత్తర తెలంగాణలోని సిద్దిపేట జిల్లాతో పాటు మెదక్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు భారీ ప్రయోజనం చేకూరుతుంది.

రోజుకు రెండు అప్ అండ్ డౌన్ ట్రిప్పులు

ప్రతి బుధవారం మినహా మిగిలిన ఆరు రోజుల్లో ప్యాసింజర్ రైలు రోజుకూ రెండు అప్ అండ్ డౌన్ ట్రిప్పులు నడుస్తోంది. ఉదయం 6.45 గంటలకు సిద్దిపేటలో బయలుదేరి.. దుద్దెడ, లకుడారం, కొడకండ్ల, గజ్వేల్, అప్పాయిపల్లి, నాచారం, మేడ్చల్, బొల్లారం, కవల్‌రీ బ్యారేక్స్(అల్వాల్), మల్కాజిగిరి, సికింద్రాబాద్ వరకు ఉదయం 10.15 గంటలకు చేరుకుంటోంది. తిరిగి సికింద్రాబాద్ నుంచి ఉదయం 10.35 గంటలకు బయలుదేరి సిద్దిపేటకు మధ్యాహ్నం 1.45 నిమిషాలకు చేరుతుంది. అన్నీ సజావుగా సాగితే సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లాలన్నా అక్కడి నుంచి సిద్దిపేటకు రావాలన్నా 3.30 గంటల ప్రయాణం తప్పదు. కానీ ట్రైన్ లేటయినా, సిగ్నల్స్ సమస్య ఉత్పన్నమైనా ఆలస్యం అవుతోంది. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు బస్సులో వెళితే కేవలం 2 గంటల సమయమే పడుతుంది. ఈ కారణం వల్ల ఈ రైలుపై ఆసక్తి చూపడంలేదు.

మనోహరాబాద్ టు సికింద్రాబాద్ వరకు రద్దీ..: ఇదే రైలు మనోహరాబాద్ స్టేషన్ వెళ్లగానే అక్కడి నుంచి సికింద్రాబాద్‌కు 100 కిలోమీటర్ల వేగంతో వెళుతుండగా, ఈ మార్గంలో రద్దీ భారీగానే ఉంటుంది. కేవలం మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు మాత్రమే అతి తక్కువ ప్రయాణికులతో వెళుతోంది. ప్రస్తుతం సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వరకు 117 కిలోమీటర్లు ప్రయాణిస్తున్న రైలు మనోహరాబాద్ వరకు 74 కిలోమీటర్లు అతి తక్కువ ప్రయాణికులతో, ఆ తర్వాత మనోహరాబాద్ నుంచి సికింద్రాబాద్ వరకు 43 కిలోమీటర్లు రద్దీగా వెళుతోంది.

ఇదే మార్గంలో గజ్వేల్ వరకు 2022 జూన్ 27న రైల్వేశాఖ గూడ్స్ రైలు సేవలను దక్షిణ మధ్య రైల్వేశాఖ రేక్ పాయింట్ కోసం ప్రారంభించింది. దీని ద్వారా రైల్వేశాఖకు మంచి ఆదాయం కూడా సమకూరుతోంది.

స్పీడ్ పెరిగితేనే మెరుగు..

మనోహరాబాద్–గజ్వేల్–సిద్దిపేట మార్గంలో వేగం తక్కువగా ఉండటం వల్ల సమయం ఎక్కువగా పడుతుంది. ఇక్కడి నుంచి సికింద్రాబాద్ వెళ్లడానికి ప్రయాణికులు కొంత వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తుంది. త్వరలోనే ఈ లైన్ స్పీడ్ పెరిగి, ప్రయాణానికి సమయం తగ్గనుంది. దీని ద్వారా ప్రయాణికుల సంఖ్య కూడా పెరగుతుంది. కొత్తపల్లి వరకు లింకు పూర్తయితే ఇక భారీగా పుంజుకుంటుంది. – దక్షిణ మధ్య రైల్వే ఇంజినీర్ జనార్దన్

అక్రమంగా స్టెరాయిడ్స్ అమ్మకం

- జిమ్‌లకు వెళ్లే వారికి విక్రయిస్తున్న డిస్ట్రిబ్యూషన్ సంస్థ సీజ్
- రూ. 2 లక్షల విలువైన 22 రకాల స్టెరాయిడ్స్ స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: శారీరక సౌష్టవం, కండలు పెంచాలనుకునే వారి బలహీనతను ఆసరాగా చేసుకుని స్టెరాయిడ్స్ అమ్ముతున్న రాకేశ్ డిస్ట్రిబ్యూటర్స్‌పై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. రూ.2 లక్షల విలువైన 22 రకాల స్టెరాయిడ్స్‌ను స్వాధీనం చేసుకుని, సంస్థను సీజ్ చేసినట్లు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోఠిలోని ఈసామియా బజార్‌లో రాకేశ్ కనోడియా నిర్వహిస్తున్న రాకేశ్ డిస్ట్రిబ్యూటర్స్‌లో అక్రమంగా స్టెరాయిడ్స్ విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 18, 19 తేదీల్లో సోదాలు చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న స్టెరాయిడ్స్‌ను పరీక్షల కోసం పంపామన్నారు.

అనుమతి లేకుండానే మందుల దుకాణం..
మియాపూర్‌లోని శ్రీకాంత్ న్యూరోసెంటర్‌లో లైసెన్స్ లేని మందుల దుకాణాన్ని సీజ్ చేశారు. లైసెన్స్ లేకుండానే మందుల దుకాణాన్ని నిర్వహిస్తున్నట్టు సోదాల్లో భాగంగా గుర్తించామని కమలాసన్‌రెడ్డి వెల్లడించారు.

సవాళ్లను అధిగమించే సామర్థ్యం పెంచుకోవాలి

యువ ఐపీఎస్‌ల దీక్షాంత్ పరేడ్‌లో కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్

సాంకేతిక అంశాలు నేర్చుకునేందుకు సిద్ధంగా ఉండాలి

నేరస్తులను జైలుకు పంపడం కాదు.. నేర వ్యవస్థలనే నాశనం చేయాలి.. ఉత్తమ ప్రొబేషనర్లకు పతకాలు బహూకరించిన కేంద్ర మంత్రి



విశ్వజీత్ శౌర్యన్‌కు గౌరవ ఖడ్గం, నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ట్రోఫీ ఫర్ పోలీస్ సైన్స్ పతకాన్ని అచ్యుత్ అశోక్‌కు అందజేస్తున్న కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్

సాక్షి, హైదరాబాద్: పౌరుల సేవే లక్ష్యంగా రూపొందిన కొత్త నేర చట్టాలను ఆకళింపు చేసుకుని, ఎప్పటికప్పుడు తలెత్తే సవాళ్లను అధిగమించే సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకోవాలని యువ ఐపీఎస్ అధికారులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఉద్బోధించారు. పోలీస్ అకాడమీని వీడిన తర్వాత కూడా నూతన అంశాలు నేర్చుకునే తత్వాన్ని వదలొద్దని, సరికొత్త సాంకేతిక అంశాలు నేర్చుకునేందుకు సదా సిద్ధంగా ఉండాలని సూచించారు. నేరస్తుల కంటే రెండు అడుగులు ముందుండేలా, ఆలోచన చేసేలా నేరాల కట్టడికి యువ పోలీసులు సిద్ధమవ్వాలన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో శుక్రవారం ఉదయం నిర్వహించిన దీక్షాంత్ పరేడ్‌లో 76వ ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్) బ్యాచ్‌కు చెందిన 188 మంది ప్రొబేషనరీ ఐపీఎస్‌లు, భూటాన్, మాల్దీవులు సహా మిత్ర దేశాలకు చెందిన 19 మంది విదేశీ అధికారులు పాల్గొన్నారు. వారి నుంచి కేంద్రమంత్రి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో భాగంగా వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన అధికారులకు పతకాలు బహూకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.

ఆదర్శంగా నిలవాలి
దేశ సేవే లక్ష్యంగా వృత్తి జీవితంలో కొనసాగాలని మంత్రి నిత్యానందరాయ్ అధికారులకు సూచించారు. భారతీయ భవిష్యత్ పోలీస్‌కు యువ ఐపీఎస్‌లు నిదర్శనంగా నిలవాలన్నారు. దేశం వందేళ్ల స్వాతంత్య్ర వేడుకల నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో యువ అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానమైన స్మార్ట్ పోలీసింగ్‌కు అనుగుణంగా పోలీస్ వ్యవస్థ పనిచేస్తూ ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.


అతిపెద్ద సవాల్ సైబర్ క్రైమ్
ప్రపంచానికి అతి పెద్ద సవాలుగా మారిన సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు సాంకేతిక శక్తి యుక్తులను పెంచుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు. నేర దర్యాప్తులో సమగ్ర శోధన అవసరమని, నేరస్తులను పట్టుకోవటంతో పాటు నేర వ్యవస్థలను మూలాల నుంచి నాశనం చేయాలని చెప్పారు. తీవ్రవాదం, వామపక్ష ప్రేరిత హింస లాంటివి దేశంలో దాదాపు తగ్గుముఖం పట్టినా.. వాటిని తుదముట్టించాలన్నారు. ప్రొబేషనరీ ఐపీఎస్‌లతో అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్ ప్రమాణం చేయించారు. వివిధ రంగాలలో సైద్ధాంతిక, ప్రాక్టికల్ శిక్షణతో పాటు, నూతన నేర చట్టాలు, సైబర్ నేరాల నియంత్రణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సరి కొత్త అంశాల్లోనూ అధికారులకు సునిశిత శిక్షణ అందించినట్లు చెప్పారు. కాగా శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అచ్యుత్ అశోక్ పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనర్‌గా నిలిచిన విశ్వజీత్ శౌర్యన్‌కు ఐపీఎస్ అసోసియేషన్ గౌరవ ఖడ్గాన్ని నిత్యానంద రాయ్ బహూకరించారు. నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ట్రోఫీ ఫర్ పోలీస్ సైన్స్ పతకాన్ని అచ్యుత్ అశోక్‌కు, మణిపూర్ కప్ ఆఫ్ లా పతకాన్ని సోనాలి మిశ్రాకు, టాప్ కప్ ఆఫ్ ఎక్సిక్యూటేషన్ పతకాన్ని ఆయుష్ యాదవ్‌కు బహూకరించారు. విదేశీ అధికారుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాయల్ భూటాన్ పోలీస్‌కు చెందిన లెఫ్టినెంట్ కింగ్నా షైరీ, లెఫ్టినెంట్ పుంషోఓలకు కూడా పతకాలు అందజేశారు. కార్యక్రమంలో టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, పలువురు సీనియర్ ఐపీఎస్‌లు, ప్రొబేషనరీ ఐపీఎస్‌ల తల్లిదండ్రులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



కవలల అడ్డా.. వడ్డాడి

ఒకే పోలికలుండే కవలలను గుర్తు పట్టడానికి ఎవరైనా తికమక పడుతుంటారు. అలాంటిది ఒకే గ్రామంలో పదుల సంఖ్యలో కవలలుంటే?.. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం వడ్డాడిలో 20 మంది వరకు కవలలు ఉండడంతో.. ఆ గ్రామాన్ని కవలల విలేజ్‌గా పిలుస్తున్నారు. ప్రస్తుతం ఐదు కవలల జంటలు స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో విద్య అభ్యసిస్తుండగా.. మిగతా పిల్లలు ఇతర చోట్ల చదువుతున్నారు. గ్రామ పాఠశాలలో విరాట్–విశాల్, కావ్య–దివ్య, గౌతమి–గాయత్రి, హర్షిత్–వర్షిత్, ప్రణాళిక–ప్రత్యక్ష చదువుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

టుడేస్ గ్రాఫిక్



ఆరోగ్య మిత్రల సమ్మె విరమణ

- మంత్రి దామోదరతో ఫలించిన చర్చలు
- వేతనం రూ.15,600 నుండి రూ.19,500కు పెంపు



సాక్షి, హైదరాబాద్: తమ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించడంతో ఆరోగ్య మిత్రలు సమ్మె విరమించారు. వారితో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం చర్చలు జరిపి.. డిమాండ్లకు అంగీకరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు రెండు రోజులుగా సమ్మె చేస్తుండటం తెలిసిందే. క్యాడర్ మార్పు (డేటా ఎంట్రీ ఆపరేటర్), రూ.15,600 నుండి రూ.19,500కు వేతనం పెంపు తదితర డిమాండ్లను ఆమోదించినట్టు మంత్రి దామోదర ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిలు, సమ్మె కాలంలో ఓడీ కింద వేతనాలు చెల్లించాలని ట్రస్ట్ సీఈవోకు మంత్రి దామోదర ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆరోగ్య మిత్రలు సమ్మె విరమిస్తున్నట్లు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ తెలిపిందని పేర్కొన్నారు. చర్చల్లో ఆరోగ్య మిత్రల రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.కుమార్, ఉపాధ్యక్షుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తుతోనే చెట్లు కూలిపోయి ఉండొచ్చు

భారీ వర్షాలు సైతం ఇందుకు కారణం

తాడ్వాయి అడవుల్లో పడిపోయిన చెట్లకు ఎలాంటి రోగం రాలేదు

సాక్షితో ఎఫ్‌సీఆర్ఐ ఆగ్రో ఫారెస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్ చిరంజీవరెడ్డి



సాక్షి, సిద్దిపేట: 'ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లో ప్రకృతి విపత్తుతోనే చెట్లు కూలిపోయి ఉండొచ్చు. వాటికి ఎలాంటి రోగం రాలేదు. ఆయా చెట్ల విత్తనాలు విరివిగా పడిపోయి కనిపించాయి. అవి త్వరలో మొలకెత్తే అవకాశం ఉంటుంది'అని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ సిల్వికల్చర్, ఆగ్రో ఫారెస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్ మిల్కురి చిరంజీవరెడ్డి చెప్పారు. తాడ్వాయి అడవుల్లో ఆగస్టు 31న భారీ గాలులకు చెట్లు కూలిపోయిన విషయం తెలిసిందే. కూలిపోయిన చెట్లను ములుగులోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థకు చెందిన 12 మంది బృందం ఇటీవల పరిశీలించింది. ఆ విషయాలను శుక్రవారం 'సాక్షి'తో చిరంజీవరెడ్డి పంచుకున్నారు.

ఇది మనుషులు చేసింది కాదు...
అటవీ కళాశాల, పరిశోధన సంస్థ డీన్ డాక్టర్ ఎస్‌జే ఆశా ఆదేశాల మేరకు ఇటీవల తాడ్వాయిలో అడవులను పరిశీలించాం. నాలుగు కిలోమీటర్ల మేర అడవులకు తీవ్ర నష్టం జరిగింది. ఇది మనుషులు చేసింది కాదు. ఆ చెట్లకు రోగం, పురుగు ఎఫెక్ట్ లాంటివి ఏమీ లేవు. పూర్తిగా ప్రకృతి విపత్తు కారణంగానే చెట్లు కూలిపోయాయని తెలుస్తోంది. భారీ వృక్షాలు కూలడంతో సమీపంలో ఉన్న చిన్న చెట్లు కూడా విరిగి నేలకు ఒరిగాయి. పక్కనే ఉన్న చిన్న చెట్ల మీద పడటంతో చిన్న చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. చెట్ల వేర్ల డెప్త్ బాగానే ఉన్నా, భూమి లోపల పరుపు బండ ఏమైనా ఉందో పరిశీలించాలి.

వర్షాలతో భూమి మెత్తబడింది
పది రోజులపాటు భారీ వర్షాలు కురవడంతో భూమి అంతా మెత్తబడింది. అదే సమయంలో అతివేగంగా గాలులు వీయడంతో పెద్దపెద్ద వృక్షాలు పడిపోయే అవకాశాలున్నాయి. గాలులు వేగంగా రావడంతో అటు ఇటు ఊగి ఆ బరువుకు చెట్లు కింద పడిపోయి ఉండొచ్చు. అడవిలో చెట్లు పడిపోవడం, వాటి స్థలంలో కొత్త మొక్కలు పెరగడం ఇది సహజ సిద్ధమైన ప్రక్రియ. కానీ మన ప్రాంతంలో ఒకేసారి వేల సంఖ్యలో వృక్షాలు కూలిపోవడం ఇదే మొదటిసారి.

టాప్ శాస్త్రవేత్తల జాబితాలో ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్)కు చెందిన 23 మంది ఫ్యాకల్టీ ప్రొఫెసర్లు ప్రపంచంలోనే టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రపంచస్థాయి అత్యున్నత శాస్త్రవేత్తల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఐఐటీహెచ్‌కు చెందిన ఈ ప్రొఫెసర్లు ఉండటం గమనార్హం. వీరి పరిశోధన వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న ప్రొఫెసర్లను ఐఐటీహెచ్ పాలకవర్గం చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి అభినందించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పూలవ్యర్థాలతో ఉత్పత్తుల్లో
'హోలీవేస్ట్' కృషి అమోఘం

సబ్బులు, అగరుబత్తులు తయారు చేస్తున్న హైదరాబాద్ స్టార్టప్ కంపెనీ

అభినందనీయమన్న కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ

దేవాలయాల్లోని పూల వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం అత్యంత కీలకమన్న కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: దేవాలయాల్లో భక్తులు సమర్పించే పూలను సేకరించి రీసైక్లింగ్ పద్ధతిలో నూతన ఉత్పత్తులను తయారు చేస్తున్న హైదరాబాద్‌లోని స్టార్టప్ కంపెనీ 'హోలీవేస్ట్'పై కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ ప్రశంసల జల్లు కురిపించింది. పూల వ్యర్థాలతో సబ్బులు, అగరుబత్తులతోపాటు సేంద్రీయ ఎరువులను తయారుచేస్తున్న విధానాలను ప్రశంసించింది. చుట్టపక్కల ఉన్న సుమారు 40 దేవాలయాలు, ఇతర మార్కెట్ ప్రాంతాల నుంచి పూల వ్యర్థాలను సేకరించడం ద్వారా ఈ స్టార్టప్ కంపెనీ వారానికి సుమారు వెయ్యి కిలోల పూల వ్యర్థాలు స్థానిక నీటి వనరులు, పల్లపు ప్రాంతాలను కలుషితం చేయకుండా నిరోధించడంలో సాయపడుతోందని వెల్లడించింది. ఈ మేరకు శుక్రవారం గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందులో పూల వ్యర్థాల రీసైక్లింగ్ అవసరాన్ని నొక్కి చెబుతూ, ఇప్పటికే ఆ రంగంలో కృషి చేస్తున్న వివిధ దేవాలయాలు, స్టార్టప్‌లు, స్వయం సహాయక సంఘాలను ప్రస్తావించింది.

ఆయా దేవాల్లోయాల్లోనూ...

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ మహాకాళేశ్వర్ దేవాలయాన్ని రోజుకు 75 వేల నుంచి లక్ష మంది భక్తులు వస్తారని, వీరిద్వారా ప్రతిరోజూ 5–6టన్నుల పూల వ్యర్థాలు వస్తున్నాయని, వీటిని దేవస్థానం 'పుష్పాంజలి ఎకోనిర్మిత్'వాహనాల ద్వారా ప్రాసెసింగ్ ప్లాంట్‌కు రవాణా చేస్తాయని, ఈ వ్యర్థాలతో జీవ ఇంధనాలు, సేంద్రీయ ఉత్పత్తులుగా మారుస్తున్నారని కీర్తించింది. స్థానిక ఎస్‌హెచ్‌జీ సంఘాలు 30 మిలియన్ల అగరుబత్తీలు, ఇతర పర్యావరణ అనుకూల వస్తువులను తయారు చేస్తున్నాయని, దీని ద్వారా పర్యావరణ సమతుల్యంతో పాటు స్థిరమైన ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయని తెలిపింది.

- ముంబైలోని సిద్ధివినాయక దేవాలయంలోనూ పూల వ్యర్థాలను సేకరించి కందువాలు, నార వంటి వస్త్రాలకు సహజ రంగులుగా వాటిని మారుస్తున్నారని తెలిపింది.
- అయోధ్య, వారణాసి, బోధ గయ, బద్రీనాథ్ వంటి ప్రధాన నగరాల్లో ప్రతి వారం సుమారు 21 టన్నుల పూల వ్యర్థాలు అగరబత్తుల ఉత్పత్తులుగా మారుతున్నాయని తెలిపింది.
- జల, వాతావరణ కాలుష్యాన్ని నిరోధించడంలో దేవాలయాల్లోని పూల వ్యార్థాలను రీ సైక్లింగ్ చేయడం అత్యంత కీలకమన్న కేంద్రం.. పూల వ్యర్థాల విప్లవం సహకారానికి, ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని సృష్టించడంలో ఈ స్టార్టప్‌లు, సంస్థలు, ఎస్‌హెచ్‌జీలు అద్వితీయ కృషి చేస్తున్నాయని కేంద్రం కొనియాడింది.

సీఎంకు ఎన్నారై సెల్ కృతజ్ఞతలు



సాక్షి, హైదరాబాద్: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఉత్తర్వులు జారీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి.. టీపీసీసీ ఎన్నారై సెల్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బీఎం వినోద్ కుమార్, యూకే కన్వీనర్ గంప వేణుగోపాల్, గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, కాంగ్రెస్ ఎన్నారై సెల్ నేత షేక్ చాంద్ పాషా పాల్గొన్నారు.

నాలుగు డీఏలు చెల్లించండి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నియమించిన పీఆర్సీ కమిటీ నివేదికను పరిశీలించకపోవడం వల్ల ఉపాధ్యాయుల్లో నిరాశ కలుగుతోందని పేర్కొన్నారు. జీపీఎఫ్ ఖాతాలు, ప్రభుత్వ జీవిత బీమాలో జమ చేసిన డబ్బు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ సెలవుల నగదు అంశాలు రెండేళ్లుగా ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా రాహుల్ వ్యాఖ్యలు

బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: విదేశీ గడ్డపై భారత సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా రాహుల్‌గాంధీ మాట్లాడారని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామంటూ అమెరికా వేదికగా రాహుల్ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌లతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ...కాంగ్రెస్ మొదటి నుంచీ పేదలు, దళితులు, గిరిజనుల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందన్నారు. ఈ వర్గాలను కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తుంది తప్ప రాజ్యాంగపరంగా కల్పించాల్సిన హక్కుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. అమెరికా పర్యటనలో భారత ప్రజాస్వామ్యాన్ని, దేశప్రజలను అవమానించేలా రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో రిజర్వేషన్లు మారుస్తుందంటూ బీజేపీపై కాంగ్రెస్ విషప్రచారం చేసి లబ్ధి పొందే ప్రయత్నం చేసిందని బంగారు శ్రుతి విమర్శించారు.





సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో ఆలూ విత్తనాలు వేసుకుంటున్న రైతులు

ఆలూ.. సబ్సిడీ ఇస్తే మేలు

క్వింటాలుకు రూ.వెయ్యికిపైగా పెరిగిన విత్తనం ధర

ఎకరానికి రూ.8 వేల వరకు అదనపు సాగు ఖర్చు ● సబ్సిడీపై విత్తనం పంపిణీ చేయాలని రైతుల డిమాండ్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఆలూ రైతులపై విత్తన భారం పడుతోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో వ్యాపారులు విత్తనాల ధరలను అమాంతం పెంచడంతో ఈ పంట సాగుచేసే రైతులకు సాగు ఖర్చు తడిసిమోపెడవుతోంది. గతంలో క్వింటాలుకు రూ.2 వేల నుంచి రూ.2,400 వరకు ఉన్న ఆలు విత్తనం ఇప్పుడు ఏకంగా రూ.3,500 దాటింది. క్వింటాలుపై సుమారు రూ.వెయ్యికిపైగా ధర పెరిగింది. ఎకరానికి కనీసం 7 నుంచి 8 క్వింటాళ్ల విత్తనం అవసరం. దీంతో ఈ పంట సాగుచేసే రైతులకు విత్తన దశలోనే సాగు ఖర్చు రూ.8 వేలు పెరుగుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. అసలే ఎక్కువ పెట్టుబడితో కూడిన పంట కావడం, దీనికి తోడు విత్తన భారం పెరగడంతో అలురైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది.

తెరపైకి సబ్సిడీ సీడ్ డిమాండ్

పెరిగిన ఆలూ విత్తన ధరలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాన్ని సరఫరా చేయాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. గతంలో రెండుసార్లు ఈ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఎనిమిదేళ్ల క్రితం సబ్సిడీపై ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా రైతులకు పంపిణీ చేసిందని, ఈసారి కూడా సబ్సిడీ విత్తన పంపిణీని పునరుద్ధరించాలని ఆలూ రైతులు కోరుతున్నారు.

పంజాబ్ నుంచి కొనుగోలు..

ఏటా రైతులు పంజాబ్‌లోని జలంధర్, యూపీలోని ఆగ్రా నుంచి విత్తనం కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. పెద్ద రైతులైతే స్వయంగా అక్కడి వెళ్లి కొనుగోలు చేసి లారీల్లో తెచ్చుకుంటారు. చిన్న, సన్నకారు రైతులు మాత్రం దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. గతేడాదితో పోలిస్తే ఆలూ విత్తన వ్యాపారులు ధరను అమాంతం పెంచారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి ఆలుగడ్డల ధర కాస్త ఆశాజనకంగా ఉందని భావించిన రైతులకు విత్తన రూపంలో మాత్రం భారం తప్పడం లేదు. ఏటా రైతులు సెప్టెంబర్ చివరి వారం నుంచి ఆలూను విత్తుకోవడం ప్రారంభిస్తారు. ఈ విత్తనాల కోసం రైతులు ఇప్పుడు ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్తున్నారు.

రాష్ట్రంలో ఐదు వేల ఎకరాల్లో సాగు

రాష్ట్రంలో ఆలుగడ్డలు అత్యధికగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌తో పాటు, వికారాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సాగు చేస్తుంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతున్నట్లు ఉద్యానవనశాఖ అధికారుల అంచనా. ఇక్కడి నేలతో పాటు, వాతావరణం అనుకూలంగా ఉండటంతో దీన్ని రైతులు సాగు చేస్తున్నారు. చలి ఎక్కువగా ఉండే ప్రదేశాలు కావడంతో ఈ పంటకు మంచి దిగుబడి వస్తుంది.

విత్తనాన్ని సబ్సిడీపై అందించాలి

ఆలూ విత్తనం రేటు పెరిగినందున ప్రభు త్వం సబ్సిడీపై రైతులకు అందించాలి. గతేడాది ఆలూ విత్తనం క్వింటాల్ రూ.2,400 – రూ.2,600 ఉండగా, ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.3 వేలు – రూ.3,500 పలుకుతోంది. కాబట్టి ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాన్ని అందిస్తే బాగుంటుంది.
– దిలీప్‌కుమార్, రైతు, అత్నూర్

ఆలూ సాగు ఖర్చు పెరిగింది



ఆలుగడ్డ విత్తనం ధర భారీగా పెంచారు. విత్తన ఖర్చు ఎకరానికి 8 వేల వరకు అదనంగా అవుతోంది. గతంలో మాదిరిగా ఆలూ విత్తనాన్ని సబ్సిడీపై సరఫరా చేసి ఆదుకోవాలి. కొన్నేళ్ల క్రితం ఆలూ విత్తనం సబ్సిడీపై ఇచ్చేవారు. దీన్ని పునరుద్ధరిస్తే రైతులకు మేలు జరుగుతుంది.
– ఎం.ఏసురత్నం, ఆలూ రైతు, మాచిరెడ్డిపల్లి, సంగారెడ్డి జిల్లా

సబ్సిడీ విత్తన సరఫరా పథకం లేదు



ప్రస్తుతం సబ్సిడీ విత్తనం సరఫరా చేయడం లేదు. గతంలో సబ్సిడీ విత్తనాలు సరఫరా చేసినట్లు నాకు తెలియదు. ఉద్యానవనశాఖ కిందకు వచ్చే ఈ పంటకు సబ్సిడీ వర్తించదు. ఒకవేళ సబ్సిడీ కిందకు చేరిస్తే రైతులకు సబ్సిడీ విత్తనం సరఫరా చేయడం వీలవుతుంది.
– సోమేశ్వర్‌రావు, డిప్యూటీ డైరెక్టర్, హార్టికల్చర్

పరిశ్రమ చిన్నదే.. పాత్ర పెద్దది

రాష్ట్రంలో సుమారు 26 లక్షలకు పైగా చిన్న, సూక్ష్మ పరిశ్రమలు

2014 నుంచి 2023 నడుమ ఏటా 11 నుంచి 15 శాతం వృద్ధి

40 శాతానికి పైగా ఎంఎస్ఎంఈలు రాజధాని చుట్టూ కేంద్రీకృతం

ఉపాధికల్పనలో వ్యవసాయంతో చిన్న పరిశ్రమల పోటీ


33 లక్షల మందికి చిన్న పరిశ్రమలతో ఉపాధి

ఎస్ఎంఎస్ఈల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీల పాత్ర 25 శాతం లోపే

మూతపడుతున్న ఎస్ఎంఎస్ఈల్లో తెలంగాణలోనే అతి తక్కువ

సాక్షి, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కీలకపాత్ర పోషిస్తున్నాయి. గడిచిన పదేళ్లగా ఈ రంగంలో తెలంగాణలో గణనీయ పురోగతి సాధించింది. తయారీ, సేవా రంగాలతోపాటు రిటైల్, వాణిజ్య రంగాల్లోనూ వీటి పాత్ర అత్యంత కీలకంగా ఉంది. తెలంగాణలోని భారీ ప్రభుత్వ రంగ సంస్థలు, బహుళ జాతి కంపెనీల సరఫరా వ్యవస్థలో ఎంఎస్ఎంఈలు విడదీయరాని భాగంగా ఉన్నాయి. రాష్ట్రంలో ఐటీ, దాని అనుబంధ సేవలు, ఫార్మా, రక్షణ, వస్త్ర, ఆహారశుద్ధి తదితర రంగాలకు సూక్ష్మ, చిన్న, పరిశ్రమలు వెన్నెముకగా ఉన్నాయి. ఎస్ఎంఎస్ఈల కచ్చితమైన సంఖ్యపై స్పష్టత లేకున్నా సుమారు 26 లక్షల మేర ఉంటుందని 2015 నాటి నేషనల్ శాంపిల్ సర్వే అంచనా వేసింది. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రకారం 8.93 లక్షలు, టీజీ ఐపాస్ కింద 2014 నుంచి ఇప్పటి వరకు ఎస్ఎంఎస్ఈలకు ఇచ్చిన అనుమతులు 22,206 ఉన్నాయి. వీటిలో సూక్ష్మ పరిశ్రమలు సుమారు 90 శాతానికి పైగా ఉండగా, ఎక్కువగా మాన్యుఫాక్చరింగ్, సేవలు, రిటైల్, హోల్‌సేల్ రంగాల్లోనే ఉన్నాయి. రాష్ట్ర పారిశ్రామిక చట్టం టీజీ ఐపాస్ ప్రకారం 2014 నుంచి ఎంఎస్ఎంఈల నమోదులో గణనీయ పురోగతి నమోదవుతూ వస్తోంది. టీజీ ఐపాస్ కింద సూక్ష్మ, చిన్న పరిశ్రమల నమోదులో ఏటా 11 నుంచి 15 శాతం వృద్ధి కనిపిస్తోంది.



పెట్టుబడుల్లోనూ భారీ వృద్ధి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో పెట్టుబడులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. 2014–19లో ఒక్కో పరిశ్రమపై పెట్టుబడి సగటున రూ.కోటి రూపాయలు కాగా, 2023 నాటికి రూ.2.15 కోట్లకు చేరింది. కరోనా ప్రభావం తగ్గుముఖం పడుతున్న సమయంలో ఓ దశలో (2021–22)లో సగటు పెట్టుబడి ఒక్కో పరిశ్రమపై రూ.4 కోట్లకు కూడా చేరుకుంది. ఇదిలా ఉంటే ఎంఎస్ఎంఈల్లో ఎక్కువ శాతం రాజధాని హైదరాబాద్ చుట్టూ కేంద్రీకృతమైనట్టు నివేదికలు వెల్లడిస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోనే 40 శాతం ఎంఎస్ఎంఈలు ఉన్నాయి.

- రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈ యాజమాన్యాల్లో ఎస్సీ, ఎస్టీ, మహిళలు 25 శాతంలోపే ఉన్నారు. ఉద్యమ్ పోర్టల్‌లో నమోదైన ప్రతీ వేయిమంది ఎంటర్‌ప్రెన్యూర్లలో మహిళలు కేవలం 3.1 శాతం మాత్రమే ఉన్నారు. ఎంఎస్ఎంఈ యాజమాన్యాల్లో ఎస్సీలు 14.94 శాతం, ఎస్టీలు 8.75 శాతం, ఓబీసీలు 27.69 శాతం, జనరల్ 48.62 శాతంగా ఉన్నారు.
- 2020–23 మధ్యకాలంలో దేశ వ్యాప్తంగా మూతపడిన సూక్ష్మ, పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే అతి తక్కువగా ఉన్నాయి. పెద్ద రాష్ట్రాలతో పోల్చి చూస్తే అత్యధికంగా మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్‌లో మూతపడగా తెలంగాణలో కేవలం 231 ఎస్ఎంఎస్ఈలు మాత్రమే మూతపడ్డాయి. ఇదిలా ఉంటే నష్టాలతో మూసివేత బాటలో ఉన్న 1.340 ఎస్ఎంఎస్ఈలను తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంది. మూతపడిన మరో 115 చిన్న పరిశ్రమలు తిరిగి తెరుచుకునేలా తోడ్పాటు అందించింది.
- రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ రంగాలతోపాటు అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో ఎంఎస్ఎంఈ కూడా ప్రధాన భూమిక పోషిస్తోంది. వీటిలో సేవల రంగంలోనే సుమారు 33 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. తర్వాతి స్థానంలో ఫుడ్ ప్రాసెసింగ్ 10 లక్షలు, ఖనిజ, ఇంజనీరింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల్లో నాలుగేసి లక్షలకుపైగా మంది ఉపాధి కల్పిస్తున్నాయి.

ఎంఎస్ఎంఈ పాలసీ –2024


సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను మరింత ప్రోత్సహిస్తే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రత్యేక 'ఎస్ఎంఎస్ఈ పాలసీ–2024 ఆవిష్కరించింది. నూతన పాలసీలో భాగంగా ఎస్ఎంఎస్ఈల ఏర్పాటుకు అందుబాటులో భూమి, రుణ సదుపాయం, ముడి పదార్థాల లభ్యత, కార్మిక నైపుణ్యత, సాంకేతిక వినియోగానికి ప్రోత్సాహం, వ్యాపార విస్తరణకు పలు ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తారు. తద్వారా జీఎస్‌డీపీలో ఎంఎస్ఎంఈల వాటా 10 శాతానికి చేరడంతో పాటు వాటి నమోదులో 15 శాతం వృద్ధి రేటును ప్రభుత్వం ఆశిస్తోంది. ఉపాధి కల్పన, సమగ్రాభివృద్ధి, సాంకేతికత ఆధునీకరణ, ఉత్పాదకత పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కొత్త పాలసీతో ఎంఎస్ఎంఈల ద్వారా ఉద్యోగాల కల్పనలో 20 శాతం, ఎస్సీ, ఎస్టీ, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లలో 30 శాతం వృద్ధిని ఆశిస్తోంది. పెట్టుబడుల్లో మరో 2 0 శాతం వృద్ధిని కోరుకుంటోంది.

2014 నుంచి నమోదైన ఎంఎస్ఎంఈలు (టీజీఐపాస్)

2014-15	2015-16	2016-17
151	1,343	1,606
2017-18	**2018-19**	**2019-20**
2,587	2,606	2,869
2020-21	**2021-22**	**2022-23**
3,309	3,974	3,061
2023-24	**2024-25**	
2,622	175	

2020-23 మధ్యకాలంలో వివిధ రాష్ట్రాలలో మూతపడిన ఎస్ఎంఎస్ఈలు

మహారాష్ట్ర	తమిళనాడు
5,082	2,456
గుజరాత్	**కర్ణాటక**
1,626	804
హరియాణా	**తెలంగాణ**
558	231



ఆ నియామకాలు రద్దు చేయాలి

- వెటర్నరీ యూనివర్సిటీలో అక్రమ నియామకాలపై నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవతారాయ్

సాక్షి, హైదరాబాద్: పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ ఆరోపించారు. గతేడాది బీఆర్ఎస్ హయాంలో నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా ఈ నియామకాలు చేపట్టడంతో నిజమైన అర్హులు తీవ్రంగా నష్టపోయారని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయంతో పాటు ఏసీబీ డీజీ, విజిలెన్స్ కమిషనర్‌లకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. నియామక ప్రక్రియలో అక్రమాలపై 27 మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా...27 కేసులకు సంబంధించి విచారణ కొనసాగుతోందని వివరించారు.

నెట్ అర్హత లేకపోయినా ఉద్యోగాలు...

నెట్(ఎన్ఈటీ) సర్టిఫికెట్ లేకపోయినా ఉన్నట్లు ఇద్దరు అభ్యర్థులకు ఉద్యోగాలు కట్టబెట్టి అవినీతికి పాల్పడిన అంశం వెలుగు చూసిందని మానవతారాయ్ తెలిపారు. నిరుద్యోగ జేఏసీ ఫిర్యాదు నిజమేనని యూనివర్సిటీ తెలిపినప్పటికీ ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈ అవినీతికి మాజీ వైస్‌చాన్స్‌లర్ రవీందర్‌రెడ్డి మూలకారణమని ఆరోపించారు. రవీందర్ రెడ్డి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి అత్యంత దగ్గరి బంధువని వివరించారు. కొత్త నోటిఫికేషన్ జారీ చేసి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

13న అలయ్‌బలయ్ ఏర్పాట్లపై ఫౌండేషన్ భేటీ

సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల 13న దసరా మిలన్ 'అలయ్‌బలయ్'కార్యక్రమంలో భాగంగా చేయాల్సిన ఏర్పాట్లపై అలయ్‌బలయ్ ఫౌండేషన్ చర్చించింది. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన సన్నాహక సమావేశంలో అలయ్‌బలయ్ ఫౌండేషన్ సలహాదారు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ఇందులోభాగంగా ఇంకా ఏయే సాంస్కృతిక కార్యక్రమాలను చేర్చాలి, ముఖ్యఅతిథులుగా ఎవరెవరిని పిలవాలి, ఏయే రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానించాలి తదితర అంశాలపై ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమైన ఆస్ట్రేలియాకు చెందిన శరత్ అద్దంకి పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కన్వీనర్ చింతల రామచంద్రారెడ్డి, సభ్యులు డా.జిగ్నేశ్‌రెడ్డి, వెంకటరమణి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, కె.రాములు, ప్రదీప్, డా.ఎస్.గౌతమ్‌రావు, పాశం యాదగిరి, కప్పర ప్రసాదరావు, రాణీరుద్రమ పాల్గొన్నారు.

వరద నష్టాలు వదిలేసి విహారయాత్రలా?

సాక్షి, హైదరాబాద్: వరదల వల్ల జరిగిన నష్టంతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కుటుంబంతో కలిసి విహార యాత్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం బీఆర్ఎస్ మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వర్షాలతో కాలువలు దెబ్బ తిన్నాయని, కోదాడలో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు గండి పడిందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గం కోదాడలో మరమ్మతులు జరగడం లేదన్నారు. పంటలకు నీరందక రైతులు నష్టపోతున్నారని, వరద బాధితులకు కనీసం సాయం కూడా అందించడం లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు తమ పదవులను కిరీటంగా భావిస్తూ ప్రజల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శించారు.

క్లుప్తంగా...

చంద్రబాబువి నీచ రాజకీయాలు
మాజీ ఎంపీ అనురాధ



అల్లవరం: వంద రోజుల తన అసమర్థ పాలనను కప్పిపుచ్చేందుకే కల్తీ నెయ్యితో తిరుపతి లడ్డూలు తయారుచేశారని సీఎం చంద్రబాబు ఆరోపణలు చేయడం అత్యంత దారుణమని మాజీ ఎంపీ చింతా అనురాధ పేర్కొన్నారు. తన నీచ రాజకీయాల కోసం చివరికి దేవ దేవుడిని వాడుకునేందుకు సైతం ఆయన వెనకాడడం లేదన్నారు.

ఆస్పత్రుల్లో భద్రత, ప్రమాణాల పెంపుపై సిఫార్సుల సేకరణ

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో ఆరోగ్య సంరక్షణ నిపుణుల పని పరిస్థితుల మెరుగుదలకు ఏర్పాటు చేసిన నేషనల్ టాస్క్‌ఫోర్స్ సబ్ కమిటీ దేశవ్యాప్తంగా రాష్ట్రాల డీఎంఈలు, ఎంపిక చేసిన వైద్య సంఘాల ప్రతినిధులతో శుక్రవారం వర్చువల్ సమావేశం జరిపింది. బెంగళూరు నిమ్హాన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమా మూర్తి సబ్‌కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్ సమావేశంలో పాల్గొన్నారు. పని ప్రదేశాల్లో భద్రత, వర్కింగ్ కండీషన్స్ మెరుగుపరచడానికి అవసరమైన సిఫార్సులను కమిటీ స్వీకరించినట్టు తెలిపారు.

నీతి ఆయోగ్ సీఈవోతో మంత్రి భరత్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ సీఈవో బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యంతో ఏపీ పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి మంత్రి టి.జి.భరత్ భేటీ అయ్యారు. వరల్డ్ ఫుడ్ ఇండియా ఎగ్జిబిషన్‌లో భాగంగా ఢిల్లీ వచ్చిన మంత్రి శుక్రవారం రాత్రి సుబ్రహ్మణ్యంను కలిసి పలు విషయాలపై చర్చించారు. రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు.

2 నుంచి దసరా సెలవులు ఇవ్వండి

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ దసరా సెలవులను మహాలయ అమావాస్య దృష్ట్యా అక్టోబర్ 2 నుంచి ఇవ్వాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్‌జేయూపీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్, అధికార ప్రతినిధి వీరబ్రహ్మం శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2న గాంధీ జయంతి కావడంతో 3న సెలవు ఇస్తే ధార్మిక క్రతువులకు వీలుంటుందని పేర్కొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో రోడ్లను నిర్మించండి
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో వేసే రోడ్లు వరదలకు కొట్టుకుపోకుండా, వర్షాలకు ఛిద్రం కాకుండా ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ఆర్థిక సహాయంతో రాష్ట్రంలో గత ఐదేళ్లుగా నిర్మాణంలో ఉన్న రోడ్ల ప్రాజెక్టులపై ఆయన బ్యాంకు ప్రతినిధులు పవన్ కర్కి, తౌఫిక్ రెహ్మాన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రోడ్ల నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని, రోడ్లు పాడవకుండా పటిష్టంగా నిర్మించేలా కాంట్రాక్టర్లకు స్పష్టమైన నియమావళిని ఇవ్వాలని సూచించారు.

విజయ్‌పాల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు
24న తీర్పు వెలువరిస్తామన్న హైకోర్టు

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ సీఐడీ విశ్రాంత అదనపు ఎస్పీ విజయ్‌పాల్ దాఖలు చేసిన వ్యాజ్యంలో వాదనలు ముగిశాయి. తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. ఈ నెల 24న తీర్పు వెలువరిస్తామంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ రాధాకృష్ణ కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. 2021లో సీఐడీ అధికారులు తనను కస్టడీలోకి తీసుకుని చిత్ర హింసలకు గురిచేశారని, ఇందుకు బాధ్యులపై కేసు నమోదు చేయాలంటూ గుంటూరు నగరపాలెం పోలీస్ స్టేషన్‌లో రఘురామకృష్ణరాజు పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఇందులో విజయ్‌పాల్ కూడా నిందితుడిగా ఉన్నారు.

ప్రభుత్వ పరిహారం ఏ మూలకూ సరిపోదు..

తెనాలి: భారీ వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతాంగానికి వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేల చొప్పున చెల్లించాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.10 వేల పరిహారం ఏమాత్రం సరిపోదని ధ్వజమెత్తారు. రైతు సంఘం ప్రతినిధి బృందం దుగ్గిరాల మండలం పెనుమూలి, పెదకాకాని మండలం వెంకట కృష్ణాపురం, తెనాలి మండల పరిధిలోని హాఫ్‌పేట గ్రామాలకు చెందిన దెబ్బతిన్న వరి పైరును శుక్రవారం పరిశీలించింది. కృష్ణయ్య మాట్లాడుతూ రైతాంగాన్ని ఆదుకుంటామని ప్రభుత్వం మాటల్లో చిత్తశుద్ధి లేదన్నారు.

పట్టణాలతో సమానంగా గ్రామాలు



నెలవారీ తలసరి వినియోగ వ్యయం అంతరంలో భారీగా తగ్గుదల

ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతోంది. ముఖ్యంగా గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంతో గ్రామీణ ప్రజల జీవన విధానం మెరుగుపడింది. దీంతో రాష్ట్రంలో వినియోగదారుల వ్యయంలో పట్టణాలు, గ్రామాల ప్రజల మధ్య అంతరం తగ్గిపోతోంది. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలకు రహదారి సౌకర్యాలు పెరగడంతో అభివృద్ధిలో కూడా అంతరం తరిగిపోయి పట్టణాలతో గ్రామాలు పోటీపడుతున్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడిస్తోంది. వివిధ రాష్ట్రాల్లో గ్రామీణ, పట్టణాల మధ్య నెలవారీ తలసరి వినియోగ వ్యయం మధ్య అంతరాలను, అసమానతలను ఎస్‌బీఐ నివేదిక విశ్లేషించింది. గ్రామీణ, పట్టణాల మధ్య నెలవారీ తలసరి వినియోగ వ్యయంలో తేడా ఆంధ్రప్రదేశ్‌లో భారీగా తగ్గినట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. ఈ విషయంలో దేశంలో ఏపీ ఆరో స్థానంలో ఉన్నట్లు తెలిపింది. దీనివల్ల రాష్ట్రంలో గ్రామీణ, పట్టణాల మధ్య అసమానతలు భారీగా తగ్గినట్లు పేర్కొంది. దేశంలో 2009–10లో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య తలసరి వ్యయం వ్యత్యాసం 88.2 శాతం ఉండగా 2022–23 నాటికి 71.2 శాతానికి తగ్గినట్లు తెలిపింది. 2029–30 నాటికి ఇది 65.1 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.

- సాక్షి, అమరావతి

దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ.6,459 ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 3,773 ఉన్నట్లు వివరించింది. రాష్ట్రంలో 2022–23 నాటికి పట్టణాలు, గ్రామాల మధ్య నెలవారీ తలసరి వినియోగ వ్యయంలో అంతరం 39.3 శాతమేనని తెలిపింది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ. రూ. 6,782 ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 4,870 ఉన్నట్లు పేర్కొంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న దిగువ, మధ్య తరగతి జనాభా ఆదాయాలు మెరుగుపడటం వల్ల నెలవారీ తలసరి వ్యయంలో అంతరాలు భారీగా తగ్గినట్లు పేర్కొంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా నేరుగా నగదు బదిలీ చేయడంతో జీవన విధానంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని నివేదిక వివరించింది. గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడం వల్ల కూడా గ్రామీణ ప్రజల ఆదాయం పెరగడంతో పాటు నెలవారీ తలసరి వ్యయం పెరుగుతోందని తెలిపింది. దీంతో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాలు తగ్గిపోతున్నాయని నివేదిక పేర్కొంది. రైతుల ఆదాయాన్ని పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం వల్ల కూడా గ్రామీణ జీవనం గణనీయంగా మెరుగుపడినట్లు నివేదిక తెలిపింది. 2011–12తో పోల్చి చూస్తే 2022–23లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏపీలో అసమానతలు గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. అదే ఛత్తీస్‌గఢ్, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో అసమానతలు పెరిగినట్లు నివేదిక తెలిపింది. అలాగే పట్టణ ప్రాంతాల్లో ఒడిశా, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో అసమానతలు పెరగ్గా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో అసమానతలు తగ్గినట్లు నివేదిక పేర్కొంది.

2022-23లో రాష్ట్రాలవారీగా గ్రామీణ, పట్టణ నెలవారీ తలసరి వినియోగ వ్యయం (రూపాయల్లో)

రాష్ట్రం	గ్రామీణ	పట్టణ	వ్యత్యాసం (శాతం)
ఆంధ్రప్రదేశ్	4,870	6,782	39.3
అసోం	3,432	6,136	78.8
బిహార్	3,384	4,768	40.9
ఛత్తీస్‌గఢ్	2,466	4,483	81.8
ఢిల్లీ	6,576	8,217	25.0
గోవా	7,367	8,734	18.6
గుజరాత్	3,798	6,621	74.3
హరియాణ	4,859	7,911	62.8
హిమాచల్‌ప్రదేశ్	5,561	8,075	45.2
జార్ఖండ్	2,763	4,931	78.5
కర్ణాటక	4,397	7,666	74.3
కేరళ	5,924	7,078	19.5
మధ్యప్రదేశ్	3,113	4,987	60.2
మహారాష్ట్ర	4,010	6,657	66.0
ఒడిశా	2,950	5,187	75.8
పంజాబ్	5,315	6,544	23.1
రాజస్థాన్	4,263	5,913	38.7
తమిళనాడు	5,310	7,630	43.7
తెలంగాణ	4,802	8,158	69.9
ఉత్తరాఖండ్	4,641	7,004	50.9
ఉత్తరప్రదేశ్	3,191	5,040	57.9
పశ్చిమబెంగాల్	3,239	5,267	62.6

మాతో పెట్టుకుంటే కాల్చిపారేస్తాం!



ఈనెల 9న పుట్టపర్తి పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా 'నిన్ను నిన్ను నిన్ను చంపి నీ రక్తంతోనే రాస్తా.. రక్తచరిత్ర.. రక్త చరిత్ర..' అంటూ పాటలు వేసుకుని టీడీపీ శ్రేణులు ఇష్టారాజ్యంగా డ్యాన్సులు చేశారు. ఇవి చూసి భక్తజనం బెంబేలెత్తిపోయారు.

ఈనెల 10న రామగిరి మండలం కుంటిమద్ది గ్రామంలో టీడీపీ కార్యకర్త గంగాధర్ నాటు తుపాకీతో నానా హంగామా చేశాడు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కేశవపై దాడి చేయబోయాడు. అతను అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది.

ఈనెల 11న మడకశిర మండలం గుండుమల గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా కొందరు యువకులు బహిరంగంగా కత్తులు, తుపాకీలతో విన్యాసాలు చేశారు. ఇది చూసి జనం బేజారెత్తిపోయారు.



మాకు మళ్లీ పాతరోజులు వచ్చాయంటూ నాటుతుపాకులతో టీడీపీ నేతల బరితెగింపు

- 'అనంత'లో మళ్లీ రక్తచరిత్రకు శ్రీకారం!?
- రామగిరి, మడకశిరలో టీడీపీ నేతలు కత్తులు,నాటు తుపాకులతో బెదిరింపులు
- గణేశ్ ఉత్సవాల్లో ఆయుధాలతో విచ్చలవిడిగా డ్యాన్సులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రాయలసీమ జిల్లాల్లో నాటు తుపాకుల సంస్కృతి మళ్లీ ఊపిరిపోసుకుంటోందనడానికి ఈ ఘటనలే తాజా ఉదాహరణలు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా నాటు తుపాకుల వాడకం విచ్చలవిడిగా సాగుతోంది. ముఖ్యంగా టీడీపీ శ్రేణులు వీటితో బహిరంగంగా డ్యాన్సులు చేస్తూ చెలరేగిపోతున్నారు. దీంతో 'ఆర్‌ఓసీ' రోజులు మళ్లీ దాపురించాయా! అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

నిజానికి.. నాటు తుపాకులు, బాంబులు, కత్తులు.. ఈ మాటలు వింటే ఉమ్మడి అనంతపురంలో జిల్లాలో ఆర్‌ఓసీ (రీఆర్గనైజింగ్ కమిటీ) అరాచకాలు గుర్తుకొస్తాయి. అప్పట్లో టీడీపీకి చెందిన ఓ మాజీమంత్రి నేతృత్వంలో ఈ దారుణాలు విచ్చలవిడిగా సాగాయి. ఇందుకు ఎందరో బలయ్యారు. అయితే, ఇప్పుడు మళ్లీ నాటి రోజులు గుర్తొచ్చేలా ఆ పార్టీ నేతలు చెలరేగిపోతున్నారు. ఉదా.. రామగిరి మండలంలో మాజీమంత్రి పరిటాల సునీత అనుచరులు నాటు తుపాకులతో నానా హంగామా చేస్తున్నారు. 'మాతో పెట్టుకుంటే అంతే.. కాల్చిపడేస్తాం.. మళ్లీ మాకు పాత రోజులు వచ్చాయి' అని రెచ్చిపోతున్నారు. ఒకచోట గన్ ఘటన వెలుగులోకి రాగానే.. మరోచోట వినాయక నిమజ్జనంలో తుపాకులతో విన్యాసాలు చేశారు. ఇంకోచోట.. రక్తచరిత్ర పాటలు పెట్టుకుని డ్యాన్సులు చేశారు.

ఐదేళ్లలో అభివృద్ధి పనులు..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రామగిరి మండల వ్యాప్తంగా పలు సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. కుంటిమద్ది గ్రామంలో కూడా రోడ్లు వేశారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. ఫలితంగా ఈ ప్రాంతం ఫ్యాక్షన్ ప్రభావం నుంచి బయటపడుతున్న సమయంలో ఇప్పుడు మళ్లీ పరిటాల కుటుంబం ఆ గ్రామంలో ఫ్యాక్షన్ వాతావరణానికి ఆజ్యం పోస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడుతున్నారు. వినాయక చవితి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాల్సి ఉండగా.. గ్రామాల్లో కొందరు టీడీపీ అల్లరి మూకలు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా చెలరేగిపోయారు. నాటు తుపాకులు, కత్తులు, డమ్మీ తుపాకులు చూపించి ప్రజల్ని భయాందోళనకు గురిచేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. దీంతో మళ్లీ 'ఆర్‌ఓసీ' కాలంలో మాదిరిగా టీడీపీ నేతలు బరితెగిస్తున్నారని ప్రజలు వణికిపోతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే సహించం..

తుపాకులు వాడాలంటే కొన్ని నిబంధనలు ఉంటాయి. అనుమతులు పొందిన వారే వాడాలి. ఎవరుపడితే వారు నాటు తుపాకులతో రెచ్చిపోతే కేసులు తప్పవు. పండుగ వాతావరణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగితే సహించేదిలేదు.

– వి. రత్న, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ

టీచర్ల సర్దు'పాట్లు'

బెడిసికొడుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ

- ఉర్దూ పాఠశాలలకు తెలుగు మీడియం టీచర్లు
- ఉర్దూ పాఠశాలలు, మైనారిటీలపై తీవ్ర ప్రభావం



విద్యాశాఖ కమిషనర్‌కి వినతిపత్రం ఇస్తున్న రూటా నాయకులు

మదనపల్లె : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్నట్లుగా తయారైంది రాష్ట్రంలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అసంబద్ధ జీఓలతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యాశాఖ తలపెట్టిన తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖకు సంబంధించి ఏర్పాటుచేసిన తొలి సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు.. టీచర్ల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి, తక్షణమే విద్యా వలంటీర్లను నియమించాలని ఆదేశించారు. అయితే, అధికారులు సీఎం మాటలకు వ్యతిరేకంగా.. విద్యా వలంటీర్ల నియామకాలకు బదులు వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియకు ప్రొసీడింగ్స్ విడుదల చేశారు. వీటితో ఉర్దూ మీడియం పాఠశాలల ఉనికికి ప్రమాదం ఏర్పడింది. ఉర్దూ పాఠశాలల్లో మాతృభాషలో బోధన జరిపే ఉపాధ్యాయుల్లేక, మైనారిటీ విద్యార్థులు మధ్యలో చదువు మానేసే పరిస్థితి తలెత్తుతోంది. టీచర్ల సర్దుబాటులో భాగంగా ఉర్దూ పాఠశాలల్లోని ఖాళీలను, ఉర్దూ మీడియంలో చదువుకున్న వారితో భర్తీచేయాల్సి ఉండగా.. ఉర్దూ మాట్లాడలేని, చదవలేని వారిని తీసుకొచ్చి సర్దుబాటు చేశారు. దీంతో ఇటు విద్యార్థులకు, అటు ఉపాధ్యాయులకు ఎలాంటి ఉపయోగంలేకుండా పోయింది. ఉదా.. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని ఉర్దూ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా వెంకయ్యరెడ్డిని బదిలీచేశారు. పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండలం తరిగొండలో సోషల్, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టులకు శ్రీనాథరావు, వెంకటరమణ, రాజేంద్రబాబులను బదిలీచేశారు. ఈ ఏడాది ఉర్దూ పాఠశాలలకు ప్రభుత్వం పంపిణీ చేసిన వర్క్ బుక్‌లన్నీ ఉర్దూ మీడియంలో ఉన్నాయి. వీటిని ఉర్దూ మాధ్యమంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తప్ప, తెలుగుమీడియం ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యేలా బోధించలేరు. దీంతో ఉర్దూ పాఠశాలల్లోని విద్యార్థులు తెలుగు మీడియంలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు.

విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు..

ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా), ఆలిండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా), ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా), ఎస్టీయూ, యూటీఎఫ్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్లు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ కమిషనర్‌కు ఫిర్యాదుచేశాయి. మంత్రి నారా లోకేశ్‌కు ట్విట్టర్ ద్వారా విషయం వివరించారు. విద్యాశాఖ అసంబద్ధ సర్దుబాటులో భవిష్యత్తులో ఉర్దూ పాఠశాలలు కనుమరుగవడమే కాకుండా విద్యా ప్రమాణాలు పూర్తిగా క్షీణించి, పిల్లలు పాఠశాలకు వెళ్లకపోయే పరిస్థితులు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. కొన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత తెలుగు మీడియం పాఠశాలల్లో మైనారిటీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఉర్దూ లాంగ్వేజ్ టీచర్లు ఉండటంతో వారు మాతృభాషను అభ్యసించే అవకాశం ఉండేది. ప్రస్తుతం వర్క్ అడ్జస్ట్‌మెంట్ నెపంతో వారిని పాఠశాలల్లో నుంచి తొలగించేశారు.

ఉర్దూ విద్యార్థులకు తీరని నష్టం..



సర్దుబాటు ప్రక్రియలో భాగంగా పలు జిల్లాల విద్యాశాఖాధికారులు ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఉర్దూ వర్ణమాల కూడా రాని తెలుగు మాధ్యమ ఉపాధ్యాయులను ఉర్దూ సబ్జెక్ట్ టీచర్లుగా కేటాయించారు. ఉర్దూ విద్యార్థులకు ఇలాంటి చర్యలతో తీరని నష్టం కలుగుతుంది. వెంటనే సర్దుబాటులో బదిలీ చేసిన తెలుగు మాధ్యమ ఉపాధ్యాయులను వెనక్కు తీసుకోవాలి.

– లయన్ ఇమామ్ బాషా, రూటా రాష్ట్ర అధ్యక్షులు

ఆధ్యాత్మిక సమాచారం



శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 68,835 మంది స్వామివారిని దర్శించుకోగా 25,883 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.96 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సింహవల్లీ తాయారుకి విశేషంగా తిరువీధి

సింహాచలం: సింహగిరిపై సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం సాయంత్రం విశేషంగా తిరువీధి జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో వేంజేపచేసి ఆలయ బేడామండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

కనకదుర్గమ్మకు బంగారు కిరీటం సమర్పణ



గోకవరం: గోకవరంలో ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన శ్రీకనకదుర్గమ్మ వారికి రూ.21 లక్షలతో తయారు చేయించిన బంగారు కిరీటాన్ని దాత కంబాల శ్రీనివాసరావు, భక్తులు అందజేశారు. గతేడాది శరన్నవరాత్ర ఉత్సవాల్లో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అమ్మవారికి బంగారు కిరీటాన్ని చేయిస్తానని సంకల్పించారు. సుమారు రూ.21 లక్షలతో రత్నాలతో పొదిగిన బంగారు కిరీటాన్ని చేయించడానికి సంకల్పించి భక్తులను సైతం భాగస్వాములను చేయడానికి పిలుపునిచ్చారు. ఆయన పిలుపు మేరకు భక్తులు సుమారు రూ.7 లక్షలు విరాళాలు అందించగా, మిగిలిన రూ.14 లక్షలు సమకూర్చి కిరీటాన్ని తయారు చేయించారు.

వెంకటగిరి జాతర రాష్ట్ర పండుగ

వెంకటగిరి రూరల్: తిరుపతి జిల్లా వెంకటగిరి పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగ అని, అధికారులంతా సమన్వయంతో జాతరను విజయవంతం చేద్దామని తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ శుభం బన్సాల్ మాట్లాడుతూ ఎవరెవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలని, అప్పుడే జాతర విజయవంతం అవుతుందన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యా సమాచారం

రేపు ఏపీటీఎఫ్ జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్ 1938) ఆధ్వర్యంలో జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు నిర్వహించనున్నారు. ఏపీటీఎఫ్ 80 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమేష్, ఎస్.సురేష్ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో విద్యావ్యవస్థలో సంస్కరణలు-ప్రాథమిక విద్యపై చూపుతున్న ప్రభావాలు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ కృషి తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.



సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి



ఏర్పేడు: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని నీతిఅయోగ్ సభ్యుడు వీకే సరస్వత్ అన్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని ఐఐటీ ప్రాంగణంలో సుస్థిర ఆర్థికవృద్ధికి కొత్త యుగం సాంకేతికత అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముందుగా స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఐఐటీ ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నీతి అయోగ్ సభ్యుడు మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తును రూపొందించడంలో ఆవిష్కరణలు, పరిశోధనల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు.

మహిళా వర్సిటీలో ఘనంగా ఫుడ్ అండ్ హెల్త్ మేళా



తిరుపతి సిటీ: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పద్మావతి మహిళా వర్సిటీ హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఫుడ్ అండ్ హెల్త్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించారు. ఇందులో ప్రధానంగా రాగి, మునగాకు పిట్టు, అరటి పువ్వువడ, నాన్ వెజ్ పచ్చళ్లు, ఆకుకూర పొడులు, పండ్ల రసాలు సందర్శకులను ఆకర్షించాయి.

● బాల మేధావి

జనరల్ నాలెడ్జ్‌కు కేరాఫ్ అడ్రస్



ఫ్రెండ్స్, ఈరోజు మనం మయాంక్ గురించి తెలుసుకుందాం. పన్నెండేళ్ల వయసులో పాపులర్ క్విజ్ షో 'కౌన్ బనేగా కరోడ్ పతి'లో కోటి రూపాయలు గెలుచుకున్న అతి పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు.

అమితాబ్ బచ్చన్ నుంచి బహుమతిని అందుకున్నాడు. ప్రైజ్ మనీతో పాటు ఒక కారును కూడా తీసుకున్నాడు.

'కోటి రూపాయల ప్రశ్నకు సమాధానం చెప్పినందుకు సంతోషంగా ఉంది. కేబీసిలో పాల్గొనే అవకాశం రావడం, అమితాబ్ సర్‌తో షోలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను' అంటూ బహుమతి గెలుచుకున్న రోజు తన సంతోషాన్ని ప్రకటించాడు మయాంక్.

మయాంక్‌ను మెచ్చుకోవడమే కాదు అతడి తండ్రిని....

'ఈ అబ్బాయి ఇంత చిన్న వయసులో ఇంత నాలెడ్జ్ ఎలా సంపాదించాడు?' అని అడిగాడు అమితాబ్.

హరియాణాలోని మహేంద్రగఢ్‌కు చెందిన మయాంక్‌కు పాఠ్య విషయాలే కాదు ప్రపంచంలో జరిగే పరిణామాలు, చరిత్రకు సంబంధించిన విషయాలు తెలుసుకోవడం అంటే ఇష్టం. వాటి గురించి టీచర్‌లను అడుగుతుంటాడు. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలను చదువుతుంటాడు.

అలా చదివిన జ్ఞానం వృథా పోలేదు.

దేశవ్యాప్తంగా ఎంతోమంది దృష్టిలో పడేలా చేసింది.

ఫ్రెండ్స్, మరి మీరు కూడా మయాంక్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి.

క్విజ్ పోటీలు ఉన్నప్పుడే జనరల్ నాలెడ్జ్‌పై దృష్టి పెట్టడం కాకుండా ప్రపంచవ్యాప్తంగా జరిగే సంఘటనల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. దాంతోబాటు చరిత్రలో ఏం జరిగిందో కూడా పుస్తకాలు చదువుతూ తెలుసుకోవాలి.

న్యూస్‌పేపర్ రోజూ చదవడం మరచిపోవద్దు.

'జననరల్ నాలెడ్జ్‌కు ఆకాశమే హద్దు' అంటున్నాడు మయాంక్.

నిజమే కదా!

మనం ఎంత తెలుసుకున్నా తెలుసుకోవాల్సింది ఎంతో ఉంటుంది. మరి ఈరోజు నుంచే మీ ప్రయత్నం మొదలు పెట్టండి. 'జనరల్ నాలెడ్జ్‌లో దిట్ట' అని పించుకోండి.



మంత్రాల మర్రిచెట్టు

సరదా జానపద కథ



ఒక ఊళ్లో ఒక జులాయి దొంగతనాలు చేస్తా బతికేవాడు. వాళ్ల ఊరికి ఒక రోజు ఒక ముని వచ్చినాడు. ఆ మునికి చానా మహిమలు న్నాయని ఊరంతా గొప్పగా చెప్పుకొనేటోళ్ళు. అది విన్న జులాయి ఒకరోజు రాత్రి ఊరంతా నిద్రపోయినాక ముని వున్న ఇంట్లోకి దూరినాడు.

నిద్రపోతా వున్న మునిని లేపి, కత్తి మెడ మీద పెట్టి 'చూడు సామీ! నేనంత మంచోణ్ణి కాను. చానా దుర్మార్గుణ్ణి. నేనేం కోరుకుంటే అది క్షణాల్లో నా దగ్గరికి చేరే మంత్రం మర్యాదగా చెప్పు. లేకుంటే నిన్ను ఇక్కన్నే పొడిచి చంపేస్తా' అని భయపడిచ్చినాడు.

దానికా ముని చిరునవ్వు నవ్వి ''చూడు నాయనా! మనిషి పుట్టుక పుట్టినాక సొంతగా సంపాదిచ్చుకోని బతకాలి గానీ ఇట్లా తేరగా వచ్చే సొమ్ము గురించి ఆలోచించకూడదు. దురాశ మంచిదిగాదు. నా మాటిని దొంగతనాలు మాని హాయిగా ఏదయినా పని చేసుకోని బతుకుపో' అన్నాడు.

దానికి జులాయి విన్లేదు. పొడవబోయాడు.

అప్పుడా ముని కాస్త ఆలోచించి ''నీ కర్మ. చెప్తా విను. ఇక్కడికి పక్కనే ఒక అడవి వుంది గదా... దాంట్లో చక్కగా మూడుమైళ్ళు పో. అక్కడ ఒక చిన్న గుడుంటాది. ఆన్నుండి తూర్పు దిక్కుకు తిరిగి చక్కగ మరో మూడుమైళ్ళు పో. అక్కడ ఒక పెద్ద మర్రి చెట్టు కనబడతాది. అది మామూలు మర్రిచెట్టు కాదు. కోరికలు తీర్చే కామధేనువు. దాని కింద నిలబడి ఏది కోరుకుంటే అది జరుగుతుంది' అన్నాడు.

జులాయి హుషారుగా పక్కరోజు ఉదయాన్నే అడవికి బయలుదేరాడు. చక్కగా ఒక మూడుమైళ్ళు పోగానే ఒక చిన్నగుడి కనబడింది. అక్కన్నించి తూర్పు దిక్కుకు తిరిగి మళ్ళా మూడు మైళ్ళు నడవగానే ఒక మర్రిచెట్టు కనబడింది. జులాయి అది చూసి చాలా సంతోషించాడు. దాని కింద నిలబడి 'నడిచీ నడిచి ఒళ్ళంతా చెమటలు పట్టినాయి. ఇక్కడ గనుక ఒక చెరువుంటే ఎంత బాగుండు. హాయిగా స్నానం చేసేవాణ్ణి' అనుకున్నాడు. టక్కున ఎదురుగా ఒక పెద్ద చెరువు ప్రత్యక్షమయ్యింది.

జులాయి ఆ చెరువును చూసి ఆశ్చర్యపోయి సంబరంగా చెరువులో దూకి బాగా ఈత కొట్టి, స్నానం చేసి ఆ చెట్టు కిందికి వచ్చినాడు. వచ్చి ''వేసుకోడానికి మాంచి ఖరీదైన బట్టలుంటే ఎంత బాగుండు' అనుకున్నాడు

వాడట్లా మనసులో అనుకోవడం ఆలస్యం పట్టుబట్టలు అక్కడ ప్రత్యక్షమయినాయి. వాడు సంబరంగా అవి వేసుకున్నాడు. ''కడుపు నకనకలాడిపోతా వుంది. మాంచి విందు భోజనం దొరికితే ఎంత బాగుండు'' అనుకున్నాడు. వాడట్లా అనుకోవడం ఆలస్యం పండ్లు, తినుబండారాలు, పానీయాలు తాంబూలాలు... ఒక్కటేమిటి లోకంలో యాడాడ వున్నవన్నీ క్షణంలో వాని ముందు ప్రత్యక్షమైనాయి. వాడు ఆనందంగా వానికిష్టమైనవన్నీ బాగా తిన్నాడు. అప్పటికే సాయంకాలమైపోయింది.

దాంతో వాడు ''నాకు మోయలేనంత బంగారం, వజ్రాలు దొరికితే ఎంత బాగుండు. హాయిగా జీవితమంతా కాలు మీద కాలేసుకోని బతుకుతాను'' అనుకున్నాడు. వాడట్లా మనసులో అనుకోవడం ఆలస్యం... వాని ముందు కుప్పలు కుప్పలుగా బంగారం, వజ్రాలు, వైఢూర్యాలు, మణులు, మాణిక్యాలు ధగధగా మెరిసిపోతా ప్రత్యక్షమయినాయి. అవి అన్నీ నింపుకొనే సరికి బాగా చీకటి పడింది. చీకట్లో అడవిలో పోవడం అంత మంచిది కాదు గదా, దాంతో అక్కణ్ణే పండుకొని పొద్దున్నే పోదామనుకోని '' మెత్తని పరుపు, మంచం వుంటే ఎంత బాగుండు'' అనుకున్నాడు. టక్కున మెత్తని హంసతూలికా తల్పం ప్రత్యక్షమయింది. వాడు ఎగిరి దాని మీదికి దూకి హాయిగా నడుం వాల్చాడు. కాని నిద్రపట్టలేదు. దూరం నుండి జంతువుల అరుపులు వినబడసాగినాయి. దాంతో వానికి భయమేసి ''కొంపదీసి నిద్రపోతా ఉన్నప్పుడు ఏ పులో వచ్చి మీద పడి నన్ను తినదు గదా'' అనుకున్నాడు. అంతే... టక్కున ఒక పులి ప్రత్యక్షమై ఎగిరి వాని మీదికి దుంకి చంపి తినేసింది.

– డా.ఎం.హరికిషన్





పిల్లలూ దెయ్యమూ చల్లనివారే..!

పిల్లలకొచ్చే కొన్ని క్రియేటివ్ థాట్స్ చూసి పెద్దాళ్లు అబ్బురపడిపోవడం మామూలే.

అదేంటోగానీ మా బుజ్జిగాడి ఐడియాలు జస్ట్ ఆశ్చర్యపోయేలా చేయడమే కాదు... గబుక్కున గతుక్కుమనిపిస్తాయి. గుటుక్కుమనిపిస్తాయేమోనని డౌటొచ్చేలాక్కూడా చేస్తాయి. అందులో కొన్ని...

ఎందుకోగానీ మా బుజ్జిగాడికి హారర్ మూవీస్ అంటే ఇష్టం. వాడంత చిన్నపిల్లాడు కదా... చూడ్డానికి నేను భయపడి చచ్చేంత భయంకరమైన మూవీస్ను కూడా తెగ ఎంజాయ్ చేసేస్తుంటాడు.

సినిమాలో ఓ దెయ్యం తెల్లటి చీర కట్టుకునీ, నున్నగా దువ్వినట్టు జుట్టును స్టైలుగా విరబోసుకుని భయంకరంగా హిస్టీరిక్‌గా నవ్వుతూ వస్తున్న సీన్ చూసి... ఓ పక్క గజగజా వణికి ఛస్తున్నాన్నేను.

అప్పుడా సీన్‌ను వాడు కూల్‌గా చూస్తూ 'ఈ దెయ్యం వాడే షాంపూ లేదా హెయిరాయిల్ ఏ కంపెనీదో కనుక్కోవాలి నాన్నా. అన్నట్టు... తెల్లచీర కట్టుకుని ఇలా శ్మశానాల్లో తిరిగే దెయ్యాలు తమ జుత్తును ఇంత ఒత్తుగా మెయింటింగు చేయడం ఎలా కుదురుతుందో కదా. ఇంతవరకు నేను చూసిన హారర్ సినిమాలన్నింటిలోనూ ఏ దెయ్యానికీ కొత్తిమీర కట్టలాంటి పోనీ స్టైయిలు... అదే పోనీ టెయిలు చూళ్లేదు నాన్నా.

ఉంకో విషయం... దెయ్యాల చీరలవీ కూడా తె...ల్లగా ఏ బర్ఫెక్సెలో, ఏ బర్మా డిటర్జెంటు పవుడరో వేసి ఉతికినంత తెల్లగా ఉంటాయ్. మట్టిగొట్టుకుపోయి ఉండే శ్మశానాల్లో వాటి కుచ్చిళ్ల మట్టిలో పొర్లాడే చోట కూడా చీరలంత తెల్లగా ఎలా ఉంటాయంటావ్? అదేదో వాషింగ్ మెషిన్లోంచి 'ఎనీ డౌట్' అంటూ బట్టలు తీస్తున్నవాడిలాగా ఈ 'దెయ్యం అక్క' బట్టల్ని కూడా వాళ్ల డ్యాడీయే ఉతికేస్తుంటాడంటావా?

నాకోటి అనిపిస్తోంది నాన్నా... ఈ యాడ్స్ వాళ్లు హీరోయిన్లకు అన్నన్ని డబ్బులిచ్చి పెట్టుకోడానికి బదులు... ఆ షాంపూలూ, హెయిరాయిళ్లూ, డిటర్జెంటు వాళ్లు దెయ్యాల్నే బ్రాండ్ అంబాసిడర్లుగా పెట్టుకుంటే బాగుంటుంది కదా?''

ఇదంతా నేను అటుఇటుగా విన్నా. కానీ... వాడన్న అన్ని మాటల్లోనూ దెయ్యాన్ని పట్టుకుని 'అక్కా' అని వరస కలిపి పిలిచిన తీరు మరింత అవాక్కయ్యేలా చేసింది.

''ఏరా... దెయ్యం నీకు అక్కా?'' అడిగా.

''మరి అమ్మ చెప్పింది కదా. నా కంటే పెద్ద అమ్మాయి లెవర్నైనా అక్కా అని పిలవాలని''

నిజమే... వీడి వరస కరెక్టే. ఈ దెయ్యపిల్లాడికి అది ఖచ్చితంగా 'అక్కే'!

- యాసీన్

మన పొడుపు కథలు

బ్రెయిన్ జిమ్



1) చూస్తే చూసింది కాని కళ్లు లేవు. నవ్వితే నవ్వింది కాని నోరు లేదు. ఏమిటది?

2) అరచేతిలో 60 నక్షత్రాలు

3) అడవిలో పుట్టింది... అడవిలో పెరిగింది. మా ఇంటికి వచ్చింది. తైతక్కలాడింది. ఏమిటది?

4) ఇల్లు కాని ఇల్లు

జవాబులు: 1) అద్దం, 2) జల్లెడ, 3) కవ్వం, 4) బొమ్మరిల్లు

తెలుగు భాషలో వానలు ఎన్నో...



గాంధారి వాన -కంటికి ఎదురుగా ఉన్నది కనిపించనంత జోరుగా కురిసే వాన.
మాపుసారి వాన -సాయంత్రం కురిసే వాన
మీసర వాన - మృగశిర కార్తెలో కురిసే వాన
దుబ్బురు వాన - తుప్పర / తుంపర వాన
సానిపి వాన - అలుకు (కళ్లాపి చల్లినంత కురిసే వాన)
సూరునీల్ల వాన - ఇంటి చూరు నుంచి ధార పడేంత వాన
బట్టదడుపు వాన - ఒంటి మీదున్న బట్టలు తడిసేంత వాన
తప్పె వాన - ఒక చిన్న మేఘం నుంచి పడే వాన
సాలు వాన - ఒక నాగలి సాలుకు సరిపడా వాన
ఇలువాలు వాన - రెండుసాల్లకు - విత్తనాలకు సరిపడా వాన
మడికట్టు వాన - బురద పొలం దున్నేటంత వాన
ముంతపోత వాన - ముంతతోటి పోసినంత వాన
కుండపోత వాన - కుండతో కుమ్మరించినంత వాన
ముసురు వాన - విడువకుండా కురిసే వాన
దరోదరి వాన - ఎడతెగకుండా కురిసే వాన
బొయ్య బొయ్య గొట్టే వాన - హోరుగాలితో కూడిన వాన
కోపులు నిండే వాన
రోడ్డు పక్కన గుంతలు నిండేంత వన
రాళ్ల వాన - వడగండ్ల వాన
కప్పదాటు వాన -
అక్కడక్కడా కొంచెం కురిసే వాన
తప్పడతప్పడ వాన -
టపటపా కొంచెంసేపు కురిసే వాన
దొంగ వాన - రాత్రంతా కురిసి
తెల్లారి కనిపించని వాన
ఏకార వాన -
ఏకధారగా కురిసే వాన
మొదటి వాన -
విత్తనాలకు బలమిచ్చే వాన
సాలేటి వాన -
భూమి తడిసేంత భారీ వాన
సాలుపెట్టు వాన -
దున్నేందుకు సరిపోయేంత వాన











ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

మన తెలుగు

ఈ వారం కొన్ని పదాలు...

ఉపేక్ష	అశ్రద్ధ, నిర్లక్ష్యం	ఉరవడి	అతి వేగం
ఉపోద్ఘాతం	ఆరంభం	ఉర్వి	భూమి
ఉప్పలి	కీడు, ఆపద	ఉల్లోలము	పెద్ద అల
ఉమ్మలము	దుఃఖం, సంతాపం	ఉవాయి	సంతోషం, గెలుపు

మా నాయినే!

బింకు : సైంటిస్ట్ తన డోర్-బెల్‌ను ఎందుకు తొలగించాడు?
టింకు : ఆ సైంటిస్ట్ 'నో-బెల్' గెలుచుకోవాలనుకుంటున్నాడు.

* * *

టీచర్ : 8 మామిడి పండ్లను ఆరుగురికి ఎలా పంచుతారు?
రవి : మ్యాంగో మిల్క్‌షేక్ చేసి!

* * *

టీచర్ : ప్రపంచంలో ఫస్ట్ క్రికెట్ మ్యాచ్ ఎక్కడ జరిగింది?
రాజు : స్టేడియంలో

● కామెడీ క్లాస్



సార్పట్టా కూరగాయలు



మన దగ్గర 'సార్పట్టా' అనే బాక్సింగ్ సినిమా వచ్చింది. బాక్సింగ్ రింగ్‌లో ఎవరు గొప్పో తేల్చుకోవడానికి పంచ్‌లిచ్చుకుంటారు. ఇంగ్లాండ్‌లోని ఉత్తర యార్క్‌షైర్‌లో ఉన్న రిపన్‌లో ప్రతి ఏటా ఈ సమయంలో భారీ కూరగాయల పోటీ జరుగుతుంది. అక్కడ భారీ భారీ సైజులో కూరగాయలు పండించిన రైతులు నువ్వు గొప్పా నేను గొప్పా రారా చూసుకుందాము ప్రతాపము అని తాము పండించిన కూరగాయలు తెస్తారు. ఏనుగంత క్యాబేజీ, రోకలి అంత క్యారెట్టు, పుచ్చకాయంత బీట్‌రూటు, పొట్లకాయంత ఉండే కుకుంబరు... చూస్తూ నోరు వెళ్లబెట్టాల్సిందే. ఈసారి జరిగిన పోటీల్లో దాదాపు 9 కేజీల ఉల్లిపాయను ఒక రైతు ప్రదర్శించాడు. పెద్ద బొచ్చుకుక్కలాంటి క్యాబేజీని ఒకతను తెచ్చాడు. చిన్న ట్రక్కులో వెనుక పట్టేంత గుమ్మడి కాయలు సరేసరే. జడ్జిలు ఇవన్నీ చూసి అందరికంటే పెద్ద కాయలను పండించిన వారికి ప్రైజు ఇచ్చి ఒక నమస్కారం పెట్టుకుంటారు. కోసి ఒక ముక్క పెడితే సంచిలో వేసుకొని ఇంటికెళ్లి వంట చేసుకుంటారు. ఎంత భారీ కూరగాయలనైనా తినాల్సింది జానెడు పొట్టే కదా.



మన సామెతలు



1. నిప్పు ముట్టనిదే చెయ్యి కాలదు.
2. నిమ్మకు నీరెత్తినట్లు.
3. నిప్పు తొక్కిన కోతి వలె.
4. నీరు ఉంటే ఊరు లేదు. ఊరు ఉంటే నీరు లేదు.
5. నీరు, నూనె కలుస్తాయా!
6. నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా!

బిజినెస్ రీల్

మన్బా ఫైనాన్స్ @ రూ.114-120

ఈ నెల 23-25 మధ్య ఐపీవో

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ ఎన్‌బీఎఫ్‌సీ.. మన్బా ఫైనాన్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 114–120 ధరల శ్రేణిని ప్రకటించింది. ఈ నెల 23న ప్రారంభంకానున్న ఇష్యూ 25న ముగియనుంది. దీనిలో భాగంగా 1.26 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 151 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్ల వాటా 100 శాతంకాగా.. భవిష్యత్ అవసరాలరీత్యా నిధులను మూలధన పటిష్టతకు వినియోగించనుంది. సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం వెచ్చించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 125 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. కంపెనీ ప్రధానంగా వాహన, వ్యక్తిగత రుణాలు, చిన్న బిజినెస్‌లకు రుణాలు తదితర ఫైనాన్షియల్ సర్వీసులందిస్తోంది.

రెడీమేడ్ గార్మెంట్స్ ఎగుమతులు జూమ్

న్యూఢిల్లీ: రెడీమేడ్ దుస్తుల ఎగుమతులు భారత్ నుంచి ఆగస్ట్ నెలలో 1.26 బిలియన్ డాలర్లు నమోదయ్యాయి. 2023 ఆగస్ట్‌తో పోలిస్తే ఇది 12 శాతం అధికం. ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్ట్ మధ్య భారత్ నుంచి విదేశాలకు సరఫరా అయిన రెడీమేడ్స్ 7.12 శాతం అధికమై 6.39 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయంగా ఎదురుగాలులు, ఎర్ర సముద్రం ముప్పు, అధిక రవాణా వ్యయాల వంటి సవాళ్లు ఉన్నప్పటికీ ఎగుమతుల వృద్ధి కొనసాగుతోందని అపారెల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ సుధీర్ సేఖ్రి తెలిపారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఉన్న జపాన్, కొరియా మార్కెట్లు సైతం సానుకూల ఫలితాలను అందించాయని కౌన్సిల్ సెక్రటరీ జనరల్ మిథిలేశ్వర్ ఠాకూర్ వివరించారు. ఆస్ట్రేలియా, మారిషస్, నార్వేకు ఎగుమతులు ఏప్రిల్–జూన్‌లో పెరిగాయని చెప్పారు.

భారత్‌లో థామ్సన్ సౌండ్‌బార్స్

న్యూఢిల్లీ: కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న ఫ్రెంచ్ కంపెనీ థామ్సన్ భారత మార్కెట్లో సౌండ్‌బార్స్‌ను విడుదల చేసింది. ఇప్పటికే ఇక్కడి మార్కెట్లో థామ్సన్ టీవీలు ఉన్నాయి. రానున్న రోజుల్లో భారీ స్పీకర్స్, పార్టీ స్పీకర్స్ సైతం విక్రయిస్తామని థామ్సన్ బ్రాండ్ ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్న సూపర్ ప్లాస్ట్రానిక్స్ సీఈవో అవనీత్ సింగ్ మార్వా తెలిపారు. ఇందుకోసం నోయిడా ప్లాంటులో రూ.50 కోట్లతో కొత్త తయారీ కేంద్రం స్థాపించినట్టు వెల్లడించారు. ఈ కేంద్రం వార్షిక తయారీ సామర్థ్యం 5 లక్షల యూనిట్లు. ఆన్‌లైన్ చానెల్స్‌లో 10 శాతం వాటా లక్ష్యంగా చేసుకున్నట్టు మార్వా తెలిపారు. '4కే స్మార్ట్ టీవీల అమ్మకాలు దూసుకెళ్తుండడం, ఓటీటీ కంటెంట్ వినియోగం పెరగడంతో సౌండ్ బార్స్‌కు డిమాండ్ అధికం అయింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-9-2024	
విశాఖ	550-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,946.35	5.32
ICICIBANK	1,349.80	4.47
JSWSTEEL	983.35	3.69
LT	3,793.00	2.97
COALINDIA	491.5	2.84

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
GRASIM	2,675.00	-2.33
SBIN	784.5	-0.69
NTPC	423	-0.22
INDUSINDBK	1,482.00	-0.19
HEROMOTOCO	6,000.00	-0.1

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	11,401
ఎన్‌ఎస్‌ఈ	1,91,598
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	3,65,983
ఎఫ్ఐఐ	+14,064
డీఐఐ	- 4,427

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.97	$ 71.16
బ్రెంట్	74.42	$ 74.88

టెలికం సర్వీసులకు 3 రకాల అనుమతులు

లైసెన్సింగ్ విధానంలో మార్పులకు ట్రాయ్ సిఫార్సులు



న్యూఢిల్లీ: ప్రస్తుత టెలికం సర్వీస్ లైసెన్సింగ్ విధానంలో సమూలంగా మార్పులు తెచ్చే దిశగా టెలికం రంగ నియంత్రణ సంస్థ ప్రధానంగా మూడు రకాల అనుమతులను సిఫార్సు చేసింది. మెయిన్ సర్వీస్ ఆథరైజేషన్, అనుబంధ సర్వీసుల ఆథరైజేషన్, క్యాప్టివ్ సర్వీస్ ఆథరైజేషన్ వీటిలో ఉన్నాయి. వివిధ సేవలు, సర్వీస్ ఏరియాలవ్యాప్తంగా 'వన్ నేషన్ - వన్ ఆథరైజేషన్' లక్ష్యాన్ని సాధించే దిశగా 'ఏకీకృత సర్వీస్ ఆథరైజేషన్' కింద ట్రాయ్ ఈ సిఫార్సులు చేసింది. వీటి ప్రకారం మెయిన్ సర్వీస్ ఆథరైజేషన్లను నెట్‌వర్క్ సర్వీస్ ఆపరేటర్ (ఎన్ఎస్‌వో), వర్చువల్ నెట్‌వర్క్ ఆపరేటర్ (వీఎన్‌వో)గా రెండు విభాగాల కింద ఇస్తారు. అనుబంధ సర్వీస్ ఆథరైజేషన్లను సాధారణంగా పెద్దగా పర్యవేక్షణ అవసరం ఉండని ఎంటర్‌ప్రైజ్ యూజర్లకు ఇస్తారు. సొంత అవసరాల కోసం నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసుకునేందుకు స్పెక్ట్రం తీసుకున్న సంస్థలకు క్యాప్టివ్ సర్వీస్ ఆథరైజేషన్ ఇస్తారు.

30 శాతం మార్కెట్ వాటా లక్ష్యం

గోద్రెజ్ ఇంటీరియో ఎస్‌వీపీ దేవ్ సర్కార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హోమ్, ఆఫీస్ ఫర్నిచర్ బ్రాండ్ గోద్రెజ్ ఇంటీరియో దక్షిణాది మార్కెట్‌పై మరింతగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం తెలంగాణలో హోమ్ ఫర్నిచర్ విభాగంలో 21 శాతంగా ఉన్న తమ వాటాను 30 శాతానికి పెంచుకునే యోచనలో ఉంది. అలాగే ఈ ఏడాది కిచెన్ వ్యాపారాన్ని 20 శాతం మేర పెంచుకోనున్నట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవ్ సర్కార్ తెలిపారు. మాడ్యులర్ కిచెన్లకు పెరుగుతున్న ఆదరణ, రియల్ ఎస్టేట్ మార్కెట్ బూమ్ తదితర సానుకూల అంశాల దన్నుతో కిచెన్ సెగ్మెంట్ గణనీయంగా వృద్ధి చెందుతోందన్నారు. వచ్చే మూడేళ్లలో కొత్తగా మరో 25 షోరూమ్‌లు, 150 రిటైల్ షోరూమ్‌లు ప్రారంభించనున్నట్లు వివరించారు. 2027 నాటికి తెలుగు రాష్ట్రాల నుంచి ఆదాయాన్ని రూ. 500 కోట్లకు పెంచుకోనున్నట్లు వివరించారు. దక్షిణాదిలో తమకు 250 పైచిలుకు చానల్ పార్ట్‌నర్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. పండుగ సీజన్ సందర్భంగా 35 శాతం వరకు డిస్కౌంట్లు అందిస్తున్నట్లు సర్కార్ చెప్పారు. అమ్మకాల వృద్ధితో తమ మొత్తం ఆదాయంలో 30–35 శాతం వాటా దక్షిణాది మార్కెట్‌ది ఉంటుందన్నారు.

అందుబాటు ధరల ఇళ్ల రుణాల్లోకి గోద్రెజ్

- డిసెంబర్ నాటికి ప్రారంభం
- మూడేళ్లలో ఐపీవోకి వస్తాం
- సంస్థ ఎండీ మనీష్ షా ప్రకటన



న్యూఢిల్లీ: వ్యాపార విస్తరణలో భాగంగా గోద్రెజ్ క్యాపిటల్ అందుబాటు ధరల ఇళ్ల రుణాల విభాగంలోకి డిసెంబర్ నాటికి ప్రవేశించనున్నట్టు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి (2025 మార్చి) నిర్వహణ ఆస్తులు (రుణాలు) రూ.17,000 కోట్లకు చేరుకుంటాయని సంస్థ ఎండీ మనీష్ షా తెలిపారు. ఈ సంస్థ నిర్వహణ ఆస్తులు 2024 మార్చి నాటికి రూ.10,000 కోట్లుగా ఉంటే, ప్రస్తుతం రూ.13,000 కోట్లకు చేరుకున్నాయి. 2026 మార్చి నాటికి రూ.30,000 కోట్లు, 2028 మార్చి నాటికి రూ.50,000 కోట్ల లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు మనీష్ షా చెప్పారు. ఎస్ఎంఈ, ఎంఎస్ఎంఈ విభాగంతోపాటు, గృహ రుణాలపై తాము ప్రధానంగా దృష్టి సారించినట్టు తెలిపారు. గోద్రెజ్ క్యాపిటల్ 100 శాతం గోద్రెజ్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థగా ఉంది. అందుబాటు ధరల ఇళ్ల విభాగంలో పెరుగుతున్న డిమాండ్‌ను షా ప్రస్తావించారు. మొదట ఒకటి రెండు రాష్ట్రాల్లో ఈ రుణాలను ప్రారంభించి, కస్టమర్ల స్పందన ఆధారంగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని వివరించారు. అందరికీ ఇళ్లు అన్న కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం తమ వృద్ధి అవకాశాలకు మద్దతునిస్తుందన్నారు.

రైతులకు అండగా..

ఎస్ఎంఈ విభాగంలో పాల రైతులకు రుణసాయంతో కార్యకలాపాలు మొదలు పెట్టామని మనీష్ షా తెలిపారు. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం కింద 25 రుణాలను మంజూరు చేసినట్టు చెప్పారు. గ్రూప్ సంస్థ క్రీమ్‌లైన్ డెయిరీ (జెర్సీ బ్రాండ్) నెట్‌వర్క్ ఆధారంగా చిన్న రైతులు వారి వ్యాపార విస్తరణకు అవసరమైన రుణాలు అందిస్తున్నట్టు వివరించారు. వచ్చే మూడున్నరేళ్లలో ఐపీవోకు వస్తామని ప్రకటించారు. తాము అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ పరిధిలోకి రామంటూ, ఆర్‌బీఐ గడువు తమకు వర్తించదని స్పష్టం చేశారు.

నాలుగో స్థానంలో ఫార్మా ఎగుమతులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా ఎగుమతులు భారత్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్ట్ మధ్య 11.9 బిలియన్ డాలర్లు నమోదయ్యాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 8.1 శాతం అధికం. ఎగుమతుల పరంగా జెమ్స్–జువెల్లరీ, కెమికల్స్ విభాగాలను దాటి ఫార్మా రంగం నాల్గవ స్థానంలో నిలిచింది. 2023లో ఫార్మా రంగం ఆరవ స్థానంలో ఉంది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఔషధ పరిశ్రమ 8–10% ఆదాయ వృద్ధి నమోదు చేసే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. అమెరికా, యూరప్ వంటి రెగ్యులేటెడ్ మార్కెట్లకు బలమైన ఎగుమతులు, ఆఫ్రికా, ఆసియాతో సహా సెమీ–రెగ్యులేటెడ్ మార్కెట్లలో రికవరీ, అలాగే స్థిరమైన దేశీయ డిమాండ్‌తో 2024-25లో ఈ స్థాయి ఆదాయ వృద్ధిని సాధిస్తుందని క్రిసిల్ అంచనా వేస్తోంది.

స్థిర నగదు ప్రవాహాలు..

2023-24లో భారత ఔషధ పరిశ్రమ సుమారు 10 శాతం వృద్ధిని సాధించింది. యూఎస్ జెనరిక్స్ మార్కెట్‌లో ధరల ఒత్తిడి తగ్గడం, నిర్వహణ వ్యయాలు మెరుగవడం.. వెరశి ఆపరేటింగ్ మార్జిన్లు 70–80 బేసిస్ పాయింట్లు పెరిగి సుమారు 22.5 శాతానికి చేరే అవకాశం ఉందని క్రిసిల్ నివేదిక వెల్లడించింది. ఫార్మాస్యూటికల్ కంపెనీలు సముచిత చికిత్సా విభాగాల్లో కొనుగోళ్లను కొనసాగించినప్పటికీ.. స్థిర నగదు ప్రవాహాలు, తక్కువ ఆర్థిక పరపతి నుండి కూడా ఈ రంగం ప్రయోజనం పొందుతుందని అంచనా. గత ఏడాది రూ.4.1 లక్షల కోట్ల మార్కెట్‌లో సగానికి బాధ్యత వహించే 190 ఔషధ తయారీ కంపెనీల ఆదాయాల ఆధారంగా క్రిసిల్ నివేదిక రూపొందించింది.

- ఏప్రిల్–ఆగస్ట్ మధ్య 11.9 బిలియన్ డాలర్లు
- గతేడాదితో పోలిస్తే ఇది 8.1 శాతం వృద్ధి

ఆదాయం దాదాపు సమానం..

దేశీయ విక్రయాలు, ఎగుమతుల మధ్య ఆదాయం దాదాపు సమానంగా ఉందని క్రిసిల్ వెల్లడించింది. దేశీయ ఆదాయంలో అధికంగా దీర్ఘకాలిక, తీవ్ర చికిత్సా విభాగాల ద్వారా సమకూరుతోంది. ఎగుమతుల ఆదాయం ప్రధానంగా ఫార్ములేషన్స్ 80 శాతం, బల్క్ డ్రగ్స్ 20 శాతం నమోదవుతోంది. 2024–25లో ఫార్ములేషన్ ఎగుమతులు రూపాయి పరంగా 12–14 శాతం పెరుగుతాయని అంచనా. యూఎస్, యూరప్ వంటి నియంత్రిత మార్కెట్లు 13–15 శాతం వృద్ధిని సాధిస్తాయి. కొనసాగుతున్న ఔషధాల కొరత, కొత్త ఉత్పత్తుల లాంచ్‌లు, ప్రత్యేక ఉత్పత్తుల వైపు మళ్లడం ఇందుకు కారణం. సెమీ–రెగ్యులేటెడ్ మార్కెట్లకు ఎగుమతులు 8–10 శాతం పెరగవచ్చు. విదేశీ మారక నిల్వలను మెరుగవడం, ఆఫ్రికన్, లాటిన్ అమెరికా దేశాలలో కరెన్సీల స్థిరీకరణ ఇందుకు సహాయపడుతుంది.



దేశీయంగా మార్కెట్ ఇలా..

ఫార్మా పరిశ్రమ ఆదాయం దేశీయంగా 7–9 శాతం పెరుగుతుందని అంచనా. ముఖ్యంగా నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసెన్షియల్ మెడిసిన్స్ (ఎన్ఎల్ఈఎం) ఉత్పత్తులలో ధరల పెరుగుదల ఇందుకు దోహదం చేయనుంది. అయితే గత ఆర్థిక సంవత్సరం టోకు ధరల సూచీలో జరిగిన కొద్దిపాటి మార్పుల కారణంగా ఎన్ఎల్ఈఎం పోర్ట్‌ఫోలియో వృద్ధి తగ్గుతూనే ఉంటుంది. పెరుగుతున్న జీవనశైలి సంబంధిత వ్యాధులు, మహమ్మారి అనంతర ఆరోగ్య అవగాహన అధికం కావడం వంటి కారణంగా దీర్ఘకాలిక చికిత్సల విభాగం దేశీయ ఆదాయ వృద్ధికి కీలకంగా దోహదపడుతుందని క్రిసిల్ భావిస్తోంది.

హైదరాబాద్‌లో పడిపోయిన ఇళ్ల అమ్మకాలు

- జూలై–సెప్టెంబర్ మధ్య 42 శాతం తక్కువ
- ప్రధాన పట్టణాల్లో 18 శాతం క్షీణత
- ప్రాప్ ఈక్విటీ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల విక్రయాలు జూలై–సెప్టెంబర్ కాలంలో సుమారు 42 శాతం మేర తక్కువగా నమోదవుతాయని రియల్ ఎస్టేట్ అనలైటిక్ సంస్థ ప్రాప్ ఈక్విటీ అంచనా వేసింది. 12,082 యూనిట్ల విక్రయాలు ఉండొచ్చని, క్రితం ఏడాది ఇదే త్రైమాసిక కాలంలో విక్రయాలు 20,658 యూనిట్లుగా ఉన్నట్టు తన తాజా నివేదికలో పేర్కొంది. దేశవ్యాప్తంగా తొమ్మిది ప్రధాన పట్టణాల్లో సెప్టెంబర్ త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు మొత్తం మీద 18 శాతం తగ్గి 1,04,393 యూనిట్లుగా ఉండొచ్చని తెలిపింది. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 1,26,848 యూనిట్లుగా ఉన్నాయి. తొమ్మిది పట్టణాలకు గాను ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 22 శాతం, నవీ ముంబైలో ఇళ్ల అమ్మకాల్లో 4 శాతం చొప్పున వృద్ధి ఉంటుందని పేర్కొంది. మిగిలిన అన్ని పట్టణాల్లో క్షీణించొచ్చని అంచనా వేసింది.

పట్టణాల వారీగా..

- బెంగళూరులో ఇళ్ల అమ్మకాలు జూలై–సెప్టెంబర్ కాలంలో 26% క్షీణించి 13,355 యూనిట్లుగా ఉంటాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 17,978 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- చెన్నై మార్కెట్లో 18 శాతం తక్కువగా 4,634 యూనిట్ల విక్రయాలు జరగొచ్చు.
- కోల్‌కతా మార్కెట్లో 23% తక్కువగా 3,590 యూనిట్లు అమ్ముడుపోవచ్చు.
- పుణెలోనూ 19% క్షీణించి అమ్మకాలు 21,306 యూనిట్లుగా ఉంటాయి.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో ఇళ్ల అమ్మకాలు 10% తగ్గి 20,460 యూనిట్లుగా ఉండొచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో 22,802 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- ముంబైలో 17 శాతం తక్కువగా 10,966 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదు కావచ్చు. అదే నవీ ముంబైలో మాత్రం 4 శాతం అధికంగా 7,737 యూనిట్ల అమ్మకాలు జరగొచ్చు.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో 22 శాతం వృద్ధితో 10,263 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదు అవుతాయి.

సాధారణమే..

''రియల్ ఎస్టేట్ పరిశ్రమలో డిమాండ్ బలంగానే ఉంది. ప్రస్తుత త్రైమాసికంలో విక్రయాలు కొత్త ఆవిష్కరణల కంటే ఎక్కువే ఉన్నాయి. కానీ, అమ్మకాల్లో స్వల్ప క్షీణత అన్నది చరిత్రాత్మకంగా ఉన్న ధోరణే కానీ, ప్రతికూల పరిస్థితులకు సూచిక కాదు'' అని ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ జసూజ తెలిపారు.

ఫిజిక్స్‌వాలా రూ.1,753 కోట్ల నిధులు



న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ యూనికార్న్ ఫిజిక్స్ వాలా తాజాగా రూ.1,753 కోట్ల నిధులను సమీకరించింది. సిరీస్–బి రౌండ్‌లో హార్న్‌బిల్ క్యాపిటల్, లైట్‌స్పీడ్ వెంచర్ పార్ట్‌నర్స్, జీఎస్‌వీ, వెస్ట్‌బ్రిడ్జ్ ఈ మొత్తాన్ని అందించాయి. ఈ డీల్‌తో కంపెనీ విలువ ఏడాదిలో రెండున్నర రెట్లు దూసుకెళ్లి రూ.23,380 కోట్లకు చేరింది. పెద్ద సంస్థల వాల్యుయేషన్‌లో గణనీయమైన తగ్గుదల కారణంగా భారతీయ ఎడ్‌టెక్ రంగంలో పెద్ద ఎత్తున నిధుల కొరత చాలా కాలంగా ఉంది. 'ఎడ్‌టెక్ రంగానికి సవాలుగా ఉన్న ప్రస్తుత సమయంలో తాజా ఫండింగ్ రౌండ్ ఆశావాదానికి దారితీసింది. కంపెనీ అభివృద్ధి, దేశం అంతటా విద్యను ప్రజాస్వామ్యం చేయాలనే లక్ష్యంపై ఇప్పటికే ఉన్న, కొత్త పెట్టుబడిదారుల అచంచల విశ్వాసానికి ఇది నిదర్శనం' అని ఫిజిక్స్‌వాలా తెలిపింది.

రిలయన్స్ ఇన్‌ఫ్రాలో పెట్టుబడులు

- ప్రమోటర్ల నుంచి రూ. 1,100 కోట్లు
- ఇతర సంస్థల నుంచి రూ. 1,900 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రమోటర్లు ఈక్విటీ రూపేణా రూ. 1,100 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. వీటికి జతగా ముంబైకి చెందిన రెండు ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు రూ. 1,900 కోట్లు అందించనున్నట్లు కంపెనీ పేర్కొంది. గురువారం సమావేశమైన కంపెనీ బోర్డు రూ. 6,000 కోట్ల సమీకరణ ప్రణాళికలకు ఆమోదముద్ర వేసింది. వీటిలో రూ. 3,014 కోట్లు ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా అందుకోనుంది. మిగిలిన రూ. 3,000 కోట్లు సంస్థాగత కొనుగోలుదారుల నుంచి సమీకరించనుంది. తొలి దశలో భాగంగా షేరుకి రూ. 240 ధరలో 12.56 కోట్ల ఈక్విటీ షేర్లు లేదా మార్పిడికి వీలయ్యే వారంట్ల జారీ ద్వారా రూ. 3,014 కోట్లు సమకూర్చుకోనుంది. వీటిలో ప్రమోటర్ సంస్థ రైజీ ఇన్ఫినిటీ ప్రయివేట్ 4.6 కోట్ల షేర్లకు సబ్‌స్క్రయిబ్ చేయనుంది. ఈ బాటలో ముంబై సంస్థలు ఫార్చ్యూన్ ఫైనాన్షియల్ అండ్ ఈక్విటీస్ సర్వీసెస్(4.41 కోట్ల షేర్లు– రూ. 1,058 కోట్లు), ఫ్లోరిన్‌ట్రీ ఇన్నొవేషన్స్ ఎల్ఎల్‌పీ(3.55 కోట్ల షేర్లు– రూ. 582 కోట్లు) చొప్పున ప్రిఫరెన్షియల్ ఇష్యూలో భాగంకానున్నాయి. పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ మాజీ ఎగ్జిక్యూటివ్ మాథ్యూ సైరియాక్ ఫ్లోరిన్‌ట్రీని ఏర్పాటు చేయగా.. ఫార్చ్యూన్ ఫైనాన్షియల్‌ను నిమిష్ షా నెలకొల్పారు. రిలయన్స్ ఇన్‌ఫ్రాలో ప్రమోటర్లకు ప్రస్తుతం 21.34 శాతం వాటా ఉంది.

పెట్టుబడుల వార్తలతో రిలయన్స్ ఇన్‌ఫ్రా షేరు ఎన్ఎస్ఈలో 11 శాతం దూసుకెళ్లి రూ. 316 వద్ద ముగిసింది.

గృహ వినియోగ మార్కెట్ 19.67 లక్షల కోట్లు

- ఏటా 10 శాతం చొప్పున వృద్ధి
- వినియోగదారుల ప్రాధాన్యతల్లో మార్పులు
- డెలాయిట్ సంస్థ నివేదిక వెల్లడి



ముంబై: భారత్‌లో ఇళ్లు, గృహ వినియోగ మార్కెట్ (హోమ్, హౌస్‌హోల్డ్) 2030 నాటికి 237 బిలియన్ డాలర్లకు (రూ.19.67 లక్షల కోట్లు) చేరుకుంటుందని డెలాయిట్ అంచనా వేసింది. ఏటా 10 శాతం కాంపౌండెడ్ వృద్ధి రేటు కొనసాగుతుందంటూ.. ఖర్చు చేసే ఆదాయం పెరుగుతుండడం, వినియోగదారుల ప్రాధాన్యతల్లో మార్పులు, వివిధ ఉత్పత్తుల పరంగా సౌకర్యం, సౌలభ్యానికి ప్రాధాన్యం ఇస్తుండడాన్ని సానుకూలతలుగా తన నివేదికలో ప్రస్తావించింది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు వృద్ధి కేంద్రాలుగా అవతరిస్తున్నట్టు తెలిపింది. ఓమ్నిచానల్ రిటైల్, ఈ కామర్స్ సంస్థలు వినియోగదారులతో అనుసంధానానికి సాయపడుతున్నాయని, పట్టణాలకు వెలుపలి ప్రాంతాలకు ఇవి చేరుకుంటున్నాయని పేర్కొంది. గృహస్థుల ఖర్చు చేసే ఆదాయం పెరుగుతుండడం, అదే సమయంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి వస్తుండడం, సులభంగా రుణాలు లభిస్తుండడం, యువ కస్టమర్లు ఆధునిక డిజైన్లు, గృహ నవీకరణ, వ్యక్తిగత అభిరుచులకు ప్రాధాన్యం ఇస్తుండడం ఈ మార్కెట్ వృద్ధికి చోదకాలుగా తెలిపింది. హౌస్‌హోల్డ్ (ఇంట్లో వినియోగించే ఉపకరణాలు) మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోందని డెలాయిట్ నివేదిక తెలిపింది. విక్రయానంతర సేవలు, వారంటీపై వ్యాపార సంస్థలు దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొంది.

ప్రీమియం ఉత్పత్తులకు ఆదరణ

వినియోగదారులు ప్రీమియం, బ్రాండెడ్ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు, కంపెనీలు ఈ–చానళ్ల రూపంలో కస్టమర్లకు ముందుగా చేరువ అవుతున్నట్టు డెలాయిట్ నివేదిక తెలిపింది. వినియోగదారులకు మెరుగైన అనుభవం, డిజైన్ ఆధారిత ఉత్పత్తుల ఆవిష్కరణపై కంపెనీలు ఎక్కువగా దృష్టి సారించినట్టు డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఆనంద్ రామనాథన్ చెప్పారు. సోషల్ మీడియా, అత్యాధునిక సాంకేతికతల సాయంతో కంపెనీలు తమ కస్టమర్లను లక్ష్యంగా చేసుకోగలుగుతున్నట్టు డెలాయిట్ నివేదిక వివరించింది. ఇంధన ఆదా గృహోపకరణాలకు, పర్యావరణ అనుకూల కిచెన్ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండడంతో కంపెనీలు నీటిని ఆదా చేసే బాత్‌రూమ్ ఫిట్టింగ్‌లు, ఇంధన ఆదా టెక్నాలజీలపై పెట్టుబడులు పెంచుతున్నాయని వెల్లడించింది. పీఎల్ఐ పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఉజాల, ఎస్ఎంసీ, పీఎం మిత్ర పథకాల మద్దతుతో డిమాండ్ పెరుగుతుండడం, హౌస్‌హోల్డ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్టు వివరించింది.

డిజైన్, ఎగుమతులపైనా దృష్టి పెట్టండి

మొబైల్స్ పరిశ్రమకు కేంద్రం సూచన



న్యూఢిల్లీ: మొబైల్స్ తయారీ సంస్థలు కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా డిజైన్, ఎగుమతులపై కూడా దృష్టి పెట్టాలని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ సూచించారు. 'ఇండియాలో డిజైన్ చేసిన–ఇండియాలో అభివృద్ధి చేసిన' మొబైల్ ఫోన్స్‌ను రూపొందించాలని పేర్కొన్నారు. బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరం (బీఐఎఫ్) కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. మొబైల్స్‌ను దేశీ మార్కెట్ కోసమే కాకుండా ఎగుమతుల కోసం కూడా తయారు చేసే సామర్థ్యాలున్న పరిశ్రమకు కేంద్రంగా భారత్ నిలవాలని కృష్ణన్ పేర్కొన్నారు. భారత్‌లో మొబైల్ ఫోన్ల ఉత్పత్తి స్థిరస్థాయికి చేరిందని, హ్యాండ్‌సెట్స్ జీవితకాలం సుమారు మూడేళ్లు ఉంటోందని వివరించారు. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు ఎగుమతి మార్కెట్లను లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. 115 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్న భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో మొబైల్ ఫోన్ల ఉత్పత్తి విలువ దాదాపు 52.5 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 4.2 లక్షల కోట్లు) ఉందని కృష్ణన్ వివరించారు. భారత మొబైల్ తయారీ వ్యవస్థ–సవాళ్లు, అవకాశాలు అంశంపై రూపొందించిన నివేదికను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో టాటా మోటార్స్ జట్టు



న్యూఢిల్లీ: వాణిజ్య వాహన కస్టమర్లకు రుణాలను అందించేందుకు ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు టాటా మోటార్స్ శుక్రవారం వెల్లడించింది. చిన్న, తేలికపాటి వాణిజ్య వాహనాల అమ్మకాలు లక్ష్యంగా ఇరు సంస్థలు ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నట్టు తెలిపింది. టాటా మోటార్స్ 55 టన్నుల వరకు సామర్థ్యం గల కార్గో వాహనాలను తయారు చేస్తోంది. అలాగే పికప్స్, ట్రక్స్‌తోపాటు 10 నుంచి 51 సీట్ల బస్‌లను సైతం విక్రయిస్తోంది.



కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా శుక్రవారం నగరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీని కూడా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భారత చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో పాటు ఆటగాళ్లు కిడాంబి శ్రీకాంత్, చిరాగ్ శెట్టి తదితరులతో ముచ్చటించారు.

రాయల్స్ బ్యాటింగ్ కోచ్‌గా రాథోడ్



జైపూర్: భారత మాజీ ఆటగాడు విక్రమ్ రాథోడ్ ఐపీఎల్ టీమ్ రాజస్తాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. సుదీర్ఘ కాలంగా భారత జాతీయ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా పని చేసిన అనంతరం రాథోడ్ ఇటీవల టీమిండియా టి20 ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన అనంతరం ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. 2019 నుంచి 2023 వరకు టీమిండియాతో కలిసి పనిచేసిన రాథోడ్ వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్ నుంచి రాజస్తాన్ బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నట్లు ఫ్రాంచైజీ శుక్రవారం వెల్లడించింది. ఇటీవల రాహుల్ ద్రవిడ్‌ను హెడ్ కోచ్‌గా ఎంపిక చేసుకున్న రాజస్తాన్ రాయల్స్... ద్రవిడ్‌తో మంచి అనుబంధం ఉన్న రాథోడ్‌ను బ్యాటింగ్ కోచ్‌గా ఎంపిక చేసుకుంది. 'విక్రమ్ రాథోడ్ రాయల్స్ కోచింగ్ స్టాఫ్‌లో భాగం కానున్నారు. రాహుల్ ద్రవిడ్‌తో కలిసి రాథోడ్ జట్టును ముందుకు తీసుకెళ్తారనే నమ్మకముంది. ఈ జోడీ భారత జట్టును ఎలా తీర్చిదిద్దిందో అందరికీ తెలిసిందే' అని ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో తెలిపింది. జాతీయ జట్టు తరఫున 6 టెస్టులు, 7 వన్డేలు ఆడిన 55 ఏళ్ల విక్రమ్ రాథోడ్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 33 సెంచరీలు చేశాడు. 'విక్రమ్ రాథోడ్‌తో చాన్నాళ్లుగా కలిసి పనిచేస్తున్నా. ప్రశాంతంగా ఉంటూనే ఆటను సరిగ్గా అర్థం చేసుకుంటాడు. రాజస్తాన్ రాయల్స్ జట్టును తీర్చిదిద్దడంలో అతడి లోతైన అవగాహన ఉపయోగపడుతుంది. మరోసారి రాథోడ్‌తో కలిసి పనిచేయనుండటం ఆనందంగా ఉంది' అని రాహుల్ ద్రవిడ్ పేర్కొన్నాడు. రాయల్స్ కుటుంబంలో చేరడం సంతోషంగా ఉందని... ద్రవిడ్‌తో కలిసి యువ జట్టును తీర్చిదిద్దడానికి సంసిద్ధంగా ఉన్నానని రాథోడ్ అన్నాడు.

పాకిస్తాన్‌లో ఇంగ్లండ్ పర్యటన

కరాచీ: ఇంగ్లండ్ క్రికెట్ జట్టు వచ్చే నెలలో పాకిస్తాన్‌లో పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా పాక్ గడ్డపై ఇంగ్లండ్ మూడు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. అక్టోబర్ 7 నుంచి 11 వరకు తొలి టెస్టు, 15 నుంచి 19 వరకు రెండో టెస్టు, 24 నుంచి 28 వరకు మూడో టెస్టు జరగనున్నాయి. మూడు మ్యాచ్‌ల్లో తొలి రెండు టెస్టులకు ముల్తాన్ ఆతిథ్యమివ్వనుండగా... ఆఖరి మ్యాచ్ రావల్పిండిలో జరగనుంది. ఈ మేరకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. కరాచీ మైదానం పునర్నిర్మాణంలో ఉండటంతో రెండు టెస్టులను ముల్తాన్‌కే కేటాయించినట్లు బోర్డు తెలిపింది. ఇటీవల స్వదేశంలో బంగ్లాదేశ్ చేతిలో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో వైట్ వాష్‌కు గురైన పాకిస్తాన్ జట్టు... ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ఎలాంటి పిచ్‌లు సిద్ధం చేస్తుందో చూడాలి.



రాణించిన కరుణరత్నే, చండీమల్

రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 237/4 ● న్యూజిలాండ్‌తో తొలి టెస్టు



కరుణరత్నే

గాలె: న్యూజిలాండ్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. లంక టాపార్డర్ బ్యాటర్లు దిముత్ కరుణరత్నే (127 బంతుల్లో 83; 6 ఫోర్లు), దినేశ్ చండీమల్ (150 బంతుల్లో 61; 6 ఫోర్లు) శుక్రవారం అర్ధ శతకాలు సాధించారు. ఫలితంగా మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. ఏంజెలో మాథ్యూస్ (34 నాటౌట్; 4 ఫోర్లు), కెప్టెన్ ధనంజయ డిసిల్వా (34 నాటౌట్; 4 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. న్యూజిలాండ్ బౌలర్లలో విలియమ్ రూర్కె 3 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 255/4తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ చివరకు 340 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిషెల్ (86 బంతుల్లో 57; 7 ఫోర్లు, ఒక సిక్సర్), గ్లెన్ ఫిలిప్స్ (48 బంతుల్లో 49 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) వేగంగా ఆడారు. కెప్టెన్ టిమ్ సౌతీ (3), మిషెల్ సాన్‌ట్నర్ (2) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 4, రమేశ్ మెండిస్ మూడు వికెట్లు పడగొట్టారు. దీంతో న్యూజిలాండ్ జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 35 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటర్లు ధాటిగా ఆడటంతో శ్రీలంక మెరుగైన స్థితిలో నిలిచింది. మరో ఆరు వికెట్లు చేతిలో ఉన్న లంక ప్రస్తుతం ప్రత్యర్థి కంటే 202 పరుగుల ఆధిక్యంలో ఉంది. నేడు ఆటకు నాలుగో రోజు కాగా... కివీస్ ముందు శ్రీలంక ఎన్ని పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిస్తుందనేది ఆసక్తికరం.

యూఏఈలో ఆడటం సానుకూలాంశం

వరల్డ్ కప్‌లో భారత్ అవకాశాలపై మిథాలీ

న్యూఢిల్లీ: మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ యూఏఈ వేదికపై జరగనుండటం భారత జట్టుకు కలిసొచ్చే అంశమని మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ పేర్కొంది. మిగతా జట్లకంటే షార్జా, దుబాయ్ వేదికలు భారత్‌కు సానుకూలమని ఆమె విశ్లేషించింది. అక్కడి స్థానిక వాతావరణ, పిచ్ పరిస్థితులు అందరికంటే భారత్‌కే ఎక్కువగా లాభిస్తాయని ఆమె చెప్పింది. 'యూఏఈలోని పరిస్థితులు కాస్త భిన్నంగా ఉండొచ్చేమో కానీ భారత్‌కు దగ్గరగానే ఉంటాయి. ఇది మెగా ఈవెంట్‌లో మన జట్టుకు బాగా ఉపకరించే అంశం. ఈ సానుకూలతతో జట్టు అక్కడి వాతావరణానికి ఇట్టే అలవాటు పడుతుంది' అని మిథాలీ వివరించింది. అయితే జరగబోయేది మెగా ఈవెంట్ అన్న సంగతి మరవొద్దని ప్రతీ జట్టు ప్రపంచకప్ కోసం సన్నద్ధమయ్యే వస్తుందని తమ జట్టు వర్గాలను అప్రమత్తం చేసింది. 'మెగా ఈవెంట్‌లో పాల్గొనే ప్రతి జట్టు అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో సిద్ధమయ్యే వస్తుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని తెలిపింది. ఐసీసీ ప్రపంచకప్ టోర్నీలో ఫైనల్ చేరిన సీనియర్ మహిళల జట్టు ఇంత వరకు టైటిల్‌ను మాత్రం గెలవలేకపోయింది. అండర్–19 ప్రపంచకప్‌లో మాత్రం యువ మహిళల జట్టు గతేడాది ఆరంభమైన తొలి మెగా ఈవెంట్‌ను గెలిచింది. ఈ ప్రపంచకప్‌లో భారత జట్టు రాణించాలని, కప్‌తో తిరిగి రావాలని బలంగా కోరుకుంటున్నట్లు మాజీ కెప్టెన్ చెప్పింది. వచ్చే నెల 3 నుంచి యూఏఈలో అమ్మాయిల టి20 ప్రపంచకప్ మొదలవుతుంది. దుబాయ్ వేదికగా 4వ తేదీన భారత్ తమ తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడుతుంది.





భారత్ గెలుపు బోణీ

అండర్–17 శాఫ్ కప్ ఫుట్‌బాల్

థింపు (భూటాన్): అండర్–17 దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షి (శాఫ్)లో భారత జట్టు శుభారంభం చేసింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ గ్రూప్ 'ఎ'లో భాగంగా శనివారం జరిగిన పోరులో 1–0తో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున సుమిత్ శర్మ (90+1వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్ల ఆటగాళ్లు హోరాహోరీగా తలపడగా... మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా డిఫెండర్ సుమిత్ శర్మ హెడర్ ద్వారా గోల్ బాది భారత జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. అంతకుముందు భారత్ దాడులను బంగ్లా డిఫెండర్లు సమర్థవంతంగా అడ్డుకోవడంతో మనవాళ్లు గోల్ సాధించలేకపోయారు. ఎట్టకేలకు సమష్టి కృషితో దక్కిన అవకాశాన్ని గోల్ పోస్ట్ సమీపంలో సుమిత్ శర్మ సద్వినియోగ పర్చుకోవడంతో భారత జట్టు బోణీ కొట్టింది. ఈ విజయంతో మూడు పాయింట్లు ఖాతాలో వేసుకున్న భారత్... తదుపరి మ్యాచ్‌లో మంగళవారం మాల్దీవులుతో తలపడనుంది.

ధనుశ్‌కు కాంస్యం

జూనియర్ ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్



లియాన్ (స్పెయిన్): భారత యువ వెయిట్ లిఫ్టర్ లోకనాథన్ ధనుశ్ ఐడబ్ల్యూఎఫ్ జూనియర్ ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు. తద్వారా ఈ టోర్నీలో పతకం నెగ్గిన తొలి భారత వెయిట్ లిఫ్టర్‌గా ధనుశ్ రికార్డుల్లోకెక్కాడు. పురుషుల 55 కేజీల విభాగంలో బరిలోకి దిగిన 17 సంవత్సరాల ధనుశ్ శుక్రవారం జరిగిన పోటీల్లో ఓవరాల్‌గా 231 కేజీల బరువెత్తి మూడో స్థానంలో నిలిచాడు. స్నాచ్‌లో 107 కేజీల బరువెత్తిన ధనుశ్... క్లీన్ అండ్ జర్క్‌లో 124 కేజీలు ఎత్తాడు. ఈ విభాగంలో వియత్నాంకు చెందిన డువాంగ్ 253 కేజీల బరువెత్తి స్వర్ణం గెలుచుకోగా... జపాన్ లిఫ్టర్ టొమారి కొటారో 247 కేజీల బరువెత్తి రజతం ఖాతాలో వేసుకున్నాడు. 'ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధిస్తానని అనుకోలేదు. చాలా ఆనందంగా ఉంది' అని పోటీల అనంతరం అతను పేర్కొన్నాడు. స్నాచ్‌లో మూడో స్థానంతో పతకం ఖాతాలో వేసుకున్న ధనుశ్... క్లీన్ అండ్ జర్క్‌లో 13వ స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో భారత్ నుంచి తొమ్మిది బంది పాల్గొంటుండగా... మహిళల 45 కేజీల విభాగంలో భారత లిఫ్టర్ పాయల్ 150 కేజీల బరువెత్తి ఆరోస్థానంలో నిలిచింది.

అభిమన్యు శతకం

● భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్ 210/6
● భారత్ 'డి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్



అభిమన్యు

సాక్షి, అనంతపురం: అభిమన్యు ఈశ్వరన్ (170 బంతుల్లో 116; 13 ఫోర్లు, ఒక సిక్సర్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఫలితంగా భారత్ 'డి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 'బి' 56 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. ప్రత్యర్థి పేసర్ల ధాటికి సహచరులు ఒక్కొక్కరుగా వెనుదిరుగుతున్నా భారత్ 'బి' జట్టు అభిమన్యు మాత్రం ఒంటరి పోరాటం చేశాడు. సూర్యకుమార్ యాదవ్ (5), ముషీర్ ఖాన్ (5), నితీశ్ కుమార్ రెడ్డి (0) విఫలం కాగా.. నారాయణ్ జగదీశన్ (13), సుయాశ్ ప్రభుదేశాయ్ (16) ప్రభావం చూపలేకపోయారు. దీంతో ఒక దశలో 100 పరుగులకే భారత్ 'బి' జట్టు 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో చక్కటి ఆటతీరు కనబర్చిన ఈశ్వరన్ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ (89 బంతుల్లో 39;3 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఈ జంట ఆరో వికెట్‌కు 105 పరుగులు జోడించడంతో భారత్ 'బి' జట్టు కోలుకుంది. ఈ క్రమంలో ఈశ్వరన్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 25వ శతకం తన పేరిట రాసుకున్నాడు. మరికాసేపట్లో మ్యాచ్ ముగుస్తుందనగా ఆదిత్య బౌలింగ్‌లో అభిమన్యు ఔటయ్యాడు. భారత్ 'డి' బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3, ఆదిత్య రెండు వికెట్లు పడగొట్టారు. చేతిలో 4 వికెట్లు ఉన్న భారత్ 'బి' జట్టు... భారత్ 'డి' జట్టు స్కోరుకు ఇంకా 139 పరుగులు వెనుకబడి ఉంది. వాషింగ్టన్ సుందర్‌తో పాటు రాహుల్ చహర్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

సంజూ సెంచరీ

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 306/5తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'డి' జట్టు చివరకు 349 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ సంజు సామ్సన్ (101 బంతుల్లో 106; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) శతకం పూర్తి చేసుకున్నాడు. క్రితం రోజు సెంచరీకి 11 పరుగుల దూరంలో నిలిచిన సామ్సన్ ఆట ప్రారంభమైన కాసేపటికే మూడంకెల స్కోరు అందుకున్నాడు. అయితే ఆ తర్వాత ఎక్కువసేపు కొనసాగలేకపోయాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో సామ్సన్‌కు ఇది 11వ సెంచరీ కాగా... భారత్ 'డి' జట్టు చివరి 5 వికెట్లను 43 పరుగుల వ్యవధిలో కోల్పోయింది. భారత్ 'బి' బౌలర్లలో నవ్‌దీప్ సైనీ 5 వికెట్లతో చెలరేగాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సైనీకి ఇది ఆరో 5 వికెట్ల ప్రదర్శన కాగా... చాన్నాళ్ల తర్వాత నవ్‌దీప్ తన పేస్‌తో బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. ఓవరాల్‌గా మూడు మ్యాచ్‌ల్లో కలిపి 11 వికెట్లు పడగొట్టిన నవ్‌దీప్ సైనీ మరోసారి సెలెక్టర్ల చూపు తనవైపు తిప్పుకున్నాడు. రాహుల్ చహర్ 3 వికెట్లు పడగొట్టాడు.

స్కోరు వివరాలు

భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్: దేవదత్ పడిక్కల్ (సి) జగదీశన్ (బి) నవ్‌దీప్ సైనీ 50; శ్రీకర్ భరత్ (సి) జగదీశన్ (బి) ముకేశ్ కుమార్ 52; రికీ భుయ్ (సి) నవ్‌దీప్ సైనీ (బి) రాహుల్ చహర్ 56; నిశాంత్ సింధు (సి) ప్రభుదేశాయ్ (బి) రాహుల్ చాహర్ 19; శ్రేయస్ అయ్యర్ (సి) నితీశ్ కుమార్ రెడ్డి (బి) రాహుల్ చహర్ 0; సంజు సామ్సన్ (సి) నితీశ్ కుమార్ రెడ్డి (బి) నవ్‌దీప్ సైనీ 106; సారాంశ్ జైన్ (సి) జగదీశన్ (బి) నవ్‌దీప్ సైనీ 26; సౌరభ్ కుమార్ (రనౌట్/నవ్‌దీప్ సైనీ) 13; ఆకాశ్ సేన్‌గుప్తా (బి) నవ్‌దీప్ సైనీ 0; అర్ష్‌దీప్ సింగ్ (బి) నవ్‌దీప్ సైనీ 11; ఆదిత్య (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 16; **మొత్తం (87.3 ఓవర్లలో) 349. వికెట్ల పతనం:** 1–105, 2–119, 3–172, 4–175, 5–216, 6–307, 7–331, 8–331, 9–349, 10–349. **బౌలింగ్:** ముకేశ్ కుమార్ 20–4–54–1; మోహిత్ అవస్థి 16–1–66–0; నితీశ్ కుమార్ రెడ్డి 10–1–54–0; నవ్‌దీప్ సైనీ 18.3–2–74–5; రాహుల్ చహర్ 13–1–60–3; వాషింగ్టన్ సుందర్ 7–0–27–0; ముషీర్ ఖాన్ 3–0–9–0.

భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్: అభిమన్యు ఈశ్వరన్ (సి) సామ్సన్ (బి) ఆదిత్య 116; నారాయణ్ జగదీశన్ (సి) రికీ భుయ్ (బి) ఆదిత్య 13; సుయాశ్ ప్రభుదేశాయ్ (ఎల్బీడబ్ల్యూ) సౌరభ్ కుమార్ 16; ముషీర్ ఖాన్ (ఎల్బీడబ్ల్యూ) అర్ష్‌దీప్ సింగ్ 5; సూర్యకుమార్ యాదవ్ (సి) ఆదిత్య (బి) అర్ష్‌దీప్ సింగ్ 5; నితీశ్ కుమార్ రెడ్డి (సి) సామ్సన్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; వాషింగ్టన్ సుందర్ (నాటౌట్) 39; రాహుల్ చహర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 16; **మొత్తం: (56 ఓవర్లలో 6 వికెట్లకు) 210. వికెట్ల పతనం:** 1–24, 2–65, 3–88, 4–96, 5–100, 6–205; **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 12–4–30–3; ఆదిత్య 14–3–33–2; ఆకాశ్ సేన్‌గుప్తా 5–0–38–0; సౌరభ్ కుమార్ 13–0–50–1; సారాంశ్ జైన్ 8–1–23–0; నిశాంత్ సింధు 4–0–22–0.

పంజాబ్‌కు రెండో విజయం

ఇండియన్ సూపర్ లీగ్



న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో పంజాబ్ ఎఫ్‌సీ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 2–1 గోల్స్ తేడాతో ఒడిషా ఎఫ్‌సీని ఓడించింది. పంజాబ్ తరఫున 28వ నిమిషంలో నిహాల్ సుధీశ్, 89వ నిమిషంలో లియాన్ అగస్టీన్ గోల్స్ సాధించారు. రెండు గోల్స్‌తో మ్యాచ్‌లో పంజాబ్ మ్యాచ్‌లో విజయానికి చేరువ కాగా...ఇంజ్యూరీ టైమ్‌లో పంజాబ్ ద్వారానే ఒడిషా ఖాతాలో ఒక గోల్ చేరింది. 90+6వ నిమిషంలో ఒడిషా మిడ్‌ఫీల్డర్ హ్యూగో బూమస్ కొట్టిన షాట్‌ను ఆపే ప్రయత్నంలో పంజాబ్ గోల్ కీపర్ రవి కుమార్ 'సెల్ఫ్ గోల్' నమోదు చేశాడు. తొలి మ్యాచ్‌లో చెన్నై చేతిలో ఓడిన ఒడిషాకు ఇది వరుసగా రెండో ఓటమి. ఐఎస్ఎల్‌లో నేడు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. జంషెడ్‌పూర్‌లో ముంబై సిటీ ఎఫ్‌సీతో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ...కోల్‌కతాలో ఎఫ్‌సీ గోవాతో మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ తలపడతాయి.

అవేశ్ ఖాన్ మెరుపులు

● భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్ 216/7
● భారత్ 'ఎ'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్



అభిషేక్ పొరెల్

సాక్షి, అనంతపురం: మిడిలార్డర్ ఆటగాడు అభిషేక్ పొరెల్ (113 బంతుల్లో 82; 9 ఫోర్లు) చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోవడంతో భారత్ 'ఎ' జట్టుతో జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో భారత్ 'సి' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 64 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో ఉన్న గ్రూప్ 'సి' జట్టు... చివరి మ్యాచ్‌లో అదే స్థాయి ప్రదర్శ కనబర్చడంలో తడబడింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (17)తో పాటు సాయి సుదర్శన్ (17), రజత్ పటిదార్ (0), ఇషాన్ కిషన్ (5), మానవ్ సుతార్ (2) విఫలమయ్యారు. దీంతో 41 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ భారత్ 'సి' జట్టును బాబా ఇంద్రజిత్ (34)తో కలిసి అభిషేక్ ఆదుకున్నాడు. వరస విరామాల్లో వికెట్లు పడుతున్నా... ధాటిగా ఆడిన అభిషేక్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. పులకిత్ నారంగ్ (93 బంతుల్లో 35 బ్యాటింగ్; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. భారత్ 'ఎ' జట్టు బౌలర్లలో అఖీబ్ ఖాన్ 3, షమ్స్ ములానీ రెండు వికెట్లు పడగొట్టాడు. చేతిలో మరో మూడు వికెట్లు ఉన్న భారత్ 'సి' జట్టు... ప్రత్యర్థి కంటే ఇంకా 81 పరుగులు వెనుకబడి ఉంది. నారంగ్‌తో పాటు విజయ్ కుమార్ వైశాఖ్ (14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 224/7తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' జట్టు చివరకు 297 పరుగులకు ఆలౌటైంది. శాశ్వత్ రావత్ (250 బంతుల్లో 124; 15 ఫోర్లు) క్రితం రోజు స్కోరుకు మరో రెండు పరుగులు మాత్రమే జోడించి వెనుదిరగగా... పేసర్ అవేశ్ ఖాన్ (68 బంతుల్లో 51 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) అనూహ్యంగా బ్యాట్‌తో అదరగొట్టాడు. టి20 తరహాలో ఎడాపెడా భారీ షాట్లు ఆడిన అవేశ్ ఖాన్ జట్టుకు విలువైన పరుగులు జోడించాడు. అతడికి ప్రసిధ్ కృష్ణ (34; 7 ఫోర్లు) చక్కటి సహకారం అందించాడు. భారత్ 'సి' బౌలర్లలో విజయ్ కుమార్ వైశాఖ్ 4, అన్షుల్ కంబోజ్ మూడు వికెట్లు పడగొట్టారు.

నార్తాంప్టన్‌ను గెలిపించిన చహల్



నార్తాంప్టన్: ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్ (డివిజన్ 2)లో భారత లెగ్‌స్పిన్నర్ యుజువేంద్ర చహల్ జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అతను 9 వికెట్లతో చెలరేగి తన జట్టు నార్తాంప్టన్‌షైర్‌ను గెలిపించాడు. ఈ మూడు రోజుల మ్యాచ్‌లో నార్తాంప్టన్ 9 వికెట్ల తేడాతో లీసెస్టర్‌షైర్‌ను చిత్తు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో లీసెస్టర్ 316 పరుగులకు ఆలౌటైంది. ఈ ఇన్నింగ్స్‌లో చహల్ 5 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో అతను 4 వికెట్లు తీశాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 180 పరుగుల ఆధిక్యం సాధించిన నార్తాంప్టన్ ముందు 137 పరుగుల లక్ష్యం నిలిచింది. నార్తాంప్టన్ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఈ స్కోరును అందుకుంది. గత మ్యాచ్‌లో విఫలమైన మరో భారత ఆటగాడు పృథ్వీ షాకు ఈ మ్యాచ్‌లో తుది జట్టులో చోటు దక్కలేదు.

సాక్షి ప్లస్
శనివారం। 21-9-2024

జాబిల్లిపై కారులో!

టోక్యో: సంప్రదాయకంగా అపోలో మిషన్ మొదలు తాజా ప్రయోగాల దాకా జాబిల్లిపై జరిగిన అన్ని ప్రయోగాల్లో ల్యాండర్, రోవర్‌లనే అధికంగా వాడారు. మానవరహితంగా కదిలే రోవర్ కొద్దిపాటి దూరాలకు వెళ్లగలవు. అక్కడి ఉపరితల మట్టిని తవ్వి చిన్నపాటి ప్రయోగాలు చేయగలవు. అయితే వీటికి చెల్లుచీటి పాడేస్తూ చంద్రుడిపై ఏకంగా కారులో వ్యోమగాములు ప్రయాణించేలా ఒక అధునాతన స్పెషల్ కారును తయారుచేస్తామని జపాన్ ప్రకటించింది. ఆటోమోటివ్ దిగ్గజం టొయోటాతో కలిసి తాము తయారుచేయబోయే భారీ వాహనం వివరాలను జపాన్‌లోని జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ(జాక్సా) తాజాగా వెల్లడించింది. భూమి లాంటి వాతావరణం అక్కడ లేని కారణంగా చంద్రుడి ఉపరితలంపై గురుత్వాకర్షణ చాలా తక్కువ. దీంతో సాధారణ కారు అక్కడ చకచకా ముందు కదలడం చాలా కష్టం. అందుకే ఒత్తిడితో నడిచే ప్రత్యేక వాహనాన్ని రూపొందిస్తామని టొయోటా సంస్థ తెలిపింది. ఈ కారు కథాకమామిషు ఓసారి చూద్దాం..

అమెరికా నాసా వారి ప్రతిష్టాత్మక ఆర్టిమిస్–8 మిషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా కారులా ఉండే అత్యాధునిక రోవర్ వాహనాన్ని సిద్ధంచేయనున్నారు. ఈ వాహనంలో వ్యోమగాములు ఎక్కువ కాలం గడపొచ్చు. సంప్రదాయ రోవర్ మాదిరిగా స్వల్ప దూరాలకుకాకుండా చాలా దూరాలకు ఈ వాహనం వెళ్లగలదు. వ్యోమగాములు చేపట్టబోయే అన్ని ప్రయోగాలకు సంబంధించిన ఉపకరణాలు ఇందులో ఉంటాయి. గతంలో ఎన్నడూ వెళ్లని ప్రాంతాలకు వెళ్తూ కారు లోపల, వెలుపల ప్రయోగాలు చేయొచ్చు. చందమామపై వేర్వేరు ప్రదేశాల వాతావరణ పరిస్థితులను ప్రత్యక్షంగా చూస్తూ వ్యోమగాములు అక్కడి నేల స్వభావాన్ని అంచనావేయొచ్చు. వ్యోమగాముల రక్షణ కోసం లైఫ్ సపోర్టింగ్ సిస్టమ్, వాహనం దిగి ఎక్కువసేపు బయట గడిపితే రేడియేషన్ ప్రభా వానికి లోనుకాకుండా ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు, దిగి సులభంగా ఆ ప్రాంతంలో కలియతిరిగేందుకు 'ఎయిర్‌లాక్'వ్యవస్థ ఇలా పలు ఏర్పాట్లతో వాహనాన్ని తీర్చిదిద్దుతామని జాక్సా తెలిపింది. ఆటోమొబైల్ సాంకేతికతలో జపాన్‌ది అందెవేసిన చేయి. దీంతో జ పాన్ టెక్నాలజీ, అంతరిక్ష అనుభవం చంద్రుడి ఉపరితలంపై కొత్త తరహా ప్రయోగాలకు బాటలు వేస్తాయని నాసా తెలిపింది.



పాండాలకు బదులు..

బీజింగ్: చైనాలోని జియాంగ్సు ప్రావిన్స్‌లోని థాయ్‌జోయూ జంతు ప్రదర్శన శాల ఇటీవల ఒక ప్రకటన చేసింది. ''అత్యంత అరుదైన వన్యప్రాణుల జంతు ప్రదర్శన మొదలవబోతోంది. సందర్శకులకు ఇదే మా స్వాగతం'' అని తెగ ప్రచారం చేసింది. టికెట్ ధరను రూ.236గా నిర్ణయించింది. అరుదైన జంతువులను చూద్దామని జనం తండోపతండాలుగా వచ్చారు. జూలో ఉండే పులి, సింహం వంటి వన్యప్రాణులతో పాటు ఒక వింత జంతువు సందర్శకుల్ని తెగ ఆకర్షించింది. ఆ ఎన్‌క్లోజర్ వద్ద 'పాండాలు'అని బోర్డ్ తగిలించి ఉంది. చైనా జాతీయ జంతువు పాండాలాగా ఉండటంతో చాలా మంది దాని ఎన్‌క్లోజర్ చుట్టూతా చేరారు. కొద్దిసేపటికి అవి మొరగడంలో జనం అవాక్కయ్యారు. జూ నిర్వాహకులను నిలదీశారు. దీంతో వాళ్లు అసలు విషయం బయటపెట్టారు. పాండా లేకపోవడంతో ఉత్తర చైనా ప్రాంతానికి చెందిన, చూడ్డానికి చిన్నపాటి సింహంలాగా ఉండే 'చౌ చౌ'జాతి కుక్కలను ఆ ఎన్‌క్లోజర్‌లో పెట్టారు. వాటికి అచ్చం పాండాలాగా తెలుపు, నలుపు ధారల రంగు వేశారు. దీంతో జనం తమ టికెట్ డబ్బులు తిరిగి ఇచ్చేయాలని గొడవకు దిగారు. అయినా సరే జూ నిర్వాహకులు తమ తప్పును సమర్థించుకోవడం విశేషం. ''జనం జుట్టుకు రంగు వేసుకోవట్లేదా. అలాగే వీటికీ డై వేశాం. తప్పేముంది?'అని ఎదురు ప్రశ్నించారు. చైనాలో గతంలో, ఇటీవల ఇలాంటి ఘటనలు జరిగాయి. గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని జూలో రెండు కుక్కలకు రంగేసి ప్రదర్శనకు పెట్టగా సంబంధిత వీడియోలను ఆన్‌లైన్‌లో 14 లక్షల మంది షేర్‌చేశారు. గతంలోనూ ఒక జూలో ఎలుగుబంటి లేకపోవడంతో మనిషికి ఎలుగుబంటి వేషం వేయించి ఎన్‌క్లోజర్‌లోకి పంపారు. దౌత్య సంబంధాల్లో భాగంగా చైనా తమ దేశంలోని చాలా పాండాలను మిత్ర దేశాలకు ఇచ్చేసింది. అడవుల నరికివేత, కాలుష్యం కారణంగా పాండాల సంఖ్య తగ్గిపోయింది. అది కూడా అంతరించిపోతున్న జంతువుల జాబితాలో చేరిపోయింది. గత ఏడాది నవంబర్ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కేవలం 1,800 పెద్ద పాండాలు అడవుల్లో, 600 పాండాలు జూలలో ఉన్నాయి. వాయవ్య చైనా పర్వతప్రాంతాల్లో అధికంగా పాండాలు కనిపిస్తాయి.



కోర్టులో జడ్జిని కాల్చి చంపిన పోలీసు

ఫ్రాంక్‌ఫర్ట్: అమెరికాలో తుపాకీ సంస్కృతికి మరొకరు ప్రాణాలు కోల్పోయారు. గతంలో జరిగిన ఘటనల్లో సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోగా ఈసారి ఏకంగా న్యాయమూర్తి బలయ్యారు. న్యాయమూర్తి పైకి ఆ ప్రాంత పోలీసు ఉన్నతాధికారి బుల్లెట్ల వర్షం కురిపించడం గమనార్హం. గురువారం కెంటకీ రాష్ట్రంలోని లెట్చర్ కౌంటీలోని వైట్స్‌బర్గ్ జిల్లా కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న 54 ఏళ్ల జిల్లా జడ్జి కెవిన్ ములిన్స్‌ను ఆయన ఛాంబర్‌లోనే లెట్చర్ కౌంటీ షరీఫ్ షాన్ ఎం.స్టైన్స్ కాల్చిచంపారు. విషయం తెల్సి పోలీసులు పక్కనే ఉన్న పాఠశాలలోని విద్యార్థులను వెంటనే ఇళ్లకు పంపించేశారు. కాల్పులు జరిగినప్పుడు కోర్టులో దాదాపు 50 మంది ఉన్నారు.

అసలేం జరిగిందంటే?

గత ఎనిమిదేళ్లుగా అదే కౌంటీలో షరీఫ్‌గా పనిచేస్తున్న షాన్ గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వైట్స్‌బర్గ్ కోర్టు భవనానికి వచ్చి జడ్జి ములిన్స్‌తో విడిగా అత్యవసరంగా మాట్లాడాలని అనుమతి కోరాడు. దీంతో జడ్జి ఆయనను తన ఛాంబర్‌కు తీసుకెళ్లి గది తలుపులు మూసేశారు. చాలాసేపు వాళ్లిద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని బయట వరండాలో వేచి ఉన్న వ్యక్తులు చెప్పారు. అయితే ఒక్కసారిగా కాల్పుల శబ్దం వినిపించిందని, తర్వాత షరీఫ్ షాన్ చేతులు పైకెత్తి బయటికొచ్చి లొంగిపోయాడని పోలీసులు తెలిపారు. ఛాంబర్ లోపలికి వెళ్లి చూస్తే బుల్లెట్ల గాయాలతో రక్తమోడి జడ్జి నిర్జీవంగా పడి ఉన్నారని కెంటకీ రాష్ట్ర పోలీసు అధికార ప్రతినిధి మ్యాట్ గేహార్ట్ శుక్రవారం వెల్లడించారు. జడ్జిని షరీఫ్ ఎందుకు చంపారనే కారణం ఇంకా తెలియరాలేదు. ఏ విషయం మీద జడ్జి, షరీఫ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందన్న విషయం ఇంకా వెల్లడికాలేదు. షరీఫ్‌ను అరెస్ట్ చేసి పోలీసులు హత్యానేరం కింద దర్యాప్తు మొదలుపెట్టారు.


షరీఫ్ షాన్


జడ్జి ములిన్స్

బెయిల్‌పై వచ్చి రేప్ బాధితురాల్ని కాల్చి చంపాడు

సంభాల్(యూపీ): అత్యాచారం కేసులో నిందితుడొకరు బెయిల్‌పై బయటకు వచ్చి బాధితురాలిని కాల్చి చంపాడు. ఈ ఘటన యూపీలోని సంభాల్ జిల్లా కైలా దేవి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రింకు(20) అనే యువకుడు 17 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఘటనపై ఘూజియాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జైలు పాలైన రింకు ఈ నెలారంభంలో బెయిల్‌పై బయటకు వచ్చాడు. 18వ తేదీ రాత్రి బాధితురాలు బైక్‌పై తల్లి, సోదరుడితో కలిసి ఇంటికి వస్తుండగా రింకు, అతడి స్నేహితుడు వారిని దారిలో అటకాయించారు. రింకు వెంట తెచ్చుకున్న తుపాకీతో కాల్పులు జరపడంతో బాలిక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

యూపీలో దళిత బాలికపై గ్యాంగ్ రేప్

మథుర: ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లాలో కదులుతున్న కారులో దళిత బాలిక(13)పై ముగ్గురు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆమెను రోడ్డుపక్కన పడేసి వెళ్లారు. ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఛాతా స్టేషన్ పోలీసులు, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. గురువారం ఓ బాలిక తమ పక్క గల్లీలోని దుకాణానికి వెళ్లింది. అక్కడ నీరజ్ అనే వ్యక్తి ఆమెకు మత్తు పదార్థం కలిపిన వాటర్ బాటిల్ ఇచ్చాడు. ఆ వాటర్ తాగిన బాలిక అపస్మారకంలోకి వెళ్లింది. నీరజ్, స్నేహితుడు శైలేంద్ర, మరో వ్యక్తి కలిసి బాలికను కారులో తీసుకెళ్లారు. కారు కదులుతుండగానే ఆమెపై ముగ్గురూ అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం బర్సానా రోడ్డులోని ఫ్లై ఓవర్ కింద పడేసి వెళ్లిపోయారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే కాన్వాయ్‌పై కాల్పులు

చండీగఢ్: హరియాణాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ చౌదరి ఎన్నికల కాన్వాయ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఘటనలో చౌదరి అనుచరుడు గోల్డీకి బుల్లెట్ గాయాలయ్యాయి. కారులో కూర్చుని ఉన్న అతడి వద్దకు ముగ్గురు వ్యక్తులు వచ్చి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. పంచ్‌కులలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు గ్యాంగ్ విభేదాలే కారణమని పోలీసులు తెలిపారు. గోల్డీకి ప్రాణాపాయం తప్పిందని, చండీగఢ్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. గోల్డీ హిస్టరీ షీటర్ కాగా, అతడిపై అంబాలా, యమునానగర్, మొహాలీల్లో మొత్తం 29 కేసులున్నాయి.

బస్సు లోయలో పడి.. ముగ్గురు జవాన్లు మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో బస్సు లోయలో పడి బీఎస్ఎఫ్‌కు చెందిన ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోగా 9 మంది గాయపడ్డారు. బుద్గాం జిల్లా వటర్‌హాల్ పంచాయతీ బ్రెల్ గ్రామ సమీపంలో శుక్రవారం ఈ విషాదం చేటుచేసుకుంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి రెండో దశ ఎన్నికల విధుల్లో పాల్గొనే బీఎస్ఎఫ్ జవాన్లతో వెళ్తున్న బస్సు లోయలో పడిందని అధికారులు తెలిపారు.

మాలిలో ఉగ్రదాడి...77 మంది మృతి

బమాకో: మాలి రాజధాని బమాకోపై అల్ ఖైదా అనుబంధ సంస్థ జరిపిన దాడిలో 77 మంది మరణించారు. జమాత్ నుస్రత్ అల్ ఇస్లాం వ అల్ ముస్లిమీన్ (జెఎన్ఐఎం) ముష్కరులు మంగళవారం ఎలైట్ పోలీస్ ట్రైనింగ్ అకాడమీ, దాని సమీపంలోని విమానాశ్రయంపై దాడి చేశారు. 77 మంది మరణించగా 255 మందికి పైగా గాయపడ్డట్టు భద్రతా వర్గాలు తెలిపాయి. ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్పీ) తాలూకు మానవతా కార్యకలాపాల కోసం వాడే విమానం కూడా దాడిలో దెబ్బతిన్నట్టు దక్షిణాఫ్రికా తెలిపింది.

హారిస్ ప్రచారంలో విన్‌ఫ్రే

'యునైటెడ్ ఫర్ అమెరికా' పేరిట టీవీ షో

- పాల్గొన్న జెన్నిఫర్ లోపెజ్, జూలియా రాబర్ట్స్ తదితరులు


కమలా హారిస్‌తో కలిసి షోలో పాల్గొన్న ఓప్రా విన్‌ఫ్రే

మిషిగన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు టీవీ లెజెండ్ ఓప్రా విన్‌ఫ్రే జత కలిశారు. ఇద్దరూ కలిసి గురువారం మిషిగన్‌లో జరిగిన 'యునైటెడ్ ఫర్ అమెరికా'పేరిట టాక్‌షో తరహా కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రత్యక్ష ప్రసారంలో జెన్నిఫర్ లోపెజ్, క్రిస్ రాక్, జూలియా రాబర్ట్స్, మెరిల్ స్ట్రీప్‌తో సహా అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. సంప్రదాయ మీడియాకు దూరంగా ఉండే ఓటర్లను చేరుకోవడానికి హారిస్ ఈ ప్రయత్నం చేశారు. దీన్ని ఐక్యత కోసం సాగుతున్న ఉద్యమంగా ఆమె అభివర్ణించారు. ఆర్థిక వ్యవస్థ, స్త్రీల పునరుత్పత్తి హక్కులు, వలసలు తదితర కీలకాంశాలపై ఈ సందర్భంగా హారిస్ చర్చించారు. స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాలు ప్రారంభించడానికి 50,000 డాలర్ల వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలన్నది తన ప్రణాళికలో భాగమన్నారు. ''ప్రస్తుతం ఇది 5,000 డాలర్లుంది. అంత తక్కువతో ఎవరూ చిన్న వ్యాపారాన్ని ప్రారంభించలేరు''అన్నారు. అమెరికాలో తుపాకీ సంస్కృతిపై తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. ''నేను తుపాకీ యజమానిని. నా రన్నింగ్‌మేట్ టిమ్ వాల్జ్‌కు కూడా తుపాకీ ఉంది. ఎవరైనా నా ఇంట్లోకి చొరబడితే కాల్చి చంపుతా''అని నవ్వుతూ చెప్పారు.

ట్రంప్‌తో హోరాహోరీయే గానీ...

హారిస్, రిపబ్లికన్ల అభ్యర్థి ట్రంప్ మధ్య గట్టి పోటీ నెలకొందని ఒపీనియన్ పోల్స్ చెబుతున్నాయి. ''వారిద్దరూ చెరో 47 శాతంతో సమానంగా కన్పిస్తున్నారు. అయితే స్వింగ్ రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన పెన్సిల్వేనియాలో మాత్రం హారిస్ 4 పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు''అని గురువారం విడుదలైన న్యూయార్క్ టైమ్స్ పోల్ తెలిపింది. కాకపోతే కమల డెమొక్రటిక్ అభ్యర్థిగా ఎన్నికైనప్పటి నుంచి సంప్రదాయ మీడియాకు దూరంగా ఉంటున్నారని, ఇది ఆమె అవకాశాలను క్లిష్టతరం చేస్తోందని విమర్శకులు అంటున్నారు. ''ఆధునిక అమెరికా చరిత్రలోనే అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అతి తక్కువ ఇంటర్వ్యూలు ఇచ్చిన అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులుగా హారిస్, వాల్జ్ నిలిచారు. వాళ్లు కేవలం ఏడు ఇంటర్వ్యూలు, ప్రెస్ కాన్ఫరెన్సుల్లో మాత్రమే పాల్గొన్నారు'' అని ఆక్సియోస్ సంస్థ గురువారం నివేదించింది. ట్రంప్, ఆయన రన్నింగ్‌మేట్ జేడీ వాన్స్ మాత్రం ఏకంగా 70కి పైగా కార్యక్రమాల్లో పాల్గొన్నారని వివరించింది.

అమెరికాలో ఓటింగ్ షురూ!

మిన్నెపొలిస్: అదేంటి, అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ జరిగేది నవంబర్ 5న కదా అంటారా? అది నిజమే అయినా అక్కడ చాలా రాష్ట్రాలు ముందుగానే ఓటేసేందుకు అవకాశం కల్పిస్తాయి. అందులో భాగంగా తొలుత వర్జీనియా, సౌత్ డకోటా, మిన్నెసోటా రాష్ట్రాల్లో శుక్రవారమే ముందస్తు ఓటింగ్ ప్రక్రియ మొదలైంది. మిన్నెసోటా డెమొక్రాట్ల ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్జ్ స్వరాష్ట్రం కావడం విశేషం. డజన్లమంది అమెరికన్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అక్టోబర్‌లో మరి కొన్ని రాష్ట్రాలు ముందస్తు ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తాయి. అమెరికా ఓటర్లలో చాలామంది సాధారణంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయడానికి ఇష్టపడతారు. కానీ పోస్టల్ శాఖ కొద్ది రోజులుగా సమస్యలతో సతమతమవుతోంది. దాంతో ఈసారి చాలామంది ఓటర్లు ముందస్తు ఓటింగ్‌కే మొగ్గుచూపుతున్నారు.

జమ్మూకశ్మీర్‌లో తొలిదశలో 61.38% పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: పదేళ్ల తర్వాత ఈ నెల 18న జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి తొలిదశలో జరిగిన ఎన్నికల్లో 61.38% పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నమోదైన ఓట్ల శాతాలను శుక్రవారం ఈసీ వెల్లడించింది. 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషులు 63.75 శాతం, మహిళలు 58.96 శాతం, ట్రాన్స్‌జెండర్‌లు 40 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పేర్కొంది. ఇందర్‌వాల్ నియోజకవర్గంలో అత్యధికంగా 82.16%, త్రాల్‌లో అత్యల్పంగా 43.56% పోలింగ్ నమోదైనట్లు ఈసీ తెలిపింది.

హరియాణాలో మేమే కింగ్‌మేకర్: కేజ్రీవాల్

చండీగఢ్: హరియాణాలో ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు లేకుండా తదుపరి ప్రభుత్వ ఏర్పాటు అసాధ్యమని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. రాష్ట్రం మార్పు కోరుతోందని బీజేపీని ఉద్దేశించి అన్నారు. హరియాణాలో గత పదేళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ శుక్రవారం హరియాణాలోని జగధారి నియోజకవర్గంలో రోడ్‌షోలో పాల్గొన్నారు. 'ఆప్‌కు చాలా సీట్లు లభించనున్నాయి. ఇక్కడి వచ్చాక గెలుపోటములను బేరీజు వేశాను. ఆప్ మద్దతు లేకుండా హరియాణాలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సాధ్యం కాదు. రాష్ట్రంలో మేము గెలిచే తొలిసీటు జగధారి'అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. 90 స్థానాలున్న హరియాణా అసెంబ్లీకి అక్టోబరు 5న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

ఖర్గేను ప్రధాని మోదీ అగౌరవపర్చారు

కాంగ్రెస్ చీఫ్ లేఖకు నడ్డా బదులివ్వడంపై ప్రియాంక

న్యూఢిల్లీ: స్వయంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే(80) రాసిన లేఖకు ప్రధాని మోదీ బదులివ్వకపోవడంపై ఆ పార్టీ నేత ప్రియాంకా గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వయస్సులో ఎంతో పెద్ద వారైన ఖర్గేను అగౌరవపర్చడమేనన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నత స్థాయిలోని వ్యక్తులు గొప్ప సంప్రదాయాలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాజకీయాలు విషతుల్యంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాని మోదీ తన పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడేందుకు ప్రయత్నించాలన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై దుర్భాషలతో కూడిన తీవ్ర విమర్శలు చేస్తున్న బీజేపీ సహా ఎన్డీయే పక్ష నేతలను కట్టడి చేయాలంటూ ఇటీవల ఖర్గే ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఇందుకు సమాధానంగా బీజేపీ చీఫ్ జేపీ నడ్డా గురువారం ఖర్గేకు లేఖ రాశారు. ప్రధాని మోదీకి రాసిన లేఖకు నడ్డా సమాధానం ఇవ్వడంపై ప్రియాంకా గాంధీ శుక్రవారం 'ఎక్స్'వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానికి ప్రజాస్వామ్య విలువలు, సంభాషణలు, పెద్దల పట్ల గౌరవం ఉంటే స్వయంగా ఆయనే ఖర్గేకు లేఖ రాసి ఉండేవారన్నారు. ఆయనకు బదులుగా, జేపీ నడ్డా పరుష పదజాలంతో కూడిన సమాధానం ఇచ్చారన్నారు. 82 ఏళ్ల ప్రజా నేతకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆమె ప్రశ్నించారు.

ఖర్గే ఎందులో అధికుడు?: కిరెన్ రిజిజు

ఖర్గేను ప్రధాని మోదీ అవమానించారంటూ ప్రియాంకా గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు తీవ్రంగా స్పందించారు. పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రమాణాలు ఆమెకు తెలియవని విమర్శించారు. 'మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆయన్ని మేం గౌరవిస్తాం. జేపీ నడ్డా బీజేపీ జాతీయ అధ్యక్షుడు. బీజేపీ అధ్యక్షుడి కంటే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొప్పవాడా? రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే కాగా, రాజ్యసభ నేత జేపీ నడ్డా. రాజ్యసభ నేత కంటే ప్రతిపక్ష నేత గొప్పా?'అని పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి రిజిజు ప్రశ్నించారు.

చర్యలపై 4 వారాల్లోగా నివేదించండి

ఢిల్లీ కోచింగ్ సెంటర్ ఉదంతంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీలో రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌ను వరదనీరు ముంచెత్తడంతో సివిల్స్ ఆశావహులు చనిపోయిన ఉదంతంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టిన చర్యలపై 4 వారాల్లోగా నివేదించాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు మధ్యంతర నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నియమించిన అత్యున్నస్థాయి కమిటీకి సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం శుక్రవారం ఆదేశాలిచ్చింది. పాత రాజేంద్ర నగర్‌లో జరిగిన రావూస్ ఉదంతం పునరావృతం కాకుండా, నేషనల్ క్యాపిటల్ రీజియన్ మొత్తంలో ఏకరూప నిర్ణయాలు అమలయ్యేలా తగు చట్ట, పరిపాలన, విధాన నిర్ణయాలను సవరించుకోవాలని ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీ రాష్ట్రాలకు సూచించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటే దేశం మొత్తానికీ అమలయ్యేలా మేమే ఆదేశాలిస్తామని కోర్టు స్పష్టంచేసింది. జూలై 27వ తేదీన రావూస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు వరదనీట మునిగి జలసమాధి కావడం తెల్సిందే.

ఛాతీపై కొట్టి, లైంగికంగా వేధించి..

ఆర్మీ ఆఫీసర్‌కు కాబోయే భార్యపై పోలీసుల దాష్టీకం

- తర్వాత చితకబాది ఇద్దరినీ అరెస్ట్ చేసిన పోలీసులు
- రోడ్డుపై ఆకతాయిల చేష్టలపై ఫిర్యాదు చేయడానికి వచ్చి దారుణాన్ని చవిచూసిన కాబోయే జంట
- ఐదుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసి కేసును సీఐడీకి బదిలీ చేసిన ఒడిశా సర్కార్
- వెల్లువెత్తిన విపక్షాల విమర్శలు

భువనేశ్వర్: న్యాయం చేయాల్సిన పోలీసులే అన్యాయం చేసిన దారుణ ఘటనలో విస్తుగొలిపే వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనలో నేరారోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు పోలీసు అధికారులను ఒడిశా సర్కార్ సస్పెండ్‌చేసి కేసును సీఐడీకి అప్పగించింది.

అసలేం జరిగింది?

పశ్చిమబెంగాల్‌లో ఆర్మీ మేజర్‌గా పనిచేసే ఒక యువ ఆర్మీ అధికారి తన కాబోయే భార్యను భువనేశ్వర్‌లో సెప్టెంబర్ 14వ తేదీన ఆమెకు చెందిన రెస్టారెంట్ వద్ద కలిశారు. తర్వాత రెస్టారెంట్ మూసేసి ఇద్దరూ అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో కారులో ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో కొందరు ఆకతాయిలు వీరిని కారు ఆపి వేధించారు. ఆకతాయిలపై ఫిర్యాదుచేసేందుకు వీరిద్దరూ దగ్గర్లోని భరత్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అయితే అక్కడ తమకు ఘోర అవమానం జరిగిందని బాధిత మహిళ చెప్పారు. హైకోర్టు ఆదేశాలతో గురువారం బెయిల్‌పై విడుదలయ్యాక గాయాలతో ఆమె ప్రస్తుతం భువనేశ్వర్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ''ఆకతాయిలపై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే అక్కడి పోలీసులు పట్టించుకోలేదు. ఎఫ్ఐఆర్ నమోదుచేయడానికి నిరాకరించారు. పైగా బూతులు తిట్టారు. వాగ్వాదానికి దిగిన ఆర్మీ ఆఫీసర్‌ను లాకప్‌లో పడేశారు. అదేంటని ప్రశ్నించినందుకు నన్ను అక్కడి ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు కట్టేసి లాకప్‌లో పడేశారు. చాలాసేపటి తర్వాత ఒక పోలీసు అధికారి ఒకతను గదిలోకి వచ్చి నా ఛాతీ మీద చాలా సార్లు కొట్టాడు. తర్వాత నా ప్యాంట్ విప్పి అతని ప్యాంట్ కూడా విప్పాడు. జననాంగం చూపిస్తూ ''అరవకుండా నువ్వు నోరు మూసుకుని ఉండటానికి నీకు ఎంత సమయం కావాలి?'అని బెదిరించాడని వివరించింది.



ఘటనను జాతీయ మహిళా కమిషన్ సూమోటోగా స్వీకరించింది. మూడ్రోజుల్లోగా ఘటనపై నివేదించాలని ఒడిశా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) వైబీ ఖురానియాను ఆదేశించింది.

జ్యుడీషియల్ విచారణ

జరపాలి: పట్నాయక్

ఘటనపై మాజీ సీఎం, బీజేడీ చీఫ్ నవీన్ పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ''హేయమైన ఘటనలో జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలి. కోర్టు ఆధ్వర్యంలో సిట్ దర్యాప్తు జరిపించాలి''అని శాసనసభలో పట్నాయక్ డిమాండ్‌చేశారు. శనివారం రాజ్‌భవన్ ఎదుట ధర్నా చేస్తామని బీజేడీ ప్రకటించింది. ''కాషాయపార్టీ అధికారంలో ఉన్న ప్రతి రాష్ట్రంలోనూ పోలీసులు రక్షకులుగా కంటే భక్షకులుగా తయారయ్యాయి. మహిళకు పోలీస్‌స్టేషన్‌లో ఇంతటి అవమానం జరిగితే, ఆర్మీ కెప్టెన్‌ను అక్రమంగా అరెస్ట్ చేస్తే ప్రధాని ఒక్కమాటైనా మాట్లాడరా?. బీజేపీ ఎందుకు మౌనం వహిస్తోంది?'' అని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీస్‌భవన్ వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు ధర్నాకు దిగారు.

పోలీసుల సస్పెన్షన్

ఘటనపై భారత సైన్యం సైతం స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని ఒడిశా సర్కార్‌ను కోరింది. దీంతో ఈ ఉదంతంలో సంబంధం ఉన్న భరత్‌పూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జ్ దినకృష్ణ మిశ్రా, సబ్ ఇన్‌స్పెక్టర్లు వైశాలిని పాండా, సలిలామయీ సాహో, సాగరికా రథ్, కానిస్టేబుల్ బలరాం హన్స్‌దాలను ప్రభుత్వం సస్పెండ్‌చేసింది. కేసును సీఐడీకి బదిలీచేయగా సస్పెండ్ అయిన పోలీసులపై శుక్రవారం కేసు నమోదుచేశారు. ''నా కూతురును దవడ కదిలిపోయేలా దారుణంగా కొట్టారు. న్యాయం కోసం వస్తే అన్యాయంగా అరెస్టుచేశారు''బాధిత మహిళ తండ్రి ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన సైన్యంలో బ్రిగేడియర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఈ జంటను వేధించిన ఏడుగురు ఆకతాయిలను పోలీసులు అరెస్టుచేశారు.

సాక్షి ప్లస్
శనివారం। 21-9-2024

రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం ఎక్కడ జరిగింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగ రచన- రాజ్యాంగ పరిషత్

రాజ్యాంగ రచనా పద్ధతులు

సాధారణంగా రాజ్యాంగాన్ని రూపొందించడానికి రెండు పద్ధతులు పాటిస్తారు. రాజ్యాంగాన్ని ఆ దేశ పార్లమెంటు రూపొందించడం ఒకటి కాగా, రాజ్యాంగ రచనకు ప్రత్యేక పరిషత్ లేదా సంస్థను ఏర్పాటు చేసి తద్వారా రాజ్యాంగాన్ని రచించడం రెండోది.

ప్రపంచంలో తొలిసారిగా రాజ్యాంగ రచనకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించిన దేశం అమెరికా. 1787లో ఫిలడెల్ఫియా సమావేశంలో రాజ్యాంగ రచనకు పూనుకున్నారు. 1789లో ఫ్రాన్స్‌లో 'కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ'ని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని రచించారు.

భారత రాజ్యాంగ రచన

భారతీయ ప్రజాప్రతినిధులతో కూడిన రాజ్యాంగ పరిషత్ అనే భావన స్వాతంత్ర్యోద్యమంలో అంతర్గతంగా ఉన్న ముఖ్య డిమాండ్. భారత జాతీయ కాంగ్రెస్ తొలిసారిగా 1918 డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగిన సమావేశంలో స్వయం నిర్ణయాధికారం అనే భావనతో ఒక తీర్మానం చేసింది. ఇదే విషయాన్ని 1922 జనవరి 5న యంగ్ ఇండియా పత్రికలో స్వరాజ్యం అనేది బ్రిటిషర్లు ఇచ్చే ఉచిత కానుక కాదని, అది భారత ప్రజల స్వయం వ్యక్తీకరణగా మహాత్మాగాంధీ పేర్కొన్నారు.

1927 మే 17న బాంబే సమావేశంలో మోతీలాల్ నెహ్రూ రాజ్యాంగ రచన ఆవశ్యకత గురించి ప్రస్తావించారు. అందులో భాగంగా అఖిలపక్ష కమిటీ 1928 మే 19న మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన 9 మంది సభ్యులతో ఒక ఉపసంఘాన్ని రాజ్యాంగ రచనకు నియమించింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదికను 'నెహ్రూ రిపోర్ట్' అంటారు. ఇది భారతీయులు సొంతంగా రాజ్యాంగ రచనకు చేసిన తొలి ప్రయత్నం. ఎం.ఎన్.రాయ్ 1934లోనే రాజ్యాంగ పరిషత్ అనే భావనను మొదటిసారిగా ప్రకటించారు. 1935లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీపరంగా తొలిసారి రాజ్యాంగ పరిషత్ ఏర్పాటును డిమాండ్ చేసింది. 1942లో క్రిప్స్ రాయబారం రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 1946లో కేబినెట్ కమిటీ రాయబార సిఫారసుల మేరకు రాజ్యాంగ పరిషత్ ఏర్పాటైంది.

రాజ్యాంగ పరిషత్ నిర్మాణం

కేబినెట్ కమిటీ రాయబార సిఫారసుల మేరకు రాజ్యాంగ పరిషత్ సభ్యుల సంఖ్య, ఎన్నిక విధానం, ఇతర ప్రక్రియలను నిర్ణయించారు. 1946 జూలై, ఆగస్టులో రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిగాయి.

- ప్రతి ప్రావిన్స్ నుంచి సుమారు 10 లక్షల జనాభాకు ఒక సభ్యుడి చొప్పున ప్రాతినిధ్యం వహించారు.
- బ్రిటిష్ పాలిత ప్రాంతాల్లో మహమ్మదీయులు, సిక్కులు, జనరల్ కేటగిరీలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించారు.
- రాజ్యాంగ పరిషత్‌లోని మొత్తం సభ్యుల సంఖ్య 389. ఇందులో 292 మంది బ్రిటిష్ ఇండియా నుంచి ఎన్నికయ్యారు. వీరిని బ్రిటిష్‌పాలిత ప్రాంతాలు లేదా గవర్నర్ ప్రావిన్స్‌ల నుంచి ఎన్నికైన శాసనసభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఎన్నుకున్నారు. నాడు మొత్తం 11 ప్రావిన్స్‌లు ఉండేవి. అవి మద్రాసు, బొంబాయి, యునైటెడ్ ప్రావిన్స్, బిహార్, సెంట్రల్ ప్రావిన్స్, ఒరిస్సా, పంజాబ్, నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్, సింధ్, బెంగాల్, అస్సాం.
- 93 మంది ప్రతినిధులు స్వదేశీ సంస్థానాల నుంచి నామినేట్ అయ్యారు. నలుగురు సభ్యులను చీఫ్ కమిషనర్ ప్రాంతాలైన ఢిల్లీ, అజ్మీర్, మేవార్, కూర్గ్, బ్రిటిష్ బెలూచిస్తాన్ నుంచి తీసుకున్నారు.

రాజ్యాంగ పరిషత్ ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ 208 స్థానాలు, ముస్లిం లీగ్ 73 స్థానాలు, యూనియనిస్ట్ ఒక స్థానం సాధించాయి.

మతాలు, సామాజిక వర్గాల వారీగా సభ్యుల సంఖ్య

హిందువులు-160, క్రిస్టియన్లు -7,
సిక్కులు-5, ఆంగ్లో ఇండియన్లు-3,
దళితులు-33, మహిళలు-15,
పార్శీలు-3, ముస్లింలు-3.

ప్రత్యేక పాకిస్తాన్ డిమాండ్‌తో ముస్లిం లీగ్ రాజ్యాంగ పరిషత్ నుంచి నిష్క్రమించింది. తర్వాత దేశవిభజన జరగడంతో రాజ్యాంగ పరిషత్‌లో సభ్యుల సంఖ్య 299కి తగ్గింది. ఇందులో బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి 229 మంది ఎన్నికైన సభ్యులు, స్వదేశీ సంస్థానాల నుంచి 70 మంది సభ్యులు కలిపి రాజ్యాంగ సభలో స్థానాలను 229కి కుదించారు.

రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన వివిధ వర్గాల ప్రముఖులు

ముస్లింలు	మౌలానా అబుల్ కలాం ఆజాద్, సయ్యద్ సాదుల్లా
సిక్కులు	సర్దార్ బలదేవ్ సింగ్, హుకుంసింగ్
మైనారిటీలు	హెచ్.సి.ముఖర్జీ
యూరోపియన్లు	ఫ్రాంక్ ఆంథోని
అఖిల భారత షెడ్యూల్డ్ కులాలు	బి.ఆర్.అంబేద్కర్
కార్మిక వర్గాలు	బాబు జగ్జీవన్ రామ్
పార్శీలు	హెచ్.పి.మోడి
అఖిల భారత మహిళా సమాఖ్య	హన్సా మెహతా
హిందూ సభ	శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, ఎం.ఆర్.జయకర్

మహిళా సభ్యులు

దుర్గాబాయి దేశ్‌ముఖ్, రాజకుమారి అమృత్ కౌర్, విజయలక్ష్మీ పండిట్, సరోజినీ నాయుడు, హన్సా మెహతా, అమ్ముస్వామినాథన్, అన్ మాస్కెర్నె నాథ్, బేగం అజీజ్ రసూల్, ద్రాక్షాయణి వేలాయుధన్, కమలా చౌదరి, లీలా రే, మాలతి చౌదరి, పూర్ణిమా బెనర్జీ, రేణుక రే, సుచిత్రా కృపలానీ.

రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన తెలుగువారు

టంగుటూరి ప్రకాశం, నీలం సంజీవరెడ్డి, పట్టాభి సీతారామయ్య, దుర్గాబాయి దేశ్‌ముఖ్, కళా వెంకట్రావు, కల్లూరు సుబ్బారావు, మోటూరు సత్యనారాయణ, ఎన్జీ రంగా, వీసీ కేశవరావు, ఎం.తిరుమలరావు, బొబ్బిలి రాజా రామకృష్ణ రంగారావు.

రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశం

- రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశం 1946 డిసెంబర్ 9న ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్లో జరిగింది. తొలి సమావేశానికి 211(9 మంది మహిళా సభ్యులు సహా) మంది హాజరయ్యారు. ఈ సమావేశం డిసెంబర్ 12 వరకు కొనసాగింది.
- డిసెంబర్ 9న రాజ్యాంగ పరిషత్‌లో సీనియర్ సభ్యుడైన డాక్టర్ సచ్చిదానంద సిన్హాను తాత్కాలిక అధ్యక్షుడిగా(ఫ్రాన్స్‌లో ఈ పద్ధతి అమల్లో ఉంది), ఫ్రాంక్ ఆంథోనిని ఉపాధ్యక్షుడిగా నియమించారు. డిసెంబర్ 11న డాక్టర్ ఆర్.రాజేంద్రప్రసాద్‌ను రాజ్యాంగ పరిషత్ శాశ్వత అధ్యక్షుడిగా జె.బి.కృపలానీ ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హెచ్‌సీ ముఖర్జీని ఉపాధ్యక్షుడిగా పట్టాభి సీతారామయ్య ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తర్వాత వి.టి.కృష్ణమాచారిని కూడా రాజ్యాంగ పరిషత్ ఉపాధ్యక్షుడిగా నియమించారు.
- అంతర్జాతీయ న్యాయవాది బెనగల్ నరసింగరావును రాజ్యాంగ పరిషత్ ముఖ్య సలహాదారుగా నియమించారు. ఈయన బర్మా (మయన్మార్) రాజ్యాంగ రచనలో కూడా పాల్గొన్నారు.



ఆశయాల తీర్మానం

1946 డిసెంబర్ 13న జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాల తీర్మానాన్ని (Objectives Resolution) ప్రతిపాదించారు. ఈ ఆశయాల తీర్మానమే రాజ్యాంగ తత్వానికి, ఆదర్శాలకు, లక్ష్యాలకు మూలం. ఇది ప్రవేశికకు ప్రధాన ఆధారం. ఆశయాల తీర్మానాన్ని రాజ్యాంగ పరిషత్ 1947 జనవరి 22న ఏకగ్రీవంగా ఆమోదించింది.

రాజ్యాంగ పరిషత్ సమావేశాలు

ముసాయిదా కమిటీ రెండు డ్రాఫ్ట్‌లను తయారు చేసింది. రాజ్యాంగ ముసాయిదా 1948 ఫిబ్రవరి 21న ప్రచురితమైంది. రాజ్యాంగ ప్రతిపై 7,635 సవరణలు ప్రతిపాదించగా అందులో 2,473 చర్చకు వచ్చాయి. రాజ్యాంగ పరిషత్ ఈ ముసాయిదాను 115 రోజుల్లో పరిశీలించింది. ముసాయిదాను రాజ్యాంగ పరిషత్ 1949 నవంబర్ 26న ఆమోదించి చట్టంగా మార్చింది. రాజ్యాంగ రూపకల్పన కోసం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. మొత్తం 11 సమావేశాలు జరిగాయి.

భారత రాజ్యాంగ పరిషత్ చివరి సమావేశం 1950 జనవరి 24న జరిగింది. ఆ రోజు సమావేశానికి హాజరైన సభ్యుల సంఖ్య 284. ఈ సమావేశంలో నూతన రాజ్యాంగం ప్రకారం భారత గణతంత్ర ప్రథమ అధ్యక్షుడిగా డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్‌ను రాజ్యాంగ పరిషత్ ఎన్నుకుంది.

రాజ్యాంగ పరిషత్ కమిటీలు

రాజ్యాంగ పరిషత్‌లో వివిధ అంశాల పరిశీలనకు 22 కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో 12 విషయ కమిటీలు, 10 ప్రక్రియ కమిటీలు. వీటికి అనుబంధంగా 7 ఉప కమిటీలు, 15 మైనర్ కమిటీలను కూడా నియమించారు. ఈ కమిటీల్లో అత్యంత ముఖ్యమైంది డ్రాఫ్టింగ్ (ముసాయిదా) కమిటీ. 1947 ఆగస్టు 29న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో ముసాయిదా కమిటీని ఏర్పాటు చేశారు.

రాజ్యాంగ పరిషత్ ముఖ్య కమిటీలు - అధ్యక్షులు

రాజ్యాంగ పరిషత్‌లో అతి ముఖ్యమైంది ముసాయిదా కమిటీ, అతిపెద్ద కమిటీ- సలహా కమిటీ.

ముసాయిదా కమిటీ: సభ్యుల సంఖ్య 6
చైర్మన్: బి.ఆర్.అంబేద్కర్.
సభ్యులు:

- ఎన్.గోపాలస్వామి అయ్యంగార్
- అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
- డాక్టర్ కె.యం.మున్షి
- సయ్యద్ మహమ్మద్ సాదుల్లా
- ఎన్.మాధవరావు (అనారోగ్య కారణంగా బి.ఎల్.మిత్తల్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో సభ్యుడయ్యారు)
- టి.టి.కృష్ణమాచారి (డి.పి.ఖైతాన్ మరణంతో ఆయన స్థానంలో వచ్చారు.)

కమిటీ పేరు	చైర్మన్
ముసాయిదా కమిటీ	డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
సలహా కమిటీ, హక్కుల కమిటీ, రాష్ట్రాల రాజ్యాంగాల కమిటీ	సర్దార్ వల్లభాయ్ పటేల్.
సారథ్య కమిటీ, జాతీయ పతాక తాత్కాలిక కమిటీ, ఫైనాన్స్ అండ్ స్టాఫ్ కమిటీ, రూల్స్ కమిటీ	రాజేంద్ర ప్రసాద్
కేంద్ర అధికారాల కమిటీ	జవహర్‌లాల్ నెహ్రూ
కేంద్ర రాజ్యాంగ కమిటీ, రాష్ట్రాల సంప్రదింపుల కమిటీ	
సుప్రీంకోర్టుపై తాత్కాలిక కమిటీ	వరదాచార్య
హౌస్ కమిటీ, చీఫ్ కమిషనర్స్ ప్రావిన్స్‌ల కమిటీ	భోగరాజు పట్టాభి సీతారామయ్య
రాజ్యాంగ పరిషత్ విధుల కమిటీ	జి.వి.మౌలాంకర్
సభా వ్యవహారాల కమిటీ	కె.యం.మున్షి
రాజ్యాంగ ముసాయిదా ప్రత్యేక కమిటీ, ప్రుడెన్షియల్ కమిటీ	అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
భాషా కమిటీ	మోటూరి సత్యనారాయణ

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. రాజ్యాంగ సదస్సులోని వివిధ కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి ఈ కింది వాటిలో సరికానిది?
   ఎ) రూల్స్ కమిటీ - రాజేంద్రప్రసాద్
   బి) అడ్వయిజరీ కమిటీ - పటేల్
   సి) స్టీరింగ్ కమిటీ - జవహర్‌లాల్ నెహ్రూ
   డి) ప్రాథమిక హక్కుల ఉపసంఘం - జె.బి.కృపలాని
2. రాజ్యాంగ మౌలిక లక్షణం కానిది?
   ఎ) సమాఖ్య
   బి) లౌకికవాదం
   సి) న్యాయ సమీక్షాధికారం
   డి) న్యాయస్థాన క్రియాశీలత
3. భారత రాజ్యాంగ తొలి ముసాయిదా ఎప్పుడు తయారైంది?
   ఎ) అక్టోబర్ 1946 బి) అక్టోబర్ 1947
   సి) అక్టోబర్ 1948 డి) పైవేవీ కాదు
4. భారతదేశంలో రాజ్యాధికారానికి మూలం?
   ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
   సి) ప్రజలు డి) న్యాయ శాఖ
5. మౌలిక రాజ్యాంగంలోని ప్రకరణల సంఖ్య?
   ఎ) 395 బి) 315
   సి) 420 డి) 465

సమాధానాలు

1) సి; 2) డి; 3) సి; 4) సి; 5) ఎ.

రసాయనాల రాజు అని దేన్ని అంటారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక రసాయన శాస్త్రం

ఫాస్ఫరస్, సల్ఫర్, దాని సమ్మేళనాలు; సాధారణ ఉప్పు, దాని ఉత్పన్నాలు

- **సల్ఫర్ ధాతువులు:** కాపర్ పైరటీస్- CuS, ఐరన్ పైరటీస్ - FeS, గెలీనా PbS, సిన్నబార్ - HgS, జింక్ బ్లెండ్ ZnS
- భూగర్భ ఉపరితలంలో లభించే ధాతువుల నుంచి సల్ఫర్‌ను సంగ్రహించే పద్ధతి సిసిలీ పద్ధతి.
- భూమి పొరల నుంచి సల్ఫర్‌ను సంగ్రహించే పద్ధతి ఫ్రాష్ పద్ధతి.
- సిసిలీ పద్ధతిలో ఉపయోగించే కొలిమి - కాల్కారోని
- సల్ఫర్ అణువు ఆకృతి - కిరీటం
- సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత 96°C
- ఫ్లవర్ ఆఫ్ సల్ఫర్ 444°C వద్ద ఏర్పడుతుంది.
- CaSను కాగిత పరిశ్రమలో విరంజనకారిగా ఉపయోగిస్తారు.
- **గన్‌పౌడర్ సంఘటనం:** సల్ఫర్ + బొగ్గుపొడి + KNO_3
- చర్మవ్యాధుల నివారణలో ఉపయోగించేది - HgS
- SO_2 వాయువు గాలి కంటే 2½ రెట్లు బరువైంది.
- ఫౌంటెన్ ప్రయోగం వల్ల SO_2 నీటిలో కరుగుతుందని, దానికి ఆమ్ల లక్షణం ఉంటుందని నిరూపించవచ్చు.
- SO_2 వాయువు విరంజన చర్యకు కారణం - నవజాత హైడ్రోజన్ ఏర్పడటం
- స్పర్శాపద్ధతిలో ఉపయోగించే ఉత్ప్రేరకం - V_2O_5
- నీలి కాపర్ సల్ఫేట్‌కు H_2SO_4ను కలిపినపుడు రంగును కోల్పోతుంది. ఈ ప్రక్రియను నిర్జలీకరణం అంటారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని రసాయనాల రాజు అంటారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని డిటర్జెంట్స్, పేలుడు పదార్థాల తయారీలో ఉపయోగిస్తారు. బ్యాటరీలను నిల్వచేయడానికి వాడుతారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లం Au, Pt వంటి లోహాలతో చర్య జరపదు.
- అగ్నిపర్వతాల నుంచి వెలువడే వాయువు H_2S
- H_2S తయారు చేయడానికి ఉపయోగించే పరికరం - కిప్పు పరికరం
- H_2S గాలి కంటే బరువైంది. ఆమ్ల లక్షణాన్ని కలిగి ఉంటుంది.
- లెడ్ ఎసిటేట్‌లో ముంచిన వడపోత కాగితాన్ని H_2S నల్లగా మారుస్తుంది.
- ఓలియంను నీటితో చర్య జరిపిస్తే H_2SO_4 ఏర్పడుతుంది.
- H_2S క్షయకరణ కారకంగా పనిచేస్తుంది.
- సల్ఫర్ రూపాంతరాల్లో అత్యంత స్థిరమైంది - రాంబిక్ సల్ఫర్
- $K_2Cr_2O_4$లో ముంచిన వడపోత కాగితాన్ని SO_2 వాయువు ఆకుపచ్చగా మారుస్తుంది.
- ఫాస్ఫోరైట్ ఫార్ములా $Ca_3(PO_4)_2$
- మెటా ఫాస్ఫారిక్ ఆమ్లం ఫార్ములా HPO_3
- ఫాస్ఫరస్ పరిశ్రమలో పనిచేసే శ్రామికులకు వచ్చే జబ్బు - ఫాసిజా
- భాస్వరాన్ని గాలిలో ఉంచితే నెమ్మదిగా మెరుస్తుంది. దీన్ని ఫాస్ఫారిజన్స్ అంటారు.
- ఎలుకలను చంపడానికి తెల్ల భాస్వరాన్ని ఉపయోగిస్తారు.
- ఫాస్ఫర్ బ్రాంజ్ మిశ్రమలోహం - Cu + Sn + P
- అగ్గిపుల్లలోని పదార్థాలు $KClO_3$, Sb_2S_3, బంక
- అగ్గిపెట్టె పక్కభాగంలోని పదార్థాలు - ఎర్రభాస్వరం, Sb_2, గాజుముక్కలు.
- ఫాస్ఫారిక్ ఆమ్లం ఒక త్రిక్షార ఆమ్లం.
- సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక ఫాస్ఫేటిక్ ఎరువు.
- గాఢ ఉప్పు ద్రావణంలోనికి HCl వాయువును పంపి శుద్ధమైన ఉప్పును పొందుతారు.
- ఉప్పునీటి ద్రావణాన్ని బ్రైన్ ద్రావణం అంటారు.
- సోడియం లోహం మెర్క్యురీతో కలిసి సోడియం అమాల్గంను ఏర్పరుస్తుంది.
- క్లోరిన్.. ఆకుపచ్చ పసుపు రంగు ఉన్న వాయువు.
- తడిపిన పూలు క్లోరిన్ సమక్షంలో రంగును కోల్పోవడానికి కారణం నవజాత ఆక్సిజన్ ఏర్పడటం.
- బ్లీచింగ్ పౌడర్ ఫార్ములా $CaOCl_2$
- ఫాస్‌జీన్ ఫార్ములా - $COCl_2$;
  టియర్ గ్యాస్ - CCl_3NO_2;
  క్లోరోఫామ్ - $CHCl_3$;

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో సల్ఫర్ ధాతువు కానిది?
   ఎ) కాపర్ పైరటీస్ బి) హెమటైట్
   సి) గెలీనా డి) సిన్నబార్
2. సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత?
   ఎ) 106°C బి) 86°C
   సి) 90°C డి) 96°C
3. అత్యంత స్థిరత్వం ఉన్న సల్ఫర్ రూపాంతరం?
   ఎ) ప్లాస్టిక్ సల్ఫర్
   బి) మోనోక్లినిక్ సల్ఫర్
   సి) రాంబిక్ సల్ఫర్
   డి) ఫ్లవర్ ఆఫ్ సల్ఫర్
4. సిసిలీ పద్ధతిలో సల్ఫర్ ధాతువును ఉంచే కొలిమి పేరు?
   ఎ) బ్లాస్ట్ కొలిమి
   బి) షాఫ్ట్‌కొలిమి
   సి) కాల్కరోని కొలిమి
   డి) రివర్బరేటరీ
5. గన్ పౌడర్ అంటే?
   ఎ) ఫాస్ఫరస్, చార్‌కోల్, మెగ్నీషియం పౌడర్
   బి) సల్ఫర్, బొగ్గుపొడి, KNO_3 మిశ్రమం
   సి) Se, దీపాంగారం
   డి) బొగ్గుపొడి, NCl_3 ల మిశ్రమం
6. $2SO_2 + O_2 \xrightarrow[400\text{-}500°C]{} 2SO_3$ (స్పర్శాపద్ధతి) ఈ చర్యలో ఉత్ప్రేరకం?
   ఎ) Ni బి) Mo
   సి) Fe డి) V_2O_5
7. రసాయనాల రాజు అని దేన్ని అంటారు?
   ఎ) H_2SO_4
   బి) H_2SO_3
   సి) $H_2S_2O_7$ డి) H_3PO_4
8. నీలి కాపర్ సల్ఫేట్‌కు సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని కలిపినపుడు రంగుని కోల్పోతుంది. ఈ ప్రక్రియను ఏమంటారు?
   ఎ) ఆక్సీకరణం బి) నిర్జలీకరణం
   సి) క్షయకరణం డి) ఫెర్మెంటేషన్
9. సల్ఫ్యూరిక్ ఆమ్లం ఏ లోహాలతో చర్య పొందదు?
   ఎ) Zn, Mg బి) Cu, Ca
   సి) Au, Pt డి) Ag, Sn
10. ఫెర్రస్ సల్ఫైడ్.. హైడ్రోక్లోరిక్ ఆమ్లంతో చర్య పొందినపుడు ఏర్పడే వాయువు?
    ఎ) SO_2 బి) SO_3
    సి) H_2S డి) NH_3
11. $K_2Cr_2O_7$ ద్రవంలో ముంచిన వడపోత కాగితాన్ని ఏ వాయువు దగ్గరకు తీసుకెళ్తే లేత ఆకుపచ్చ రంగుని పొందుతుంది?
    ఎ) H_2S బి) SO_2
    సి) N_2O డి) NO
12. చర్మవ్యాధుల నివారణకు ఉపయోగించేది?
    ఎ) ZnS బి) CaS
    సి) HgS డి) PbS
13. ఓలియంను నీటితో చర్య జరిపితే ఏర్పడే ఆమ్లం?
    ఎ) HNO_3 బి) H_2SO_4
    సి) H_2SO_3 డి) H_3PO_3
14. ఫాస్ఫరస్ మూలకం?
    ఎ) P_8 బి) P_4
    సి) P_6 డి) P_3
15. కిందివాటిలో నిర్జలీకరణి?
    ఎ) H_3PO_4
    బి) $Ca_3(PO_4)_2$
    సి) P_2O_5
    డి) Na_3PO_4
16. సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక?
    ఎ) నత్రజని ఎరువు
    బి) ఫాస్ఫాటిక్ ఎరువు
    సి) పొటాషియం ఎరువు
    డి) కాల్షియం ఎరువు
17. అగ్గిపుల్ల తలలో ఉండే రసాయనిక పదార్థాలు?
    ఎ) $KClO_3$, Sb_2S_3, బంక
    బి) KCl, $SbCl_3$, బంక
    సి) NaCl, Sb_2S_3, బంక
    డి) P_4,Sb_2S_3, గాజుముక్కలు
18. కాల్షియం ఫాస్ఫేట్ ——— ను కలిగి ఉంటుంది.
    ఎ) $CO_2(PO_2)_3$ బి) $CaHPO_2$
    సి) $Ca_3(PO_4)_2$ డి) $Ca(H_2PO_4)_2$
19. P_2O_5 ను చల్లని నీటిలో కరిగించినపుడు ఏర్పడేది?
    ఎ) H_3PO_4 బి) HPO_3
    సి) PH_3 డి) PH_3, H_3PO_4
20. ఫాస్ఫర్ బ్రాంజ్ అనే మిశ్రమలోహం సంఘటనం?
    ఎ) Cu + Sn + P
    బి) Cu + Zn + P
    సి) Cu + Sn
    డి) Cu + Mg + S
21. తెల్ల ఫాస్ఫరస్‌ను దేనిలో నిల్వ ఉంచుతారు?
    ఎ) Cs_2 బి) కిరోసిన్
    సి) నీరు డి) CCl_4
22. చీకటిలో భాస్వరాన్ని గాలిలో ఉంచితే నెమ్మదిగా మండి మెరుస్తుంది. దీన్ని ఏమంటారు?
    ఎ) ప్రతిదీప్తి బి) రసాయనశక్తి
    సి) ఫాస్ఫారిజన్స్ డి) జీవదీప్తి
23. కిందివాటిలో ఏది ఫాస్ఫారికామ్ల లవణం కాదు?
    ఎ) NaH_2PO_4 బి) Na_2HPO_4
    సి) Na_3PO_4 డి) H_3PO_4
24. కిందివాటిలో దేన్ని ఎలుకల మందుగా ఉపయోగిస్తారు?
    ఎ) కాల్షియం ఫాస్ఫైడ్
    బి) జింక్ ఫాస్ఫైడ్
    సి) మెగ్నీషియం ఫాస్ఫైడ్
    డి) ఫాస్ఫీన్
25. సముద్ర నీటిలో ఉప్పుశాతం?
    ఎ) 3.2% బి) 2.8%
    సి) 4.6% డి) 5.2%
26. క్లోరిన్ వాయువు రంగు
    ఎ) ఎరుపు బి) నీలం
    సి) ఆకుపచ్చ-పసుపు
    డి) నలుపు
27. నీటిలో హైడ్రోజన్ క్లోరైడ్ స్వభావం?
    ఎ) క్షారం బి) ఆమ్లం
    సి) తటస్థ డి) ద్వంద్వ
28. టియర్ గ్యాస్ ఫార్ములా
    ఎ) $COCl_2$
    బి) $CaOCl_2$
    సి) CCl_3NO_2
    డి) $CaSO_4$
29. $CHCl_3$ను ఏమంటారు?
    ఎ) బ్లీచింగ్ పౌడర్
    బి) ఫాస్‌జీన్
    సి) క్లోరోఫాం
    డి) అమాల్గం
30. బ్రైన్ ద్రావణం అంటే?
    ఎ) ఉప్పు+ నీరు
    బి) చక్కెర+ నీరు
    సి) యూరియా+ నీరు
    డి) గ్లూకోజ్ + నీరు

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) సి; 5) బి; 6) డి; 7) ఎ; 8) బి; 9) సి; 10) సి; 11) బి; 12) సి; 13) బి; 14) బి; 15) సి; 16) బి; 17) ఎ; 18) సి; 19) బి; 20) ఎ; 21) సి; 22) సి; 23) డి; 24) బి; 25) బి; 26) సి; 27) బి; 28) సి; 29) సి; 30) ఎ.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సల్ఫ్యూరిక్ ఆమ్లంలోని మూలకాలు
   ఎ) నత్రజని, సల్ఫర్, ఆక్సిజన్
   బి) హైడ్రోజన్, సల్ఫర్, ఆక్సిజన్
   సి) సల్ఫర్, ఆక్సిజన్
   డి) ఫాస్ఫరస్, సల్ఫర్, హైడ్రోజన్
2. వాసనలేని ఆమ్లానికి ఉదాహరణ
   ఎ) HNO_3
   బి) H_3PO_4
   సి) HCl
   డి) H_2SO_4
3. రంగులేని, చిక్కటి నూనె వంటి ఆమ్లం?
   ఎ) H_2SO_4
   బి) H_3PO_4
   సి) HNO_3
   డి) HCl
4. ఫాస్ఫారిక్ ఆమ్ల సంకేతం
   ఎ) H_3PO_4
   బి) H_2SO_4
   సి) HNO_3
   డి) CH_3COOH
5. జడవాయువు కాని దానికి ఉదాహరణ
   ఎ) క్లోరిన్
   బి) హీలియం
   సి) నియాన్
   డి) ఆర్గాన్

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) ఎ; 5) ఎ.

కదలని కీలు, మడతబందు కీలు ఉన్న అవయవాలు ఏవి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ



మాదిరి ప్రశ్నలు

1. ఊపిరితిత్తులలో 'ఉచ్ఛ్వాసం', 'నిశ్వాసం' ప్రక్రియల్లో జరిగే మార్పులు వరసగా
   1) లోపలి పీడనం తగ్గుతుంది – లోపలి పీడనం పెరుగుతుంది
   2) లోపలి పీడనం పెరుగుతుంది – లోపలి పీడనం తగ్గుతుంది
   3) లోపలి పీడనం తగ్గుతుంది – లోపలి పీడనం తగ్గుతుంది
   4) లోపలి పీడనం పెరుగుతుంది – లోపలి పీడనం పెరుగుతుంది

జ. 1;
వివరణ: గాలిని బయటి నుంచి లోపలికి తీసుకోవడం ఉచ్ఛ్వాసం అయితే గాలిని బయటకు వదలడాన్ని నిశ్వాసం అంటారు. ఈ ప్రక్రియలో మొదట లోపలి పీడనం తగ్గి తర్వాత పీడనం పెరుగుతుంది. అంటే ఉరఃకుహరం పెరగడం వల్ల లోపల పీడనం తగ్గుతుంది. ఫలితంగా బయటి నుంచి గాలి లోపలికి వస్తుంది. అదే విధంగా నిశ్వాసంలో పీడనం పెరగడం వల్ల గాలి బయటకు వెళ్తుంది.

2. మన దేహంలో కదలని కీలు, మడతబందు కీలు ఉన్న అవయవాలు ఏవి?
   1) భుజం, మెడ
   2) పై దవడ – తల, ముంజేయి
   3) కింది దవడ – తల, భుజం
   4) మోకాలు, మెడ

జ. 2;
వివరణ: శరీరంలో రెండు ఎముకలు కలిసే చోటును కీలు అంటారు. ఇవి కదిలే కీళ్లు, కదలని కీళ్లు అని రెండు రకాలు. తలలోని పుర్రెలో ఉన్న ఎముకలన్నీ కదలని కీళ్లు. అలాగే పై దవడ కూడా ముంజేయిలో మడత బంధు కీలు ఉంటుంది. దీని ద్వారా చేయిని ఒకవైపు మాత్రమే ముడవగలం.

3. ద్విపార్శ్వ సౌష్ఠవం, త్రిస్తరిత లక్షణంతోపాటు ఖండితయుత దేహం కలిగివున్న జీవులు ఏవి?
   1) జలగలు 2) ఆల్చిప్పలు
   3) ఏలిక పాములు 4) సీ ఆర్చిన్‌లు

జ. 1;
వివరణ: అనెలిడా వర్గానికి చెందిన జీవులు ద్విపార్శ్వ సౌష్ఠవాన్ని కలిగి ఉండి, మూడు స్తరాలను కలిగి ఉంటాయి. బాహ్య, మధ్య, అంతస్త్వచాలతో ఏర్పడిన శరీరం ఖండీభవనాన్ని చూపుతాయి. జలగలో 33 ఖండితాలు ఉంటాయి.

4. 'తారక' పరిమాణాన్ని కాంతి తీవ్రతను బట్టి సర్దుబాటు చేయగల కండర నిర్మాణం?
   1) శైలికామయ కండరాలు
   2) అవలంబిత స్నాయువులు
   3) కంటిపాప
   4) స్నాయువులు, కండరాలు

జ. 3;
వివరణ: ఐరిస్ లేదా కంటిపాప కాంతి తీవ్రతను బట్టి తారక పరిమాణాన్ని సర్దుబాటు చేస్తుంది. కాంతి తీవ్రంగా ఉన్నపుడు కంటిపాప చిన్నదిగా మారుతుంది. అదే విధంగా కాంతి లేనపుడు కంటిపాప పెద్దదిగా మారి ఎక్కువ కాంతిని తీసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

5. సూక్ష్మమైన మొక్కలు, జంతువులపై కీటకనాశనులు ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతాయని తన గ్రంథంలో సూచించిన శాస్త్రవేత్త ఎవరు?
   1) రేచల్ కార్సన్ 2) జూలియట్ క్యూరి
   3) మేరీ ఎన్నింగ్ 4) రోసాలిండ్

జ. 1;
వివరణ: రేచల్ కార్సన్ అనే శాస్త్రవేత్త, రచయిత అమెరికా దేశానికి చెందినవారు. ఈమె 'సైలెంట్ స్ప్రింగ్' అనే పుస్తకాన్ని 1962లో రాశారు. రసాయన క్రిమిసంహారకాల వల్ల అనేక రకాల జీవ జాతి నశిస్తుందని ఆమె ప్రతిపాదించారు. దీని ప్రభావంతోనే DDT వంటి మందులను నిషేధించారు.

6. కింది వాటిలో నీటి నుంచి ఆహారాన్ని వడపోసి గ్రహించడానికి తమ దంతాలను ఉపయోగించుకొనేవి ఏవి?
   1) కొంగ – కప్ప 2) చేప – బాతు
   3) చేప – బల్లి 4) కప్ప – బాతు

జ. 2;
వివరణ: నీటిలో అనేక జీవ జాతులు నివశిస్తాయి. అందులో చేప, బాతులు ముఖ్యమైనవి. ఇవి నీటి నుంచి ఆహారాన్ని తమ దంతాల ద్వారా వడపోసి గ్రహిస్తాయి. ఇది నీటి యొక్క అనుకూలనం.

7. సాక్యులస్, యుట్రిక్యులస్‌ల నుంచి బయలుదేరిన నాడీ తంతువులు కలసి ఏర్పడేది?
   1) కర్ణావర్త నాడి 2) పేటికా నాడి
   3) శ్రవణ నాడి 4) దృక్ నాడి

జ. 2;
వివరణ: అంతర చెవిలో సాక్యులస్, యుట్రిక్యులస్‌లు ఉంటాయి. ఇవి శరీరానికి సమతాస్థితిని కల్పించడానికి పనికి వస్తాయి. వీటి నుంచి పేటికా నాడి ఏర్పడుతుంది. ఇది 8వ కపాల నాడి. ఇది అంతర చెవి నుంచి సమతాస్థితి సమాచారాన్ని మెదడుకు అందిస్తుంది.

8. రవి రక్తవర్గం 'A', రవి తండ్రి రక్తవర్గం 'O'. అత్యవసర సమయంలో రవికి, రవి తండ్రికి రక్త దానం అవసరమైతే ఎక్కించాల్సిన రక్త వర్గాలు?

	రవి	రవి తండ్రి
1)	A, O	O
2)	AB	AB
3)	B, O	A
4)	B	B, O

జ. 1;
వివరణ: రక్తవర్గాలు రక్తంలోని కారకాల వల్ల ఏర్పడతాయి. A, B, AB, O రక్తవర్గాలను గుర్తించారు. రవి రక్తవర్గం 'A' అయితే అతనికి A, O వర్గం రక్తాన్ని, రవి తండ్రిది 'O' కాబట్టి 'O' రక్తవర్గం నుంచి మాత్రమే ఇవ్వాలి. 'O' రక్తవర్గాన్ని విశ్వదాత అని, 'AB' రక్తవ ర్గాన్ని విశ్వగ్రహీత అంటారు.

9. క్లోమం స్రవించే ఎంజైములు ఏవి?
   1) అమైలేజ్, సుక్రేజ్, లైపేజ్
   2) ట్రిప్సిన్, అమైలేజ్, లైపేజ్
   3) లైపేజ్, పెప్సిన్, టయలిన్
   4) పెప్సిన్, లైపేజ్, సుక్రేజ్

జ. 2;
వివరణ: క్లోమం జీర్ణగ్రంథి. ఇది ఆంత్రమూలం వంపులో ఉండే బల్లపరుపు నిర్మాణం ఉన్న గ్రంథి. ఇది ట్రిప్సిన్ (ప్రోటీన్‌లపై) అమైలేజ్ (పిండి పదార్థాలపై), లైపేజ్ (కొవ్వులు)లను స్రవిస్తుంది.

10. మానవుని హృదయంలో కుడి పార్శ్వం వైపు ఉన్న కవాటాలు?
    1) అగ్రత్రయ కవాటం, పుపుస ధమని కవాటం
    2) అగ్రత్రయ కవాటం, మహాధమని కవాటం
    3) అగ్రద్వయ కవాటం, మహాధమని కవాటం
    4) మిట్రల్ కవాటం, పుపుస ధమని కవాటం

జ. 1;
వివరణ: గుండెలో కుడి పార్శ్వంలో అగ్రత్రయ కవాటం, పుపుస ధమని కవాటాలు ఏర్పడి ఉంటాయి. అగ్రత్రయ కవాటం కుడి కర్ణికా – జఠరికా విభాజకంపైన, అదే విధంగా పుపుస ధమనీ చాపం వద్ద పుపుస ధమనీ కవాటాలు ఏర్పడి ఉంటాయి. ఇవి రక్తాన్ని ఏకముఖంగా ప్రవహింపజేస్తాయి.

11. రక్తకేశనాళికా గుచ్ఛంలో పీడనం పెరగడానికి కారణమేమిటి?
    1) సన్నని నాళం ఉన్న అభివాహి ధమనిక
    2) పోడోసైట్ల మధ్య ఉన్న సూక్ష్మరంధ్రాలు
    3) సన్నని నాళం ఉన్న అపవాహి ధమనిక
    4) సన్నని నాళం ఉన్న అపవాహి సిరిక

జ: 3;
వివరణ: రక్తకేశనాళికా గుచ్ఛం అభివాహి నాళికలతో ఏర్పడుతుంది. ఇందులో నుంచే అపవాహిక నాళికలు ప్రారంభమవుతాయి. అపవాహి ధమనిక వ్యాసం అభివాహి ధమనిక కంటె తక్కువగా ఉండటం వల్ల గ్లామరులస్‌లో పీడనం పెరుగుతుంది.

12. కింది వాటిలో ఒకే సందర్భంలో జరిగే ప్రతీకారచర్య, సహజాత ప్రవృత్తి ఏది?
    1) కదులుతున్నది ఏదైనా మొదటిసారి కనిపిస్తే దాని వెనకే వెళ్లడం
    2) మొనదేలిన వస్తువును తాకినపుడు కలిగే ప్రతిస్పందన
    3) సంతానోత్పత్తి కోసం భిన్న లింగ జీవులను ఎన్నుకోవడం
    4) బడిగంట మోగగానే విద్యార్థులు మైదానాన్ని వదలి వెళ్లడం

జ: 2
వివరణ: మొనదేలిన వస్తువును తాకినపుడు అసంకల్పిత ప్రతీకార చర్య జరుగుతుంది. ఫలితంగా మనం చేయిని వెంటనే వెనక్కు తీసుకుంటాం. ఇది మనకు పుట్టుకతో వచ్చిన లక్షణం.

13. హేమంత్ తన ఆహారంలో నీటిలో కరిగే, కొవ్వుల్లో కరిగే విటమిన్లు ఉండేలా చూసుకుంటాడు. కింది వాటిలో కొవ్వులో కరిగే విటమిన్, నీటిలో కరిగే విటమిన్లు ఏవి?
    1) ఫోలిక్ ఆమ్లం, ఆస్కార్బిక్ ఆమ్లం
    2) బయోటిన్, కాల్సిఫెరాల్
    3) టోకోఫెరాల్, ఫిల్లోక్వినోన్
    4) రెటినాల్, పైరిడాక్సిన్

జ: 4
వివరణ: విటమిన్ శరీరానికి ఉపయోగపడే సూక్ష్మ పోషకాలు. ఇవి రెండు రకాలు.
1. కొవ్వులో కరిగేవి – విటమిన్ ఎ, డి, ఇ, కెలు
2. నీటిలో కరిగేవి – బి, సిలు.
రెటినాల్ (విటమిన్-ఎ), పైరిడాక్సిన్ (విటమిన్-$బి_6$)లు

14. కింది వాటిలో 'దండాల' ప్రత్యేక లక్షణం ఏమిటి?
    1) అతి తక్కువ కాంతిలో వస్తువులను గుర్తించడం
    2) కాంతివంతమైన వెలుతురులో రంగుల్ని గుర్తించడం
    3) రంగుల్లోని ప్రత్యేకతల్ని గుర్తించడం
    4) దృష్టి స్పష్టంగా ఉండేలా చేయడం

జ: 1
వివరణ: కంటిలో రెండు రకాల కణాలు ఉంటాయి.
1) దండాలు (రాడ్స్)
2) శంఖువులు (కోన్స్)
అతి తక్కువ కాంతిలో వస్తువులను గుర్తించడానికి దండాలు ఉపయోగపడతాయి. శంఖువులు కాంతివంతమైన వెలుతురులో రంగుల్ని గుర్తించడానికి సహాయపడతాయి.

15. వేర్వేరు మట్టి నమూనాలు, ప్లాస్టిక్ గరాటు, వడపోత కాగితం, నీరు, కొలజాడి, డ్రాపర్లను ఉపయోగించి నిర్వహించే ప్రయోగం ద్వారా తెలుసుకోగలిగేది?
    1) మట్టిలో తేమ శాతం
    2) మట్టి నీటిని పీల్చుకునే స్వభావం
    3) మట్టిలోని ఖనిజ లవణాలు
    4) మట్టిలో ఉండే పదార్థాలు

జ: 2
వివరణ: మట్టి నీటిని పీల్చుకునే స్వభావంను తెలుసుకోవడానికి ప్రయోగాన్ని నిర్వహించడానికి ఈ వస్తువులు అవసరం. మట్టి నమూనాలను సేకరించి వడపోత కాగితం ద్వారా ప్రయోగాన్ని నిర్వహిస్తారు.

16. కింది ఏ ఆల్కలాయిడ్ స్కీజోఫ్రీనియాను నివారిస్తుంది?
    1) థియాన్ 2) మార్ఫిన్
    3) రిసర్పిన్ 4) అట్రోపిన్

జ: 3
వివరణ: మొక్కలలో ఏర్పడే ద్వితీయ జీవక్రియోత్పన్నాలు ఆల్కలాయిడ్‌లు. రావుల్ఫియా సర్పంటైనా (సర్పగంధి) మొక్క వేర్లు, బెరడులో రిసర్పిన్ దొరుకుతుంది. ఇది పాము కాటుకు ప్రధాన మందు. అంతేకాకుండా మానసిక వ్యాధి అయిన స్కీజోఫ్రీనియా నివారణలోనూ ఉపయోగిస్తారు.

17. సకశేరుకాల కాలేయ కణాలలో నునుపు అంతర్జీవ ద్రవ్యజాలం లోపిస్తే?
    1) ప్రొటీన్ల సంశ్లేషణ జరగదు
    2) జీర్ణరసాల ఉత్పత్తి జరగదు
    3) కొవ్వుల సంశ్లేషణ జరగదు
    4) విషపదార్థాల నిర్వీర్యం జరగదు

జ: 4
వివరణ: అంతర్జీవ ద్రవ్యజాలంను కణ అస్థిపంజరం అంటారు. ఇది కేంద్రక త్వచం నుంచి కణత్వచం వరకు విస్తరించి ఉంటుంది. నునుపు అంతర్జీవ ద్రవ్యజాలం విష పదార్థాలను నిర్వీర్యం చేస్తుంది.

18. A, Bల నుంచి సరైన వాటిని ఎన్నుకొని కింది పట్టికను పూరించండి.

వినాళ గ్రంథి పేరు	విడుదలచేసే హార్మోన్
స్త్రీ బీజకోశం	A
B	ల్యూటినైజింగ్ హార్మోన్

1) A : ప్రొలాక్టిన్, B: క్లోమం
2) A : ప్రొజెస్టిరాన్, B: పిట్యుటరీ
3) A : అడ్రినలిన్, B: అడ్రినల్
4) A : థైరాక్సిన్, B : థైమస్

జ: 2
వివరణ: A. ప్రొజెస్టిరాన్ – స్త్రీబీజకోశం స్రవిస్తుంది. ఇది గర్భాశయం అంతర పొరను ఏర్పరచడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది.
B. పిట్యూటరీ గ్రంథి – ల్యూటినైజింగ్ హార్మోన్‌ను స్రవిస్తుంది. ఇది పురుషులలో టెస్టోస్టిరాన్ స్రవించడంలోను, స్త్రీలలో అండోత్సర్గానికి సహాయపడుతుంది.

19. కస్క్యుట రెఫ్లెక్సా దేని ద్వారా ఆహారాన్ని గ్రహిస్తుంది?
    1) అంటు వేర్లు 2) చూషకాలు
    3) వాయుగత వేర్లు 4) లెంటికణాలు

జ: 2
వివరణ: కస్క్యుట లేదా బంగారు తీగ మొక్క పరాన్న జీవనం జరిపే మొక్క. ఇది ఇతర మొక్కలపై అంటు వేళ్లతో అంటిపెట్టుకొని హాస్టోరియాలు (చూషకాలు) ద్వారా ఆహారాన్ని స్వీకరిస్తాయి.

What is the position of J with respect to M?

BANK EXAMS
Reasoning



Model Questions

Directions (1-5): Read the given information and answer the given question

There are some people are sitting in a row facing North. Six persons sit between L and J. Three persons are sitting between M and N. K is third to the right of N. K is second to the left of P. Number of people between M and P is same as the number of people between M and L. Only three people sit to the left of L. Two people sit between P and R. R is sitting at the second position from one of the ends.

1. How many persons are sitting in the row?
   A) 27 B) 28
   C) 19 D) 18
   E) 26
2. What is the position of J with respect to M?
   A) 2 nd to left B) 3 rd to right
   C) 2 nd to right
   D) 3 rd to left
   E) Immediate left
3. How many persons are sitting between M and P?
   A) 9 B) 12
   C) 8 D) 7
   E) 10
4. Which of the following statements is true?
   A) J sits to the right of K.
   B) Seven people are sitting between N and R.
   C) Less than 10 people sit between P and L.
   D) 9 people sit between J and P.
   E) None of the statements is correct.
5. How many people are sitting to the left of K?
   A) 19 B) 8 C) 9
   D) 15 E) 12

Directions (6 - 10): Read the given information and answer the given question

A boy has arranged nine books P, Q, R, S, T, U, V, W and X one above the other but not necessarily in the same order. There are 5 books between book P and book R. Book T is kept immediately above R. 3 books are kept between book T and book S. Number of books between P and S is same as the number of books between T and Q. Book U is kept below book Q. Book W is kept somewhere below X. There is only one book kept between U and V. U is above V.

6. Which of the following statements is not true?
   I) There are two books between T and Q.
   II) S is kept below W.
   III) U is kept immediately above P.
   A) Only I B) Only II
   C) Only III D) Both II and III
   E) All I, II and III
7. V is related P and Q is related to X in certain manner. To which of the following is U related in the same manner?
   A) W B) R
   C) S D) T
   E) X
8. How many books are kept between X and P?
   A) Five B) Two
   C) Three D) Four
   E) None
9. Which of the following pair of books is kept immediately above and below book Q respectively?
   A) XS B) SX
   C) RW D) WR
   E) None of these
10. What is the position of book W in the given arrangement?
    A) Between P and V
    B) Fourth from the top.
    C) Sixth form the bottom.
    D) Fourth from the bottom.
    E) Between R and Q.

Direction (11-15): Study the information given below and answer the questions based on it.

There are 9 management graduates A, B, C, D, E, F, G, H and I. Each of them have their birthday in one of the three months - February, March and April of the same year,but not necessarily in the same order. They are also born on three different dates 6, 25 and 28. Each person has an interview on the same day (on the same date of the same month) he was born. Only three persons have interviews between F and G. F is born before G. A is born immediately before or after G. I is born in a month which has less than 30 days and the date is a multiple of 5. There was only one person born between I and F. B and H have interviews in the same month. H was born on a date which is a multiple of 14. E and D were born on the same date. E was born before D. The number of persons born between F and G is the same as that of E and A.

11. How many persons have interviews between E and H?
    A) 3 B) 6 C) 4
    D) 2 E) 5
12. Which group of persons were born in the month of April?
    A) C, F, A B) F, B, G
    C) A, G, D D) F, B, H
    E) None of these
13. G was born on which of the following dates?
    A) 28 February
    B) 6 February
    C) 25March
    D) 6 March E) None of these
14. Find the odd one out.
    A) BH B) FB
    C) GA D) EI
    E) CD
15. Which of the following is the correct combination of month date and persons?
    A) March - F - 25
    B) February - B - 6
    C) April - A - 6
    D) March - B - 28
    E) February - E - 25

Directions(16-20): In each question below three statement followed by two conclusions numbered I and II. You have to take the two given statements to be true even if they seem to be at variance with commonly known facts and then decide which of the given conclusions logically follows from the given statements disregarding commonly known facts.

A) Only conclusion I follows.
B) Only conclusion II follows.
C) Either conclusion I or II follows.
D) Both conclusions I and II follow. E. Neither conclusion I nor II follows.

16. Statement:
    $D \geq B > F$; $B > M > A$;
    $F > C$; $R < C$
    Conclusion:
    I. $C < D$ II. $F < A$
17. Statement:
    $D \leq R > E \leq B$;
    $S \leq M = E > G = B$
    Conclusion:
    I) $D > G$ II) $D \leq B$
18. Statement:
    $E \leq S > F \leq C$; $T \leq N = F > P$;
    $H > C$
    Conclusion:
    I) $T < C$ II. $C = T$
19. Statement:
    $M = L \geq N \geq Q < P < V \geq S$;
    $Q > G$
    Conclusion:
    I. $G \geq S$ II. $M > G$
20. Statement:
    $Q > A \geq Z \leq X \leq C$; $Z \geq H$; $A > D$
    Conclusion:
    I. $Q > H$
    II. $Z \leq D$

SOLUTIONS

(1-5):
By considering the points, (I)K is third to the right of N,(II)K is second to the left of P, (III) three persons are sitting between M and N and(IV)Number of people between M and P is same as the number of people between M and L, only one possible arrangement follows as given below.
L_ _ _ _ _ _ _ _M _ _ _ N _ _ K _ P
Based on the other points, the final seating arrangement is as follows.
_ _ _ L_ _ _ _ _ _ J _ M _ _ _ N _ _ K _ P _ _ R _

1) E; **2)** A; **3)** C; **4)** B; **5)** A

(6-10): Based on the statement "There is only one book kept between U and V. U is above V." there is only one possibility which is given below.

Number	Books
9	T
8	R
7	X
6	Q
5	S
4	W
3	U
2	P
1	V

6) B; **7)** A; **8)** D; **9)** A; **10**; D

(11-15): The date of interview is nothing but the date on which the person was born.
Based on the statement, "The number of persons born between F and G is the same as that of E and A" there is only one possibility as given below:

S.No	Month	Date	Person
1	Feb	6	C
2		25	I
3		28	E
4	Mar	6	F
5		25	B
6		28	H
7	Apr	6	A
8		25	G
9		28	D

11) D; **12)** C;
13) E; **14)** E;
15) C

16) A;
By combining the given expressions,
$D \geq B > F > C$.
Hence, $C<D$ follows
$F < B > M > A$.
We cannot determine the relation between F and A.
Only I follows

17) C;
By combining the expressions we get $D \leq R > E \leq B = G$.
Hence, the relation between D and G (G = B) cannot be determined. But, either I or II follows.

18) C;
Based on the statements,
$T \leq N = F \leq C$.
Hence, Either I or II follows.

19) B;
By combining the statements,
$G < Q < P < V \geq S$.
Hence, Conclusion I does not follow.
$M = L \geq N \geq Q > G$.
Hence, Conclusion II follows

20) A;
By combining the statements,
$Q > A \geq Z \geq H$.
Hence, Conclusion I follows.
$D < A \geq Z$ Hence, the relation between Z and D cannot be established. So, Conclusion II does not follow.